33612

శుభాకాంక్షలు

మా పాఠకులు, రచయిత(త్రు)లు, ఏజంట్లు, ప్రకటనకర్తలందరికీ దసరా శుభాకాంక్షలు —సం

సీరియల్స్

రజని ముఖచిత్రం గల పత్రిక ఆకర్షణీయంగా వుంది డి యస్ పి విజయ్ సీరియల్ ఇంటరెస్టింగ్‌గా ఉంది కథ అల్లడంలో సావిత్రి గారికి ఆమే సాటి

—ఎ సురేష్‌కుమార్ హైదరాబాద్

★ ★ ★

ఆదూరి సావిత్రి గారి డి ఎస్ పి విజయ్ సీరియల్‌లో విజయ్ పాత్ర బాగుంది

—పి రాము గుంటూరు

★ ★ ★

డి ఎస్ పి విజయ్ ఎంతో సస్పెన్స్‌గా ఉన్నది రచయిత్రి సావిత్రి గార్కి మా ధన్యవాదాలు రేపటి మహిళ సీరియల్ కూడా చాలా బాగున్నది

—చెరుకూరి హరిబాబు అద్దంకి

★ ★ ★

ప్రేమసాగర మదనం ఎంతో ఆసక్తిదాయకంగా వుంది డి ఎస్ పి విజయ్ లో ఆదూరి సావిత్రిగారు సృష్టించిన పాత్రల్లో విజయ్ పాత్ర చాలా అద్భుతం —బి అప్పారావు నెల్లిమర్ల


★ ★ ★

మంజీరనాదం రావినూతల సువర్ణాకన్నన్ గారి సీరియల్ అద్భుతంగా వుంది అరవింద్ కాంతిల పాత్రలు మాకెంతో నచ్చాయి బాను గుహదగ్గర వారు జరిపిన త్రవ్వకాల్లో నిధినిక్షేపాలకు బదులు శవ పేటిక బయట పడడం చాలా మిస్టీరియస్‌గా మరెంతో థ్రిల్లింగ్‌గా వుంది రచయిత్రికి ధన్యవాదాలు —ఐరేని శ్రీనివాస్ గౌడ్ రామాయంపేట

కథలు

4–10 సంచికలోని చేజారిన వసంతం కథ బాగుంది పత్రికలోని శీర్షికలన్నీ నవ్యనూతనంగా వుంటు మమ్మి ఆనందింప చేస్తున్నవి

—కాజ హనిత ఎలూరు



చేజారిన వసంతం చాలా బాగుంది మోజుల ఊబిలో మునిగేవారికి సందేశాత్మకంగా ఉంది రచయిత అభినందనీయులు వి వి బి గారి కొడి కథ బాగుంది —కుమారి సీత హైదరాబాద్

★ ★ ★

రజని ముఖచిత్రం చాలా ఆకర్షణీయంగా ఉన్నది మహానటి చేజారిన వసంతం కథలు చాలా బాగున్నాయి కొడి కథ పర్వాలేదు

—కె సత్యనారాయణ కె ఎన్ వి రవికుమార్ మైలవరం

★ ★ ★

రజని ముఖచిత్ర పత్రిక చాలా బాగుంది దిగేమ్ చేజారిన వసంతం కథలు బాగున్నాయి

—కీర్తి కిష్టయ్య లక్ష్మీదేవిపల్లి

శీర్షికలు

రజని ముఖచిత్రంతో వెలువడిన సంచిక అత్యంత ఆకర్షణీయంగా వుంది ఈకాలం పెళ్ళిళ్ళు శీర్షికలో స్త్రీకి ప్రాధాన్యత ఉండాలి అన్న కె శ్రీదేవి (కర్నూలు) గారి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాం ఈనాడు జరిగే ప్రతి పెళ్ళిలో మగపెళ్ళి వారమనే అహంకారంతో చాలామంది ఇవతల వాళ్ళ మనసులను బాధపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నారు వాళ్ళకు బుద్ధిరావాలంటే ముందు స్త్రీకి ప్రాధాన్యత ఉండాలి —శ్రీపాద పద్మజా శ్రీనివాస్, బొబ్బిలి

★ ★ ★

రజని ముఖచిత్రం నీట్‌గా వుంది ఈకాలం పెళ్ళిళ్ళు శీర్షిక నేటి యువతరానికి ముఖ్యంగా మాకెంతో బాగా నచ్చింది

—చో దవరపు నాగేశ్వరరావు రమాదేవి లక్ష్మీశశాంక హైదరాబాదు □

అమ్మా కనకదుర్గమ్మా

అమ్మా కనకదుర్గమ్మా!
తొమ్మిది రాత్రులూ
వివిధ అవతారాలతో
మమ్మల్ని ఆశీర్వదించు తల్లీ!
అంతేకాదు మహిషాసురులు
ఇంకా తిరుగుతున్నారు
వాళ్ళనందర్నీ సంహరించు
మహాకాళీ – మహిళలను
అవమానించి అత్యాచారాలు జరిపే
మానవాధములను మననీయకమ్మా
అంబికా శాంభవీ
అవినీతి పరులను
హతల కొట్టవమ్మా
అంతటా శాంతి నెలకొల్పవమ్మా
★ ★ ★
పిల్లలకు పప్పులూ
బెల్లాలు, వంతుల్ల
కందరకు పది వరహాలు
చదువులందరికీ
చక్కగా రావాలి
ముగ్గురు అమ్మల తల్లి
మురిసి పోవాలి
విల్లంబు ధరియించి
వీరులుగ కావాలి
విద్యార్థులంతా
కోతి బొమ్మలు పూని
హనుమంతు వలె
బాలికలు రావణుల
నందర్ని తరిమి కొట్టాలి
అన్నిటికి చేయూత
అమ్మ ఇవ్వమ్మా కనకదుర్గమ్మ
కామాక్షి భ్రమరాంబ
కన్నతల్లి కరుణాంబురాశి

—ఎం ఎస్ ఎం

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు (1938 1972)

28 అక్టోబర్ 87
శ్రీ ప్రభవ నామ సం ఆశ్వయుజ శు దశమి
సంపుటము 80 సంచిక 6

ముఖ్య సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ
కార్యవాహక (యాక్టింగ్) సంపాదకుడు
మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతి వెల	రు	2 75
పోస్టులో 6నెలల చందా	రు	80 60
పోస్టులో 12నెలల చందా	రు	161 20

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం విజయవాడ 520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం

అభయ ప్రదాయిని శ్రీ కనకదుర్గ
(చిత్రం ఎస్ కాశీవిశ్వేశ్వరరావు)

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

డబ్బా? అధికారమా?

మోసగాళ్ళకూ బ్యాంకుల వాళ్ళకూ సహకారం ఉంటుంది ఆ బ్యాంకులు స్విట్జర్లాండ్‌వి కావచ్చు ఆ మోసగాళ్ళు ఇటలీ వాళ్ళు కావచ్చు కాని వాళ్ళ కలయిక మాత్రం ప్రమాదకరమైనది బ్యాంకులు జాతీయం అయినటువంటి దేశాలలో ఈ కలయిక మరింత ప్రమాదకరమైన దవుతుంది ఎందుకంటే చాలామంది మోసగాళ్ళు రాజకీయాలలో ఉంటారు రాజకీయవాదులు మోసగాళ్ళయి ఉంటారు ఇక వాళ్ళకు ఇష్టారాజ్యంగా వ్యవహరించ గలిగినటు వంటి పరిస్థితి ఉంటుంది బారత ఆర్థిక వ్యవస్థ క్షీణించడం శ్రీమతి ఇందిరాగాంధీతో ప్రారంబం కాలేదు ఆమె విమర్శకులు చాలా మంది ఆవాదన పెడుతూ ఉంటారు నిజానికి బారత ఆర్థిక వ్యవస్థ క్షీణించడం బ్యాంకుల జాతీయకరణతో ప్రారంబ మైంది దాని వల్ల పన్ను చెల్లింపు దార్ల డబ్బు మీద శ్రీమతి ఇందిరాగాంధీకి అపరిమితమైన అదికారం దొరికింది ఆ డబ్బును ఆమె తమ రాజకీయ స్థానాన్ని సుస్థిర పరచుకోవడానికి మాత్రమే గాక తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగు పరచుకోవ డానికి కూడా ఉపయోగించుకున్నారు అప్పుడు ఆమెను అమితంగా అరాదించిన వాళ్ళలో చంద్రశేఖర్ వంటి వాళ్ళున్నారు ఇటువంటి వాళ్ళకు ఒక ఆదునిక ఆర్థికవ్యవస్థ ఎట్లా నడుస్తుందో చాలా తక్కువ తెలుసు మనుషులను ఎవరైనా వాడుకొని చరిత్ర చెత్తకుప్ప మీదికి విసిరేసినట్టు గానే శ్రీమతి ఇందిరాగాంధీ కూడా వీళ్ళను వాడుకున్నారు

మరేదేశంలో నయినా అయితే జగన్నాద పూజారి లాంటి వ్యక్తి బ్యాంకు డిపాజిట్‌దార్ల డబ్బును దుర్వినియోగం చేస్తున్నందుకు కటకటాల వెనక్కి వెళ్ళవలసి ఉండేది కాని మన దేశంలో మాత్రం ఆయనకు బ్యాంకుల బాధ్యత అప్పగించారు పూజారి తన ఋణమేళాల ద్వారా రాజకీయావస రాల కోసం డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు డబ్బును ఇతర మార్గాలలో దుర్వినియోగం చేయడం కంటే రాజకీయ అవసరాలకోసం దుర్వినియోగం చెయ్యడమనేది ఘోరం ఒక ధర్మతేజ ప్రబుత్వం నుంచి సూటిగా నెహ్రూ గారి కార్యాలయాన్ని ఉపయోగించుకొని అప్పు తీసుకుంటాడు ఆ డబ్బుతో జెనీవాకో లేక భగవంతుడు మాత్రమే చెప్పగలిగినటువంటి మరొక చోటికో వెళ్ళిపోతాడు చివరికి మాత్రం ఆయనను పట్టుకొని జైలులో పెడతారు ఋణమేళాలు ఇంకా అంతకంటే ఘోరం ఎందుకంటే డబ్బు పట్టుకొని ఎవరైనా పారిపోయారని రుజువు చెయ్యలేం గనుక ఎవరినీ పట్టుకోలేం కాని బ్యాంకులు మాత్రం అంతకంతకూ పేదవయి పోతాయి అప్పుడప్పుడు అప్పులన్నిటినీ రద్దు చేసుకో వలసి వస్తుంది రాజకీయ నాయకులు ఏ శిక్షా లేకుండా తప్పించుకు పోతారు

శ్రీమతి ఇందిరాగాంధీకి వేరేచోట్ల కూడా ఆరాదకులున్నారు ఎందుకంటే ప్రపంచం నిండా యంగ్‌టర్క్‌లే ఉన్నారు వాళ్ళకోసం ఒక నిరాశామయ బవిష్యత్తు ఎదురు చూస్తున్నదని వాళ్ళకు తెలియదనుకోండి పెరూలో ఆర్థిక వ్యవస్థ మనదాని కంటే ఘోరమైన స్థితిలో ఉన్నప్పుడు అద్యక్షుడు అలాన్ గార్షియా పెరెజ్ బ్యాంకులను జాతీయం చేస్తానని బెదిరించాడు కాని అక్కడ ఎక్కువమంది చంద్రశేఖర్‌లు లేరు దేశం యావత్తూ ఒక్క తాటి మీద నిలిచి ఒక రాజకీయ వాది నాయకత్వం కింద కాక ఒక రచయిత నాయకత్వం కింద ఈ ప్రయత్నాన్ని నిరసించాయి మేరియో వార్గాస్ లోసా అనే ఆ నవలా రచయిత నవలలు దక్షిణ అమెరికా అంతటా ప్రసిద్ధమైనవి ఈ దేశపు ఆర్థిక జీవనం మీద ప్రబుత్వం అదికారాన్ని స్థాపించుకుంటే దానికి ఎటువంటి అపరిమిత అదికారం చేకూరుతుందంటే ప్రజాస్వామ్యం పూర్తిగా విచ్ఛిన్నమై పోతుంది అని ఆయన అన్నాడు బారత దేశంలో బ్యాంకుల జాతీయకరణకు అత్యవసర పరిస్థితికి మద్య ఉన్న కాలం ఆరు సంవత్సరాలు మాత్రమే పెరూ వంటి దేశాలలో ఆ వ్యవది ఇంకా తగ్గిపోవచ్చు

గోవాలో ఈ మద్యనే జరిగినటువంటి ఒక కేసులో ప్రతాప్‌సింగ్ రాణె అనబడే అక్కడి ముఖ్యమంత్రి భూముల వ్యవహారంలో కపటంతో సొమ్ము చేసుకోవడం కోసం తన కింది అదికారులతో మోసాలు చేయించాడని అబియోగం వచ్చింది నీటిపారుదల కాలువలు తన భూముల గుండా వెళ్ళేటట్టు మార్పులు చేయించాడని కొన్ని చోట్ల ఆ భూములు అయనకు చెందినవి కాకపోయి నప్పటికీ భూముల దస్తావేజులను మార్చి ఆ భూములు ఆయనకూ ఆయన కుటుంబానికీ చెందినవిగా చూపారని తేలింది ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు ఇటువంటి కేసులోనే తీవ్రమైన అబిశంసనలు ప్రకటించారు దానితో రాణె రాజీనామా చేయాలని గోవాలో ప్రతిపక్షం కోరింది కాని విషయం అక్కడితో అయిపోలేదు రాణె కేవలం నష్టపరిహారాల ద్వారా మాత్రమే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించలేదు ఆ భూముల్ని బ్యాంకులకు తాకట్టు పెట్టి తద్వారా కూడా డబ్బు సంపాదించడానికి ఆయన ప్రయత్నించాడు భూమి దస్తావేజులను సరిగా పరిశీలించకుండానే జాతీయ బ్యాంకులు ఆ ముఖ్యమంత్రికి కోట్లాది రూపాయల డబ్బును అందజేశాయి గోవాలో రాణె ఏం చేశాడో ఇతర రాష్ట్రాలలో ఇతర రాజకీయ వాదులు కూడా అదే చేసి ఉండవచ్చును ఎందుకంటే ఇటువంట సందర్భాలన్నిటిలోను బ్యాంకు అదికారులు ప్రబుత్వ ఉద్యోగులలా ప్రవర్తిస్తారు వాళ్ళను రాజకీయ ఒత్తిడితో సులబంగా బెదిరించవచ్చు

జనార్దన పూజారి ఋణమేళాలు ఈ వివాదానికి ఒక వైపు మాత్రమే నిజమైన వివాదాస్పదమైన అంశం ఏమంటే రాజకీయ వాదులు ఈ బ్యాంకుల నుంచి తమ స్వంత అవసరాలకోసం కోట్లాది రూపాయలు లాక్కోగలుగుతున్నారనేదే అర్జున్ సింగ్‌ను అడగండ బజన్‌లాల్‌ను అడగండి కొన్ని సంవత్సరాల కింద చిల్లిగవ్వకు కూడా కొరగాని ఈ వ్యక్తులకు బ్యాంకుల లోపలికి వెళ్ళే అర్హత కూడా ఉండేదికాదు వాళ్ళు ఇప్పుడు కోట్లకు పడగెత్తుతున్నారు అయితే నిజమైన లాబం పొందిన వాళ్ళు గాంధీకుటుంబీకులే అనుకోండి నేను ఇదివరకే రాసినట్టు గాంధీ కుటుంబానికి ఐదు వేల నుంచి పది

కీర్తి మందిరం



జాతి పిత బాపూజీ
(చిత్రం దేవు దీక్షితులు)

పోర్‌బందర్ పట్టణంలో ని మహాత్మాగాంధీ గారు ప్రభవించిన గృహం కీర్తి మందిర్ గా విలసిల్లుతోంది ప్రతిరోజూ వేల కొలదీ దేశీయులే కాకుండా విహార యాత్రికులైన విదేశీయులు కూడా కీర్తి మందిర్ ను ఒక పుణ్యస్థలంగా భావించి తమ శ్రద్ధాంజలి సమర్పించుకుంటూ వుంటారు

కీర్తి మందిరం స్వాతంత్ర్య సమర స్పందనం
భారత జాతికిది భవ్య నందనం
కలలో నైన అధికార కాంక్ష నెరుగని
అమలజీవికిది జన్మ నిలయనం
త్యాగ సంపదకు ప్రతి రూపంబుగ
చరిత్ర కెక్కిన చరితవ్రతునికిది మాతృ గృహం
అసాధ్యములను సాధ్యములుగ నిరూపించిన
కారణజన్ముడు గాంధీజీ తొలిగా కన్నులు తెరచినదిచ్చటనే
హింసకు బెదరక రవి అస్తమించని రాజ్యాధిపతులను
రచ్చ కీడ్చిన అహింసా శూరుని స్మృతిసదనం ఇదే! ఇదే!
కీర్తి మందిరం రాగబంధనం పునీత కంకణం కారుణ్య సాగరం
ప్రపంచ ప్రజల పుణ్యక్షేత్రజం, పోర్ బందర్ పసిడి ప్రసాదం
సర్వజనీన ఆర్ష సంస్కృతీ వైభవోత్సవం

—జనస్వామి కోదండరామశాస్త్రి


వేల కోట్ల రూపాయల మద్య ఆస్తి ఉంటుంది సరిగ్గా ఫిలిప్పైన్స్‌లో మార్కోస్ కుటుంబానికి ఉన్నట్టుగానే కాని దానిలో ఒక్క పైస కూడా గౌరవనీయమైన శ్రమతో కష్టపడి సంపాదించింది కాదు


ఎన్నికల ఖర్చులో అత్యధికభాగాన్ని ప్రభుత్వం భరించడం వంటి ఎన్నికల సంస్కరణల ద్వారా దేశంలో అవినీతిని పోగొట్టవచ్చునని భావించే వాళ్ళు పొరపాటు పడుతున్నారు ఎన్నికలలో పోటీ చేయడానికి ఎవరికీ వేలాది కోట్ల రూపాయలు అవసరం లేదు తమ ఫైళ్ళనుంచి జరిగే ప్రతి

న్యూఢిల్లీ లేఖ

వ్యవహారంలోనూ చేతికి దొరికినంత సంపాదించే టటువంటి మన రాజకీయ వాదులు కేవలం ఎన్నికల డబ్బు కోసమే అట్లా చేయడం లేదు వాళ్ళ ఆశపోతు తనం వల్ల అలా చేస్తున్నారు మొదట వాళ్ళు శ్రీమతి ఇందిరాగాంధీ లాగా పదవి కోసం ఆశపోతులయ్యారు తర్వాత డబ్బుకోసం ఆశపోతులయ్యారు ఎందుకంటే ఈ రెండిటినీ విడదీయడం కష్టం కాంగ్రెస్ రాజకీయ వేత్తలలో చాలా మంది నేరస్తులు గనుక భయపడుతూ ఉంటారు తాము పట్టుబడితే ప్రజలు తమను క్షమించరని వాళ్ళకు తెలుసు తాము పట్టుబడక తప్పదని కూడా తెలుసు 1977లో ప్రజలు శ్రీమతి ఇందిరాగాంధీని క్షమించలేదు ఆమె కొడుకును కూడా వాళ్ళు 1989 లో క్షమించబోరు బోఫోర్స్ ఇతర వివాదాల సంగతి ఏమైనా కానివ్వండి మొత్తం మీద మనకిప్పుడు ఒక కొత్త తరం ఉంది ఈ కొత్తతరం చంద్రశేఖర్‌ల వలె మోహన్ ధారియాల వలె కాక నెహ్రూలను గాంధీలలో అంతర్గత స్వభావాన్ని గుర్తించింది అంతే గాక హక్సర్‌ల కుమార మంగళంల బోగస్ సోషలిజాన్ని కూడా గుర్తించింది గిరిలాల్ జైన్‌లు ఎం జె అక్బర్‌లు వారం వారం ప్రవచించే నీతులను వాళ్ళ అసలు స్వభావాన్ని కూడా ఈతరం అర్థం చేసుకున్నది ఇది 1977 జనతా తరం గనుక ఈ తరాన్ని మోసం చేయడం పదిరెట్లు కష్టమవుతుంది ఈ అభద్రతా భావం వల్లనే ప్రతి కాంగ్రెస్ వాదీ ఆశపోతు అవుతున్నాడు అది రక్షణ వ్యవహారాల్లో లంచాల రూపంలో బైటికి వచ్చినా చివరికి తుస్సుమనే ఒప్పందాలనబడే వాటి రూపంలో బైటికి వచ్చినా మూలకారణం అదే

రాజకీయ వాదులు ముందు వాళ్ళకి అధికారం కావాలో డబ్బు కావాలో తెల్చుకోవాలి వాళ్ళు రెండిటినీ భుక్తం చేసుకోవడానికి వీల్లేదు ఎందుకంటే వాళ్ళకు అవి రెండూ ఉన్నందు వల్లనే మనం ప్రజలం ఇంతకాలమూ అవి రెండూ లేకుండా గడపవలసి వచ్చింది ☐





మహిష మర్ధని

దేవీపూజ

భారత దేశంలో అనాదిగా ఆచరిస్తున్న పండుగలలో ముఖ్యమైంది దసరా. 'దశ హార' (పది రోజులు) అనే శబ్దమే కాలగమనంలో దసరాగా మారింది. ఇది శరత్కాలం. ఆశ్వయుజ శుక్ల పక్షంలో పాడ్యమి నుండి దశమి వరకు జరుగుతుంది. ఈ పండగను దేవీ నవరాత్రులని, దుర్గాష్టమి అని, శరన్నవరాత్రులని పేర్కొంటారు.

దేవీ ఆరాధన భారత దేశంలో వేద కాలంకు పూర్వమే ఆచారంలో ఉండేది. సింధూనాగరికత ప్రజలు దేవీ ఆరాధకులు, వీరు మాతృమూర్తిని 'యోని' రూపంలో పూజించినట్లు, ఆమెకు బలులు కూడా సమర్పించి నట్లు తెలుస్తోంది. ఋగ్వేదంలో దేవితత్వం వర్ణించ బడింది. ఇచ్చటి దేవి వాక్రూపిణి. ఈ వేదం ప్రథమ మండలంలో దేవి సృష్టికి మూలమైన మాతృమూర్తిగా వర్ణింప బడింది ఐతిరేయ బ్రాహ్మణంలో ఈమె శివుని అర్థాంగి వాజసనేయ బ్రాహ్మణంలో ఈమె శివుని సోదరిగా చెప్పబడింది కేశోపనిషత్తులో దేవి హైమవతి ఒకప్పుడు దేవతలు రాక్షసులను సంహరించి ఆ విజయానికి తామే కారకులమని ఎవరికి వారు విర్రవీగుచూండగా జగజ్జనని వారి ముందు ఆకారం లేని యక్షిణి రూపంలో నిలబడి వారిని అయోమయంలో ముంచెత్తగా దేవతలు అగమ్యులై ఇంద్రుని వేడగా అతడు యక్షిని ప్రాదేయపడుమన్నాడు దేవతలు ఆమెను ప్రార్థించగా యక్షి శాంతించి హైమవతీ రూపములో ప్రత్యక్షమై దేవతల విజయానికి త న కారకురాలని తన్ను విస్మరించ రాదని తెలియజేసింది అంతే కాక ఆమె అహంబ్రహ్మ స్వరూపిణీమత్త ప్రకృతి పురుషాత్మకంజగత్ అని తానే ఈ సృష్టికి మూలమని తెల్పిందట' బవిషత్ పురాణంలో శ్రీకృష్ణుడు దర్మరాజుకు దేవి మహత్యాన్ని వర్ణించాడట' మహాబారత యుద్ధమందు అర్జునుడు విజయాన్ని కోరుతూ దేవిని ప్రార్థించి నాడు రుక్మిణీదేవి శ్రీకృష్ణుని బర్తగా ప్రసాదింపుమని దేవిని కోరింది

శ్రీరామచంద్రుడు విజయదశమి రోజున రావణ సంహార మొనర్చినాడని దానికి గుర్తుగా ఢిల్లీ నగరంలో ప్రతి ఏటా రామలీలా మైదానంలో రావణుని కాష్ఠం జరుపుతారు అలాగే గుప్త రాజులు దేవీ బక్తులు వీరు తమ నాణాలపై దుర్గ బొమ్మను ముద్రించారు కాళిదాసు దేవీ ఉపాసకుడు మధ్యయుగాల్లో పల్లవులు తూర్పు చాళుక్యులు కాకతీయులు దేవీ బక్తులు ఈ కాలంలో దేవీ ఉత్సవాలు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి కృష్ణరాయులు కాలంలో ఈ ఉత్సవాన్ని తిలకించడానికి దేశ విదేశీయులెందరో వచ్చెడివారు రాయులు తొమ్మిది అంతస్థుల బవనంపై కూర్చొని పది రోజులు ఉత్సవాన్ని తిలకించి మల్లులకు క్రీడాకారులకు కళాకారులకు బహుమతులు పంచేవాడట ఆనాటి ఆ బవంతే ఈనాటి హంపీ క్షేత్రంలోని దసరా దిబ్బ అధునిక కాలంలో మైసూరు మహారాజులు ఈ ఉత్సవాన్ని ఘనంగా జరిపేవారు

దేవి ఎవరు?

ఇంద్రుడు కస్యప ప్రజాపతి పుత్రులందరిని వదించగా వారి తల్లి దితి ఇంద్రుని ఓడించే శక్తిగల కూమారునికై బ్రహ్మను గురించి తపస్సు చేసింది అమెకు మహిషాసురుడు పుత్రుడుగా జన్మించాడు అతడు బలపరాక్రమ సంపన్నుడై తనకు చావు లేకుండా వరమివ్వమని శివుని గురించి తపస్సు చేయగా మహేశ్వరుడు పుట్టిన వాడు గిట్టక మానడు అది తప్ప వేరే వరమేదైనా కోరమనగా మహిషుడు తనకు స్త్రీ వల్ల మాత్రమే మరణం కలిగేట్లు వరమివ్వమనగా హరుడా వరమిచ్చాడు వరప్రసాది యైన మహిషుడు ముల్లోకాలలోని ప్రాణులను హింసించు చుండగా వారి బాదలను చూడలేక త్రిమూర్తులు తమ తమ తేజాలను జత చేర్చి దుర్గ లేక ఆది పరాశక్తిని సృష్టించి ఆమెకు మహిషుని సంహరింపమని తమతమ ఆయుదాల నిచ్చారు ఆమె సింహ వాహినియై తొమ్మిది రోజులు వివిద అవతారాలెత్తి మహిషునితో పోరి పదవ రోజు అతడిని సంహరించింది దేవి సాదించిన విజయానికి సూచకంగా ప్రజలీ పండుగను ప్రతి ఏటా జరుపుకొంటున్నారు

దుర్గ



పూర్వం ఈ పండగ జేష్ఠ దుర్గ లక్ష్మీ సరస్వతీ దేవీల ప్రతికై పన్నెండు రోజులు జరిపేవారట అశుబ సూచకమని. జేష్టా దేవిని పూజించడం మాని తొమ్మిది రోజులు (ఒక్కొక్కరికి మూడు రోజులు) జరుపుతున్నారు. ప్రస్తుతం దసరా మొదటి రోజు అనగా పాడ్యమి నాడు సరస్వతి లక్ష్మి దుర్గా దేవిలను ఆవాహన చేస్తారు విదియ రోజున కుమారి, తదియ రోజున త్రిపురేశ్వరి చవితినాడు కళ్యాణి, పంచమినాడు రోహిణి షష్టినాడు కాళి సప్తమి నాడు 'చండి అష్టమినాడు శాంబవి నవమినాడు దుర్గ దశమినాడు సుబద్ర పేర్లతో దేవిని కొల్చి ఉద్వాసన చెప్పేటట్లు మత్స్య పురాణం, రుద్రయామళం గ్రంథాల్లో తెలుప బడింది పూర్వం రాజులు విజయదశమి రోజున దండయాత్రలకు బయలు దేరి వెళ్లేవారు పది రోజులు పండగ జరిపించలేని వారు మూడు రోజులు దుర్గాష్టమి మహర్నవమి విజయదశమి పండుగలు జరుపు కొంటారు

బెంగాల్ రాష్ట్ర ప్రజలకు ధసరా ఉత్సవాలకు అవినాబావ సంబంధముంది బెంగాలీలు ఈమెను తమ ఆడపడుచు అంటారు ఈమెను శివుని కిచ్చి వివాహం జరిపించేప్పుడు అమెను సంవత్సరానికి కనీసం మూడు రోజులు పుట్టింటికి పంపేట్లు అల్లుడితో ఒప్పందం కుదుర్చుకొన్నారట మాట ప్రకారం నవరాత్రి దినాల్లో దుర్గ పుట్టింటికి వస్తుందట ఆడపడుచు రాకకు గుర్తుగా బెంగాలీలు ఈ పండుగను ఎంతో వైబవంగా జరుపుకొంటారు

కర్నాటక రాష్ట్ర ప్రజలకు దసరాకూ కూడ సంబందముంది దేవి పూర్వం మహిషాసుర పట్టణంలోనే మహిషుని సంహరించినదట ఆమహిషాసుర పట్టణమే నేటి మైసూరు

దేవి ఆలయాలు

దక్షయజ్ఞం ధ్వంసం చేసిన తరువాత రుద్రుడు పార్వతీ దేవి మృతదేహాన్ని భుజంపై వేసుకొని తిరుగాడు చుండగా విష్ణువు తన చక్రాయుదంతో అమె మృత దేహాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించగా అవి దేశంలో పలు ప్రదేశాల్లో పడినాయి ఆ ప్రదేశాలనే శక్తి పీఠాలంటారు వాటిలో కొన్ని శ్రీశైలం భ్రమరాంబికా కాశీ విశాలాక్షి, అస్సామ్ కామాఖ్యాదేవి ప్రయాగ మాదవేశ్వరి గయ మంగళగౌరి ఉజ్జయని మహాకాళి కలకత్తా కాళి కొల్హాపూర్ మహాలక్ష్మి జాజ్ నగర్ విరజాదేవి గౌహతి కౌమార దేవి జబల్‌పూర్ వైష్ణవి కంచి కామాక్షి, ఆలంపురం జోగులాంబ మైసూరు చాముండి ఇండోర్ సరస్వతి తిరువిడమరుదూర్ ముక్తాంబిక శ్రీ కాళహస్తి జ్ఞాన ప్రసూనాంబ తిరువారూర్ కమలాంబిక మొదలైనవి ఇవికాక ప్రతి గ్రామంలోని గ్రామ శక్తులెన్నో వెలసినాయి

దేవిని నవరాత్రి పుణ్య దినాల్లో లింగ వయో జాతి బేదాలు లేక పూజించేవారికి దన వస్తు వాహన వయః ప్రాప్తి లబించునని పురాణాల వువాచ బారతీయుల నమ్మకం

వ్యాసం, ఫోటోలు పి కృష్ణమూర్తి

సీరియల్

రేపటి మహిళ

సి. ఆనందారామం

(గత సంచిక తరువాయి)

మృదుల అనంగ్‌కి ఫోన్ చేసి నాతో గిరిజన గ్రామానికి వస్తానన్నారుకదా! రేపు బయలుదేరుతున్నాను వస్తారా? అంది

వస్తాను రేపెన్నింటికి రావాలి? ఎక్కడికి రాను? ఉత్సాహంగా అన్నాడు అనంగ్

ఎక్కడి కేమిటి? మా యింటికేరండి ఇక్కణ్నుంచి రైలులో నైనా బస్సులో నైనా వెళ్దాం ట్రైన్‌లో వెళ్ళినా కరీంనగర్‌లో దిగి బస్సు ఎక్కవలసి వుంటుంది కాబట్టి డైరెక్టుగా బస్సులో వెళ్తేనే బాగుంటుందేమో?

బస్సులోనే వెళ్దాం నేను నేరుగా బస్సు స్టాండ్‌కే వస్తాను ఎన్నిగంటలకో చెప్పండి?'

ఉదయం పస్టు బస్సులోనే వెళ్దాం మధ్యాహ్నానికల్లా నీలంపల్లి చేరుకోవచ్చు

బస్‌స్టాప్‌కి వంటరిగా వచ్చిన మృదులని చూసి ఉత్సాహంతో పొంగిపోయాడు అనంగ్ అతడి మనసు యేవేవో దృశ్యాలను అల్లేసుకో సాగింది బస్‌లో పక్కపక్క సీట్లు లోనే కూర్చున్నారు ఇద్దరూ బస్ బయలు దేరాక ఎరోడ్డు మీదో నిర్జనంగ వున్న ప్రదేశంలో గూండా ఎవరైనా ఈ బస్ ఆపేస్తే యెంత బాగుంటుంది అన్నాడు అనంగ్

అప్పుడు బాగుండేది యేవిటిటా?

అపుడు బస్ ఆగిపోతుంది మనిద్దరం రోడ్డుకి దూరంగా ఆ కనిపించే మైదానాలవైపు వెళ్ళి ఎత్తైన కొండల మీద కూర్చుని ఆరుబయల్లో ప్రకృతి అందాలు చూసుకుంటూ కబుర్లు చెప్పుకోవచ్చు

అలాగే జరుగుతుందని యెందుకనుకోవాలి? గూండాలు బస్సు ఆపడానికొచ్చినపుడు నేనెదురుతిరిగి వాళ్ళందర్నీ చావబాది బస్సుని యదాప్రకారం ముందుకి నడిపించొచ్చును కదా!

మీరా!

ఎం? మిస్టరీ నవలల్లోలాగ మొదటి ఐడియా థ్రిల్లింగా వుందనుకోండి – రెండోది మరింత థ్రిల్లింగ్‌గా లేదూ?

మృదుల తన్ని వెక్కిరిస్తోందో – సరదాగా మాట్లాడుతోందో అర్థం కాలేదు అనంగ్‌కి

అవును, అలాజరిగితే మరింత థ్రిల్లింగ్‌గా వుంటుంది కరెక్ట్ బస్ యేదో స్టేజిలో ఆగింది నిండు గర్భిణీ స్త్రీ బస్సెక్కింది బస్‌లో వెనక సీట్లు తప్ప ఖాళీల్లేవు గర్భిణీ అటు నడవ బోతుంటే మృదుల చటుక్కున లేచి నిలబడి వెనక కుదుపెక్కువ మీరిక్కడ కూర్చోండి నేను వెనక్కి వెళ్తాను అని తనసీటు ఆవిడకి ఆఫర్ చేసి తను వెనక సీట్లోకి వెళ్ళి పోయింది గర్భిణీ స్త్రీ అనంగ్ పక్కన కూర్చోడానికి కొంత సంకోచించినా నిలబడే స్థితిలో లేకపోవడం వల్ల అతడి పక్కనే వొదిగి కూర్చుంది ఉండుండి ఎవడో కీచకుణ్ని చూసి నట్టు అనంగ్‌ని చూస్తూ పైట వొంటినిండా కప్పుకొంటోంది పల్లెటూరి గర్భిణీ స్త్రీ ప్రక్కన కూర్చోవలసి వచ్చినందుకే లోలోపల చిరాకు పడుతున్న అనంగ్ ఆ చూపుకి మరింత ఇరిటేట్ అయ్యాడు లేచి నిలబడి మీరు విశాలంగా కూర్చోండి అన్నాడు గర్భిణీ స్త్రీతో ఆవిడ ముఖంలో రిలీఫ్ కనిపించింది డబుల్ సీట్లో పూర్తిగా సర్దుకుని కూర్చుంది వెనకసీట్లో మృదుల ప్రక్కన ఖాళీలేదు ఎవరో ఖద్దరు పంచె ఆసామీ కూర్చున్నాడు మృదుల తన పక్కన కూర్చున్నందుకు ఆనందంతో వెలిగి పోతోంది ఆ ఆసామి మొహం ఆ మొహాన్ని ఈర్ష్యగా చూసి రాడ్ పట్టుకుని నిలబడ్డాడు అనంగ్ వెనక సీట్లో కూర్చునే అనంగ్ వైపు చెయ్యి చూపి చాలా మంచి పని చేసారు అంది మృదుల మెచ్చుకోలుగా ఆ ప్రశంస మండుతున్న అతని మనసుని కాస్త ఓదార్చింది అనంగ్ మనసులో

పోనీలే బస్సులో యెలా కూర్చుంటేనే ముందు ముందు ఆపల్లెటూళ్లో ఇద్దరమే యేకాంతంగా వుంటాంగదా! అనుకున్నాడు

మృదుల అనంగ్ నీలంపల్లి చేరుకునే సరికి అక్కడ మరో ముగ్గురమ్మాయిలు వీళ్లకోసమే వెయిట్ చేస్తున్నారు అనంగ్ ఆశలు నీరుకారి పోయాయి అమ్మాయిల్లో ఒకమ్మాయి పెళ్ళికానిదానిలా కనిపిస్తోంది మరొకమ్మాయికి పెళ్ళైందో లేదో తెలియడం లేదు మెడలో నల్లపూసలున్నాయి ముఖాన బొట్టులేదు ఆమె ముస్లిమ్ కావచ్చునేమో? కనీసం యువతరంలో విద్యావంతుల్లో నైనా హిందూ ముస్లిమ్‌లు పరస్పరం స్నేహంగా ప్రేమగా వుండటం వాంఛనీయమే కదా! మూడో అమ్మాయి ఫ్రాక్‌లో వుంది మెడలో శిలువగుర్తు లాకెట్‌గా వున్న సిల్వర్ చైన్ మెడలోవుంది బహుశా ఆంగ్లో – ఇండియన్ కావచ్చునేమో? మృదులని చూడగానే సంతోషంగా విష్‌చేసారు ముగ్గురూ వాళ్లలో ఒకమ్మాయి అనంగ్‌నుద్దేశించి ఈయనేనా ట్రైబల్ లైఫ్ స్టడీ చేస్తానంటూ మీతో వచ్చిన మిస్టరీ రైటర్ అంది ఆ అడగడంలో వున్న వెటకారాన్ని గుర్తించాడు అనంగ్ అతడు పాపులర్ రైటర్స్‌లో ఒకడు ఎంతోమంది ఫాన్స్ వున్నారతనికి ఆంధ్రదేశంనిండా అయినా అతనిని ఘాటుగా విమర్శిస్తూ నిరసించే వాళ్ళు కూడా లేకపోలేదు అలాంటి కొద్దిమందిలో ఈ అమ్మాయి కూడ ఒకర్తె కావడం అతనికి కొంచెం కష్టంతోచింది

మన కందిపిక కార్యాలయానికి వెళ్దాం పదండి అంది మృదుల అందరూ కాలి నడకన బయలుదేరారు మట్టి గోడలతో తాటాకుల కప్పులతో వున్న

జరిగిన కథ – 8 బాగవతార్ రాకగురించి తెలియజేయక పోయినా విమానాశ్రయానికి మృదుల వస్తుంది డిటెక్టివ్ సోమనాద్ మృదుల ముందే బాగవతార్‌కి ఫైలు అందజేస్తాడు దేవకి కోసం విమానాశ్రయానికి వచ్చానని మృదుల చెపుతుంది దేవకి రాలేదని విని యశోదరాదేవి కంగారు పడుతుంది మింగియార్ ఇంట్లోంచి వచ్చిన వాళ్ళ ఫొటోలలో దేవకి ఫొటో కూడ ఉంటుంది డాన్సర్‌గా ఉన్న దేవకిని కలుసుకుని మృదుల స్నేహాన్ని ప్రకటిస్తుంది ఫ్లెమింగ్‌ను మృదుల జూడోతో మట్టి కరిపిస్తుంది మృదుల ఒక గిరిజన ప్రాంతంలో సేవా కార్యక్రమాలు ప్రారంబిస్తుంది

పూరిగుడిసె ముందు నిలబడి శోవమ్మా! అని పిలిచింది మృదుల నలభైయేళ్ళ పల్లెటూరి గృహిణి తలుపు తెరుచుకొని వచ్చింది తల చక్కగా దువ్వుకుని ముడి వేసుకుంది చేతులకి మట్టిగాజులు మడమలకి కొద్దిగా పైగా కట్టుకున్న నేత చీర – నుదుట కాస్త పెద్దదిగా కనిపించే కుంకుమ బొట్టు ఇంతకు మించి పల్లెటూరి వ్యాంకం యేమీ లేదు శోవమ్మలో

అందరికీ నమస్కారాలు చేసి మట్టి అరుగు మీద ఈతాకుల చాప పరిచి కూర్చోండమ్మా! గుఱ్ఱాలు తెప్పిస్తాను అంది నమ్రతగా ఆ గుడిసె – ఆ వాతావరణం శోవమ్మ – అన్నీ చాలా చప్పగా ఉన్నాయి అనంగ్‌కి ఏదో చాలా థ్రిల్లింగ్‌గా వుండే ఎడ్వెంచరస్ అనుభూతి ఎక్స్‌పెక్ట్ చేస్తూ వచ్చాడు అతడు ఆడపిల్లలంతా చాపల మీద కూర్చున్నారు శోవమ్మ గాజు గ్లాసులతో కుండలో నీళ్ళు ముంచి తెచ్చిచ్చింది మిగిలిన వాళ్ళంతా తాగారు గాని అనంగ్ మాత్రం ఆ నీళ్ళు తాగలేక "ఈ చుట్టుపక్కలెక్కడా సోడా దుకాణాలు లేవా" అన్నాడు.

"లేకేం. ఈ వీధి చివరలో నే ఒకటున్నట్టుంది. కాని ఆ సోడాల కంటే యీ నీళ్ళే శుచిగా – శుభ్రంగా వుంటాయి చెప్పింది ముస్లిమ్‌లా కనిపిస్తున్న అమ్మాయి

వివిధ జాతులకు చెందిన అమ్మాయిలందరూ ఇలా ఒక్కటిగా మసలుకోవటం చాలా వింతగా తోచింది అనంగ్‌కి సిటీలో మతకలహాల గురించి వినివిని అతడు ఆ రెండు జాతులకి మధ్య బద్ధవైరం అనే అభిప్రాయానికి వచ్చేసాడు నిజానికి ప్రత్యేకించి యే ఒక్క జాతిని తప్పు పట్టడానికి లేదు స్వార్థపరులు కొందరు రగిల్చిన విద్వేషాగ్నులలో జాతి పేరిట – మతం పేరిట అమాయకులు నాశనమై పోతున్నారు

విధిలేక అందరితో పాటు ఆ మంచినీళ్ళే తాగి చాపకి ఒక చివరగా కూర్చున్నాడు ఆతనికి ట్రైబల్ విలేజికి వెళ్ళడంలోని చార్మ్ నశించిపోయింది పూర్తిగా ఒక అరగంటలో పదిహేనేళ్ళ కుర్రాడు అయిదు గుఱ్ఱాలను తీసుకొచ్చాడు ఆ యింటికి. అవి రేసు గుఱ్ఱాల్లాగ షోక్‌గా లేవు. బలహీనంగా వున్నాయి. వాటి మీద యెక్కి వెళ్ళడం ఊహించుకునే సరికి కాళ్ళల్లోంచి వొణుకొచ్చింది అనంగ్‌కి. ఆడపిల్లలు నలుగరూ గుఱ్ఱాలెక్కి రికాబుల్లో కాళ్ళు బిగించుకుని కళ్ళేలు చేతోత్త పట్టుకున్నారు.

"మీరెక్కరేం?" అడిగింది మృదుల అనంగ్‌ని.

"నాకు గుఱ్ఱపు స్వారీ రాదు." బిక్కమొహంతో చెప్పాడు అనంగ్.



రేపటి మహిళ

ఇది హార్స్‌రేసు కాదు – సినిమా సీను అంతకంటి కాదు గుఱ్ఱపు స్వారీ రాపక్క రలేదు ఎక్కి కూర్చోండి ఈ గుఱ్ఱాలకి యీ దార్లో నడవడం అలవాటే అవే వెళ్లిపోతాయి మనకేం శ్రమ లేకుండా చెప్పింది మృదుల అప్పటికీ అనంగ్ గుఱ్ఱం యెక్క డానికి సాహసంచలేదు

మీరు నడుస్తానంటే నేను తోవ చూపిస్తాను చెప్పింది శోవమ్మ ఆ అడవి కాలి బాటలో – శోవమ్మ తోడుగా – కాలి నడకన – ఉసూరు మంది అనంగ్ మనసు శోవమ్మ బదులు మృదుల ఆ మాట అని వుంటే యెంత బాగుండేది ఈ ప్రయాణమే ఎంత ఎగ్జైటింగ్‌గా వుండి వుండేది మనసులో ఊహించుకున్న శృంగార సంబాషణలు కాయిన్ చేసుకున్న జోక్సు – అన్నీ వేస్టేనా? అతడు ఆలోచిస్తూ నిలబడే వున్నాడు అమ్మాయిలు తమ గుఱ్ఱాలని అదలించారు అవి సన్నని కాలిబాటలో ఒకదాని వెంట మరొకటి అతి నెమ్మదిగా పరుగు తీసాయి

★ ★ ★ ★

డియర్ అవతార్!

నీకు చెప్పకుండా వెళ్లిపోవలసి వస్తోంది నిన్న రాత్రే వస్తానన్నావు నువ్వు ఇంకా రాలేదు నా ఫ్రెండ్స్ అంతా నా కోసం యెదరు చూస్తుంటారు నేను వెళ్లక తప్పదు అన్నట్టు ఈ సారి పాపులర్ రైటర్ అనంగ్ కూడా నాతో వస్తున్నాడు అతను ట్రైబల్ లైఫ్ స్టడీ చేసి వాళ్ల సమస్యల పైన నవల వ్రాద్దామను కుంటున్నాడట అతడు సిన్సియర్‌గా అలా రాస్తాడని నమ్మకం లేదు అయినా నాతో వస్తానంటె సరేనన్నాను చూద్దాం ఎం ప్రయత్నిస్తాడో! నేనతి త్వరలో మూడు నాలుగు రోజుల్లో వచ్చేస్తాను


విత్ లవ్

నీ

మృదు

ఉత్తరం మళ్లీ మళ్లీ చదువుకుంటున్నాడు బాగవతార్ ఒక్కొక్కసారి చదివినప్పుడల్లా మనసు మరింత మరింత రగిలిపోతోంది చదవడం ఆపలేడు మనసుని స్వాదీనంలోకి తెచ్చుకోలేడు కోపం వల్ల పెరిగిన ఉద్రేకంతో నరాల్లో రక్తం ఉరుకులు పెడుతోంది రక్తనాళాలు చిట్లి పోతాయా అన్నట్టు పళ్లు పటపట నూరుకుంటున్నాడు ఉరుములు – మెరుపులుతో కుండపోతగా వర్షం కురుస్తోన్న ఆకాశంలా తయారౌతోంది మనసు ఊపరి ఆడకుండా ఉక్కిరిబిక్కిరి చేసే ఝంఝూ మారుతంలా అల్లల్లాడిపోతోంది

ఎంత తెగింపు? అనంగ్‌తో ఒంటరిగా ఎక్కడికో వెళ్లిపోతుందా! రెండు రోజుల వరకూ రానని ఉత్తరం రాసి పెడుతుందా! ఏమైనా అంటే నువ్వు నన్ను నమ్మాలి నేనే తప్పు చెయ్యలేదు అని లెక్చర్లు కొడుతుంది అలా అనక ఇంకెలా అంటుంది? లోకంలో ఎవరేనా తన తప్పు తను ఒప్పుకుంటారా?



ఐ వాంట్ టు కిల్ హెర్ దాన్ని చంపెయ్యాలి చంపి తీర్తాను పిడికిలి బిగించి బల్ల మీద గట్టిగా గుద్ది చెయ్యి మంట పుట్టి అబ్బా అంటూ వెనక్కి జరిగి వెనకే వున్న మోడాని చూసుకోకుండా తన్నేసి దాని మీదుగా క్రింద పడ్డాడు ఫోన్ రింగైంది నెమ్మదిగా లేచి తను పడటం యెవరూ చూడలేదు కదాని అటూ యిటూ చూసుకున్నాడు ఎదురుగా అద్దంలో ప్రతిబింబం బిక్కమొహంతో జాలిగా చూసింది కాలు చాచి తన్నబోయి మోకాలు కలుక్కుమనగా వెనక్కి తీసుకున్నాడు ఫోన్ రింగవుతూనే వుంది టిలిఫోన్ వున్న రౌండ్ టేబిల్ ప్రక్కన కేన్ కుర్చీలో కూలబడి ఫోన్ అందుకున్నాడు

కెన్ ఐ స్పీక్ టు మిస్టర్ బాగవతార్ గంబీరంగా అదికార పూర్వకంగా వినబడిందొక కంఠం అలా అదికారంగా మాట్లాడే వాళ్లకి సమాదానం చెప్పడం బాగవతార్‌కి ఇష్టముండదు రిసీవర్ క్రెడిల్లో పెట్టేసాడు మళ్లీ వెంటనే మ్రోగింది ఫోన్ అంధుకున్నాడు

పోలీస్ స్టేషన్ నించి మాట్లాడుతున్నాను బాగవతార్ గారు ఉన్నారా? అదే కంఠం అదే అదికారం ముచ్చెమటలు పోసాయి బాగవతార్‌కి ఈ మద్య ఎ సినిమాలో చూసినా పోలీసుల దురాగతాలే కనిపిస్తున్నాయి పోలీసులంటేనే అలర్జీ బాగవతార్‌కి కాని సమాదానం చెప్పాలి తప్పదు

నేనే బాగవతార్‌ని ఏం కావాలి మీకు? బింకంగా మాట్లాడాలని ప్రయత్నించాడు కాని కంఠంలో ఒణుకు అదుపులో పెట్టుకోలేక పోయాడు

మీ శ్రీమతి మృదుల గారిని కొన్ని తప్పని సరి పరిస్థితులలో మేము అరెస్టు చేయవలసి వచ్చింది మీరొకసారి పోలీస్ స్టేషన్‌కి వస్తే అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు అటు వైపు నుంచి ఫోన్ పెట్టేసిన చప్పుడు

ముచ్చెమటలు పట్టాయి బాగవతార్‌కి

మృదులని అరెస్ట్ చేసారా? ఎందుకు? ఎం నేరం మీద? లాకప్ రూమ్స్‌లో రేప్స్ గురించి విన్నాడు చదివాడు పాపం మృదులని కూడా యెవరేన్నా రేప్ చేస్తారా? ఇంతకీ మృదుల చేసిన నేరమేమిటి? ఆమె వెంట పెద్దమనిషిలా వెళ్లిన అనంగ్ రేప్ చెయ్యబోతే శీలరక్షణ కోసం అతడ్ని హత్య చేసిందా? అమాయకురాలు అందర్నీ నమ్మేస్తుంది ఇప్పుడు మృదుల కేం శిక్ష విదిస్తారు? ఉరి తీస్తారా! అందమైన ఆ కళ్లల్లోంచి కనుగుడ్లు పొడుచుకొచ్చి – నాలుక బయటి కొచ్చి – మొహం వికృతంగా మారి – నో మృదులని ఉరి తీసే అదికారం ఎవరికీ లేదు ఎంత డబ్బు ఖర్చు అయినా మంచి లాయర్‌ని పెట్టి మృదుల నిర్దోషి అని రుజువు చేస్తాడు తన మృదులని తప్పకుండా కాపాడుకుంటాడు

అదేమిట అయ్యగారూ! ఏడుస్తున్నారేమిటి? ఆశ్చర్యంగా అడిగింది వంట మనిషి ఆ మాటలకి ఆలోచనల్లోంచి ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చాడు చేతులతో తడుముకుంటే చెంపలు తడిగా తగిలాయి అప్పటి వరకూ తను ఏడుస్తున్నట్టు తనకి తెలియదు గబాల్న పక్కకి తిరిగి రుమాలుతో కళ్లు తుడుచుకున్నాడు బోజనం చేస్తారా?' అడిగింది వంటమనిషి సమాదానం చెప్పకుండా డ్రైవర్‌ని పిలిచి కారు తీయమని కారులో కూర్చున్నాడు ఎక్కడికి సార్? అడిగాడు డ్రైవరు పోలీస్ స్టేషన్‌కి కాదు కాదు క్రిమినల్ లాయర్ షణ్ముఖంగారింటికి చెప్పేసి సీట్లో వెనక్కి వాలి కూర్చున్నాడు కళ్ల నీళ్లు ఆగడం లేదు బుఱ్ఱలోకి ఏ ఆలోచనలు రావడం లేదు తన పక్కన అమాయకంగా – పువ్వులా నిద్రపోయే మృదుల – తన సంగీతాన్ని పరవశత్వంతో వింటూ – తనకి ప్రోత్సాహానిచ్చే మృదుల ఎంతటి అలసటనైనా చిన్న చిరునవ్వుతో చెదరగొట్టే మృదుల – ఇల్లంతా నవ్వుల జల్లులతో నింపేస్తూ ఉల్లాసంతో వెలిగించే మృదుల – తన మృదుల తన కింక దక్కదా!

డ్రైవర్ షణ్ముఖంగారి ఇంటి ముందు కారాపాడు మరోసారి కళ్లు తుడుచుకుని లాయర్ గారి ఆఫీస్ రూమ్‌లోకి వెళ్లాడు ఎవరో క్లయింట్స్‌తో మాట్లాడుతున్నాడు లాయర్ బాగవతార్ ఖంగారు ఖంగారుగా లాయర్ గారూ! మీరు ముందు అర్జెంట్‌గా నా వ్యవహారం చూడాలి ఒక్క క్షణం ఆలస్యం కావడానికి వీల్లేదు అన్నాడు లాయర్‌కి బాగవతార్ తెలుసు

కూర్చోండి ఏమిటో చెప్పండి

నా బార్యని – మృదులని – పోలీసులు అరస్ట్ చేసారు

అరె! మృదులగారిని అరెస్ట్ చేసారా? ఎ సందర్భంలో?

హత్యకేసు

హత్య కేసా? ఎవర్ని హత్య చేసారు?

రైటర్ అసంగ్‌ని వాడు మృదులని రేప్ చెయ్యబోతే శీలరక్షణ కోసం చంపేసింది మృదులని మీరెలాగేనా కాపాడాలి

మళ్ళీ బాగవతార్ కళ్ళ నిండా నీళ్ళు

అలా బాద పడకండి మీ మృదుల కేం భయం లేదు మొదట ఆమెని బెయిల్ మీద విడిపించుకుందాం ఎ పోలీస్ స్టేషన్‌లో వుంది? తెల్లబోయి చూసాడు బాగవతార్

అడగడం మర్చిపోయాను అన్నాడు బిక్క మొహంతో తెల్లబోవడం ఇప్పుడు షణ్ముఖం వంతు అయింది

ముందు ఏ పోలీస్ స్టేషన్‌లో వుందో తెలుసుకుని నా దగ్గిర కొస్తే విడిపించే ఎర్పాట్లు చేద్దాం అన్నాడు

మళ్ళీ కార్లో కొచ్చి కూర్చున్నాడు బాగవతార్ ఎక్కడికి సార్? అడిగాడు డ్రైవరు

ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌కి పోనీ

ఎక్కడికి సార్?

ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌కి పోనీయమంటే నీక్కాదూ! కసిరాడు బాగవతార్ చిరాకులు – కసుగులు డ్రైవర్‌కి బాగా అలవాటే జీతం బాగా యిస్తాడు కాబట్టి బాగవతార్ దగ్గిర ఉన్నాడు కాని లేకపోతే ఎప్పుడో ఉద్యోగం వదిలేసి వెళ్ళిపోయేవాడు ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌కె వెళ్ళి మృదుల గురించి ఎంక్వయిరీ చేసి లేదని తెలుసుకోగానే బాగవతార్ గుండెదడ ఎక్కువ కాసాగింది పోలీస్ లాకప్ రూమ్స్‌లో ఖైదీలు మాయమవడానికి సంబందించిన సమాచారం ఆ మద్యనే ఏదో పేపర్లో చదివాడు లాకప్ రూమ్‌లో మృదులని పోలీసులు రేప్ చేసేసి అది బయటికి రాకుండా చంపేసి – శవాన్ని పూడ్చేసి మృదుల తప్పించుకు పారిపోయింది అని ప్రకటిస్తారెమో? రకరకాల ఊహలతో పిచ్చిగా చిందరవందర మెపోతొంది అతని ...

ఆడ – మగ అనేకమంది నినాదాలతో రోడ్డు మీద గుంపులు గుంపులుగా నడుస్తూంటే ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోయాయి బాగవతార్ కారు కూడా ఆపేయవలసి వచ్చింది ఆ గుంపు ఏమిటా అని చూసిన బాగవతార్ అదిరి పడ్డాడు గుంపు మద్య మెడలో పూలమాలతో మృదుల

జన ప్రవాహం బాగవతార్ కారుని ముందుకు కదలనీయలేదు అప్పటి వరకు మృదుల యేదో అయిపోయిందని ఆరాటపడిపోతూ మతి పోగొట్టుకున్న బాగవతార్‌కి అంత మంది మద్య మెడలో పూలదండతో మృదుల కనపడేసరికి భరింపరాని ఇరిటేషన్ వచ్చేసింది ఆ అమ్మాయి తనకేదో దారుణమైన మోసం చేసినట్లు ఫీలయ్యాడు

కారు ఇంటికి పోనీ! కోపంగా చెప్పాడు డ్రైవర్‌తో ఆ కోపం ఎందుకో డ్రైవర్‌కి అర్థం కాలేదు అప్పటి వరకూ బాగవతార్ మృదుల కోసం ఆరాటపడటం డ్రైవర్‌కి తెలుసు మృదుల క్షేమంగా కనిపించినందుకు సంతోషించాలి గాని కోపం తెచ్చుకోవడమేమిటి?

ఈయన మూడ్సు ఈయన్ని సృష్టించిన దేవుడు కూడా అర్థం చేసుకోలేడు అనుకున్నాడు మనసులో కారు వెనక్కి తిప్పి ఇంటికి తీసుకెళ్ళాడు బాగవతార్ హాల్లోకొచ్చేసరికి ఎ ఎ నక్షత్ర అతని కోసం ఎదురు చూస్తున్నాడు చాలా ఎగ్జైటింగ్‌గా వున్నాడతడు సర్! ఎం జరిగిందో మీకు తెలుసా? అడగాడు సంభ్రమంగా సోపాలో కూలబడి విసుగ్గా చెప్పండి! అన్నాడు బాగవతార్ ఉత్సాహంతో ఉక్కిరిబిక్కిరి అవుతూన్న నక్షత్ర బాగవతార్ విసుగుని పట్టించుకోలేదు జరిగిందంతా వివరంగా చెప్పసాగాడు

* * * * * * * * * * * *

గుఱ్ఱం యెక్కడానికి సాహసించలేని అనంగ్ విదిలేక శోవమ్మతో కాలి నడకన బయలుదేరాడు శోవమ్మ లాంటి ఆడదానితో కలిసి అడవుల్లో కాలిబాట వెంట ప్రయాణం చేయవలసి రావడం ఏమాత్రం భరించలేక పోతున్నాడు అనంగ్ ఇంతలో ఆ దారిన ఒక జీప్ వెళ్తోంది ఆపమన్నట్లు చటుక్కున చెయ్యి జాపాడు జీప్ ఆగింది జీప్ డ్రైవర్ ఎక్కన గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలతో ఒరి అందు ... ఒంచెలో ఖరీదైన మనిషి కూర్చుని ఉన్నాడు అతని తన ...

కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య **చిన్నదిగా, క్లుప్తంగా** వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీదే పేరూ, వూరూ అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి
- ★ సొంత చిరునామాగల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పి పంపడం జరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యత లేదు
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకు ఐదారు వారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి
- ★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు

శాంతి దూత శక్తిమాత

ఎక్కడ చూస్తే అక్కడ కన్పిస్తుంది
శక్తి స్వరూపిణి సర్వాధికారిణి
సప్త సముద్రాలు ఆమె శరీర వర్ణాలు
నిఖిల ప్రపంచాలు ఆమె చేతిబంతులు
నిబిడాంధకారమగ్న కాలమేఘ మాలికల
అట్టహాసాలు ఆమె వికృత దరహాసాలు
ఆతల్లే నర్తిస్తూ చెంతకు చేరిందంటే
అతడౌతాడు అద్భుత కళాకారుడు
న్యాయకరవాలంతో అన్యాయ కళేబరాన్ని
నరికే యువకుల భుజశక్తి ఆతల్లే
కామాంధుల బారి నుండి కట్నం చావుల నుండి
రక్షకోరు యువతులను రక్షించేదాతల్లే
ప్రజాస్వామ్య హంతకులౌ పౌరాణిక రాక్షసుల్ని
మట్టుపెట్టు గుట్టు చెప్పు మహాశక్తి ఆతల్లే
ఓ తల్లీ! భరతమాత ఉక్కిరిబిక్కిరి అయ్యే
ఈ తరుణం నీ కరుణకై ఎదురు చూస్తున్నది
ఎవరి హృదయసీమ జేరి ఎవరి బుద్ధి నావహించి
హింసా విద్వేషాగ్నికి ఇగిరిన మానవతాత్మతో
చరియించే యీ ప్రజలకు శాంతి దాత వౌతావో
ఈ తరుణం నీ కరుణకై ఎదురు చూస్తున్నది
ఓ తల్లీ! భరతమాత నూరడింప రావమ్మా!

—సూర్యదేవర రవికుమార్

రేపటి మహిళ

విజిటింగ్ కార్డ్ యిచ్చి కనుకునూర్ వరకు నాకు లిఫ్ట్ యిస్తారా? అని అడిగాడు విత్ ప్లెజర్ అని జీప్‌లోకి ఆహ్వానించాడు జీప్ ఎక్కుతూ శోవమ్మా! నిన్ను కనుకునూర్‌లో కలుసుకుంటాను అని చెప్పి చెయ్యి ఊపాడు జీపులో పెద్దమనిషి ఈ మారుమూల పల్లెటూళ్లో మీకేం పని? అని అడిగాడు

నా పేరు అనంగ్ ఏదో కొద్దిగా బిజినెస్ వుంది నవలలు కూడా రాస్తూంటాను

ఏమిటేమిట' ప్రఖ్యాత నవలా రచయిత అనంగ్ గారు మీరేనా? మీ నవలలు నాలుగైదు సినిమాలుగా కూడా వచ్చాయి కదూ!

ఇంత మారుమూల అడివిలో నవలా రచయితగా తన్ని గౌరవించే వ్యక్తి – అదీ ఖరీదైన వ్యక్తి దొరికినందుకు చాలా సంతోషించాడు అనంగ్

అవునండీ! ఇంకో అయిదారు నవలలు సినిమాలుగా రాబోతున్నాయి యదాలాపంగా అన్నట్లు చెప్పాడు

గ్లాడ్ టు మీట్ యు నా పేరు రాజభూషణం ఫారెస్ట్ కాంట్రాక్టర్‌ని మా బంధువర్గంలో చాలా మంది గవర్నమెంటులో వున్నారు గొప్పగా చెప్తూ చెయ్యి జాపాడు ఆప్యాయంగా ఆ చెయ్యి అందుకున్నాడు అనంగ్

ఇంతకీ మీరీ పల్లెటూరికి ఎందుకొస్తున్నారో చెప్పనేలేదు

ట్రైబల్ లైఫ్ మీద నవలొకటి ప్లాన్ చేసాను ఏదో ఆషామాషీగా వ్రాయడం నాకిష్టం లేదు ఏ విషయమైనా సరే క్షుణ్ణంగా పరిశోధించి – మరీ రాస్తాను అందుకే ఈ అడవిలోకి వచ్చాను అదృష్టం బాగుండి మీరు కలిసారు

అహ్హహ్హ అని ఉల్లాసంగా నవ్వాడు రాజభూషణం ఈ ట్రైబల్స్ గురించి రాయడానికే మీరుంటుందండీ! మన్నూ – మశానమునూ! కొన్ని రకాల ఇంగ్లీషు మేగజైన్సులో ఆఫ్రికన్ అడవుల్లోని ట్రైబల్స్ గురించి వాళ్ల వింత వింత ఆచారాల గురించి అద్భుతమైన విషయాలు రాస్తారు అవి సేకరించి రాయండి పాఠకులు పరమానందంగా చదువుతారు

ఆఫ్రికన్ అడవుల్లో ట్రైబల్స్ జీవితాలతో మన ట్రైబల్స్ జీవితాలు కలుస్తాయంటారా?

ఏ లైఫ్ ఎలా వుంటుందో – తెలుగు పాఠకుల్లో ఎంత మందికి తెలుసు? తెలుసుకోవాలన్న కుతూహలం మాత్రం ఎంత మందికి? ఏదేనా అద్భుతంగా –వింతగా –గమ్మత్తుగా వుంటే పాఠకులు మెచ్చుకుంటారు సాదా సీదాగా రాస్తే ఎవడిక్కావాలి?

ఈ సలహా బాగుంది అలాంటి మేగజైన్స్ ఎక్కడ దొరుకుతాయో ప్రయత్నిస్తాను

మేగజైన్స్ దొరక్క పోయినా ఫరవాలేదు ఆఫ్రికన్ ట్రైబల్ లైఫ్ మీద అద్భుతమైన నవలలు కొన్ని వచ్చాయి ఇంగ్లీషులో అవి చూడండి పోనీ

ఈ అయిడియా కూడా బాగుంది అయితే అలాటి వాటిల్లో చాలా సీన్స్ తెలుగు సినిమా ప్రొడ్యూసర్లు ఉపయోగించేసుకున్నారనుకుంటాను అయినా పరవాలేదు ఎప్పటికప్పుడు ఈ రకమైనవి కొత్త కొత్తగా వస్తూనే వుంటాయి ఇంతకీ ఆ రైటర్స్ అయినా నిజం చెప్తున్నారో లేదో మనకి తెలియదు నిజమైతేనేం – అబద్ధమైతేనేం – థ్రిల్లింగ్‌గా వుంటే చాలు

బాగా చెప్పారు పగలంతా మీ స్టడీస్ ఏవో పూర్తి చేసుకుని సాయంకాలానికి రెడీగా వుండండి మా జీప్ పంపిస్తాను రాత్రి మా గెస్ట్ హవుస్‌లో పడుకుందురు గాని

థేంక్యూ

ఈ రోజుల్లో ఈ ట్రైబల్స్‌లో ఎవరూ వెనకటి రోజుల్లో లాగ అమాయకంగా లేరండీ అందరూ తెలివి మీరి పోయారు పని దగ్గిర మొరాయిస్తారు దొంగతనాలకి లెక్కేలేదు బయట నుంచి కూలీలని తెప్పించుకోకుండా నానాగొడవా చేస్తారు ఏమిటో కొందరు రచయితలు మేమే వీళ్లనేదో బాగుచేసెస్తున్నట్టుగా రాసేస్తారు చూస్తారుగా మీకే అర్థమౌతుంది

జీప్ కనుకునూర్ దగ్గిర ఆగింది అవిగో! ఆ కనపడే గుడిసెలే మీరు చూడాలనుకుంటున్న పల్లెటూరు చెప్పాడు రాజభూషణం

థేంక్స్ చెప్పి జీప్ దిగాడు అనంగ్

సాయంత్రానికి రెడీగా వుంటారుగా అడిగాడు రాజభూషణం

ఓ కే అనంగ్ ఊళ్లో కొచ్చేసరికి మృదుల ఆమె స్నేహితులు అక్కడకి చేరుకున్నారు ఊళ్లో జనం ఆడ – మగ అందరూ వాళ్ల చుట్టూ ఉన్నారు వీళ్లూ, వాళ్లలో ఒకరన్నట్టు కలిసిపోయి మాట్లాడుతున్నారు కథల్లో వర్ణించినట్లు మగవాళ్లల్లో ఎవరూ ఒట్టి గోచీలలో లేరు యువకులంతా పాంట్స్ బుష్ షర్ట్సులోనే వున్నారు పెద్దవాళ్లల్లో మాత్రం బాగా ముసలివాళ్లు అతికొద్దిమంది పాత దోవతులు మోకాళ్ల వరకూ కట్టుకుని తిరుగుతున్నారు వేషంలో నాగరికత ఉన్నంత మాత్రాన వాళ్లు సుఖంగా వున్నారని చెప్పడానికి వీల్లేదు ఆ పరిసరాల్లో దారిద్ర్య దేవత బీకరంగా నృత్యం చేస్తూనే వుంది మట్టి గుడిసెలు తాటాకుల కప్పులు ఈ గుడిసెలకి కాస్త దూరంలో ఏనాడో ఎవరో మంత్రిగారు వీళ్లకి వేరే ఇళ్లు కట్టించి ఇవ్వడం కోసము చేసిన శంకుస్థాపన తాలూకు రాయి గుడిసెల్ని జాలిగా చూస్తోంది జొన్నరొట్టెలు కొన్ని ఇళ్లల్లో అవీ లేవు చోడి అంబలి ఇదే ప్రదానమైన ఆహారం అప్పుడప్పుడు అడవుల్లోంచి దొంగతనంగా పట్టి తెచ్చిన జంతువుల మాంసం వాళ్లకి మంచి విందు అయితే ఆ విందు తరుచుగా దొరకదు అలా దొంగతనంగా జంతువుని చంపి వాటి మాంసం ఇళ్లకి తెచ్చుకోవడానికి వీళ్లు చాలా యాతన పడవలసి వస్తుంది గార్డులు మొదలుకొని మేస్త్రీల వరకు ఎవరికంట పడ్డా ఆ మాంసం లాగేసుకుంటారు పడిన శ్రమకి వాళ్లు తిట్టే బండబూతులే బహుమానము ఇప్పటికీ మగవాళ్లల్లో చాలా మంది తాగుడు మానలేక పోతున్నారు ఈ వ్యసనం అతి భయంకరంగా ఈ కుటుంబాల జవసత్వాలన్నిటినీ పీల్చి పిప్పి చేస్తోంది ఇంత నిరాశలోనూ ఆశాకిరణం చిన్నపిల్లల్లో సగానికి పైగా చుట్టుపక్కల టౌన్సులో స్కూల్స్‌లో జాయినయ్యి చదువుకోవడం ఆ వూళ్లో ఇదివరలో ఆడవాళ్లు కూడా తాగేవారట ఇప్పుడిప్పుడు యువతరంలో ఆడవాళ్లు తాగడంలేదు ముసలి వాళ్లైనా మృదుల లాంటి వాళ్లు వచ్చినప్పుడు తాగడం మానుకుంటున్నారు

(ఇంకా ఉంది)

చూపుల్లో తంతివ్వల

కేప్టెన్ షేక్ మౌలాలి

"ఏమండీ! మనం ఇల్లు మారదామా! అంది వనజ ఆపీసు నుండి వచ్చిన భర్తకు కాఫీ అందిస్తూ

ఎందుకో తెల్సుకోవచ్చా! అన్నాడు సూర్యం కాఫీ సిప్ చేస్తూ

నాకెందుకో ఇక్కడ ఉండాలనిపించడం లేదండీ! ఇల్లు మారితేనే మంచిదనిపిస్తుంది! అన్నది ఎదురుగా కుర్చీలో కూర్చొని తాను కూడా కాఫీ తాగుతూ

ఇది ఇండెపెండెంట్ హౌస్ అద్దె కూడా ఎక్కువేమీ కాదు కుళాయి బావి రెండూ ఉన్నాయి నా ఆపీసుకు కూడా చాల దగ్గర చక్కగా అలంకరించుకోడానికి పెరడు నిండా నీకు బోలెడు పూలు ఇంటి యజమానులు ఇబ్బంది పెడుతున్నారనుకోవడానికి వాళ్ళసలు ఈ ఊళ్ళోనే ఉండడం లేదు ఈ ఇల్లు కావాలని సెలక్ట్ చేసింది కూడా నువ్వే! మూడు నెలలు కూడా ముగియక మునుపే ఇల్లు మారదా మనడానికి గల కారణం తెలుసుకోవచ్చా బామామణీ! అన్నాడు సూర్యం ఖాళీ కప్పు క్రింద పెడుతూ

వనజ ఎ సమాదానం ఇవ్వకుండా కాలి బొటన వేలిని నేలకేసి రాస్తూ చూపు క్రిందికి వాల్చింది

ఎమిటో ఆ ఆలోచన! అన్నాడు సూర్యం

సమాదానం శూన్యం

సూర్యం లేచి లోనకు వెళ్ళి బట్టలు మార్చుకు వచ్చాడు

వనజ అలాగే కూర్చొని దీర్ఘాలోచనలో పడిపోయింది

అరె! ఎమిటి వనజా ఆ కన్నీళ్ళు! అసలేమయిందో చెప్పు అలాగే! నీ ఇష్టం ప్రకారం ఇల్లు మారదాము! అన్నాడు

అనుకోని ఈహఠాత్పరిమాణానికి వనజ త్రుళ్ళిపడి కళ్ళు తుడుచుకుంది

ఇక్కడ కంటి వెనుక పెరడులో చల్లగా ఉంటుంది అక్కడ కూర్చుందాం పద! అనడంతో వనజ లేచింది

బావిని ఆనుకొని కూర్చున్నాడు సూర్యం తులసి కోటకు ప్రక్కగా కూర్చుంది వనజ

మరేం లేదండి! ఆ ఎమరింటాయన ఎప్పుడూ నాకేసి అదో విదంగా చూస్తుంటాడండి! అంది వనజ తలదించుకొని

అంటి లెక్చరరు శంకరరావా! అన్నాడు సాలోచనగా సూర్యం

అవునన్నట్లు తలాడించింది వనజ

యాభయి పడిలో పడ్డ శంకరరావుకి ఇదేం పాడు బుద్ధి పైగా టీచరుగా ఆయనకు ఊళ్ళో మంచి పేరుంది సతతమూ విద్యార్థినీ విద్యార్థుల మద్య మసలే ఉపాద్యాయులు ఇలా ప్రవర్తించడం మంచిదికాదు! వనజ అబద్ధం చెప్పదు ఎన్నాళ్ళ నుండి ఈ వ్యథ అనుభవిస్తుందో! ఆలోచనలో పడ్డాడు సూర్యం

రాత్రి బోజనం ఇద్దరికి సరిగా రుచించలేదు మొత్తం మీద అయిందనిపించారు ఇద్దరికీ కడుపులో చేయి పెట్టి దేవినట్లుగా అనిపించింది రాత్రంతా సరిగ నిద్ర పట్టలేదు

మరునాడు సూర్యం ఆఫీసులో ఏ ఫైలు తెరచినా బట్ట తలతో నెరసిన గడ్డంతో లావుపాటి కళ్ళద్దాలతో శంకరరావు ముఖం ఎక్కిరిస్తూ కన్పించింది ఫైలు మూసి కూర్చుంటే కన్నీటి బిందువులతో వనజ సాక్షాత్కరించింది లంచ్ బాక్స్ తెరచి నోట్లో పెట్టుకున్నాడు చేదుగా ఉన్నట్లని పించింది అంతా కుక్కకు పడేసి బాక్స్ బ్యాగ్‌లో



చూపుల్లో అంతర్యం

పడేశాడు తల బరువుగా కళ్ళు వేడిగా, నరాలన్నీ బలహీనంగా ఉన్నట్లనిపించాయి వేడి నిట్టూర్పుల మధ్య మరుసటి రోజుకు సెలవు చీటి రాసి పర్మిషన్ తీసుకొని గంట ముందుగా ఇంటికి బయలుదేరాడు

ఇల్లు చేరి స్నానం చేస్తేనే గాని సూర్యానికి తాపం తగ్గలేదు

పెరట్లో చేరి భార్యాభర్త కాఫీ తాగుతూ కూర్చున్నారు

ప్రతి ఇంటికి ఏదో రకమయిన ఇబ్బంది ఉంటుంది వనజా! ఇబ్బందిని మనం సమస్యగా భావించకూడదు ఇబ్బంది గాని లేక సమస్యగాని సావకాశంగ పరిష్కరించే మార్గం ఆలోచించాలి భీతి చెంది పారిపోతే ప్రయోజనం శూన్యం అంతగా ఇక్కడ మనం ఉండలేనప్పుడు తప్పక ఇల్లు నీ ఇష్ట ప్రకారమే ఖాళీ చేద్దాం! అన్నాడు సూర్యం

ఈ ఇంట్లో మనం చేరినప్పటి నుండి ఆయన అనుక్షణం నా వైపే చూడడానికి ప్రయత్నిస్తుంటా డండీ! బాగా గమనించి ఆలోచించే మీతో చెప్పాను ఇందులో నా తొందరపాటు ఏమాత్రం లేదండీ! అంది వనజ

నిజమే! కాని తీరా ఇల్లు మారాక అక్కడ ఇంతకంటె పెద్దచిక్కు ఉత్పన్నం కావచ్చు! మరో మాట ఇది అద్దె ఇల్లు కనుక మారడానికి ప్రయత్నించవచ్చు కాని సొంత ఇల్లు అయితే అది సాధ్యమయ్యే విషయం కాదు కదా! పొరుగు వాడికి భయపడి లోకంలో ఎవ్వరూ ఇల్లు అమ్ముకోరు పోనీ అతను అలా ప్రవర్తించడానికి ఏదయినా కారణముందా! అడిగాడు

వనజ పెదవి విరచి తల అడ్డంగా తిప్పింది

కొంచెం సేపు ఇద్దరూ మౌన ముద్రలో పడ్డారు

తిరిగి సూర్యం అన్నాడు – పోనీ అతను అలా ప్రవర్తిస్తున్నాడని అతని ఇల్లాలిపై నేను దృష్టి కేంద్రీకరించడం అంత సబబు సభ్యత కాదు నేనే స్వయంగా అతని దగ్గరకు వెళ్ళి 'నీ ప్రవర్తన బాగా లేదు మార్చుకో' అంటే అనవసరపు రాద్ధాంతం కావచ్చు! నాకో ఆలోచన స్ఫురిస్తుంది ఆఫీసుకు రేపు సెలవు కూడా పెట్టాను తెల్లారిన తర్వాత చెప్తాను, పని నీ వలననే సానుకూల్యమవుతుంది ప్రయత్నించి చూద్దాం!

ఇద్దరి హృదయాలు కొంత తేలికయ్యాయి రాత్రి గడిచింది

వనజ యథాప్రకారం తొమ్మిదయ్యేసరికి వంట కానిచ్చింది

ఇద్దరూ వరండాలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ ఎదురింటికేసి కన్ను వేసి ఉంచారు తొమ్మిదిన్నర అయ్యేసరికి శంకరరావు చేతిలో పుస్తకాలతో కాలేజీకి బయలుదేరాడు

పది నిమిషాలు వ్యవధానం ఇచ్చి వనజ వెళ్ళి ఎదురింటి తలుపు తట్టింది

తలుపులు తెరచుకున్నాయి వనజ లోన అడుగు పెట్టింది సూర్యం చూపు శంకరరావు ఇంటి గుమ్మం మీదనే కేంద్రీకరించింది వాకిలికి కట్టిన కర్టన్ రెపరెపలాడుతోంది చాలా జాగ్రత్తగా చెవులు నిక్కించి వినడానికి మరీ ప్రయత్నిస్తున్నాడు. కాని ఏమాత్రం మాటలు వినిపించడం లేదు

గంటన్నర గడిచింది వనజ బయటకు రాలేదు సూర్యానికి గుండెదడ మొదలయి తల తిరుగు తోంది

శంకరరావు భార్యతో సూక్ష్మంగా విషయం అందించి వెంటనే రమ్మని వనజకు చెప్పి పంపించాడు సూర్యం పోనీ ఏదయినా ఘర్షణ మొదలయిందా అంటే, వాతావరణం చాల ప్రశాంతంగా ఉన్నట్లనిపించింది

సూర్యం చూపంతా ఎదురింటి కర్టన్ మీదనే ఉంది

సూర్యుడు నెత్తి మీదకు వచ్చాడు గాలి దారాళంగ వీస్తున్నప్పటికి సూర్యానికి చెమటలు పట్టసాగాయి

ఇంతలో నిండు పున్నమ ముఖంతో నవ్వుతూ చేతుల్లో రవిక గుడ్డ అరటి పళ్ళు తాంబూలంతో వనజ ఎదురుగా వచ్చి కూర్చుంది

చెమటలు తుడుచుకున్న సూర్యం ఏమిటన్నట్లు ఆమె కళ్ళలోకి చూశాడు

"నేను కొంత తొందర పడ్డాననిపిస్తుందండీ! ఎదురింటావిడ నన్ను సాదరంగా లోనికి పిల్చి ఇల్లంతా చూపించింది ఆమె చిన్ననాటి నుండి అన్ని వివరాలు చెప్పింది తర్వాత వివాహం అయినప్పటి నుండి అన్ని ఫోటోలు ఆల్బమ్‌లు చూపించింది

వారికి ముగ్గురు సంతానమట పెద్దబ్బాయి అమెరికాలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు రెండో తను ఆర్మీలో మేజరుగా పని చేస్తున్నాడు

తర్వాత వారికి ఒక కుమార్తె కలిగింది ఆమెను ఎం డి చదివించారు

గత సంవత్సరం ఇద్దరు దంపతులు కుమార్తెతో సహా హరిద్వార్‌లో కుంభమేలా దర్శించడానికి వెళ్ళారు

అప్పుడు వార్తా పత్రికలలో కూడా ఫోటోలతో సహా వివరాలు వచ్చాయి కదా! అక్కడ జరిగిన త్రొక్కిసలాటలో ఎందరో అశువులు బాశారు అప్పుడు తల్లిదండ్రులను రక్షించుకొనబోయి పాపం ఆ అమ్మాయి ప్రాణాలు పోగొట్టుకుంది

ఎదురింటి పిన్నిగారు కళ్ళ నీళ్ళు పెట్టుకొని చెబుతూ ఆ అమ్మాయి ఫోటో చూపించింది

ఏమండీ! నిజంగా ఆ ఫోటో అచ్చు నాది లాగానే ఉందండీ! మనిషిని పోలిన మనుషులుంటా రంటారు కదా! ఇదేనేమో!

మనం ఈ ఇంట్లో చేరినది మొదలు శంకరరావు గారు పిన్నిగారితో నన్ను గురించి చెప్తూ గతించిన తన కూతురు స్మృతికి వస్తుందంటారట! ఆమె నాతో ఆ విషయం చెబుదామనుకుంటుండగనే మూణ్ణెల్లు గడిచాయట

మా బిడ్డ నీ రూపంలో ఈ రోజు నా ఇంటికి వచ్చిందమ్మా అంటూ భోజనం చేయమని బ్రతిమలాడింది మీరు కూడా ఇంట్లోనే ఉన్నారని చెప్పి నేను వచ్చాను


నేను లేచి వస్తుంటే ఉండమ్మా! అని సొంత కూతురికి పెట్టినట్లు వీటితో నా ఒడి నింపి అప్పుడప్పుడు వస్తుండమ్మా! అసలు నీ ఇల్లే అనుకో! అంది

మరో విషయం చెప్పటం మర్చానండీ! వచ్చే ఆదివారం మన ఇద్దరికీ వారింట్లోనే భోజనం మరీ గట్టిగా చెప్పారు పిన్నిగారు!

అంతా విన్న సూర్యం నుదిటిపై చెమటను తుడుచుకున్నాడు

ఇంతలో ఎదురింటి ముందు స్కూటరు ఆగిన చప్పుడయి సూర్యం దృష్టి అటుగా మరల్చాడు శంకరరావు ఇటుకేసి లిప్తకాలం చూసి ఆ తర్వాత ఇంటిలోకి వెళ్ళాడు

శంకరరావు చూపుల్లో ఎంత ఆంతర్యం మమత దాగున్నాయో గ్రహించాడు సూర్యం □





జీవం ఉట్టిపడేలా చేసే లిరిల్ తాజాదనం.



లిరిల్
తాజాదనపు సబ్బు

వళ్లు పులకరింపజేసే నిమ్మకాయల తాజాదనంతో.

పత్రికాలోకంలో విశిష్ట తారక ఆంధ్ర సచిత్ర వారపత్రిక

విద్యా ప్రపంచంలో విశేష దీపిక రవి కళాశాల వేదిక

సంయుక్త ఆధ్వర్యంలో

సరికొత్త సైన్స్ క్విజ్!

తెలుగు పాఠక లోకానికి ఎనిమిది దశాబ్దాలుగా సేవ చేస్తూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక, విద్యార్థి లోకానికి మూడు దశాబ్దాలుగా వెలుగు చూపిస్తూ ఒక నిర్దిష్ట స్థానాన్ని పొందిన రవి కళాశాల, బ్రాడీపేట, గుంటూరు- కలిసి తెలుగువిద్యార్థి పాఠక ప్రపంచం కోసం ఒక సరికొత్త సైన్స్ క్విజ్‌ను నిర్వహిస్తున్నాయి.

ప్రముఖ విద్యావేత్త, రవి కళాశాల డైరక్టర్ శ్రీ సి. ఎ. ఎన్. ధన్ ఈ క్విజ్‌కి సంబంధించిన ప్రశ్నలను ఇస్తారు. బహుమతులు కూడా వారే ఇస్తారు. సైన్స్ ప్రోగ్రామ్‌లు- క్విజ్‌లు, ఎగ్జిబిషన్‌లు, సెమినార్‌లు వంటివి- ఎన్నో నిర్వహించిన శ్రీ ధన్ ఈ క్విజ్ వేదిక "ఆలోచనాపరులకు ఏ పనినైనా దీక్షగా కొనసాగించే కార్యశీలురకు ఎంతయినా ఉపకరిస్తుం"దంటున్నారు. శక్తి సామర్థ్యాల పరిశీలనకి ఇదొక అవకాశం కాగలదు.

ఈ క్విజ్‌లో ఇరవై ఏళ్ళు నిండని స్త్రీ పురుషులు ఎవరైనా పాల్గొనవచ్చు. క్విజ్‌కి సంబంధించిన మొత్తం 25 ప్రశ్నలు ఒక్కొక్క వారం 5 ప్రశ్నలు చొప్పున వరుసగా 5 వారాలపాటు ఇవ్వబడుతాయి. ప్రతి వారం క్విజ్‌కి సంబంధించిన ఒక ప్రత్యేక కూపన్ ఉంటుంది.

అయిదు వారాలూ పూర్తయ్యాక పాఠకులు 25 ప్రశ్నలనూ వాటి సమాధానాలను సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003 అనే చిరునామాకు పంపాలి. ప్రతి 5 ప్రశ్నల సమాధానాలతో పాటు ఆ వారపు క్విజ్ ప్రత్యేక కూపన్ జతపరచి తీరాలి. అంటే మొత్తం 25 ప్రశ్నల సమాధానాలతో వాటికి సంబంధించిన 5 కూపన్‌లు విధిగా ఉండాలి. కూపన్‌లు జత చేయకుండా వచ్చిన సమాధానాలను ఎట్టి పరిస్థితులలోనూ పరిశీలించడం జరగదు. మొత్తం అన్నీ కలిపి ఒకేసారిగా గడువు తేదీలోగా పంపాలి.

గడువు తేదీ: 31 అక్టోబరు, 1987

పాఠకులు పంపిన సమాధానాలను నిష్ణాతులైన విద్యావేత్తలకు పంపి వారి అభిప్రాయాలకు అనుగుణంగా ఉత్తమమైన సమాధానాలను రాసిన వారికి ఈ కింది బహుమతులను ఇవ్వడం జరుగుతుంది:

మొదటి బహుమతి రు. 750/-

రెండవ బహుమతి రు. 500/-

మూడవ బహుమతి రు. 300/-

రెండు నాలుగవబహుమతులు ఒక్కొక్కటి రు. 200/-

మూడు ఐదవబహుమతులు ఒక్కొక్కటి రు. 100/-

15 ప్రత్యేక బహుమతులు- పత్రిక ఇయర్‌బుక్‌లు 15

ఈ క్విజ్‌లో పాల్గొనే వారు ఈ కింది నిబంధనలను విధిగా పాటించాలి

- ★ క్విజ్‌లో పాల్గొనే వారి వయస్సు కచ్చితంగా 20సం లోపే ఉండాలి ఈ మేరకు ఒక ధ్రువ పత్రాన్ని విధిగా జతపరచాలి
- ★ క్విజ్‌లో గెలుపొందిన వారు ప్రచురణ నిమిత్తం తమ జీవిత విశేషాలను తెలుపుతూ తమ ఫొటోలను పంపడానికి సిద్ధపడి ఉండాలి
- ★ ప్రతి వారం ప్రచురించే 5 ప్రశ్నలకు సంబందించిన కూపన్ మరచిపోకుండా జత చేయాలి ఈ లెక్కన 5 వారాలకు 5 కూపన్‌లు ఉండాలి ఏ ఒక్క కూపన్ లేకపోయినా వారి సమాదానాలను పరిశీలించడం జరగదు అన్నీ కలిపి ఒకేసారి గడువు తేదీలోగా పంపాలి
- ★ క్విజ్‌కి సంబందించిన సమాదాన పత్రాలు ఎటువంటి పరిస్థితులలోనూ తిప్పి పంపబడవు కాబట్టి తగిన టపా ఉన్న తిరుగు కవర్లను జత చేయనక్కర లేదు
- ★ సమాధానాలు స్పష్టంగా పూర్తి తెలుగు లిపిలోనే ఉండాలి. కాగితానికి ఒకే వైపున రాయాలి. అర టావు సైజు కాగితాల మీద అయితే అనువుగా ఉంటుంది. వ్రాత ప్రతిపై పూర్తి చిరునామా రాయాలి. చిరునామా పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి.
- ★ ఉత్తమ సమాధానాల ఎంపికలో, బహుమతుల నిర్ణయంలో సంపాదకునిదే తుది తీర్పు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- ★ గడువు తేదీ దాటాక అందిన సమాధానాలను ఎట్టి పరిస్థితులలోనూ పరిశీలించడం జరగదు.
- ★ క్విజ్ ఫలితాలను గడువు తేదీ తర్వాత సాధ్యమైనంత త్వరగా వీలును బట్టి ప్రచురించడం జరుగుతుంది. ఈ విషయంలో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

–సం.

11 మీరు రెండు చక్రాల సైకిల్ చూసే ఉంటారనుకుంటాను అంటే నవ్వొస్తుందనుకుంటా కానీ దాన్ని స్టాండు లేకుండా నిలబెట్టగలరా? కాని కదులుతున్నప్పుడు నిన్ను, నీ స్నేహితుని, ఇంకా ఏదైనా సామానుంటే అంత బరువును ఎలా మోస్తుంది పడకుండా? దాని నిర్మాణంలోని రహస్యమేంటి? చక్రానికి, చక్రానికి ఎంత దూరం ఉండాలి? సీటుకి, హాండిల్‌కి మద్య ఎంత దూరం ఉండాలి? పెద్ద చక్రానికి పళ్ల చక్రానికి మద్య నిష్పత్తి, స్పోక్స్ సంఖ్య ఎంత? అన్ని అవసరమా? ఇంకా ఎన్నో వివరాలు చూసి, కొలిచి లెక్కగట్టి వ్రాయండి స్పీడును పెంచాలంటే ఏ మార్పులు చేయాలి?

12 మనిషి నీటిలో మునుగుతాడు శవం నీటిలో తేలుతుంది ఏమిటి ఇందులోని భౌతిక శాస్త్ర రహస్యం

13 ఆవు, కుక్క, కోడి మొదలైన పసు పక్ష్యాదులు తమ సంతానాన్ని ఎలా గుర్తించగలవు? లెక్కపెట్టగలవు?

14 సముద్ర మట్టము ఎలా నిర్ణయిస్తారు?

15 వర్షము భూమి నుండి అత్యున్నత ఎత్తు నుండి అత్యల్ప ఎత్తు నుండి కురుస్తుంది? ఏది నిజం?

కూపన్-3

ఆంధ్ర సచిత్ర వారపత్రిక - ఐదు వారాల
పరిశోధన ప్రశ్న క్విజ్

పేరు..


వయస్సు..

చిరునామా..

....

....

సంతకం..



"ఆధునిక మీరా" అస్తమయం

హిందీ మందిరంలో వీణాపాణి మూర్తీభవించిన స్ఫూర్తి చైతన్యం ఆధునిక మీరా శ్రీమతి మహాదేవి వర్మ అస్తమించారు హిందీ సాహిత్యవనంలో వేదన కల్పన భావుకత కరుణ రంగరించి కమ్మగా పాడే కోకిల కంఠం మూగ పోయింది

శ్రీమతి మహాదేవి వర్మ 1907లో ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాదులో ఒక సంపన్న కుటుంబంలో హోలీ నాడు జన్మించారు ఆమె తండ్రి గోవిందప్రసాద్ పేరుగాంచిన వకీలు అభ్యుదయ భావాలు దార్శనిక ప్రవృత్తి కలవాడు తల్లి హేమరాణీదేవి విదుషీమణి కృష్ణ భక్తురాలు తల్లిదండ్రుల సద్గుణాలన్నీ చిన్న నాడే మహాదేవి వర్మకు అలవడ్డాయి చిన్నప్పటినుంచి భావుకత చింతన పాలు ఆమెలో ఎక్కువ ఆమె తాతగారు సనాతనపరుడు ఆయన కోరిక ననుసరించి మహాదేవి వర్మ వివాహం 9 సం ల బాల్యప్రాయంలోనే జరిగి పోయింది

వివాహం అయిన తర్వాత ఆమె విద్యాభ్యాసం ఇంటి వద్దనే ఏర్పాటు చేశారు పితృ గృహంలో సాగినట్టు పతి గృహంలో సాగదుగా' అందుకే కష్టనష్టాల కోర్చి ఆమె చదువు కొనసాగించారు. సంస్కృతంలో ఎమ్ ఎ పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై ఆమె ప్రయాగ మహిళా విద్యాపీఠానికి ప్రధానాచార్యులుగా నియుక్తులయ్యారు

బాల్యం నుండి తండ్రిగారి వేదాంతభావాలు భావ స్వాతంత్ర్యం ఆమెను ఉత్తేజ పరచాయి. బౌద్ధమతంలోని కరుణాభావం ఆమెను కలవర పరచింది భిక్షుణి కావాలని ప్రయత్నించింది కానీ కారణాంతరాల వల్ల కుదర లేదు చివరకు అటు పితృ గృహాన్ని ఇటు పతి గృహాన్ని పరిత్యజించి అలహాబాదులో ఒంటరిగా ఉండటానికి యిష్టపడ్డారు

భావుకత కరుణ సుకుమారత నారీ గరిమ గల శ్రీమతి వర్మ బహుముఖ ప్రతిభా సంపన్నురాలు. అనంత వేదనను కవిత్వంలో పలికించే ఆమె నిజ జీవితంలో ఎంతో హాస్యప్రియురాలు ఆమె పరిపాలనా దక్షతకు సేవా పరాయణతకు వ్యవహార కుశలతకు గీటురాయి ప్రయాగ మహిళా విద్యాపీఠం. నగర జీవితానికి దూరంగా అంధ విశ్వాసాలకు అతీతంగా మౌన క్రాంతిని కలిగించే విద్యా సంస్థ ఆ విద్యాలయం

నీహార్ ఆమె మొదటి రచన ఇది అనుభూతి ప్రధాన మైనది ఇందులో పీడిత మానవత్వం గురించి నశ్వర ప్రపంచాన్ని గురించి మనస్సుకు హత్తుకునే విధంగా చిత్రించ బడింది నిరాశ విరక్తి మృత్యుప్రీతి మొ భావాలు ఇందులో కనబడుతాయి

అనుభూతి కంటే చింతనకు ప్రాధాన్యం ఉందని తెలుసుకున్న శ్రీమతి వర్మ రశ్మి కావ్య సంకలనం వెలువరించారు సుఖమనేది జీవితం మొదటి మెట్టులోనే ఆగిపోతుంది కానీ దు ఖం జీవితాన్ని సారవంతం చేస్తుంది సుఖాన్ని మానవుడు ఒంటరిగా అనుభవించాలను కుంటాడు అదే దు ఖమయితే పది మందితో పాలు పంచుకోవాలను కుంటాడు విశ్వజనీన మైన ఈ దు ఖమే ఆమె కవితా వస్తువుగా అవతరించింది

నీరజ సంధ్యాగీత్ లో సుఖ దు ఖాల్లో సామంజస్యం వ్యక్త మౌతుంది ఆత్మ పరమాత్మల సంబంధం స్థాపింప బడింది విశ్వంలో వ్యాప్తి చెందిన అజ్ఞానం అంధకారం అహంకారం దూరం చేసేందుకు కొవ్వొత్తిలా మండుతూ అణువణువు కరుగుతూ ప్రకాశం నింపాలనే తపన ఈ కవయిత్రిలో కనబడుతుంది. "దీపశిఖ"లో ఆమె నవ యుగ వైతాళికురాలుగా ఆవిర్భవిస్తుంది. ఈ కావ్యం ఆమె మానసిక స్థితికి ప్రతీక

మహాదేవి వర్మ కావ్యంలో వ్యష్టి చేతన ఆత్మవాదం ఎక్కువ ఆత్మ పరమాత్మల సంయోగ వియోగాలను రూపకాలుగా గ్రహించింది వివిధ ఉపమానాల ద్వారా వాటి మధ్య ఐక్యత ఏక రూపత్వం వ్యక్త పరచడంలో సఫలీకృతురాలయింది హిందీలో రహస్య వాదానికి ప్రతినిధి కవయిత్రిగా పేరు గాంచింది

దార్శనిక దృష్ట్యా మహాదేవి వర్మ మీరాబాయి ఒకే సంప్రదాయానికి అనుయాయులుగా కనబడతారు మీరాతో నన్ను పోలుస్తుంటారు ఈ విషయంలో నేను చెప్పేది ఏముంటుంది? ఆమె మహాత్మురాలు జీవితంలో ఎంతో సంఘర్షణ పడింది ఆమె ఎప్పుడు ఎక్కడ మరణించిందో మనకు తెలియదు మేము చేసిన సంఘర్షణ దాని ముందు ఎంత'

మహాదేవి వర్మ జీవితంతో ఎంతో సంఘర్షణ చేసింది అయితే ఆమెకు తగిన గుర్తింపు లభించింది భారత దేశంలో అత్యుత్తమ సాహితీ బహుమతి జ్ఞానపీఠ అవార్డు లభించింది పద్మభూషణ బిరుదుతో భారత ప్రభుత్వం ఆమెను సత్కరించింది. ఆమె అస్వస్థురాలుగా అపస్మారక స్థితిలో వున్నప్పుడు డాక్టర్ల బృందం చికిత్స చేయడానికి ఎంతో కృషి చేసింది స్వయంగా ప్రధాన మంత్రి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి విచారించారు అయినా దేశ ప్రజల ఆదరాభిమానాలు ఆమె భౌతిక దేహాన్ని కాపాడలేక పోయాయి 11-9-87న ఆమె దివంగతురాలయ్యారు ఆమె కవిత్వమే మనకు వెలుగు ప్రసాదిస్తుంది



- శ్రీమతి మహాదేవి వర్మ

— కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు



రావినూతల సువర్ణాకన్నన్

(గత సంచిక తరువాయి)

చందన కోసం ఆశగా ఆరాటంగా ఎదురు చూస్తూనే వున్నాడు రసన్

మూడు రోజులు గడిచిపోయింది

కానీ చందన మాత్రం అటుకేసి తొంగైనా చూడలేదు రసన్ మొహం చిన్న బోయింది

అమ్మాయిగారి కోపం పోలేదు విషయం రాజాగారి దాకా వెళ్తే తనక కఠిన శిక్ష పడుతుందని జాలిపడి అబద్ధం చెప్పారే గానీ తనని మాత్రం క్షమించలేదు అనుకుని బాధ పడ్డాడు తనని తాను ఎన్నోసార్లు తిట్టుకున్నాడు

ఒకసారి ఆమె దగ్గరికెళ్తే? అన్న ఆలోచనకూడా వచ్చింది కానీ ఎందుకో కోటకెళ్ళడానికి మాత్రం ధైర్యం చాల్లేదు అటుగా వెళ్తున్న దాసీని అడగాలని అనుకున్నా అడగ లేక పోయాడు

మరో నాలుగు రోజులు గడిచి పోయాయి కానీ చందన జాడలేదు ఆమె కాలి అందెల సవ్వడే కరువయింది అతనికి లోకమంతా శూన్యంగా అనిపించసాగింది

ఇంక ఆగలేక ఆరోజు పొద్దున్నే పూలకోసం వచ్చిన దాసీని అడిగేశాడు అమ్మాయిగారు తోటకేసి రావడం లేదేం? అని

ఆమె మాట్లాడ లేదు ఓ సారి అతనికేసి చురుగ్గా చూసి ముందుకు సాగింది ఆమె చూపుకి అతని గుండె దడదడలాడింది

తను అమ్మాయిగారి తలకి గాయం చేసిన సంగతి ఈమెకి తెలిసి పోలేదు కదా! అనుకున్నాడు భయంగా

అయినా ధైర్యం తెచ్చుకుని మళ్ళీ అడిగాడు రాకుమారి గురించి

అమ్మాయి గారింక ఇక్కడికి రారు అందామె తీక్షణంగా

అమ్మాయిగారు రారా! అతని మీద పిడుగు పడ్డట్టయింది

అపును రారు వచ్చినా నితో కబుర్లాడుతూ కూర్చోరు! కాస్త వ్యంగ్యంగా అందామె

ఎందుకు? పాలిపోయిన మొహంతో అన్నాడతను

అదంతే! అనేసి విసురుగా వెళ్ళి పోయిందామె

నిర్ఘాంత పోయాడు రసన్

అయితే అమ్మాయిగారు నన్ను క్షమించలేదన్నమాట? చ! నేనెంత వెధవని! కాస్తయినా ఆలోచించకుండా కాబోయే మహారాణి మీద కోపం తెచ్చుకుని ఆమె తలకి గాయం చేశాను ఆమేకాదు నన్ను దేవుడు కూడా క్షమించడు అనుకున్నాడు దిగులుగా

ఇంక ఇక్కడ వుండకూడదు అనికూడా అనుకున్నాడు

పది రోజులు నిర్జీవంగా దొర్లిపోయాయి

ఈ పదిరోజులూ నరకం అనుభవించాడు రసన్

ఒకటి రెండు రోజుల్లో అక్కణ్ణించి వెళ్ళిపోవాలని కూడా నిర్ణయించుకున్నాడు

అయితే ఆసాయంత్రం చందన వచ్చింది

అతనికళ్ళు తళుక్కు మన్నాయి

అతని హృదయం పున్నమి నాటి సంద్రంలా పొంగింది

ఒక్క పరుగున ఎదురెళ్ళి అమ్మాయి గారూ! అన్నాడు ఆనందంగా

చందన తియ్యగా నవ్వింది

అమ్మాయిగారూ! నా మీద కోపం వచ్చిందికదూ? దీనంగా అన్నాడతను కళ్ళు రెండూ నీళ్ళతో నిండి పోయాయి

ఊహుఁ! అంది చందన కళ్ళతో నవ్వుతూ

మరి మీరెందుకు రాలేదిన్నాళ్ళూ?

ఇంక ముందు కూడా రాను!

తృళ్ళిపడ్డాడు రసన్

అదిగో! నా మీద కోపం వచ్చింది! అమ్మాయిగారూ! నేను పొరపాటు చేశాను దానికి మీరేశిక్షయినా విధించండి కానీ ఇక్కడికి రావడం మాత్రం మానద్దు! రెండు చేతులూ జోడించి దీనంగా అన్నాడు

చందన మొహం గంభీరంగా అయి పోయింది

నేల చూపులు చూస్తూ మౌనంగా వుండి పోయింది

రసన్ రెండు కాళ్ళ మీద మోకరిల్లాడు ఆమె పాదాలముందు వినయంగా

జరిగిన కథ – 9 రాజాపాండూ కూతురు చందన వ్యాపారి సూర్యదేవ్ చిన్న కొడుకు గడుగ్గాయి రసన్ రసన్‌ను రాజుగారు ఆస్థానానికి పిలిపించి చిత్రకళాభిరుచిని ప్రశంసించి రసన్ చిత్రకళా శిక్షణకు ఏర్పాట్లు చేస్తారు ముందు ఇష్టం చూపని రసన్ తోటలో చందనతో కలిసిన స్నేహం వల్ల రాజాశ్రయంతో చిత్రకళ నేర్చుకోవడానికి సిద్ధపడతాడు చందనకు రసన్‌కు విడిపోలేనంతటి అనుబంధం ఏర్పడుతుంది చందన బావ విక్రమ్ వచ్చి చందనను తీసుకు పోతాడు చందన మూడో రోజుకే తిరిగి వచ్చేస్తుంది

"రసన్ లే!" అంది చందన ఆప్యాయంగా

నా మీద కోపం పోయిందనండి నన్ను మన్నించాననండి. ఇక్కడికి రావడం మానను అనండి దుఃఖం నిండిన గొంతుతో అన్నాడు రసన్

ఛ! నీ మీద కోపం కాదు రసన్!'

"మరి! మీ రెందుకు రారిక్కడికి?"

"చెప్పండి! నామీద కోపం పోయిందికదూ?"

"అసలు నీమీద కోపం వుంటేకదా పోవడానికి!" మళ్ళీ నవ్వింది చందన

'మరి? ఇన్నాళ్ళు ఎందుకు రాలేదు?"

"ముందు లేచి సరిగ్గా నిల్చో!" అంది చందన అతను నిల్చున్నాడు

'చెప్పండి!' వుద్వేగంగా అన్నాడతను

ఆమె క్షణం ఏలా చెప్పాలా అన్నట్టు తికమకపడింది

ఆమె మౌనం అతన్ని మరింత కలవరపెడుతోంది

'ఆరోగ్యం బాగా లేదా?' అన్నాడు ఆదుర్దాగా

బాగానే వున్నానుగా?' చిన్నగా నవ్వింది చందన

మరి?

'నేనింక ఇలా రాకూడదు! మగాళ్ళతో మాట్లాడకూడదు!" అంది చందన

ఎందుకు?" అమాయకంగా అన్నాడు రసన్

నేను పెద్దదాన్నయ్యానుకదా! అందుకు!" ఆమె చెంపలు సిగ్గుతో ఎర్రబడ్డాయి

అప్పుడు పరిశీలనగా చూశాడామె కేసి రసన్ ఏదో పెద్దరికం వచ్చినట్టు



ఒదిగి నిల్చుంది

పట్టు పరికిణీ మీద జరీ పని చేసిన ఓణీ వేసుకుంది. పద్దెనిమిదేళ్ళ రసన్‌కి విషయం స్ఫురించింది కారణం తెలియదు గానీ చిత్రంగా తనూ కాస్త సిగ్గుపడ్డాడు

ఏమిటి రసన్? ఏమిటలా అయిపోయావ్?" అతని చెయ్యిపట్టి గుంజుతూ అంది చందన

తృళ్ళిపడ్డాడు రసన్

"అమ్మాయిగారూ! మీరు ... మీరింక నిజంగానే ఇక్కడికి రారా?" తేరుకుని మెల్లగా అన్నాడు

"అవును రసన్!.. అలాగే అంటున్నారు మాదాసీలు!' దిగులుగా అంది. చందన

క్షణం మౌనంగా ఉండిపోయాడు రసన్

"అమ్మాయిగార్ని చూడకుండా వుండగలనా?" అనుకున్నాడు మనసులో

"పసితనంలో అమ్మాయి గారితో పరిచయం అయింది ఆనాటి నుంచీ మొన్న మొన్నటి వరకు. ఆమె తోడిదే లోకంలా బ్రతికాడు ఒక్క రోజు ఆమె రావడం ఆలస్యం అయితే తహతహలాడి పోయేవాడు. ఏపరిస్థితుల్లోనైనా ఒకటి రెండు రోజులు కనిపించకపోతే పిచ్చిగా ఉండేది అన్నం సయించేదికాదు. నిద్ర పట్టేది కాదు కలతనిద్రతో నే గడిపేసేవాడు

ఏమిటీ చిత్రం! అనుకునేవాడు ఇది పూర్వజన్మ సంబంధం! అమ్మాయిగారి నమ్మిన బంటునై వుంటాను పూర్వ జన్మలో!" అని సమాధానం కూడా తనే చెప్పుకునే వాడు అలాంటిది అమ్మాయిగారు అసలు కనిపించక పోతే? అమ్మో! "భయంగా గుండెల మీద చెయ్యి వేసుకున్నాడు రసన్

'ఏమిటి రసన్?"

"ఏం లేదమ్మాయిగారూ!. మీరు కనిపించక పోతే నే.ను. ఉండలేను బాధగా అన్నాడు రసన్.


"నిజమే! నీకేకాదు!. నాకూ తోచదు!. కానీ ఇంక తప్పదుగా ఇంక మేము అంతఃపురంలో నే ఉండాలట! మగాళ్ళతో అసలు మాట్లాడకూడదు!" కళ్ళు రెపరెపలాడిస్తూ అంది చందన

"మీ అంతఃపురంలో మగాళ్ళు పనివాళ్ళు లేరూ? వాళ్ళతో మీరు మాట్లాడకుండా వున్నారా!"

"నిజమే!" అనిపించింది చందనకి

"అమ్మాయిగారూ!.. నన్నూ మీ పనివాళ్ళలో ఒకడని అనుకోండి దయచేసి ఇక్కడికి రావడం, నాతో మాట్లాడ్డం మానద్దు!" బతిమాలుతున్నట్టు అన్నాడు రసన్

చందన మాట్లాడలేదు. ఏదో దీర్ఘాలోచనలో పడ్డట్టు మౌనంగా నిల్చుండి పోయాడు



మంజీరనాదం

"ఏం అమ్మాయిగారూ!" జాలిగా అడిగాడు రసన్

"సరే ... చూద్దాంలే!.... మరి... నేను వెళ్ళనా?" అంది చందన

"కాస్సేపు వుండండి." మాతృమూర్తి" అన్న చిత్రం చిత్రించాను? అది చూసి వెళ్ళుదురుగాని" అన్నాడతను.

"సరే"అంటూ అక్కడ ఓ తిన్నెమీద కూర్చుంది చందన.

రసన్ కుటీరంలోని కెళ్ళి ఓ చిత్రం తీసుకొచ్చి ఆమెకి చూపించాడు.

"చాలా బావుంది రసన్!" మెచ్చుకుంది చందన.

అతను మురిసి పోయాడు.

అది ఏవుద్దేశంతో గీశాడో, ఎంతసేపట్లో గీశాడో వుత్సాహంగా చెప్పాడు.

మరో అరగంట ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు ఇద్దరూ

"ఇంకనేను వెళుతున్నా రసన్! నిజానికి ఇవాళ కూడా వచ్చేదాన్ని కాదు. కానీ నువ్వు నాకోసం ఆశగా ఎదురు చూస్తూంటావని, విషయం నీతో చెప్పెళ్దామని మాత్రమే వచ్చాను." అంది చందనలేస్తూ.

అతను దిగులుగా చూశాడు.

ఇంతలో ఓ దాసీ వచ్చిందక్కడికి.

"అదిగో దాసీ వచ్చేసింది. నేనెళుతున్నాను" అంటూ పరుగు తీసింది చందన.

ఒంటరిగా మిగిలి పోయాడు రసన్.

అతని హృదయం భారంగా అయిపోయింది.

అలా చాలాసేపు ప్రతిమలా నిల్చుండి పోయాడు.

* * * * * * * * * *

చందన ఆరోజు రావడం మళ్ళీ రాలేదు.

వారం రోజులు గడిచి పోయాయి.

రసన్‌కి అవుద్యానవనం యడారిలా, తన కుటీరం స్మశానంలా అనిపించింది.


నిజానికి అతని విద్యాభ్యాసం ఏనాడో పూర్తయింది. తల్లిదండ్రులు ఇంక ఇంటి కొచ్చెయ్యమన్నా, రాజావారు వెళ్ళే వెళ్ళచ్చున్నా అతను వెళ్ళకుండా అక్కడే వున్నాడూ అంటే అది కేవలం రాకుమార్ని చూడకుండా వుండలేకనే. అలా అని ఆమె మీద అతనికి వేరే అభిప్రాయం ఏం లేదు.

"పెళ్ళయిన తరవాతకూడా భర్తతో సహా అమ్మాయి గారు ఇక్కడే వుంటే బావుండు" అనుకున్నాడు ఎన్నోసార్లు. అలాంటిది ఆమె రాక పోవడం అతనికి తీరని గాయం ఏర్పరిచింది.

* * * * * * * * * *

మరో నాలుగు రోజులు గడిచి పోయాయి.

చందన నాలుగు రోజుల పాటు ఆటల్లోనూ, పాటల్లోనూ పొద్దు పుచ్చింది.



ఆపై ఆమె ధ్యాస రసన్ మీదికి మళ్ళింది. పెద్దల మాటలు గుర్తొచ్చి–

"ఛ! నేను రసన్‌తో మాట్లాడకూడదు" అనుకుంది. అయితే ఆ నిర్ణయం ఎంతో సేపు వుండేదికాదు.

పదేపదే ఆమె మనసు రసన్ మీదికి పోసాగింది మరో రెండు రోజులు గడిచేసరికి, రసన్ని చూడాలనీ, అతనితో కబుర్లు చెప్పాలనీ ఎంతగానో అనిపించింది అందుకె తెగించి ఒంటరిగా వున్న తల్లి దగ్గరికొచ్చింది.

"ఏమ్మా?" అంది మమతాదేవి నవ్వుతూ.

"అమ్మా! .. నేను .. తోటలో కెళ్తానమ్మా!" గారాలు పోతూ అంది చందన

"దానికేవమ్మా! వెళ్ళు!" కూతురి తల నివురుతూ అంది తల్లి.

చందన మొహం వెలిగింది.

చివ్వున వెనక్కి తిరిగి పరిగెత్తబోయింది.

."చందా!" వెనకనించి పిల్చింది మమతాదేవి.

ఆగింది చందన.

"దాయమ్మని తీసికెళ్ళు"

దాయమ్మంటే మమతాదేవి పుట్టింటిదాసి అరవయ్యేళ్ళ వృద్ధురాలు. చందనంటే ఆమెకి ప్రాణం. మమతాదేవి కూడా ఆమెని తల్లిగా చూసుకుంటుంది.

"అలాగే!దాయమ్మా!" వుత్సాహంగా అరిచింది చందన.

కూతురికళ్ళలోని వెలుగు చూసి తెల్లబోయియిది తల్లి

"ఇప్పుడు తోటకెందుకమ్మా?" అంది కుతూహలంగా.

"రసన్ని చూడ్డానికి!" తక్కున అంది చందన.

రసన్ని చూడ్డానికా?" అర్ధంకానట్టు చూసింది మమతాదేవి.

"అవునమ్మా! అతన్ని చూడ్డానికే! రసన్ని చూసి ఎన్నాళ్ళయింది! పాపం! నాకోసం రోజూ చూస్తుండి వుంటాడు. ఆశగా! అవునమ్మా! ... ఆ మధ్య నేను వెళ్ళకపోతే ఎంత బాధపడ్డాడో తెలుసా?. అన్నం కూడా సరిగ్గా తిన్లేదట .... నాకూ అంతే. అతన్ని చూడాలనీ, ఎంచక్క అతనితో బోల్డుకబుర్లు చెప్పాలనీ వుంది!" అమాయకంగా అంది చందన.

కొయ్య బారి పోయింది మమతాదేవి.

"రసన్ని చూడాలనుందా? ... రసనంటే.... చిత్రకారుడు కదూ?" గొణిగినట్టు అంది మమతాదేవి.

"అవునమ్మా! ... అతనే!.... అతను నన్ను చూడకుండా వుండలేనన్నాడు!... నేనూ అంతే ... అతన్ని చూడకుండా.."

ఆమెమాట పూర్తికానే లేదు. చటుక్కున కూతురి నోరు మూసేసింది తల్లి కంగారుగా ఇటు, అటు చూసి.

బిత్తర పోయింది చందన.

"నీ గదిలోకి పో!" కఠినంగా అంది మమతాదేవి.

"మరి... తోట...."

"ఇంక తోట సంగతి పూర్తిగా మర్చిపో?" అనేసి విసురుగా అక్కణ్ణించి వెళ్ళి పోయింది తల్లి.

తల్లి నోట అంత కఠినమైన మాటలు ఏనాడూ వినని చందన... నిర్ఘాంత పోయింధి. కళ్ళనిండుగా నీళ్ళూరాయి.

"ఏమిటి తల్లీ?" అంటూ వచ్చింది దాయమ్మ. విషయమంతా చెప్పి–

"నేనన్న దాంట్లో తప్పేమైనా వుందా దాయమ్మా? అమ్మకి ఎందుకంత కోపం వచ్చింది? .... తోట కెళ్తే తప్పేమిటి నువ్వే చెప్పు!" అంది చందన కళ్ళు తుడుచుకుంటూ.

భారంగా నిట్టూర్చింది దాయమ్మ.

"చెప్పు దాయమ్మా! రసన్‌తో మాట్లాడితే తప్పా?"

"అది కాదమ్మా! రాజకుటుంబంలోని స్త్రీలు అలా ఎవరితో పడితే వాళ్ళతో మాట్లాడకూడదు... ముఖ్యంగా మగాళ్ళతో అసలు మాట్లాడకూడదు" అనునయంగా అంది దాయమ్మ.

మరైతే... మన వంటవాళ్ళూ, సైనికులు, నాట్యాచార్యులు వీళ్ళంతా మగాళ్ళు కారేంటీ? మరి వాళ్ళతో మాట్లాడ్డం లేదూ?" కాస్త రోషంగా అంది చందన.

ఆమెకి రసన్ అన్న మాటలు గుర్తున్నాయి

వాళ్ళు మన కింద పనిచేసే వాళ్ళు! మనమీద ఆదార పడ్డవాళ్ళు

మరి రసన్ కూడా మనమీదే ఆదారపడ్డాడు ఎన్నాళ్ళనుంచో మన దగ్గరే వుంటున్నాడు! అందులోనూ నాన్నగారి కతనంటే నాలాగే ఎంతో ఇష్టం! నా చిన్న నాటి నేస్తం! ఇప్పుడు హటాత్తుగా అతనితో మాట్లాడ్డం ఎందుకు మానెయ్యాలి? నిలదీసింది చందన

చందన వాదనని ఖండించలేక ఖండించకుండా వుండనూలేక నిర్ఘాంతపోయి అలా నిల్చుండి పోయింది దాయమ్మ

ఏం దాయమ్మా? నేనన్నది నిజమేకదూ?

ఆఁ? ఆ! నిజమే! గబాల్న అంది దాయమ్మ

అయితే మరి తోటకెళ్దామా?

అమ్మో! అమ్మగారు?

అమ్మతో ఎలాగైనా నువ్వే చెప్పు! నువ్వు చెప్తే అమ్మ కాదనదు! అమాయకంగా అంది చందన

కరిగి పోయింది దాయమ్మ అయితే చందన రసన్‌ల మధ్య స్నేహం పెరగడం కూడా అంత శ్రేయస్కరం కాదని కూడా అనిపించిందామెకి అందుకే–

అలాకాదు చందమ్మా! నేనెంత చెప్పినా అమ్మగారు ఒప్పుకోరు పైగా నన్ను కూడా తిడతారు నా మాటవిని రసన్ మాట ఎత్తకు ఇంక తోటకంటావా నేను వీలు చూసుకుని తీసి కెళ్తాను అదీ రసన్ లేని సమయంలో అంది గంభీరంగా ఆమె చందనని చందమ్మా అనే పిలుస్తుంది

చందన మొహం వాడి పోయింది తనకోసం ఆతృతగా ఎదురు చూస్తున్న రసన్ కళ్ళలో మెదిలాడు ఆమె కళ్ళు మళ్ళీ నీళ్ళతో నిండుకున్నాయి–

దాయమ్మా! పాపం! రసన్ నా కోసం ఎదురు చూస్తుంటాడు! అంది బేలగా

పోనీ ఓ పని చేస్తే? హటాత్తుగా అంది దాయమ్మ

ఏమిటి?

ఈరోజు మాత్రం నిన్నెలాగో తోటకి తీసికెళ్తాను నువ్వు రసన్‌ని కలిసి అతనితో మాట్లాడి ఇంకనించి రానని నా కోసం చూడద్దనీ గట్టిగా చెప్పి వచ్చెయ్యాలి! అలా అయితే తీసికెళ్తాను!

క్షణం ఆలోచించిన చందన–

సరే! అనేసింది

ఆ సాయంత్రం రాజావారి అంతఃపుర ఆవరణలో వున్న స్నాన వాటికకని బయల్దేరారు దాయమ్మ చందన మమతాదేవితో చెప్పి

దాయమ్మా! త్వరగా వచ్చెయ్యండి! దానికి నీళ్ళు చూస్తే ఒళ్ళు తెలియదు! హెచ్చరించిందామె

అలాగేనమ్మా! నేనున్నానుగా అంది దాయమ్మ

ఇద్దరూ మెల్లగా రాజమహల్‌కి ఓ పక్కగా ఉన్న స్నాన వాటిక మీదుగా మరో వన తోట చేరుకున్నారు

ఆతృతగా తోటంతా కలియ చూసింది చందన

అయితే రసన్ ఎక్కడా కనిపించలేదు

తోటంతా నిద్రపోతున్నట్టనిపించిందామెకి

దిగులుగా దాయమ్మ కేసి చూసింది

కుటీరంలో ఉన్నాడేమో చూసిరా! ఓ చెట్టుకింద కూలబడుతూ అంది దాయమ్మ

ఉత్సాహంగా కుటీరం కేసి పరుగు తీసింది చందన

కుటీరమంతా చీకట్లావరించి ఉన్నాయి

రసన్! అంది మెల్లగా

సరిగ్గా తిండి నిద్రలేక నిస్త్రాణగా పడుకున్న రసన్ కాపిలుపు పన్నీటి చినుకులా తోచింది చటుక్కున లేచి–

అమ్మాయిగారూ! అన్నాడు ఆనందంగా అతనికది కలేమో అనికూడా అనిపించింది

నేనే రసన్! నీకోసం వచ్చాను! తియ్యగా అంది చందన

రసన్ హృదయం మధురంగా అయిపోయింది ఒళ్ళు తెలియడం లేదు

కొత్త శీర్షిక

రచయిత్రి



జవాబులు

సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి రావినూతల సువర్నాకన్నన్ తమ సీరియల్ నవల మంజీర నాదం'పై పాఠకుల ప్రశ్నలకి సమాధానాలు ఇస్తారు ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన పాఠకులు తమ ప్రశ్నలని 'రచయిత్రి జవాబులు' శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ –520003 అనే చిరునామాకి పంపవచ్చును రచయిత్రి ఎంపిక చేసిన ప్రశ్నలని, వాటికి ఆమె ఇచ్చిన సమాధానాలని వారం వారం ఈ సీరియల్ పేజీలలో ప్రచురించగలము ప్రతి వారం రచయిత్రి ఉత్తమంగా ఎంపిక చేసిన ప్రశ్నని పంపిన వారికి ఆమె రాసిన నవల ఒకటి బహుమతిగా లభిస్తుంది పాఠకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని ఆశిస్తున్నాము –సం

అతనేం చేస్తున్నాడో అతనికే తెలియలేదు ఒకలాంటి తన్మయత్వం ఆవహించేసింది చటుక్కున నాలుగడుగులు ముందుకేసి చేతులు రెండూ చాచి–

అమ్మాయి గారూ! అన్నాడు ఆర్తిగా

విడీ విడని మొగ్గ చందన!

ఆ పిలుపులో ఏదో ఆకర్షణ!

ఆమెగుండెల్లో అదో లాంటి మత్తు!


ఆమె మనసంతా చెప్పలేని పులకింత!

రసన్! అంది మదురాతి మదురంగా కను చీకటిలో చేతులు చాచిన రసన్ మసగ్గా కనిపిస్తున్నాడామెకి

అమ్మాయి గారూ! మరి నాలుగడుగులు ముందుకేశాడు రసన్

చిత్రంగా ఒక్క పరుగున వచ్చి అతని చేతుల్లో వాలి పోయింది చందన

మరుక్షణం అతని చేతులు ఆమెని చుట్టేశాయి చందన చిన్నారి చేతులు



ధర్మపథం

దసరా ప్రాముఖ్యం

భారతీయుల పండుగులలో దసరాకు గల ప్రాముఖ్యం మరొక పండుగకు కానరాదు. సంవత్సరాది, మకర సంక్రాంతి, గణపతి నవ రాత్రులు మున్నగునవి దక్షిణ ప్రాంతం వారికి ముఖ్యాలయినట్లు ఉత్తర దేశీయులకు ముఖ్యాలు కావు. దీపావళి దక్షిణాత్యులకు అతి ముఖ్యం. తక్కిన పండుగుల కన్న గణపత్యుత్సవాలనే మహారాష్ట్రులు ఎంతో ఘనంగా జరుపు కుంటారు. దసరా పండుగలు మాత్రం విభిన్న ప్రాంతాలలో వేర్వేరు రీతులలో ప్రాధాన్యం వహించినది.

పది దినాలు జరిగే పండుగ కాబట్టి దీనికి దసరా అని పేరు వచ్చింది. ఈ దినాల్లో బెంగాలీలు దుర్గాపూజను అతి వైభవంగా జరుపుకుంటారు. వారి ఏకైక మహాపర్వ సమయం ఇదే! ఉత్తర ప్రాంతీయులు– ఈ సమయంలోనే రామ రావణ యుద్ధం జరిగిందని భావించి, రావణ కుంభకర్ణుల గడ్డి బొమ్మలు తయారు చేసి, వాటిని దహించి ఎంతో తృప్తి పడతారు. శ్రీరామ లీలోత్సవాలను మహా వైభవంగా జరుపు కుంటారు.

దక్షిణాది ప్రాంతంలో మంత్రోపాసకులకు ఇవి ఎంతో ముఖ్యమైనవి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకూ ఇవి దేవీ నవరాత్రులని ప్రసిద్ధి. మంత్రోపాసకులు ప్రతి దినం ఉదయమే స్నానం చేసి, తమ ఆరాధ్య దేవతను పూజించి, సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి, మంత్ర పునశ్చరణ చేసుకుని రాత్రి దేవీ పూజానంతరం గానీ ఆహారం తీసుకోరు. ఈ నవరాత్రులు ఎంతో దీక్షతో ఉంటారు. ఈ తొమ్మిది రోజులూ లక్ష్మీ, దుర్గా, సరస్వతీ పూజలు జరుగుతాయి. పిల్లల బొమ్మల కొలువు వేడుకలు, మహిళల పేరంటాండ్ర పిలుపులు, వినోదాలు ఇప్పుడే!

విజయుడు– అర్జునుడు దశమినాడు శమివృక్షంపై ఉంచిన ఆయుధాలను తీసుకుని విరాట నగరంపైకి వచ్చిన కౌరవులను ఒంటరిగా ఓడించినట్లు ప్రసిద్ధి– అందువల్లనే దీనికి విజయ దశమి అనే పేరు వచ్చింది. పూర్వపు రాజులు జైత్రయాత్రకు ఈ దినమే బయలు దేరేవారట! పూర్వం ఆయుధాల పూజ కూడా దశమినాడే జరుగుతూ వుండేది. పండుగ దినమైన ఆ రోజు విరామదినం అగుటవల్ల కార్మికులు, తమ తమ ఆయుధాలైన పనిముట్లను– ఆ ముందు రోజునే– అంటే మహర్నవమి నాడే చేసుకోవడం దరిమిలా ప్రారంభమైనది. అదే క్రమంగా ఆచారంగా మారిపోయింది. అనాచారాలు ఆచారాలుగా మారిపోవడం లోకసామాన్యమే గదా!

వేర్వేరు ప్రాంతాల్లో విభిన్న పద్ధతులలో జరుపబడే యీ పండుగ భిన్నత్వంలో ఏకత్వానికి తగిన తార్కాణం.

– బులుసు వేంకట రమణయ్య

మంజీరనాదం

కూడా అతని చుట్టూ అల్లుకున్నాయి.

ఆమె పెదవుల్లోని మధురిమలు చవిచూడ నారంభించాయి అతని పెదవులు.

ఆమె కెంతో హాయిగా ఉంద అతని కౌగిలి! అది కామవాంఛలాలేదు.

తప్పిపోయిన పాపకి హటాత్తుగా తల్లి కనిపించి చేతులు చాస్తే .... ఆ కౌగిలిలో నిశ్చింతగా ఒదిగినట్టుంది.

ఇద్దరూ అలా కొన్ని క్షణాలు స్వప్నావస్థలో ఉండిపోయారు.

ఇద్దరికీ నోట మాట రావడం లేదు.

తాము అలా చేరువవడం ఎవరైనా చూస్తే ప్రమాద మనిగానీ, తమకోసం దాయమ్మ బైట కూర్చుని వుందనిగానీ వాళ్ళకి గుర్తు లేదు.

దాయమ్మ మాత్రం క్షణాలు యుగాలుగా గడుపుతోంది. ఆమె మనసు కీ డుని శంకిస్తోంది. తెలియని భయం ఆమె వెన్నులోంచి ఒణుకు పుట్టిస్తోంది.

"ఏమ్మాట్లాడు తున్నారింతసేపూ ?" అనుకుంది. క్షణాలు గడుస్తున్న కొద్దీ ఆమెలోని భయం భూతంలా పెరిగి పోతోంది.

దూరంగా ఏదో చప్పుడయింది.

ఉలిక్కి పడింది దాయమ్మ.

కంగారుగా శబ్దం వచ్చిన వైపు చూసింది.

ఎవరో దాసీలే నవ్వుకుంటూ అటుకేసి వస్తున్నారు.

"చందమ్మా!" అంది దాయమ్మ గట్టిగా.

ఆ పిలుపుతో ఈ లోకంలో కొచ్చారు చందన, రసన్.

గభాల్న దూరం జరిగారు.

మరోసారి పిల్చింది దాయమ్మ.

"రసన్!.... దాయమ్మ పిలుస్తోంది". కంగారుగా పరిగెత్త బోయింది చందన.

"అమ్మాయిగారూ!" వదల్లేనట్టు అతను ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"వదులు రసన్.... మళ్ళీ వస్తానుగా?" అంటూ సున్నితంగా అతని చేతిని విడిపించుకుని బైటికి పరిగెత్తింది చందన.

దాయమ్మ చందన చెయ్యి పట్టుకుని మహల్‌కేసి నడిచింది. అటుగా వచ్చిన దాసీలు నవ్వుకుంటూనే తోటలో మరో వైపుకి నడిచారు.

వాళ్ళు తమని గమనించనందుకు తేలిగ్గా వూపిరి తీసుకుంది దాయమ్మ.

వెళ్ళలేక వెళ్ళలేక వెళ్తున్నట్టున్న చందనని, ఆ పిల్ల చెయ్యి పట్టి దాదాపు ఈడ్చుకెళ్తున్నట్టున్న దాయమ్మనీ అలా చూస్తూ నిల్చుండి పోయాడు రసన్.

(ఇంకా ఉంది)



నెస్టమ్ బేబి సిరియల్
ప్రారంభించేందుకు ఆదర్శప్రాయమైనది
పెరుగుదలకు ఆదర్శప్రాయమైనది
నెస్టమ్, పాలు-పూర్తి పోషక విలువలున్న ఆహారం.
నెస్టమ్
రైస్
ఇనుము-విటమిన్లతో కూడినది
పాలలో కలపండి.
ఉచితం
మీ బాబు, తన ఆహారంలో, కొత్త రుచులను కోరుతాడు అందుకని—మీ ఉచిత నెస్టమ్ వంటల పుస్తకం కోసం రాయండి.
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నెం. 6016,
న్యూ ఢిల్లీ-110008.
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk

రేపటి హీరో

హేమంది రమణారెడ్డి

జగన్మోహనరావు జగమంతటికీ అందగాడు కాకపోయినా ఆ ఊరికి అందగాడనే ఫీలింగు అయనకి వుంది అందుకే పుట్టుకతో పెట్టుకున్న పేరు అప్పలసామిని మార్చేసి ఆ ఊరికి హీరో గనుక కప్పకు నుయ్యి సముద్రంలాగా యితగాడికి ఆ ఊరే ప్రపంచం ఆ ప్రపంచానికి ఏకైక నవమోహనుడు యితడే గనుక ఆ పేరు పెద్దయ్యాక పెర్మినెంట్‌గా కన్‌పర్మ్ చేసుకున్నాడు చేతిమీద పేరు పచ్చ పొడిపించుకొని మరీ

జగన్మోహనరావుకి సినిమా పిచ్చి వుంది ఈ పిచ్చెక్కించింది కూడా ఊళ్ళో జనమే ఎన్ టి రామారావుకి నీకు అట్టే తేడాలేదు అదృష్టం తప్పితే అంటే నిజమేనేమో అనుకున్నాడు వౌరా మెయిలెక్కేసి మద్రాసులో కొత్తగా కుట్టించుకున్న సపారీ డ్రస్సు వేసుకొని మొనిలిసా కళ్ళద్దాలు మోర్‌మార్కెట్‌లో కొనుక్కున్నవి తగిలించుకొని-ముప్పయి రోజుల్లో తమిళ బాష పుస్తకంని రీడర్స్ డైజెస్ట్ లెవెల్‌లో చేతిలో పుచ్చుకుని మద్రాసు పురవీదుల్లో తన అందాన్ని ద్విగుణీకృతం చేసుకుంటూ తను ఎవరి దృష్టినైనా పడక పోతానా అంటూ సంచరించ సాగాడు అతడి ఊహ కరెక్టే అయింది ఒక డైరెక్టరు దృష్టిలో పడ్డాడు అతగాడు గొప్ప సీనియర్ సిన్సియర్ డైరెక్టరు పేరు కామేశ్వర్రావు ప్రస్తుతానికి పిక్చర్లు లేకపోయినా తీయబోయే చిత్రం తాలూకు కథా చర్చలో పాల్గొనడం అతడి అలవాటు అతడి దృష్టిలో పడటం మన హీరో గ్రహపాటు!

విషయం విన్నవించు కున్నాడు మీ దృష్టిలో పడటం నా పూర్వజన్మ సుకృతం అన్నాడు ఏదయినా వేషం మీరు యిప్పిస్తే పట్టు పంచె పట్టు జుబ్బా కుట్టిస్తా అమ్మగారికి నల్లిస్టోర్స్‌లో పట్టు చీర కొనిపెడతా- హీరోగా ఎస్టాబ్లిష్ అయిపోతే నా చర్మం వొలిచి చెప్పులు కుట్టించి పెడతాను అంటూ ఎవేవో పెడతాను అని కాబోయే మంత్రి గారిలా వాగ్దానాలు చేయసాగాడు దొంతరలుగా సర్! యివిగో పుస్తకాలు యిందులో అబినయం గురించి కావలసిన వివరాలు వున్నాయి వాటిని ఆకళింపు చేసుకొని అద్దంలో అబినయం బాగా ప్రాక్టీసు చేసుకొని నెల రోజుల తరువాత బయలు దేరిరా నేను నేను తీయబోయే సినిమాలో తప్పకుండా చాన్సు యిస్తాను అని వెన్ను చరిచేసరికి సరాసరి ఊళ్ళో పడ్డాడు

జగన్మోహనరావు మద్రాసు నుండి వచ్చాడని తెలిసే సరికి ఊళ్ళో వారి పలకరింపుల్లో చాలా వ్యత్యాసం కనిపించింది సినిమాస్టార్‌ని చూసిన ఎక్స్‌ప్రెషన్ వాళ్ళ మొహాల్లో కనిపించింది జగన్మోహనరావు పొంగి పోయాడు డైరెక్టరు గారు యిచ్చిన పుస్తకాల్ని కంఠస్థం పట్టేసి నమిలేసి మింగేశాడు ఒక అబినయం ప్రాక్టీసు చేయాలి ఉదయం టాయిలెట్ అయినపుడు అద్దం ముందర గంటల తరబడి పిచ్చివాడిలా మొహంలో మారే రంగుల్ని గమనించి సంబరపడే వాడు రోడ్డు మీద కొస్తే మంగళ షాపులో అద్దం ముందు ఆసనం వేసుకొని కూరుకు పోయేవాడు నలుగు రయిదుగురు బలవంతాన బయటకు నెట్టితే గాని బయటపడే వాడు కాడు అంత సాదన చేసేశాడు మెట్యూరిటీ వచ్చేసింది అబినయం విషయం యిచ్చిన ఎక్స్‌ప్రెషన్ యివ్వకుండా గంటల తరబడి అద్దం ముందు గడిపేయ గలడు అలాగే కెమరా ముందు కూడా ఆ ధైర్యంతోనే మద్రాసు పయన మయ్యేడు

డైరెక్టరు గారికి ప్రెజెంటేషన్లు స్వీట్సు హాట్సూ జీడిపప్పు ఇత్యాది స్పెషల్ ఎట్రాక్షన్స్‌తో బయలుదేరి వచ్చేసరికి కామేశ్వర్రావు గారు తబ్బిబ్బయి పోయేరు ఎంత సహృదయత! ఏది నాయనా అబినయం చూపించు! అని అడగడం పూర్తి కాకముందు అబినయ బ్రహ్మ అని బిరుదు యిచ్చేలా అబినయం చేసి చేసి వొదిలేశాడు కామేశ్వర్రావు గారు అదిరి పోయారు

నాయనా! అబినయింలో నూటికి నూటపది మార్కులు వొచ్చినట్టే అయితే సినిమా హీరో కావాలంటే అబినయంతో బాటు నృత్యం కూడా అవసరం ఈ రోజుల్లో డాన్సస్ ఎవరు బాగా చేస్తారో వారికే కుర్రకారు పాలోయింగ్‌వుంది డాన్సులో మాడ్యులేషన్ డాన్సు వెస్ట్రన్‌డాన్సు ఎందుకయినా మంచిది క్లాసికల్ డాన్సు నేర్చుకో! నెలరోజులు టైముపడుతుంది నీకు హీరో చాన్సు తప్పకుండా వుంటుంది శుబస్యశీఘ్రం అంటూ ఆశీర్వదించేసరికి జగన్మోహనరావు తన వూరికి స్వాప్‌బ్లాకులో (సినిమా ల్లో షడన్‌గా డిసిప్పియర్ అయినట్టు) మాయమైపోయాడు ఊళ్ళోవాళ్ళకు జగన్మోహనరావు మీద రోజరోజుకీ క్రేజు పెరిగిపోతుంది కామేశ్వరరావుగారు చెప్పిన మూడు వెరైటీ డాన్సులు నేర్చుకోవడం మొదలుపెట్టాడు అసలు నడవడం మానేశాడు రోడ్డుమీద నుండి డాన్సు చేస్తూనే తను వెళ్ళవలసిన చోటికి వెళ్ళేవాడు మూవ్‌మెంటు లేకుండా మాట్లాడేవాడుకాదు ఊళ్ళో చిన్నా పెద్ద అంతా ఈ జగన్మోహనరావులో వున్నఫళంగా అపర నటరాజు' అవిర్భవించాడేమో అనుకొని వంగివంగి నమస్కాలు చేసేవారు జగన్మోహనరావు తబ్బిబ్బయిపోయే వాడు తను యింట్లో వాళ్ళనీ ఊళ్ళోవాళ్ళనీ డాన్సుచేయించేవాడు ఇది తట్టుకోలేక ఊళ్ళో వాళ్ళంతా యింకా ఆలస్యం దేనికి, వెంటనే మెయిలెక్కి మద్రాసుచేరిపో సినిమాల్లో హీరో చాన్సు ఖాయం! యిప్పుడున్న హీరోల్లో ఎవరూ నీ లాగా డాన్సు చేయలేరు అని అబయహస్తం యిచ్చి మెయిలెక్కించేశారు

మద్రాసులో చేరిన జగన్మోహనరావు దర్శకోత్తముడి మేడమెట్లెక్కుతూనే డాన్సు చేయడం మొదలుపెట్టి నమస్కారంకూడా డాన్సు బంగిమ లోనే పెట్టాడు తన పవరు చూపించాడు గురుదేవులు కోరినవి మూడు వెరైటీ డాన్సులు మాడ్రన్ వెస్ట్రన్ క్లాసికల్ – అయితే యితగాడు నాలుగోరకం డాన్సు కూడా చేసి చూపించాడు దర్శకుడు కామేశ్వర్రావు కిదేం అర్ధంకాక దీన్నేం డాన్సు అంటారు శిష్యా' అని అనుమానాస్పదంగా అడిగాడు దీన్ని బ్రేకు డాన్సు అంటారు గురుదేవా! అని సవినయంగా మనవిచేశాడు అనగా స్పష్టంగా వివరించగలవా! అని అడిగేడు గురువుగారు బ్రేకు డాన్సు అనగా అంటూనే గొంతు సవరించుకొని అబినయంచేసి చూపిస్తూ గురుదేవా! ఏం లేదు ఒంటికి పైత్యం ప్రకోపించినపుడు కాళ్ళు చేతులు మెడకాయి ఒకటేమిటి శరీరంలో కదలవలసిన అవయవాలన్నీ కదులుతాయి అలా కదిలేలా మూవ్‌మెటు (కదిలించి) చూపించడమే బ్రేకు డ్యాన్సు అంటూ మూర్ఛ రోగి పడిపోయినట్టు పడిపోయి కాళ్ళు చేతులు మెడ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ స్పీడులో కదిలించసాగాడు కామేశ్వరుడికి కంగారుపుట్టింది ఆగు నాయినా! అద్భుతం! అమోఘం! నువ్వు డాన్సులో నూటికి నూట యాభై మార్కులు తెచ్చుకోగలవు అయితే మరో చిన్న మానవప్రయిత్నం నీ కృషి లోపం లేకుండాచేయి అన్నాడు నెమ్మదిగా జగన్మోహనరావు బ్రేకు డాన్సు చేసున్నాడేమో అప్పటికే తడిచి ముద్దయిపోయాడు మళ్ళీ చెమట్లు పట్టడం మొదలెట్టాయి నువ్వు అబినయ బ్రహ్మ అపర నటరాజువి కాని పైట్సు ఈ రోజు సినిమాకి కావలసిన ముఖ్యమయిన క్వాలిపికేషను పైట్సుతో ముక్కు మొహం వున్నా లేకపోయినా కోతిలా గెంతులు వేసి దున్నపోతులా నలుగుర్ని చితుతచేసే పైయిట్ ఎవరికి సొంతమో వాళ్ళే హీరోలుగా రాణిస్తున్నారు ఒక్క నెలరోజులు నీ విలువయినకాలం స్పేర్‌చేయి! రేపటి హీరోవి నువ్వే! అంటూ దర్శకుడు జగన్మోహనరావు బుజం చరిచేసరికి కొండంత బలంవచ్చింది ఒక్క కుదుపులో మద్రాసు నుండి తన పుట్టిన ఊరికి జంప్‌చేసినట్లు ట్రయిన్‌లో తిరుగుముఖంపట్టాడు ట్రయిన్‌లోనే పైట్ నేర్చుకుందామన్న దుగ్ధతో

నలుగుర్ని తన్ని మొహం వాచిపోయ్యేలా చివాట్లు వీపుమీద పలచగా నాలుగు అట్లు తిన్నాడు

ఊళ్ళోకి వచ్చిన హీరో జగన్మోహనరావుని ఊరంతా ఏవయిందిరా! ఈసారి ఏం ముంచుక్కొచ్చింది? అని అడిగేరు ఫయిట్ పయిట్ నేర్చుకోవాలి! ఇండస్ట్రీలో వున్న హీరో లందర్నీ మించిపోవాలి నేను సూపర్‌స్టార్‌ని అయిపోవాలి! స్థిర నిశ్చయంతో అన్నాడు అనడమేవిటి? అపుడే నలుగుర్ని తన్నాడు కూడా తనేపనిచేసినా పయిట్




లాగే వుండేది ఊళ్ళోవారందర్నీ తన్నాడు – తన్నులు తిన్నాడు యింట్లోవారిని తన్నాడు తన్నులు తిన్నాడు అందరిదగ్గరా చెడ్డయిపోయాడు వీడికేం భూతం పట్టిందిరాబాబో ఎవరు కనిపిస్తే వాళ్ళను తంతున్నాడు వీడిసినిమా పైత్యం మండిపోను ఎంత ప్రకోపిస్తే మాత్రం కనిపించే మనుషుల్ని పశువుల్ని రాళ్ళు రప్పలు అన్నిటినీ తన్నేయడమేనా? అని అందరూ తీర్మానించుకొని అప్పాయ్ నువ్వు హనుమంతుడంతటివాడివి అరిఎలో సందేహంలేదు నీ శక్తి నీకు తెలియడం లేదు మాకు తెలుస్తుంది! నువ్వు యిక్కడ వుండ వలసినవాడివికావు మేం తలో యింత చందావేసి యిస్తాం మద్రాసు వెళ్ళిపో అక్కడే శాశ్వతంగా వుండిపో! అంటూ సోర్స్‌డ్‌గా చెప్పేరు రేపటి హీరో పాకెట్ ఖర్చులకోసం కొంత డబ్బు జేబులో పెట్టి నువ్వు సూపర్‌స్టారు అయ్యేతరువాత పెద్దఎత్తున సన్మానం ఏర్పాటుచేసి నిన్ను మేం పిలిచినంతవరకు రావద్దు అలా రానని మాట యివ్వు! అని చేతిలో చెయ్యి వేయించుకొని గెల్పించుకొని మరి మెయిలు ఎక్కించారు

దర్శకశ్రేష్ఠుడు కామేశ్వరుడి ముందు ప్రత్యక్ష మవ్వడమే డాషింగ్ అండ్ డైనమిక్‌గా ప్రత్యక్ష మయ్యాడు గురుదేవా! నమోనమః అంటూ సాష్టాంగనమస్కారం చేశాడు. తను నేర్చుకున్న పయిట్లు జిమ్నాస్టిక్స్ అన్నీ నేర్చుకున్నవన్నీ ప్రదర్శించాడు కామేశ్వరుడి గుండె ఆగినంత పనయింది ఈ లోకంలోకి వచ్చేసరికి నిముషాలు పట్టాయి తేరుకొని ఓ పెద్ద జగ్గు నిండా మంచినీళ్ళు తాగి జగన్మోహనరావు! నీ ప్రతిబ నీ గొప్పదనం నీ కృషికి నా కళ్ళు బైర్లుకమ్మి, తల తిరిగిపోతుంది నువ్వు నువ్వే! నీకు సాటి మరొకరు లేరు కాని అంటూ నీళ్ళు నమిలాడు

జగన్మోహనరావు గుండె ఝల్లుమంది ఈ కానీకి అర్థం ఏమిటో బయంగావుంది మళ్ళీ వూరు

ఇ·వేమన·పద్యాలు



వేష భాష లెరిగి కాషాయ వస్త్రముల్
కట్టినపుడె ముక్తి కలుగబోదు
తలలు బోడులైన తలపులు బోడులా
విశ్వదాభిరామ వినురవేమ

"రేపటి హీరో"

పంపించడుకదా – ఏమంటాడో ఏమో గుండె వేగంగా కొట్టుకుంటుంది శరీరంలో రక్త ప్రసరణ ఎక్కువయ్యింది చెప్పండి గురువుగారూ' మీ కానీ కి అర్ధం తెలుసుకుందామని కొండంత ఉత్సాహంగావుంది' .అన్నాడు చేతులు ముడుచుకొని

నువ్వు అబినయం అమోఘంగా చేస్తున్నావు అయితే నీ లాగా అబినయంచేసే మహానటులు మన యిండస్ట్రీలో ఒక రిద్దరుకారు చాలామంది పోటీపడుతున్నారు అలాగే డాన్సు విషయంలో నీలాగే చేసే డాన్సు సామ్రాట్‌లు ఒహ్ చాలామంది వాళ్ళు డాన్సు చేస్తూ యిండస్ట్రీని డాన్సు చేయిస్తున్నారు పోతే పయిట్ అచ్చు నీలాగే ఫయిట్ చేసే పయిట్‌శ్రీలు అపర హనుమంతుళ్ళు యిప్పుడు ఒకరి కొకరు పోటీగా కొట్టుకు చస్తున్నారు నువ్వు నేర్చుకున్న మూడు విద్యల్లోనూ సరిసమానంగా పోటీపడే హీరోలున్నారు నువ్వు స్పెషల్ ఎట్రాక్షన్‌తో కోహినూర్ వజ్రంలా ప్రత్యేకతతో పిలిం యిండస్ట్రీలో ప్రకాశించాలంటే యిండస్ట్రీలో యింతవరకు ఏ హీరోకి అనువుగానిది అనితరసాధ్యమయిందీ సాదించాలి అపుడే నువ్వు సూపర్‌స్టార్‌వి రేపటి హీరోవి అవుతావు' అన్నాడు గురుదేవుడు యోగముద్రలో కూర్చొని జగన్మోహనరావు బవిష్యత్తుని చూస్తూ – శలవియ్యండి గురుదేవా? అయితే తిరిగి మా స్వగ్రామం మాత్రం వెళ్ళను వెళితే నన్ను బతకనివ్వరు నేను హీరోని కావాలంటే ఆ అనితర సాద్యమయిన విద్య ఏదో యిక్కడెక్కడో దగ్గర్లో నేర్చుకొనే, ఏర్పాటు చెయ్యండి ఖర్చు వుండకూడదు ఈసారి నేను తిరిగి వచ్చేక నన్ను తప్పకుండా హీరొగా పెట్టి మీరు సినిమాతీయాలి తీయకపోయారో నా శవమే మీ కళ్ళముందర కనిపించేది అని మాట వరసకు అన్నాడేగాని ఎక్స్‌ప్రెషను మాత్రం మీ తోలు వొలిచేస్తాను పీక నొక్కేస్తాను రక్తం పీల్చేస్తాను అన్నంత పోర్సుగా వుంది ఆయన డైలాగు మాడ్యులేషను అర్ధమయింది విషయం దర్శకోత్తముడికి – తత్తరపడుతూ అంతదూరం ఎందుకు నాయనా నువ్వు ఎలాగైనా రేపటి హీరోవే' అంటూ బుజం చరిచేడు

ఈ మాట యింతకుముందు విన్నప్పుడు శరీరం పులకరించేది మనసు గాల్లో తేలిపోయేద్ది యిప్పుడు న్యూట్రల్‌గావుండిపోయింది చెప్పండి గురువుగారు నన్ను ఏం చేయమంటారో? నేను సినీపీల్డులో హీరోగా తారాపదంలో ప్రకాశించాలి' సూపర్‌స్టార్‌ని కావాలి' రేపటి హీరోని కావాలి' అందుకోసం ఏమయినా చేస్తాను అన్నాడు స్థిర నిశ్చయంతో గంబీరస్వరంతో బేస్‌లో క్లోజప్ ఎక్స్‌ప్రెషన్‌తో

ఎ వయినా చేస్తావా? ఏదో ప్లాష్ వెలిగి అడిగేడు దర్శకుడు జగన్మోహనరావు పట్టువదలని పరిశీలనగా చూస్తూ

"చేస్తాను' స్థిర సంకల్పంతో అన్నాడు రేపటి హీరో

చేస్తావా? మళ్ళీ రెట్టించాడు దర్శకుడు

చేస్తాను' అదే శృతిలో సమాదానం చెప్పేడు హీరో

చే స్తా వా? చెయ్యిచాచి అడిగేడు డైరెక్టరు

చేస్తా ను' చేతిలో చెయ్యివేశాడు హీరో

అయితే వెంరనే వెంరనే సస్పెన్స్‌లో వుంచాడు డైరెక్టరు – ఆ సస్పెన్స్ బరించలేకపోయాడు హీరో

వెంరనే ఏంగ్జైటీతో అడిగాడు హీరో

వెంరనే సర్కస్ కంపెనీలో చేరిపో సర్కస్ పీట్స్ అన్ని నేర్చుకో' యిప్పటివరకు మన హిరోల్లో సర్కస్ పీట్సు చెసేవాళ్ళు ఎవరూలేరు రేపు నువ్వౌస్తావు' రేపటి హీరోవి అవుతావు' దర్శకుడు ఆ మాట పూర్తిచేయకముందే జగన్మోహనరావు అక్కడనుండి మాయమైపోయాడు రేపటి హీరో సర్కస్ కంపెనీలోకి □

నిత్యనూతన సీరియల్

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ



వేయిపడగలు

పదునొకండవ అధ్యాయము

(గత సంచిక తరువాయి)

అప్పటికి మహాత్ముడైన గాంధి సహాయ నిరాకర ణోద్యమము ఆరంభించి రెండేండ్లయినది. జనులు గాంధి దేవుడై అవతరించె నన్నారు. ఆయనయే కృష్ణుడు. రాటము వేణువు, తన్మధురధ్వని వంశీనినాదము, భారత దేశము బృందావనము. ప్రజలు గోపికలై ఆయన చెప్పినట్లే కోట్లకు కోట్లు జనులు గుమికూడి అవలంబింప జొచ్చిరి. దేశమున అర్థముకాని యుద్యమొకటి ప్రారంభ మయ్యెను. ఈ మహా సంచలనము చూచి ఖండ ఖండాంతరవాసు లాశ్చర్య పోయిరి. దేశము నందు ఇంగ్లీషు చదువన్నను పాశ్చాత్య సంప్రదాయాను సరణమన్నను నిరాదరణ కలిగెను. ఇంగ్లీషు చదువు భారతీయులను వ్యామోహితుల చేసి పారతంత్ర్య శృంఖలానిబద్ధులను చేసి దాస్య భావ పూరితులను చేయు చున్నదని అతివాదులు విశ్వసింప జొచ్చిరి. రంగాపురములో కేశవరావను ఒక ముప్పది యేండ్ల యువకుడు ఎమ్. ఎ. బి. ఎల్. ప్యాసై చెన్న నగరములో న్యాయవాద వృత్తి యందుండెను. ఈయన రాజ్యలక్ష్మమ్మ గారి కుమారుడు. గాంధి గారి ఉద్యమము బయలుదేరి నంతనే యీయన తన న్యాయవాద వృత్తి పరిత్యజించి ఉద్యమములో చేరబారెను. "ఇంగ్లీషు చదువు చెప్పబడుచున్న కళాశాల యందు పిల్లలు చదువరాదని వాదించిన దేశ భక్తులతో చదువులేక పిల్లలు చెడిపోరా?" అని తంత్రులు వాదించిరి. ప్రతి చోటను జాతీయ కళాశాలలు స్థాపించి యింగ్లీషు చదువు మానివేసిన విద్యార్థులకు దోడ్తో విద్యాభ్యాసము నకు కూడ వీలు కలిగించుటకు దేశమున అనేకులు ప్రయత్నించిరి. కేశవరావుగారు సుబ్బన్న పేటలో జాతీయ కళాశాల పెట్టెను. అచట రాటము వడకుట, హిందీ, తెలుగు, సంస్కృతములు నేర్పుదురు. కేశవరావు చెన్నపురిలో ప్రశస్తి పొందిన న్యాయవాది అగుటచేత దేశమున ఆయన కెక్కువ పలుకుబడి కలదు. జమిందారుల వద్దకు, ధనాధికుల వద్దకు పోయి భూరి విరాళములు తెచ్చెను. రెండేండ్లలో సుబ్బన్న పేట జాతీయ కళాశాల నిలుకడగల సంస్థ అయ్యెను. చంద్రారెడ్డి ఏబది యెకరముల మెట్టభూమి కళాశాల కిచ్చి వేసెను. అచ్చటనే తదాలయ నిర్మాణములు జరిగెను. కేశవరావు సుమారు అరువది వేల రూపాయలు వసూలు చేసి కళాశాలకు మూలనిధిగా బ్యాంకులో వేసెను. ఏబది యెకరముల పొల మున్నది. సాలున కైదువేలు వడ్డి వచ్చును. కళాశాల అవ్యవహితముగా సాగ నారంభించెను. దేశము నందు కళలు, విద్యలు నశించి పోవుచున్నవనియు వానినన్నిటిని సముద్ధరించుట జాతీయ విద్యాశాల విధి అనియు కేశవరావు తలంచెను. అందుచే కళాశాలలో దేశీయ వ్యాయామము నేర్పబడుచుండెను. సంగీతము చెప్పుట కొక గాయకు డేర్పరుపబడెను. ఒక వంగదేశ చిత్రకారుని పిలిపించి ప్రాచ్యశిల్పశాఖ స్థాపించి తదధికారిగా ఆయనను నియమించెను. ప్రతి సంవత్సరము దసరా పండుగలలో కళాశాలలో మహోత్సవములు జరుగును. పెద్ద పెద్ద వస్తాదులను పిలిపించి, కుస్తీలు పట్టించి గెలిచిన వారికి నూటపదార్లు బహుమాన మిత్తురు. పెద్ద గాయకులను పిలిపించి, సభలు చేసి సమ్మానింతురు. కవులను పిలిపించి గౌరవింతురు. కళాశాల ఆదర్శములు చూచినచో కృష్ణమనాయడు బ్రతికి వచ్చెననిపించెను. కృష్ణమనాయని స్మృతి కలిగిన జనులందరును కేశవరావును దైవముగా పూజింపజొచ్చిరి. ధర్మారావునకు కేశవరావన్నచో వేయి తలల ఆదిశేషుడు మరల అవతరించినట్లే ఉండెను. రెండు సంవత్సరముల నుండియు ధర్మారావునకు తన చదువు మాని యీ కళాశాలలో చేరుదమని తలంపు. కాని కళాశాలలో ఉపాధ్యాయులకు జీతములులేవు. అందరు ఊరకే పని చేయుచుండిరి. ధర్మారావునకు సంసారభారము శిరస్సున ఉండుట చేత చదివి సంపాదించవలసిన అవసరమున్నది. అభిమాన మంతయు కేశవరావుగారి మీద ఉన్నను ధర్మారావు తన దారియే తాను తొక్కెను. అదియు కాక ప్రథమమునలో జాతీయ కళాశాల మీద ఎక్కువ మోజులేదు. ఉద్యమము వృద్ధి పొందిన కొలది కళాశాలపై అభిమానము వృద్ధి కాజొచ్చెను. ఇంగ్లీషు కళాశాల సుబ్బన్నపేటలో ఉండుట తదభివృద్ధికి కొంత ఆటంకము జరిగెను. సుబ్బన్నపేట ప్రజలకు కోట మీద ఉన్నంత ఆదరము, గౌరవము మరింక దేనిమీదను లేవు. రంగారావుగారు సువిస్పష్టముగా తత్కళాశాలాస్థితికి ప్రతిఘటించినవాడు. నాగేశ్వరరావుగారు దానికి వ్యతిరేకులు. ఈ సందర్భముల చేత కళాశాలకు సుబ్బన్నపేటలో ప్రఖ్యాతి లేకపోయెను. చంద్రారెడ్డి యేబది యెకరములు ఇచ్చెనే గాని పురపాలక సంఘము, రాచరికమున కనుకూలమైన వర్గములందే ఎక్కువ యిచ్చకలవాడు. రెండు మూడేండ్లేదురు గాలికి నిలబడిన తరువాత కేశవరావునకు కాలు నిలువ ద్రొక్కుకొన వీలైనది.

ప్రతి సంవత్సరమును, గడచిన మూడేండ్లు దసరా పండుగలకు కళాశాలోత్సవములు జరిగెను ఆ యేడు ధన లోపము చేత ఉత్సవములు వాయిదా పడెను కేశవరావుగారు చెన్నపురికి పోయి మూడు వేలును బొంబాయికి పోయి ఐదు వేలును విరాళములు తెచ్చెను పండుగ పది రోజులున్న దనగా ఇంటికి వచ్చెను తలవని తలంపుగా కళాశాలోత్సవములు సంక్రాంతి పండుగ కని నిర యింపబడెను పత్రికల నిండ ఆహ్వానములు ప్రచురింపబడెను బందరు నుండి జంగం కోటయ్య గారిని హరి నాగభూషణము గారిని విజయ నగరము నుండి ద్వారం వెంకటస్వామినాయుడు

జరిగిన కథ –25 రంగారావు గారు భార్య మరణించిన తరువాత ఇంగ్లాండు పోయి ఒక దొరసానిని తెచ్చి వివాహం చేసుకుంటాడు పురపాలక సంఘం వారు ప్రజలపై ఎక్కువగా పన్నులు విధిస్తారు ధర్మారావు హరప్ప నాయనికి చదువు చెప్పడానికి ప్రతి రోజూ కోటలోనికి వెడుతూ ఉంటాడు గుండేరుకు వరదవచ్చి సుబ్బన్న పేటను ముంచెత్తుతుంది పంటలన్నీ నాశనం అవుతాయి ఎసరికకు ఉబ్బు చేస్తుంది ధర్మారావు పుష్కరాలకి బెజవాడ వెడతాడు ధర్మారావు మిత్రులను కలుసుకుని ఎశుపతి ఇంటికి వెడతాడు పుష్కరాలలో అధికారులు చేసే అగడాలను ఎదిరిస్తాడు ధర్మారావు హరప్పనాయుడు తల్లికి మాణిక్యములు పెడతాడు సంక్రాంతికి సుబ్బన్న పేట అంతా కళకళలాడుతుంది ధర్మారావు దేవదాసితో కలిసి గుడిలోకి పోయి స్వామికి సేవలు సరిగా జరగనందుకు చాలా విచారిస్తారు

గారిని ఎతాపురము నుండి సంగమేశ్వరశాస్త్రి గారిని సంగీత సభలకు ఎలిచిరి

కేశవరావుగారి కాంధ్ర గాయకులనే పోషించవలయునని అభిప్రాయము ఆంధ్రులను వదలి పెట్టి ద్రావిడ గాయకులను పోషించువారిని మెచ్చుకొనువారిని చూచినచో ఆయనకొడలుమంట అవునయ్యా! ద్రావిడు లెక్కువ సంగీత పాటకులేమో నాకు తెలియదు

వారికి ప్రాంతీయాభిమాన మెంత! దానికి వారు పెట్టినది పేరు? ఇప్పుడు గాంధీ గారి ఉద్యమము మూలమున ప్రాంతీయాభిమానములు చాల వచ్చిన మాట నిజమే అది రాజకీయ విషయముల యందు కళా విషయము లందు కాదు నా కాంధ్రుల గానమే యిష్టము అని ఆయన వాదించును

వస్తాదులు ప్రవేశముగా రుసుము పది రూపాయలు చెల్లించవలయును నాల్గు రోజులలో నలువది మంది వస్తాదులు వచ్చిరి

కూచిపూడి వారి చేత ప్రహ్లాద నాటక మాడించబడుట కేర్పాటు చేసిరి కాకినాడ నుండి ముప్పిడి జగ్గరాజుగారు వచ్చి దమయంతీ వేషము దరించునట్లు!

పలనాటిలో ఎవరో బ్రాహ్మణులు తోలుబొమ్మలు కట్టిదరట – వారి కొరకు కేశవరావు మనిసిని పంపించెను కడచిన రెండేండ్లుగా కళాశాల డబ్బు రుచి మరిగినవాండ్రు – చుట్టుప్రక్కలనున్న పగటి వేషాలవారు గొర్రె పొట్టేళ్ళ వాళ్ళ వెలుగుగొడ్ల నాడించువారు, దొమ్మరవాండ్రు గారడివాండ్రు పాములవాండ్రు – సుబ్బన్నపేట చుట్టు మూగిరి

పండుగల నాటికి పై రంతయు కోసివేసిరి పైరు కోయక ముందు తోరాలు త్రొక్కి చల్లిన జనుము తలలు బైట పెట్టెను గుండేటి వరదకు తుడుచుకొని పోయిన చేలలో మరల నాటిన ముదురు పైరు నాటక యీచుకొని పోయెను పొలము లన్నియు సరిగా ఎండలేదు ఈ వచ్చిన బిచ్చగాండ్రందరును తడిపొలాల మీదనే గుడిసెలు వేసికొనిరి ఎంత మంది బిచ్చగాండ్రు! వేసగిలో నెరియలుపడ్డ పొలాలలో అడుగున ఎచ్చటనో దాగి ఉండి వాన చినుట పడినంతనే బొణుగురు బొణుగురని కూయు కప్పలు లక్షోప లక్షలై వెలికురికినట్లు తమ్మాదరించు ప్రభువు దొరికినంతనే వారందరును నేల యీనినట్లు వచ్చిరి ఆహా! ఆశ్రయమిచ్చువాడు దొరకినచో ఆశ్రితులు పది వేల మంది అందురు ఆశ్రయ మిచ్చువాడు లేనిచో వారందరును మండు వేసగియందు కాకులు వోలె మలమలమాడి చత్తురు!!

భోగిపండగ నాడుత్సవములు ప్రారంభమయ్యెను కూచిపూడి వారు వచ్చి పగటి



వారు త్యాగయ్యగారి కృతులను పాడునప్పుడు వారి కర్థము తెలియదు నాకు బాగుండదు అవును – కాదు నేను తెలుగువాడను నాకు తెలుగు వారి మీద అభిమానము ఇదిగో మీ వంగీయులున్నారు కదా!

దేశమునందు సుప్రసిద్ధులైన సమాహ్వానించిరి బస్తీలకు రా దలచు

వేషములు వేసిరి మొదటనే అర్ధనారీశ్వర వేషమును సంతరించి గ్రామమంతయు తిరిగిరి జాతీయ కళాసాల ఊరికి తూర్పున మెట్టచేలలో ఉన్నది ఊరునకు పడమరన కోట ఉన్నది వేషము – కోట నైరృతి మూలయందు బయలుదేరి దక్షిణపు గోడ వెంటనే వచ్చి స్వామి అలయము ముందు నిలుచుండి తన విద్య ప్రదర్శించుచుండెను జనము వారి చుట్టును మూగిపోయిరి

అర్ధనారీశ్వరుని వేసము వేసిన అయన మొగమునకు సగమునందు సన్నని తెర వేసెను అది కుడి వైపునకు తీయును – గిరిజాకృతి శిరసున చంద్రవంక, గౌరీకళ్యాణపు బొట్టు ముక్కర మహాదేవుని భార్య వలె ఒంటి కన్నులో జ్యోతిస్సులు వెలుగుచుండెను అర్ధనిమీలిత నేత్రము గౌరీ కటాక్షామృతమునే ప్రసరింప చేసెను తక్కిన శరీరమంతయు స్త్రీ దేహము వలెనే భాసించెను పార్వతి వైభవ ప్రస్తావనా కీర్తనలు పాడి మరల తెర ఎడమ వైపునకు లాగును అంతలో విచిత్రమైన మహాదేవాకృతి గోచరించెను జటాజూటము నందు చంద్రరేఖ పాలమున గంధాక్షతలు – విప్పారిన నేత్రమునందు సర్వజగన్నాథత్వమును, సాల ప్రాంశువైన మనిషి అతడు నవ్వును వెండి కొండ తెల్లని కాంతులు చిమ్మును అతడు కుపితభులవు చూపించును పాలము నందు సిందూరముతో చేసిన మూడవ కంటి నుండి నిప్పులు క్రక్కుచున్నట్లు కనిపించెను ఇంతకుముందు గిరిజార్ధముఖము ప్రదర్శించిన వేళ చీర తాల్చినట్లు, రైకతాల్చినట్లున్న అతని శరీరము పురుషార్ధముఖము ప్రదర్శించినంతనే అది యేమి చిత్రమో? శివుడు దోవతి కట్టినట్లు పైన ఉత్తరీయము తాల్చినట్లు కనిపించును అట్లు వేషము వేయుట యెట్టి విద్యయో! అతనిని చూచి నాగేశ్వరస్వామి తన ప్రతిబింబమనుకొనునేమో!

అతడు దేవాలయములు దాటి, బ్రాహ్మణ వీథి దాటి, ఊరిచివరనున్న కళాశాల వద్దకు పోయెను కేశవరావుగారు కనిపించెను పగటి వేషగాండ్రందరును నమస్కరించిరి కేశవరావు దేశీయ విద్యలకు గొప్ప వ్యాఖ్యాత, వీరన్న అడినంత సేపు కేశవరా వేదో వ్యాఖ్యానమే చేయుచుండెను

అదిగోనయ్యా! చదువు అర్ధనారీశ్వరుని వైభవము, కైలాసము సొగసు, ప్రమథులలో భేదములు, వారి పేరులు, అనేకములైన గౌరీదేవతల వైభవ విస్తారతలు, మహా భక్తులైన శైవుల కథాసంవిధానములు, సప్తమాతృకల చరిత్రలు, త్రిపురాసుర సంహారము, బాణాసురుని కథ – ఒకటి యననేల – శైవాగమములన్నియు అతని జిహ్వాగ్రముననే ఉన్నవి చూడవయ్యా! చూడుము! ఇంగ్లీషు చదువులు వచ్చి యీ మహాసంస్థను పాడు చేసినవి పాశ్చాత్య నాగరికత వచ్చి యీ పేదవారి నోళ్ళ మీద కొట్టినది పిడికెడు బిచ్చముతో తృప్తిపడి, తీరి కూర్చున్న వేళలందు సునాయాసమున సుఖకరముగ విద్యలు దేశమునందు వ్యాపింప చేయుచుండెడి యిట్టి



దసరా సరదాలు
(చిత్రం పి. పి నాయుడు)

వేయి పడగలు

మహాసంస్థ లెన్ని నాశనము పొందినవి వీరి నందరను పూర్వము మహారాజులు ధనవంతులు ఆదరించిరి నేటికవి కూటికి మాలిన విద్యలైనవి అసలు వీనికి విద్యాత్వమే పోయినది"

ఆ నాడు సాయంకాలమున కొందరు చిన్న వస్తాదులకు కుస్తీలు జరిగెను ఒక తురక కుర్రవాడును ఒక కాపును కుస్తీ పట్టిరి కాపు కురవ్రాడు సన్నగా ఉండి మిక్కిలి చురుకై ఉండెను మహమ్మదీయుడు కొంచెము బలిసి కన్నులందు క్రూరత్వమున్నట్లు కనబడెను కాపు కురవ్రాడు ఏలూరు తమలపాకుల వీర వెంకమ్మగారి తాలింఖానాలో మనిసి అయన వస్తాదులతో మరియాద నెరింగినవాడు కృష్ణా జిల్లాలో అయన కీర్తియు చక్కగా వ్యాపించి ఉండెను వారి తాలింఖానాలోని కుర్రవాండ్రు రౌడీలవలె కాక పెద్దమనిషి తరహాలు తెలిసినవారు పేచీలు తెలిసికొని సులువుగా చురుకుగా పొట్లాడెదరు ఇద్దరును చేయి చేయి కలవనే లేదు కాపు కుర్రవాడు దస్తితో నెదుటి వానిని పీటమన్ను చేసెను అందరకు ఆశ్చర్యమైనది చేయి చేయి కలుపుటలోననే బొటన వ్రేలితో గలిపి చేతిని పట్టుకొని, ఎడమ వైపునకు చేయి విరిచి కన్ను మూసి కన్ను తెరచినంతలో వేగముగా లాగివేసెను దానితో ఎదుటి మనిషి ఎడమ పార్శ్వమును తలయును తూలిపోయి క్రింద పడిపోవును అది వేగముగా లాగుటలో నున్న ఒడుపు మంచి చురుకైన వాడు గాని అట్లు చేయలేడు తరువాత మరి యిద్దరు కుస్తీ పట్టిరి వారి కుస్తీ యెంత సేపటికిని తెగలేదు అది లాలోచీ అని విడపరచి పంపిరి

రాతిరికి ప్రహ్లాద నాటక మాడబడెను కూచిపూడివారు పూర్వము ప్రహ్లాద నాటకమును మూడు రాత్రులాడెడివారు జనుల కోపిక తగ్గి అది క్రమముగా రెండు రాత్రులకే అడబడుచుండెను వ్యవధి లేకపోవుటచే రెండు రాత్రుల కథయు ఒక్క రాత్రియే అడు మనిరి

ధర్మారావునకు కేశవరావన్నచో చాల గౌరవము కేశవరావు ధర్మారావు నతని వివాహము నాటి నుండి కొద్దిగా ఎరుగును కడచిన రెండేండ్ల నుండి బాగుగా ఎరుగును రాజ్యలక్ష్మమ్మ గారికిని అరుంధతి మీద ప్రేమ వలన ధర్మారావునకు రాజ్యలక్ష్మమ్మ గారి ఎడల గౌరవము వలన, ధర్మారావు కేశవరావుల పరస్పర గౌరవ ఘచ్చముగా మనస్సంబంధియే కాక కించిద్హృదయ సంబంధి కూడ అయ్యెను ఈ ఉత్సవములు చూచుటకు రంగాపురము నుండి రాజ్యలక్ష్మమ్మగారు వచ్చి దర్మారావు గారి యింటనే ఉండెను

అరుంధతి విచిత్రమైన వ్యక్తి అమె లోకములో ఎవరిని గౌరవించదు అట్లని అవినయవతి కాదు మనసులో అమెకెవరి మీదను మహాభిప్రాయముండదు పైకి మర్యాదోల్లంఘనము చేయదు అమె లోకములో గౌరవించు స్త్రీ వ్యక్తి రాజ్యలక్ష్మమ్మ గారొక్కతయే-తనకు దన భర్తకు పొసంగించినదామె అనియో రాజ్యలక్ష్మమ్మ గారి ముఖము నందలి తేజస్సు చూచియో తెలియదు అమెకు వేడి నీళ్ళు కాచి యిచ్చును అమె వచ్చెనని ప్రతి పూటయు రెండు మూడు కూరలు వండును అమెనే పనియు ముట్టుకోనీయదు రాజ్యలక్ష్మమ్మ గారిప్పటికి వృద్ధురాలై దగ్గర దగ్గర ఎబది యేండ్ల వయసు కలది అయ్యెను అమె శిరోజములు సగమునకు సగము నెరసెను అమె ఒడలు దొందముపారి మునుపటి వలె రమణీయము గా లేదు అరుంధతీ ధర్మారావుల కామె పరమేశ్వరి వలె కనపడును ఈ దంపతులకు తమయందు గల గౌరవము అమెకు తెలియును రాజ్యలక్ష్మమ్మ గారికి కూచిపూడి భాగవతులన్నచో ప్రాణము ప్రహ్లాద నాటక మొక్క రాత్రియే అడుదురనగా అమె చీ చీ అన్నది కొడుకు కనపడునేమో రెండు రాత్రు లాడించుమని చెప్పెదమనుకున్నది బహు వ్యాపృతుడైన కొడుకు కనిపించలేదు సావిత్రమ్మ గారు అరుంధతీ రథంతరులు, రాజ్యలక్ష్మమ్మ గారు కలసి నాటకమునకు పోయిరి దేవదాసియు, రత్నగిరియు వచ్చి దూరముగా నిలుచుండిరి రథంతరి పోయి గిరికను తెచ్చి తమ వద్ద కూర్చుండబెట్టుకొనెను

ధర్మారావు హరప్పనాయనితో నాటకమునకు కలసి వచ్చెను హరప్ప నాయడీ నాటకమునకు వచ్చుటకు తండ్రిగారి వద్ద అనుజ్ఞ మిక్కిలి బలవంతముగా తెచ్చుకొనెను ధర్మారావునందు రంగారావు గారికి విషయమున వైమనస్యము కలిగెను కాని తల్లి లేని నాయడు ధర్మారావు నంటిపెట్టుకుని తిరుగుచుండెను వారిద్దరను విడదీయుట జమీందారుని కందుచే ఇష్టములేదు కోటలో నుండి నాటకము చూచుటకేగిన దొక్క హరప్పయే సభ్యులందరి కన్న ముందు పెద్ద తివాచీ వేసి దానిపై పరుపు వేసి, బాలీ సమర్చిరి దానిపైహరప్పనాయడు కూర్చుండెను ధర్మారావు ప్రక్కనే కూర్చుండెను

4

మా నాయనగారు అప్పటికి నిరుద్యోగి అప్పటి దాకా గుంటూరు ఏ సి కాలేజీలో ఉద్యోగం చేస్తూ ఉండేవారు

అప్పట్లో ఆ కాలేజీలోని కొందరు విద్యార్థులు వివేకానందస్వామి ఫోటోని చించటం కాళ్లతో మట్టగించడం వంటి పనులు చేశారట మరి కొందరు విద్యార్థులు దానిని వ్యతిరేకించారు ఈ వ్యతిరేకతకి సత్యనారాయణగారి సహకారం ఉందని కమిటీ వాళ్ళు సంజాయిషీ అడిగారు

సంజాయిషీ లేదు అన్నాడట ఈయన అయితే 'డిసిమిస్' చేయాల్సి వస్తుంది అన్నారట వాళ్ళు మీరు 'డిస్మిస్' చేసేదేమిటి మీ బొంద, నేనే 'రిజైన్' చేస్తున్నాను అన్నాడీయన అట్లా ఆ కాస్త ఉద్యోగం కాస్తా పోయింది

మా తాతగారు శోభనాద్రిగారు నిరతాన్న దాత– ఆ నా తండ్రి యనన్ ద ధీచి శిబి కర్ణాదుల్ పునా రూప సంస్థానం బందిన కర్మయోగి – అన్నాడు గదా ఈయన కల్పవక్షంలో –

అదిగో ఆ వరసలోనే సర్వమైన ఆస్తి హారతి కర్పూరమై పోయింది వేయి పడగలులోని రామేశ్వరశాస్త్రి పాత్ర సంపూర్ణంగా మా తాతగారే ఒక్కటే తేడా! రామేశ్వరశాస్త్రి నాలుగు వర్ణాల కన్యలనీ వివాహమాడాడు మా తాతగారు ఆడలేదు మా నాయనమ్మగారి పేరు పార్వతమ్మ

ఆ ఇద్దరూ ఇద్దరికిద్దరే!

పూర్వపు పాలేరొకడు దారిలో కనిపించి ధొరా! చెట్టంత వాడివి నువ్విట్టా అయ్యావు పిట్టల్లాంటోళ్లం మే మిట్టా అయ్యాం చివరికి కట్టుకోవడానికి గుడ్డ కూడా లేదు కదా! అని వాపోయాడట ఆ సమయంలో ఎవరైనా పెదవి



ఆర్థిక పరిస్థితి

విరుస్తారు, దుఃఖపడతారు విశేషమైన దానగుణం ఉంటే పై ఉత్తరీయం యిస్తారు కాని శోభనాద్రి గారు! పై ఉత్తరీయం తాను కట్టుకుని ధోవతి వాడి కిచ్చి ఇంటికి వచ్చాడట ఇంట్లో మా నాయనమ్మ! ఉన్న ఒక్క చీరా ఎవరో పేదరాలికిచ్చి, తాను దుప్పటి చుట్టుకుని కూర్చునే దట! వీళ్ళకి మళ్లీ బట్టలు కొనలేక మా నాయనగారు నానా యిబ్బందీ పడేవాడట

ఇదిల్లా ఉండగా, ఇంట్లో సభ్యుల సంఖ్య!! మా నాయనగారు మా అమ్మగారు మా పెద్దన్నయ్య మా పెద్దక్కయ్య, మా చిన్నక్కయ్య – మా పెద్ద బాబాయి ఆయన బార్య ఇద్దరు పిల్లలు – మా చిన్నబాబాయి ఆయన బార్య – మా చిన్న మేనత్త భర్త పోయి కొడుకుతో ఇక్కడే ఉండేది వీళ్ళు కాక వచ్చేపోయే బంధువులు స్నేహితులు!

అయ్యో! ఒక పక్క ఇల్లు యిల్లా! బయట ఇంగ్లీషువాళ్ల పరిపాలన! జాతీయ బావాలుంటే ఉద్యోగాలు లేవు మా భాబాయిలకు లేవు మా నాయనగారికి ఉన్నది కూడా ఊడింది పచ్చళ్ళు పెట్టుకోవడానికి జాడీలు రాచ్చిప్పలు కూడా లేక కొన్ని సందర్భాల్లో మా అమ్మగారు కొబ్బరి చిప్పలు గోకి వాటిల్లో పెట్టేదట పచ్చళ్ళు ఒక్కొక్కసారి పదార్థాలేవీ లేక, ఇంత మందీ ఏదో ఒక పచ్చడన్నమో మజ్జిగన్నమో తిని లేచే వాళ్లట ఈ స్థితిలో – మా నాయనగారు ఏ స్నేహితుడి ఇంట్లోనో తిని రావడమో, లేదా తిని వచ్చానని చెప్పి పడుకోవడమో చేసే వాడట ఈ పరిస్థితుల వల్లనైతే నేమి అజీర్తి వల్లనైతేనేమి – ఆ నాటికే రెండో పూట బోజనం మానేశాడు మా నాయనగారు

ఏకభుక్తం వల్లనైతేన్నేమి, మరే కారణం వల్లనైతేనేమి – కాఫీ బాగా అలవాటైంది మా నాయనగారికి రోజుకి నాలుగైదు సార్లు కాఫీ తాగితేనే గాని ఉండలేడు వ్రాయలేడు ఇంట్లో అందరూ తాగడానికా డబ్బులేదు ఎవ్వరికీ లేకుండా తనొక్కడూ త్రాగలేడు నవల సాగాలంటే మద్యే మద్యే కాఫీ పానీయం లేకుండా సాగేటట్టు లేదు ఏం చేస్తాడు? అల్లాగే బాధపడుతూనే మా అన్నయ్య చేతికి పావలా యిచ్చి బయటి నుంచి మరచెంబుడు కాఫీ తెప్పించుకుని ఆ కాఫీయే చల్లారి పోయినప్పుడు వెచ్చ చేయించుకుని తాగుతూ నవల డిక్టేట్ చేసేవాడట

ఆ రోజు లెల్లాంటివి? హోటలులో ఒక మనిషికి రెండు పూటలా బోజనం పెడితే నెలకి పది రూపాయల రోజులు ఆ రోజుల్లో యింట్లో నెల ఖర్చు దాదాపు రెండు వందలు అందుకని వేయి పడగలు వ్రాయాలి బహుమతి రావాలి దాంతో ఐదారు నెలలు ఇల్లు గడవాలి మిగిలిన విషయాలు తరువాత

(ఇంకా ఉంది)

–విశ్వనాథపావనిశాస్త్రి

నాటకమారంబించుటకు జామున్నర ప్రొద్దు పోయినది ఇంతసేపును హంగు జరుగుచుండెను తొందరగా మొదలుపెట్టవలయునని కేశవరావుగా రెన్నిసార్లు చెప్పినను వారి వేళకే, వారు ప్రారంబించిరి చోపుదారు వచ్చి హిరణ్యకశిపు మహారాజుగారి రాకను తెలిపెను తెర అడ్డము పట్టిరి వెనుక హిరణ్యకశిపుడు వచ్చి ఉండెను తాళము మద్దెలలు కాలిగజ్జెల మ్రోత పెళపెళా రావము చేత రాక్షసుడు అవతరించినట్లే ఉండెను రెండు కాగడాలు దగ్గర పెట్టి గుగ్గిలము చల్లి కలిగిన తళతళలో తెరతీసిరి వెనుకనున్న రాజు కిరీటము బుజకీర్తులు- వీనియందు గల తళుకు రేకులు దగ దగలాడి పోయెను తండ్రి పట్టాభిషేక వేళయందు హరప్ప కారేండ్లయినను నాటకాదులు సరిగా చూడలేధు ఆయన ఇంతవరకును పీడి నాటకమే ఎరుగడు హరప్పకీ నాటక మహోత్సవము మనోబిరామముముగ ఉండెను హిరణ్యకశిపుడు తపస్సుకు పోవుచు గర్బవతి అయిన లీలావతిని ఇంటి వద్ద ఉంచి పోయెను ఆమె గర్భస్థ శిశువు తన కపకారి కాగలడని ఇంద్రుడామెనుగొని పోవుచుండ నారదు లవతరించిరి నటకులప్పుడేదో ఒక కీర్తన పాడిరి ఆ రాగము ఆ తాళము ఆ లయచేత ఆకాశము నుండి దేవర్షి భూమి కవతరించినట్లే తోచెను

దర్మారావున కాశ్చర్యమయ్యెను కంపెనీల వారు వేయు నాటకము యందట్టి బావము కలుగుటకే వీలులేదు వారు బావానుగుణమయిన రాగముగాని రాగానుగుణ మైన లయగాని పాటించిన కీర్తనలే ఎరుగరు బొంబాయి నుండి దిగుమతి అయిన పారశీ మెట్లు చేతగాని తెలుగు కవులచేత రచింపబడిన కీర్తనలు గాయకుని కంఠధ్వని మ్రింగివేయు హార్మనీ తబలా ధ్వనులతో అపరిపక్వ మనస్కులు అనాగరక హృదయులు అయిన అవివేక సామాజికుల కొల్లగొట్టుటయే ఎరుగుదురు గాని విద్యలో నిగూఢత్వ మెరుగరు వేషము వేయుట ఎట్లో ఎ బావమునం దేరాగమున్నదో ఎ తాళమునం దేబావము పుట్టించ వచ్చునో బిన్నతాళ గతుల వలన బిన్నబావము లెట్లుదయించునో ఈ రహస్యములు సంప్రదాయ వేత్తలైన కూచిపూడి వారికే తెలియును ఈ నటకులు వారి వద్ద విద్యను నేర్చుకొనవలెనన్న నేర్చుకొనరు

నాటకము కొంత దూరము నడచినది రెండు రాత్రుల కథ ఒక రాత్రియే జరుపవలసి వచ్చుట చేత కథ తొందరగా జరుగుచుండెను ప్రహ్లాదుడు తండ్రి మాట వినలేదు పుత్రుని మీద కోపగించుచుండెను కొడుకును చేరదీసి వలదురా యన్న! తండ్రితో వైరము వలదురా యన్న! నిన్ను జంపుదు రనగ ఏంటిని కన్న కడుపెటులోర్చురా! వలదురా యన్న! అని బోధించెను హరప్పనాయడు తత్కీర్తనలోని భావము తన హృదయాంతరాళమున ఎక్కడ తగిలెనో పరిదీన వదనుడయ్యెను దర్మారావతనిని సమాదరించెను లోకోక్తి నట్లు చక్కగా సంగ్రహించి బావానుగుణమైన రాగములో పొదిగి మానవ హృదయము నందలి మూల బావములను పెల్లగించు శిల్పమే శిల్పము! అందుకనియే నాటకమన్నచో రచయిత అయిన కవి తెలుగు దేశము పలుకు బడి అంతయు దోచుకున్నవాడై ఉండవలెను నటకుడు గాంధర్వము భరతము సార మెరిగినవాడు కావలెను తక్కిన నాటకములు దేశమునకు వేరు పుర్వు వంటివి హరప్ప దృష్టి అంతయు కదలిపోయెను

వేయి పడగలు

ప్రహ్లాదుని కరిపించుటకు పాములతో రమ్మని పాములవాని కొరకు హేమకశిపుడు కబురంపెను వాడు వచ్చెను వచ్చుచునే వాడు పది వేల సర్పముల పేరులు వాని యాకృతి విశేషములు వాని విషములలో నున్న బేదములు వానికి ప్రతి క్రియలైన మందులు రెండు గడియలసేపు ఉపన్యసించెను వాని వేషము కట్టుట గొప్ప విచిత్రముగా ఉన్నది రాజ పోషణలో నుండి రాజు వద్ద బహు బహుమానములు పుచ్చుకొన్న వాడద్ది విద్యగా అది పరిశోధనగాతన పూర్వు లార్జించిన బహు సర్పగత జ్ఞానము తన నూతన పరిశోధనతో కలిపి ఒక పెద్ద సంస్థగా ఉన్న పురుషుని వలె ఉండెను కనుబొమ్మలు కన్నుల క్రింద కందరములు రెండును దగ్గరకు తీసి కనులు మూసికొని పోవునట్టు నవ్వును వాని యెదలోని క్రౌర్యమంతయు గోచరించును సెలవు లిడమునకు లాగి వికృత హాసము చేయును వాని ఎదలోని అనాగరకత అంతయు వెలికి వచ్చును ఎర్రని చుక్కలు కలిగిన నల్లని గుడ్డ బుట్టంత తలపాగ చుట్టి, వెనుక అడుగు పొడుగున జారవిడిచి కొస మలచి పాగాలో దోపి, వేయి రకముల పూసలు మెడయందు చేతులందు ధరించి ఆరు బుట్టల నిండ పాముల తెచ్చెను **ఉత్సవములకు వచ్చిన పాములవాండ్రీ పాముల వాని వేషము చూచి భయపడిరి** అందులో ఒకడు చాల సమీపముకు వచ్చి దిగాలు పడి చూచుచు నిలుచుండెను కేశవరావు ఏరా! నీవిట్లుంటివా? అని అడిగెను. వాడు హిరణ్యకశిపు మహారాజుగారు వానికి డబ్బిచ్చి పోషణ చేయుచున్నాడు అందుచేత వాడట్లుండెను నాకును దనమిచ్చి ఆదరించెడు దొర ఉన్నచో అట్లే ఉందు ననెను కేశవరావు మొగమున ఒక విషాదపు తీవె ఉదయించెను బ్రాహ్మణుడు పాములను తీసి ఆడించెను ఆడించుచు సభకు నమస్కారము చేసి బాబూ! ఎవరైన మంత్రగాండ్రున్నచో కట్టు విప్పుకుడు విప్పునచో మరల నేనైన చేయవలసి రావలసివచ్చు ననియెను

కూచిపూడి వారు గొప్ప మంత్ర శాస్త్రజ్ఞులు వారు నాటక మాడబోవునప్పుడే అష్ట దిగ్బంధనము చేయుదురట తమ విద్యయెడ అసూయపడిన వారు చిలిపి ప్రయోగములు చేసి పూర్వము వారిని అలయించగా వారు ప్రయోగమునకు మారు ప్రయోగములు చేయుట నేర్చుకొని ఉందురు వలసినచో వారు మోడి కూడ కట్టగలరు ధర్మారావు పాములవాని వేషమునకు, తత్ప్రదర్శిత విద్యా విశేషమునకు ముగ్ధుడై పోయెను ఆఫ్రికా దేశమునందును, తదిర దేశములందును గల సర్ప జాతులను గురించి వ్రాసి వాని చిత్రములతో ప్రకటింపబడిన ఇంగ్లీషు పుస్తకము లతడు చూచెను ఆ పుస్తకము లెవరో కొద్దిమంది చదువుదురు నాటక రూపమున బోధించబడుతున్న యీ మహా విషయము దానికన్న ఎంత ఉత్తమమైనది ఈ విద్య ధూపదీప నైవేద్యములు లేక నవసి పోయినది.

కథ ఎంత తరిమినను కాలము చాలలేదు తూర్పు రేకలు తోచినవి నృసింహావతారము రావేళ అయినది నృసింహమూర్తి వేషము వేయునతడు నృసింహ మంత్రో పాసకుడు అతడు రెన్నాళ్ళ నుండి భోజనము చేయడు ఈ రెండు దినములు మంత్రము జపించుచునే ఉండును రంగమునకు వెనక భూమియందున్న బల్లపై ఆయనకు వేషము వేసి, తలకు సింగపు తల వంటి ఒక గూడ అమర్చి కుర్చీలో కూర్చుండబెట్టిదరు రెన్నాళ్ళ నుండి తిండిలేక అతని మేనెల్ల నక నకలాడుచుండెను అతని చేతులకు గొలుసు కట్టి వెనుకకు బిగించి ముగ్గురు పట్టుకొనిరి

నృసింహావతారోదయ మైనంతనే హిరణ్యకశిపు వేషదారి పిల్లి వలె అయిపోయెను- అతడు విజృంభించెనా యా మహోపాసకుని యుగ్రత విజృంభించును కిరీటము భుజకీర్తులిది వరకే తీసివేసి- పరిదీన మూర్తియై నాటకము కొరకు మాత్రము హరి లేడని ప్రహ్లాదుని కెదురు కీర్తనలు పాడుచు నృత్యము చేయుచుండెను తెర తీసినంతనే పది కొబ్బరి కాయలు కొట్టిరి రెన్నాళ్ళ నుండి తిండిలేని ముసలి సింహము హుమ్మని గర్జించినది సభయంతయు భయగ్రస్తమై పోయెను ఇంతవరకు తన్మయత్వములో ఉన్న గిరిక లేచి నిలుచుండి చేతులు బోదించి తూలిపోవు చుండెను అరుంధతీ రతంతరులు పట్టుకొని కూర్చుండబెట్టిరి నృసింహమూర్తి హిరణ్యకశిపుని మీదికి దూక వచ్చెను సమీపముదాక రానిచ్చి హంగుదారులతనిని వెనుకకు లాగిరి ఇంతలో తెర దించిరి హారతులిచ్చి స్వామి ఉగ్రత ఉపశమింపజేసిరి

వెనుక ఒకసారి తండ్రికొడుకులు నృసింహ హిరణ్య కశిపు వేషములను తాల్చిరట నృసింహమూర్తి కినుప గోళ్ళు పెట్టిరట ఉపవాసమున్న ఉగ్రతలో మంత్ర పునశ్చరణ చేయు నావేశములో తండ్రి ఒడలు తెలియక హిరణ్యకశిపు వేషము వేసిన తన కుమారుని నిజముగనే చీల్చెనట నాటి నుండియు కూచిపూడి వారి నాటకములలో నృసింహ హిరణ్యకశిపులకు సన్నిహితత్వము కలిగించరు ఒకాయన అన్నాడు వేషము వేయువా డుపవాసముండుట ఎందుకు? మంత్ర పునశ్చరణ చేయుట ఎందులకు? అలంకారికులు పాత్రదారికి వేషములో తాదాత్మ్య ముండరాదని చెప్పుదురు అని కూచిపూడి వారు తక్కిన వేషములయందంతే కాని నృసింహావతార విషయముననే వారి కనుకూలముగా ఈ అచారము వచ్చుచున్నది వారి బావములో నాటకమన్నచో సర్వ దేవతా నివాస భూమి అయిన శిల్పమని, నాటకము వారి కులవృత్తి బరతమునకు వారు పుట్టినిండ్లు భక్తి ప్రపత్తులకు వారు నిధానములు లోకమునందు రసముతో పాటు దైవ భక్తి కూడ వారు వెదజల్లిరి

కూచిపూడి వారు నాటకమైనంతనే, ప్రొద్దుననే బయలదేరి, వేషముల తోడనే యూరిలోని దనవంతుల కడకు యాచనకు పోవుదురు పూర్వమిది అచారము దేశము నవనాగరికత తెచ్చుకొన్నకొలది వారును దానిని మానివేసిరి కాని ఆనాడు పొద్దుననే రాత్రి యువరాజుగారు నాటకము చూడవచ్చిరి కదా అన్న ఆశచేత వేష మూడదీయని లీలావతీ ప్రహ్లాదులతో హంగుతో కోటలోనికి పోయిరి దివాను గారు వీరి రాక జూచి వారిని వారించబోయిరి హరప్పనాయడు తాను కప్పుకొనుచున్న పట్టు సేలువ తెచ్చి వారిమీద విసరెను దివాను దిగ్భ్రాంతుడై పోయెను వారు శారదా రామాయణములోని రెండు చరణములనిరి నృత్యము కిలకిలలాడెను తాళము కంగు కంగుమనెను హరిహర నాయని దగ్గర నుండి స్తోత్ర పాఠములు వసంతర్తువు నందు కోకిలా లాపము వలె సుమధుర దీర్ఘములయ్యెను హరప్పనాయని గుండెలో ఆనందము పోటువేళ నదికి సముద్ర మెదురు పొడినట్టు పొంగెను ఒక **సంప్రదాయము చచ్చిపోవుచు చావులో కూడ దాని లక్ష్యమేయైన మహౌదార్య శ్రీనే ప్రకటించును. మరియొక సంప్రదాయము, తాను నూత్నాభ్యుదయము పొందుచు, అభ్యుదయములో కూడ దాని లక్షణమైన వెలతెల పోవుటయే ప్రకటించును.** వేసగి నాటి అస్తమయము కూడ తేజోవంతమే దుర్దినములలోని ఉదయము కూడ మేఘాచ్ఛాదితమే

తరువాత వారు దర్మారావుగారియింటికి పోయిరి రామేశ్వర శాస్త్రిగారి కీర్తి పాతర లానాడు త్రవ్వబడెను డిల్లీ బోగాలు రాజనాలు పాలాప్రగడములు పుట్టకు పుట్లు వెలికి వచ్చెను దర్మారావు చేతిలో దమ్మిడీ లేదు తండ్రి కీర్తి దశదిశాపూరితమయ్యెను ధర్మారావింటిలో వెదకెను ఈదగినంత వెలగల వస్తువేదియు కనిపించలేదు అరుంధతి వెలగల చీర ఒక్కటియే ఉన్నది అదిపది రూపాయల ఖరీదు కొని ఏడాది అయినది అరుందతి ఒకసారియో రెండుసార్లో కట్టుకొన్నది సహాయ నిరాకరణో ద్యమము వచ్చిన తరువాత ఆమె ఆ చీర కట్టుకొనలేదు ధర్మారావది తెచ్చి యిచ్చెను. క్రొత్త చీర చూచి భాగవతులు పరితుష్టి పొందిరి శారదా రామాయణములోని మరి రెండు చరణములు గలగలలాడెను మేళమునకు అద్యక్షుడైన వేంకటనారాయణగా రెగిరి గంతువేసి మడమలతో చిరుందును గొట్టెను దర్మారావు దగ్గరకు వచ్చి నాయనా; మీ నాయనగారు శిబి దధీచి! నీవు మాత్రము తక్కువా; బంగారు తండ్రి వని చిబుకమును రెండు వ్రేళ్ళతో పూని ముందునకు లాగెను ముసలి బ్రాహ్మణుని ఆ ముద్దునకు ధర్మారావు సిగ్గుపడెను

(ఇంకా ఉంది)


కోమల్ జి బి సింగ్


రిని సైమన్


సాదన శ్రీవాత్సవ


జ్యోత్స్న మహాపాత్ర


గీతాంజలి అయ్యర్

బుల్లి తెర తారలు

(సినిమా తారలు థియేటర్లలో గాని కనిపించరు బుల్లితెర తారలు ప్రతి రోజూ ఇళ్ళల్లోనే టి వి సెట్లలో దర్శనమిస్తుంటారు దూరదర్శన్ ప్రసార కేంద్రాలు అనేక చోట్ల వెలయడంతో వీరు అఖిల బారత తారలయ్యారు రిని ఉచ్చారణ కోమల్ కంఠం గీతాంజలి చెక్కిళ్ళు మిను మందహాసం మృణాళిని బావ ప్రకటన షీలాకళ్ళు ఆకర్షించని వారు అరుదు వీళ్ళ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చాలా మందికి ఉంటుంది అందుకు ఇదొక అవకాశం)

కోమల్ జి బి సింగ

నేను చాలా బద్ధకస్తురాలినండోయ్! అనే కోమల్ పలకరిస్తే చాలు- సిగ్గుతో వొయ్యారంగా కుంచించుకు పోతుంది 1977 నుంచి వార్తలు చదువుతోంది వయసు 30 ఇంద్రప్రస్థ కాలేజ్‌లో ఎం ఎ (సైకాలజీ) అడ్వాలే అనే మాడలింగ్ ఎజెన్సీలో మేనేజింగ్ పార్ట్‌నర్ భర్త నుంచి విడిపోయిన ఈమె తల్లిదండ్రులతో నివసిస్తోంది పిల్లులు ఉడుతలు తాబేళ్ళు పెంచడం హాబీ త్వరలోనే విడియో చిత్రాలు డాక్యుమెంటరీలు నిర్మించబోతోంది అడపాదడపా ఆలిండియా రేడియోలో కూడా వార్తలు చదువుతూంటుంది

రిని సైమన్

ఒకసారి న్యూస్‌లో ఏంటీ బయటిక్ బదులు అంటీ బయటిక్ అని పొరబాటున చదివాను! ఎన్ని ఉత్తరాలొచ్చాయో ! అనే 22 ఏళ్ళ రినీ సైమన్‌కు జీన్స్‌కు బదులు చీర ధరించడం కాస్త ఇబ్బందిగా ఉంటుందట ఈమె తొలుత ఆకాశవాణి లో వార్తలు చదివేది ఫస్ట్‌క్లాస్ న్యూస్ కాస్టర్ అని మెల్విల్ డెమెలో లాంటి వారి ప్రశంసలందుకుంది కమ్మని కంఠం చక్కని వాచకం బగవంతుడు ఈమెకిచ్చిన వరాలు ఈమె తండ్రి ఎస్ సైమన్ వైమానికదళంలో వింగ్ కమాండర్ మానాన్న చక్కని వక్త మా అమ్మ మితబాషిణి అంటుందీమె నవ్వుతూ బి యె (లటరేచర్) జర్నలిజంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పొందింది ఇపు డు ఢిల్లీ వర్సిటీలో ఎం ఎ (చరిత్ర) అబ్యసిస్తోంది వారానికి రెండు మూడు సార్లు వార్తలు చదువుతూంటుంది నా అబిమాన న్యూస్ రీడర్ నీతి రవీంద్రన్ అంటుందీమె త్వరలోనే సిద్ధార్థబసు నిర్వహించే ఒక క్విజ్ కార్యక్రమానికి ఈమె హోస్టెస్ ఇది చాలా వినూత్నంగా విశిష్టంగా ఉంటుంది అనే ఈమెకు ఐ ఎ ఎస్ పరీక్షలు రాయాలనుందిట త్వరలోనే ఇంగ్లాండ్ గ్రీస్ ఇటలీకి వెళ్లాలనుకుంటోంది ఇంగ్లాండ్‌కు వెళ్ళగానే నేను మొట్ట మొదట దర్శించేది బి బి సి కేంద్రాన్ని అంటుంది రిని

సాధన శ్రీవాత్సవ

ప్రమాదవశాత్తు నేను టి వి అనౌన్సర్ అయ్యాను అంటుందీమె ఒక రోజు ఎవరో సలహా ఇస్తే దూరదర్శన్ కేంద్రానికి దరఖాస్తు పంపిందట 1979లో ఆడిషన్ పరీక్షల్లో నెగ్గి అప్పట్నుంచి కార్యక్రమాలలో పాల్గొంటోంది ఈమె మేక్సీముల్లర్ బవన్‌లో జర్మన్ అబ్యసించి ఆ తర్వాత జర్మనీ వెళ్ళి టీచర్స్ ట్రెయినింగ్ కాలేజ్‌లో చదివింది ఒక జర్మన్ నాటకంలో నటించిందట కూడా చిత్రలేఖనం సంగీతం సితార్ వాదన నృత్యంలో శిక్షణ పొందింది నా పెళ్ళా? బగవంతుడు ఎప్పుడు రాసిపెట్టాడో! అంటుందీమె ఫక్కుననవ్వుతూ

జ్యోత్స్న మహాపాత్ర

ఇటీవల ఈమె పేరు జోత్స్నరాయ్‌గా మారింది ఇప్పుడొక బాబు తల్లి కూడా ఈమె మేఘముక్త అనే ఓ ఒరియా చిత్రంలో ద్విపాత్రలు నిర్వహించి 1983లో ఉత్తమ నటిగా క్రిటిక్స్ అవార్డు పొందింది ఆ తర్వాత వెండి తెరకు స్వస్తి చెప్పేసింది వెండి తెర మీద కనిపించడం కన్నా బుల్లితెర మీద కనిపించడంలోనే అదో ఆనందముంది అనే ఈమెక చిత్రలేఖనం నృత్యం పట్ల మక్కువ ఎక్కువ

గీతాంజలి అయ్యర్

బొంబాయి కెథెడ్రల్ స్కూల్‌లో కలకత్తా లోరెటో కాలేజ్‌లో చదువుకున్న ఈమె 1961 నుంచి ఆకాశవాణిలో వార్తలు చదివేది 1971 నుంచి దూరదర్శన్‌లో చదువుతోంది ఈమె ఖాందాన్ సీరియల్‌లో నటించిన విషయం వీక్షకులకు తెలిసే ఉంటుంది అప్పటికి గాని నాకు హిందీ వచ్చని చాలా మందికి తెలిసింది కాదుట అనే ఈమె టాజ్ పేలెస్‌లో టాజ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పాశ్చాత్య సంగీతం తెలుసు పుస్తకాల పురుగు ప్రయాణాలంటే ఇష్టం 1983 లో బర్త నుంచి విడిపోయిన ఈమెకు ఒకకొడుకు కూతురు ఉన్నారు

మిను

దూరదర్శన్‌లో శాశ్వత ఉద్యోగిని అవడం వల్ల వారానికి మూడు సార్లు దర్శనమిస్తూంటుంది సాప్తాహికి ఆప్ ఔర్ హమ్ కార్యక్రమాలలో పాల్గొన్నాక 1973 నుంచి హిందీలో 1980 నుంచి ఆంగ్లంలో వార్తలు చదువుతోంది పోలీస్ ఫైల్స్ నిర్మాత అశోక్ తాల్వార్ ఈమె బర్త అయినప్పటికి విడాకులు పొందిన ఈమెకు ఇద్దరు కూతుళ్ళునారు

నీతి రవీంద్రన్

ఆరడుగుల పొడగరి 1971 నుంచి ఆకాశ వాణిలో వార్తలు చదివింది ఈమె బర్త వైమానిక దళంలో ఉన్నతోద్యోగి అక్కడ ఈమె యుఎన్ ఐ బ్యూరో మేనేజర్‌గా పని చేసింది బర్త వైమానిక దళం


ముక్తా శ్రీవాత్సవ



అవినాష్‌కౌర్



ప్రభ్‌జోత్‌కౌర్



షీలా చమాన్



మృణాళినీసింగ్




మిను


నీతి రవీంద్రన్


అనితకోహ్లి

నుంచి డిల్లీలో ఎర్ ఇండియా లో చేరాక 1976 నుంచి దూరదర్శన్‌లో వార్తలు చదువుతోంది అప్పుడప్పుడు ఫిలిమ్స్ డివిషన్ వారి వార్తా చిత్రాలకు కూడా వాయిస్ ఇస్తూంటుంది పుస్తకాలు సంగీతం సినిమాలు ఈమె హాబీలు హోమియోపతి వైద్యం పట్ల నాకు విశ్వాసం ఎక్కువ మా ఇంట్లో అందరికీ నేనే వైద్యం చేస్తూంటాను సుమండీ అనే 38 ఎళ్ళ నీతికి ఒకే ఒక కూతురుంది

అనిత కోహ్లి

ఏిమ్ వగైరా సరకులకు మాడలింగ్‌గా పని చేసిన ఈమె బర్త వైమానికదళంలో ఉన్నతమైన హోదాలో ఉన్నారు వీరికి ఇద్దరు కుమారులు సౌత్ డిల్లీ పాలిటెక్నిక్‌లో అనిత లెక్చరర్ ఈమె సోదరి మంజుసింగ్ సమర్పించే ఏక్ కహానీ తదుపరి 26 బాగాల సీరియల్ నిర్మాణంలో ఈమెఎంతో తోడ్పడిందట

ముక్తాశ్రీవాత్సవ

అలహాబాద్ ఆకాశవాణిలో పని చేస్తూ వచ్చిన ఈమె 1960లో ఢిల్లీకి వచ్చి దూరదర్శన్‌లో చేరింది ఇంగ్లీషు హిందీ ఉర్దూలలో అనౌన్స్‌మెంట్స్ ఇస్తూంటుంది సంగీత కార్యక్రమాలను సమర్పిస్తూంటుంది ఆప్ ఔర్ హమ్ సప్తాహిక కార్యక్రమాలలో పలుమార్లు పాల్గొంది ఈమె తండ్రి పేరు మోసిన లాయరు ఇటీవల ఈమె అమెరికా కెనడా ఐరోపాలలో పర్యటించి వచ్చింది అక్కడి అనౌన్సర్స్ ప్రబావం నా మీద కాస్తో కూస్తో ఉండి తీరుతుంది, అంటుందీమె

అవినాష్ కౌర్

నేను డిల్లీ యూనివర్సిటీలో బి ఇడి చదువుతున్నప్పుడు ఒకసారి మండీ హౌస్ ను చూడ్డానికి వెళ్ళాను అనౌన్సర్‌గా పని చేయాలన్న తలంపు నాకప్పుడే కల్గింది అక్కడే దరఖాస్తు పత్రాన్ని పూరించాను. సెలెక్ట్ అయిన వెంటనే విజ్ఞాన్ పత్రిక సప్తాహిక కార్యక్రమాలలో పాల్గొనేదాన్ని జనవరి 1982 నుంచి హిందీ వార్తలు వారానికి రెండు సార్లు చదువుతున్నాను పగటి పూట ఒక స్కూల్లో పదవ తరగతికి ఫిజిక్స్ బోధిస్తూంటాను అనే ఈమె రెండేళ్ళ కుమార్తెకుతల్లి


ప్రభ్‌జోత్ కౌర్


అవినాష్ కౌర్ సోదరి 75 మంది అభ్యర్థినులలో ఎంపికయ్యాను అంటుందీమె సగర్వంగా అనౌన్స్‌మెంట్స్‌తో పాటు తరచు ఆప్ ఔర్ హమ్ లో వీక్షకుల ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు ఇస్తూంటుంది కూడా ఒకప్పుడు సినిమాలలో నటించాలనుకుంది గాని మంచి అవకాశాలు రాలేదట

షిలా చమాన్

1971లో మిస్ యంగ్ ఇండియా చిట్టి అనే బెంగాలీ చిత్రంలో నాయిక హిందూస్థాన్ థాంప్సన్ కంపెనీలో ఒకప్పుడు మాడలింగ్ స్టార్ కొంత కాలం నికీ టాషా కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పని చేసింది ఆంగ్ల హిందీ బెంగాలీ జర్మన్ రష్యన్ మాతృబాష సింధీ బర్త మాతృబాష పంజాబీ బాషల్లో అనర్గళంగా మాట్లాడగలదు ఈమె బర్త మాజీ ఆర్మీ మేజర్ బల్‌దేవ్ చమన్ అనారోగ్య కారణంగా స్వచ్ఛందంగా విరమణ చేసి ఇప్పుడు కంప్యూటర్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు వీరికి 14 ఏళ్ళ పుత్రుడు 15 ఏళ్ళ పుత్రిక ఉన్నారు షీలా చక్కగా పియానో వాయిస్తుంది నృత్యంలో కూడా శిక్షణ పొందింది 1985 నుంచి దూరదర్శన్‌లో వార్తలు చదువుతోంది అంతకు ముందు మిర్రర్ ఆఫ్ ది వరల్డ్ పెనోరమా కార్యకమాలు సమర్పించేది వయసు 32 ఈమె తండ్రి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉన్నతోద్యోగి.

శశికుమార్


తేజేశ్వర్‌సింగ్


పంకజ్‌మోహన్


మృణాళినీ సింగ్

"మా అక్కయ్య బర్త నుంచి విడాకులు పొందింది అందుకే నేను నా పెళ్ళి గురించి ఇంతవరకు ఎ నిర్ణయానికీ రాలేదు అనే మృణాళినీ జైపాల్ సింగ్ వయసు 28 ఫిలాసఫీలో పట్టం పొందింది ఈమె తన అక్కతో తుషార్ ఇంటర్నేషనల్ అనే రెడీమేడ్ బట్టల వ్యాపారాన్ని కొంత కాలం క్రితం ప్రారంబించింది అక్కడ ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదున్నర వరకు పని 1975 నుంచి నాలుగేళ్ళ పాటు ఆకాశవాణిలో వార్తలు చదివాను కొన్ని ప్రకటనల చిత్రాలకు వాయిస్ ఇచ్చాను 1984 ఫిబ్రవరి నుంచి దూరదర్శన్‌లో వార్తలు చదువుతున్నాను స్టూడియోలో బాక్ గ్రవుండ్ కాస్త నీలంరంగులో ఉంటుంది గనుక దరించే వస్త్రాల గురించి చాలా జాగరూకత వహిస్తూంటాను తరచు ఓబెరాయ్ ఇంటర్నేషనల్‌కి హేర్ డ్రెస్సింగ్‌కి వెళ్తుంటాను అనే ఈమె బాడ్‌మింటన్ టేబుల్ టెన్నిస్ లలో కప్పులు గెలుచుకుంది ఈత సంగీతం సంఖ్యా శాస్త్రం హస్త సాముద్రికం కూడా తెలుసట

శశికుమార్ (మీనన్)

మద్రాసు క్రిస్టియన్ కాలేజ్‌లో ఎం ఎ వయసు 34 మద్రాసు దూరదర్శన్ ప్రారంభమైన తదాదిగా వార్తలు చదివేవారు 1984 నుంచి బహ్రైన్‌లో హిందు పత్రిక పశ్చిమాశియా విలేఖరిగా పని చేశారు ఆ తర్వాత బొంబాయి ముద్రా అడ్వరయిజింగ్ మేనేజర్‌గా ఉన్నాక ప్రస్తుతం ప్రెస్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా టి వి విబాగంలో చీప్ ప్రొడ్యూసర్‌గా అంటున్నారు వివాహితుడు మూడేళ్ళ నాలుగేళ్ళ కుమారులున్నారు

తేజేశ్వర్ సింగ్

వయసు 39 పేజ్ పబ్లికేషన్స్ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్ ఆక్స్‌పర్డ్‌లో విద్యాబ్యాసం చేస్తున్నప్పుడు తరచు బి బి సి కార్యక్రమాలలో పాల్గొనేవారు ఆ తర్వాత ఆలిండియా రేడియోలో కొన్ని నాటికలలో నటిస్తూ దర్శకత్వం వహించారు కూడా జ్వాలా హిందీ చిత్రంలో విలన్‌గా సినిమారంగంలోనూ ప్రవేశించారు ఈయన శ్రీమతి సంఘసేవకురాలు వీరిద్దరు కవల పుత్రికలు

పంకజ్ మోహన్

డాటా (కంప్యూటర్ కన్‌సల్టెన్సీ)బాంక్ వ్యవస్థాపకుడు ఈయన సంస్థలో వివిధ రాష్ట్రాలకు ఖాతాలున్నాయి రంగస్థలోపాసకుడు రిచర్డ్ ఆటిన్ బర్ చిత్రం గాందీ లో మహాత్ముని కార్యదర్శి మహదేవ దేశాయ్‌గా నటించి న ఈయన బార్య నుంచి విడిపోయిన ఏకాంతవాసి

(జి వి జి)

సినిమా

నేతృత్వంలో ఎస్. అంబరీష్ ఈ విశిష్టమైన చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "మిగతా వృత్తులలోని వారికన్నా ఈయన దర్శకత్వంలో శొభమూరి రామచంద్రరావు "పోరాటం, ఎదురీత" అనంతరం నిర్మించే ఎస్. ఆర్. స్టేషన్‌మాస్టర్‌కు వివిధ మనః ప్రవృత్తులు గల



"స్టేషన్ మాష్టర్"లో అశ్విని

"స్టేషన్ మాస్టర్"గా రావు గోపాలరావు

"షూటింగ్ అక్టోబర్‌లో పూర్తవుతుంది," అన్నారు కోడి రామకృష్ణ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో రావుగోపాలరావు ప్రధానపాత్ర నిర్వహిస్తూ సమర్పించే ఆర్. జె. ఆర్. ప్రొడక్షన్స్ వారి పై చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, అశ్విని, డాక్టర్ రాజశేఖర్, జీవిత, వేలు, వీరభద్రరావు, రాళ్ళపల్లి, చిట్టిబాబు, మల్లికార్జునరావు, సాక్షి రంగారావు, చిడతల అప్పారావు, రాళ్ళబండి, మాలి, అన్నపూర్ణ నటిస్తున్నారు. గణేష్ పాత్రో, విజయ్, చక్రవర్తి, శివశంకర్, రావుశ్రీ, కమల్‌తేజ్, తాతా సురేష్ ప్రభృత సాంకేతిక వర్గంతో ఎస్. జయరామారావు

అన్నపూర్ణమ్మగారి అల్లుడు'లో సీత, డాక్టర్ భానుమతీరామకృష్ణ





సరస్వతీ

సుజా

చాలామంది పెద్దయ్యాక డాక్టర్ కావాలనో, లాయర్ కావాలనో అనుకుంటూ ఉంటారు. నేనలా కావాలని అనుకోలేదు గాని, బాగా చదువుకోవాలని మాత్రం అనుకున్నా. కాని, సరస్వతి కటాక్షించలేదు. అనుకోకుండా సినిమా రంగంలో ప్రవేశించాను. లాయర్‌గా, డాక్టర్‌గా నటించాను! ఐతే, ఉన్నత విద్య నభ్యసించ లేదే అనే కొరత మాత్రం అలాగే

నీవిశేషాలు

_జి.వి.జి.

మనుమలను పరిశీలించడానికి వీలవుతుంది. ఒక స్టేషన్‌మాస్టర్ పాత్రను ప్రధానంగా తీసుకుని, అతని దృక్కోణంలోంచి సమాజంలోని సమస్యలను నవ్యపంథాలో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాం," అన్నారు డైరెక్టర్.



"శారదాంబ" లో స్వాతి



కటాక్షం

త

ఉండిపోయింది.

మా అబ్బాయి బాగా చదువుకుంటున్నాడు. అమ్మాయిని బాగా చదివించాలని ఆశ.

నన్ను సరస్వతి కటాక్షించక పోయినా- ఒక తమిళ చిత్రంలో సరస్వతిగా నటిస్తున్నానండోయ్! విద్యల తల్లి సరస్వతి పాత్ర ధరించడంతో నేను పట్టభద్రురాలినయ్యానన్న సంతోషం కల్గింది.

"సర్వం శక్తి మయం

"సృష్టికి మూలకారణమైన ఆదిశక్తి మహిమల్లో కొన్నిటిని ఓ చిత్ర కథగా రూపొందించాం. ముఖ్యంగా మహిళలను విశేషంగా ఆకర్షించే భక్తి రస ప్రధాన చిత్రమిది," అన్నారు ఆర్. రామకృష్ణం రాజు. ఈయన సమర్పించే శ్రీనివాసా ఎక్సర్స్ వారి పై చిత్రంలో కె. ఆర్. విజయ, సుజాత, జయచిత్ర, సుమిత్ర, కల్పన, పవిత్ర, అనూరాధ, దేవి, రాజేష్, రమణమూర్తి నటించారు. శ్రీ చంచర్ సంభాషణల కర్త. కె. వి. మహదేవన్ స్వరకల్పనలో అప్పలాచార్య, ప్రకాష్ గీతాలు రాశారు. ఆత్మాచరణ్ సంకల్పనకర్త. శ్రీమతి రాధికారావు నిర్మించిన ఈ చిత్రానికి కె. ఎస్. గోపాలకృష్ణ దర్శకుడు.

"చందమామ రావే"లో కల్పన, చంద్రమోహన్



భవిష్యత్తులో అక్షరాభ్యాసం

-పి. ఎల్. నారాయణ



విజయదశమినాడు పిల్లలకు అక్షరాభ్యాసం చేసి బడిలో చేర్పించటం అనాదిగా వస్తూన్న ఆచారం కొంత కాలం పోయాక- అంటే, 40 పేజీల నోటు పుస్తక మొకటి 15 రూపాయలకు అమ్మే రోజు వస్తుందనుకుందాం అనుకోవడమేమిటి? తప్పకుండా వచ్చి తీరుతుంది అప్పుడు ఒక తండ్రి తన కూతుర్ని ఓ కాన్వెంట్‌లో యు కె జి. లో చేర్పడానికి తీసుకెళ్తాడు అక్కడ హెడ్ మిస్ట్రెస్‌కు ఆ అమ్మాయికి జరిగే సంవాదం ఇలా ఉండొచ్చు.

హెడ్ నువ్వు టి వి లో ఏ సినిమాలు చూస్తుంటావమ్మాయ్?

అమ్మాయి శనివారాలనాడు రాత్రి బాగా పొద్దు పోయు క వేస్తుంటారు చూడండీ ఆ సినిమాలే

హెడ్ మీ అమ్మగారికి వంట పనులలో సాయపడుతుంటావా?

అమ్మాయి మా అమ్మ ఎక్కడ వంట చేస్తుందీ? మా ఇంట్లో అన్ని పనులూ మా నాన్నగారే

హెడ్ నీ చెల్లాయితోగాని తమ్ముడితోగాని ఆడుకుంటుంటావా?

అమ్మాయి ఇప్పుడు అమ్మకింకా అయిదో మాసం పుట్టబోయేది తమ్ముడో చెల్లెలో అప్పుడే ఎలా తెలుస్తుందండి?

హెడ్ నువ్వు పాడగలవా?

అమ్మాయి ఏం? ఇప్పుడు పెళ్ళిచూపులకు ఎవరైనా వస్తారా?

హెడ్ నీకు తెలిసిన వారెవరైనా ఈ స్కూల్లో చదువుకుంటున్నారా?

అమ్మాయి బోలెడుమంది నా బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారిక్కడ

ఒక నోటు పుస్తకం 15 రూపాయలకు అమ్మే కాలమొచ్చేసరికి అప్పటి పిల్లల మాటల దోరణి ఇలా ఉంటుందేమో!

-(జి వి జి)

"మహారాజశ్రీ జేబుదొంగ"

ఆఖరి షెడ్యూల్ అక్టోబర్‌లో ' అన్నారు ఎ. కోదండరామిరెడ్డి ఈయన దర్శకత్వంలో ఎం. రామలింగరాజు నిర్మించే రోజా మూవీస్ వారి పై చిత్రంలో చిరంజీవి భానుప్రియ రాధ, సత్యనారాయణ గొల్లపూడి మారుతీరావు, రఘువరన్, రాళ్ళపల్లి సుదాకర్ శ్రీనివాస్, వీరబద్రరావు మాడా హరిప్రసాద్, శ్రీదుర్గ, అన్నపూర్ణ కుయిలీ గొరిల్లా పాల్గొంటున్నారు. గొల్లపూడి కథ సత్యానంద్ మాటలు వేటూరి పాటలు చక్రవర్తి సంగీతం, లోక్‌సింగ్ ఛాయ, బాస్కరరాజు శిల్పం తార నృత్యాలు అజయ్ కుమార్ సంయుక్త దర్శకత్వం వెళ్ళిస్వామి కూర్పుతో ఎం అర్జునరాజు సమర్పణ

'పెళ్లికొడుకులొస్తున్నారు"

'సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 15 వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ అన్నారు రేలంగి నరసింహారావు ఈయన దర్శకత్వంలో టి విజయ బాస్కరరెడ్డి నిర్మించే మానస ఆర్ట్ ప్రొడక్షన్స్ వారి పై చిత్రంలో కల్యాణ చక్రవర్తి హరీష్ చక్రవర్తి, కల్పన, సీత వై విజయ, ప్రబాకరరెడ్డి, కోట శ్రీనివాసరావు, వేలు వీరబద్రరావు బాలాజీ, డాక్టర్ శివప్రసాద్ శ్రీ లక్ష్మి వగైరా నటవర్గం పూసల

సినిమా

మాటలు, సి. నారాయణరెడ్డి పాటలు, వాసూరావు సంగీతం, పి. ఎస్. ప్రకాష్ ఛాయ, రాజగోపాల్





"భైభద్రకాళీ"లో కె. ఆర్. విజయ

కూర్పుతో టి సిద్ధారెడ్డి సమర్పణ ఈ చిత్రానికి కథను రేలంగి పూసల సమకూర్చారు డబ్బు చూసుకుని విర్రవీగే అత్తకు ఇద్దరు అల్లుళ్లు నేర్పే గుణపాఠం ప్రదానాంశం

"వేగుచుక్క - పగటిచుక్క"

అక్టోబర్ నవంబర్ నెలల్లో షూటింగ్ అన్నారు సత్యారెడ్డి ఈయన దర్శకత్వంలో సి హెచ్ రెడ్డి రామయ్య నిర్మించే శ్రీ గౌతమీ చిత్ర వారి పై చిత్రంలో అర్జున్ బానుచందర్‌ల సరసన శోబన అశ్విని నాయికలు నూతన్‌ప్రసాద్ గొల్లపూడి మారుతీరావు వేలు, మాడా ప్రకాష్‌రెడ్డి సాయి కిరణ్ కె ఆర్ విజయ శ్రీలక్ష్మి కల్పనారాయ్ బేబీ శాలిని ఇతర పాత్రదారులు సాంకేతికవర్గం గణేష్ పాత్రో రాజ్- కోటి దివాకర్ కుదరవల్లి నాగేశ్వర రావు ప్రకాష్- సురేఖ, హార్స్‌మన్‌బాబు పాండు, ప్రకాష్

శోభన్- మురళీ మోహనరావులతో శ్రీకృష్ణ ప్రసన్న ఎంటర్ ప్రైజెస్ చిత్రం

శోబన్‌బాబు ఇన్‌స్పెక్టర్‌గా అర్జున్ లాయర్‌గా నటిస్తున్నారు అన్నారు బి వి ఎస్ ఎన్ ప్రసాద్ ఈయన డ్రైవర్‌బాబు మకుటంలేని మహారాజు అనంతరం నిర్మిస్తున్న శ్రీకృష్ణ ప్రసన్న ఎంటర్ ప్రైజెస్ వారి తృతీయ చిత్రంలో శారద సుహాసిని రజని శరత్‌బాబు నూతన్ ప్రసాద్ రమాప్రబ వగైరా తారాగణం సెల్వరాజ్ కథకు పరుచూరి సోదరులు మాటలు రాశారు జొన్నవిత్తుల గీతాలను చక్రవర్తి స్వర పరిచారు కె ఎస్ హరి ఛాయ బాస్కరరాజు శిల్పం గిరిధర్ సంయుక్త దర్శకత్వం శివప్రసాద్ సహకార దర్శకత్వం, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో కె మురళీమోహనరావు దర్శకుడు

అక్టోబర్ 1 నుంచి నెలాఖరు వరకు నవంబర్‌లో పాచ్ వర్క్ ' అని దర్శకుడు తెలిపారు

శోబన్‌తో ఎస్ ఆర్ పిలిమ్స్ చిత్రం

తొలి షెడ్యూల్ అగస్ట్ 31 నుంచి ఎక్రం రోజులపాటు జరిగింది నవంబర్‌లో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు రేలంగి నరసింహారావు. ఎలిమ్స్ సంసారం చిత్రంలో శోబన్‌బాబు శారద, జయప్రద రాజేంద్రప్రసాద్ రజని రాజ్యలక్ష్మి, గొల్లపూడి మారుతీరావు సుధాకర్ హరిప్రసాద్, ప్రసాద్‌బాబు సాక్షి రంగారావు ఎంలక్ష్మి వగైరా. నటవరం సత్యానంద్ సంబాషణలకర్త రాజ్-కోటి స్వరకల్పనలో ఆత్రేయ జొన్నవిత్తుల గీతాలు రాశారు శరత్ ఛాయ కె పెద రామలింగేశ్వరరావు శిల్పం శీను నృత్యాలు కె రామసూరి సంయుక్త దర్శకత్వం ఎన్ వెంకటేశ్వరరావు ప్రొడక్షన్ డి. వెంకటరత్నం కూర్పు నిర్వహిస్తున్నారు

యు వి సూర్యనారాయణబాబు చిత్రాలు

జయవిజయ మూవీస్ పతాకంలో తయారయ్యే మాయల మరాఠీ సాంఘిక చిత్రానికి పి. చంద్రశేఖర రెడి దర్శకుడు రమేష్‌తో సెప్టెంబర్‌లో సెట్స్‌కు వెళ్తుంది


అక్టోబర్‌లో ప్రారంభమై మూడు షెడ్యూల్స్‌తో డిసెంబర్‌లో ముగిసే పద్మావతి ఎలిమ్స్ 1వ చిత్రంలో రమేష్ సరసన రజని నాయిక ఎ. కోదండరామి రెడ్డి దర్శకుడు.

శ్రీదేవి, మిథున్ చక్రవర్తి నాయికా నాయకులుగా జనవరిలో సెట్స్‌కు వెళ్లే హిందీ చిత్రానికి కె. బాపయ్య దర్శకుడు.



"కాంచన సీత"లో రఘువరన్, జయసుధ

తారల బొమ్మల కొలువు







కృష్ణతో కె వి వి సత్యనారాయణ చిత్రం

ఓ విచిత్రమైన రౌడీ పరిస్థితుల ప్రభావంతో మంచి రౌడీగా మారే ఎన్నో మలుపులు గల కథ విజయదశమినాడు పూజ అక్టోబర్ 9–20 నవంబర్ 11–20 డిసెంబర్ 1–10 షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు కె వి వి సత్యనారాయణ ఈయన శాలామినీ క్రియేషన్స్ పతాకంలో నిర్మించే చిత్రంలో కృష్ణ రాధ శారద మోహన్‌బాబు గొల్లపూడి మారుతీరావు నూతన్ ప్రసాద్ వై విజయ ఆదిగాగల వారు పాలొంటారు పరుచూరి సోదరుల రచన రాజ్– కోటి సంగీతం రఘు నృత్యాలు కె నాగేశ్వరరావు నిర్వహణతో ఎస్ ఎస్ రవిచంద్ర దర్శకుడు

రమేష్ సామ్రాట్ త్వరలో

కృష్ణ సమర్పణలో ఆయన పుత్రుడు రమేష్ పరిచయం గావింపబడే పద్మాలయా స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పై చిత్రం అతి త్వరలో విడుదలవుతుంది ఊటీ మైసూర్ బెంగుళూరు హార్సిలీ హిల్స్ హైదరాబాద్ మద్రాసు ప్రాంతాలలో షూటింగ్ జరిపాం రీరికార్డింగ్ బొంబాయిలో జరిగింది కొన్ని ప్రింట్‌లను 70 ఎం ఎం లోకి కూడా బ్లో అప్ చేస్తున్నాం అన్నారు జి హనుమంత రావు ఈయన భారీ ఎత్తున నిర్మించిన పై చిత్రంలో రమేష్ సరసన హిందీ అందాల తార సోనమ్ నాయిక శారద రంగనాథ్ నూతన్‌ప్రసాద్ రాజేష్ పద్మనాభం మాడా కృష్ణవేణి ఇతర పాత్రధారులు– పరుచూరి సోదరుల సంభాషణలు బప్పీలహరి సంగీతం వి ఎస్ ఆర్ స్వామి ఛాయ సలీం- రఘు నృత్యాలు బి చలం శిల్పం రాజు సాహసాలు కోటగిరి గోపాలరావు కూర్పు జి ఆదిశేషగిరిరావు నిర్మాణ సారథ్యంతో వి మధుసూదనరావు దర్శకుడు

శోభన్‌బాబు కోడి రామకృష్ణలతో కందేపి సత్యనారాయణ చిత్రం


డిసెంబర్‌లో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు కోడి రామకృష్ణ ఈయన కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో రాఘవేంద్ర ఎన్ క్రియేషన్స్ అధినేత కందేపి సత్యనారాయణ నిర్మించే 4వ చిత్రంలో శోభన్‌బాబు రాధ సత్యనారాయణ గొల్లపూడి మారుతీరావు రాజా రాళ్ళపల్లి వై విజయ అన్నపూర్ణ పాత్రధారులు గణేష్‌పాత్రో మాటలు రాజ్–కోటి సంగీతం సురేష్ ఛాయ కళాధర్ శిల్పం జనార్ధనరెడ్డి– రామ సుజం సహకార దర్శకత్వం గాడి సత్యం– వేణు ప్రొడక్షన్ కె సత్యం కూర్పు నిర్వహిస్తున్నారు □

1 రమ్యకృష్ణ

2 జీవిత

3 జీవిత తాంబూలం తీసుకుంటున్న చెల్లెలు

ఫొటోలు: ఈశ్వర్



శతచిత్ర నటి సుమలత

సమాధానాలు!

ఎం సుబ్బారాయుడు ద్రాక్షారామ

ప్ర శివునికిమల్లే మనకూ మూడు కళ్ళూ ఉంటే?

జ అప్పుడు కళ్ళజోడుకు అదనంగా మరో అద్దం తగిలించుకోవలసి ఉండేది

దాసు మహోబలరావు, విశాఖ - 2

ప్ర సుమలతగారూ! జీవితమంటే చావు పుట్టుకలేనా?

జ కాదు, ఆ చావు పుట్టుకల మధ్య ఉన్న ఇంటర్వెల్

గురవప్పశెట్టి, తాడిపత్రి

ప్ర మీ నటన అంటే నాకెంతో ఇష్టం మీరు నటించిన ప్రతి చిత్రాన్నీ విదిగా చూస్తుంటాను వీటిని బట్టి చూస్తే పూర్వజన్మలో నేను మీ సోదరుడినేమో అనపిస్తుంది ఏమంటారు?

జ ఏం? ఈ జన్మలో మాత్రం కాదా?

ర్యాలి ఉమాపతి, ఖమ్మం

ప్ర సుమలతగారూ! ఆలోచన యనెడి వారధికి ఆనకట్ట ఏమిటి?

జ తృప్తి

కె రాజేశ్వరి, కనిగిరి

ప్ర సిస్టర్! దేవుని ఊరేగింపు వస్తే సమీపంగా ఒక్క స్టూడెంటైనా కనిపించడు గాని ఒక్క సినిమా తార వస్తే చాలు ఎంతో మంది గుమికూడుతారు ఎంచేత?

జ దేవుడు ఆటో గ్రాఫ్‌లు ఇవ్వడుగా!

కడలి దీనదయాళ్, మడకశిర

ప్ర భగ్న ప్రేమికుడు జీవితాంతం వ్యాకులతతో క్రుంగి కృశించి పోవలసిందేనా?

జ జీవితం ఒక మహాసముద్రం లాంటిది అందులో భగ్నప్రేమ ఒక నీటి బొట్టు మాత్రమే

నిష్టల రామశాస్త్రి, పర్లాకిమిడి

ప్ర నల్లకోడి తెల్లగుడ్డు పెడుతుంది ఎంత విచిత్రం!

జ మీ పేరును బట్టి చూస్తే, మీరు బ్రాహ్మలనిపిస్తోంది మీరు కోడి గుడ్డు ఊసెత్తడం ఎంత విచిత్రం!

పి శ్రీకంఠయ్య, హోసూరు

ప్ర సినిమా తారలకు తమ సోపులు అందమిస్తాయని కొన్ని కంపెనీల వారు ప్రకటన లిస్తూంటారు మరి హీరోలకు ఏ సోపులు అందమిస్తాయి?

జ షేవింగ్ సోపులు!

కె నవనీతరాజు, బరంపురం

ప సుమలతాజీ! కత్తి పోటా? కలము పోటా?

జ కలమే పోటని విజ్ఞుల అభిప్రాయం అది వమ్మని గూండాలు నిరూపిస్తూంటారు

వల్లూరి ప్రతాపరావు, రాయచోటి

ప్ర ఏదైనా ఒక చిత్రాన్ని బాగా విమర్శించిన వారినే అదే చిత్రమునకు దర్శకునిగా నియమించిన ఆ చిత్రము ఎట్లుండును?

జ మరికొందరి విమర్శలకు గురి అవుతుంది

సి. వరదరాజులు, రాజంపేట

ప్ర : సినిమాలు చూడడం వల్ల కొందరు పేదవాళ్ళ కొంపలు గుల్లలవుతున్నాయి. అటువంటప్పుడు సినిమాలను ప్రభుత్వం ఎందుకు నిషేధించ కూడదు?

జ : పెళ్ళిళ్ళ వల్ల కూడా కొన్ని పేద కొంపలు గుల్లలవుతున్నాయి. మరి, పెళ్ళిళ్ళను కూడా నిషేధించాలంటారేమో మీరు!

ఎం. పి. జ్యోతి, కంకిపాడు

ప్ర : జీవితంలో ప్రతి స్త్రీకీ ఉన్న ధర్మం ఏమిటి? తన స్వార్థమా భర్త సేవయా?

జ భర్త సేవే ఆమె స్వార్థం

వి శకుంతలారెడ్డి, మడకశిర

ప్ర ఆలస్యం అమృతం విషం నిదానమే ప్రదానం ఏది పాటించడం మంచిది?

జ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం

బెందు దనకోటి బొల్లారాం

ప్ర పితృవాక్య పరిపాలకుడై మాతృహంతకుడైన పరశురాముడు గొప్పా లేక పితృవాక్య దిక్కరియై శ్రీమన్నారాయణుని చూడగల్గిన ప్రహ్లాదుడు గొప్పా?

జ పరశురాముడే ఎంచేతంటే, ఆ తర్వాత తన తల్లిని బ్రతికించుకో గలిగాడు కాని ప్రహ్లాదుడు తన తండ్రి చావును తప్పించలేకపోయాడు అవునంటారా? □

గమనిక

ఈ వారం ఉత్తమ ప్రశ్నగా ఏదీ ఎంపిక కాలేదు —సం

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సుమలత సమాధానాలు

ప్రశ్న

పంపినవారి పేరు

పూర్తి చిరునామా

మార్పు.

జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

చీకటి పడింది

వీధి దీపాలు వెలిగాయి!!

నిరంజన శాస్త్రిగారిల్లు – సందడిగా – పిల్లల కేరింతలతో కళకళలాడుతున్నది

అయన మాత్రం గదిలో ట్రంకు పెట్టె దగ్గిర కూర్చుని – పంచెల్ని – చీరెలని లెక్క పెడుతున్నాడు ఎవరెవరికి ఏంవేవి పెట్టాలో మనసులో నే నిర్ణయించుకుని – తీసి విడిగా పెట్టుకుంటున్నాడు అయన వెనకగా అలికిడైంది తలతిప్పి చూశాడు చేతులు కట్టుకుని భయంగా చూస్తున్న కొడుకు మురళి కన్పించేడు

'వెళ్ళి వచ్చావా' గంభీరంగా అడిగేడాయన

తలవూపి వెళ్ళాను ఇంకా చౌదరిగారు రాలేదట దారిలో వాళ్ళ పాలేరు కనబడి చెప్పాడు అన్నాడు మురళి బయంగా

మురళికి తండ్రి అంటే ఎనలేని బయం ఎదురుపడి అసలు మాట్లాడటం ఎరుగడు తండ్రి ఏంవంటాడో నన్న బెంగపడుతున్న మురళి – వాళ్ళింటికి వెళ్ళి కనుక్కోకబోయావా? ఇంట్లో ఏంవన్నా చెప్పారే మోనన్న తండ్రి సాత్విక మాటలకి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు ఆశ్చర్యమూ వేసింది అసలు అయన నోటి నుంచీ రావల్సిన మాటలు – ఏం ఇంటిదాకా వెళ్ళి రాలేక పోయావా? అంత బద్ధకంగా వున్నదా? కండలు కరుగుతాయన్న బయమా అంటూ రంకెలు వేయాల్సింది అంత వేగంగా వుంటుంది అయన మాట

అదీ కనుక్కున్నాను ఇంట్లో వాళ్ళకీ ఏంవీ చెప్పలేదట అసలు ఎప్పుడు వస్తారో కూడా తెలియదట అన్నాడు కూడదీసుకుని మురళి

నిరంజన శాస్త్రిగారు చిన్నగా నవ్వేరు బయం లేదులే చౌదరిగారు మాటతప్పే మనిషి కాదు పైగా మనమంటే చాలా అభిమానం ఏదో ఇబ్బంది వచ్చి రావటం అలస్యం చేసి వుంటాడు లాస్ట్ బస్‌కి ఖాయంగా వస్తాడు ఇంకా చాలా సేపు టైముందిగదా! మనం బయపడాల్సిన పనిలేదు ఈ లోపు పెళ్ళి వార్కి ఏమి కావాలో చూస్తూ వుండు అంటూ మురళిని హెచ్చరించి సాగనంపేరు తిరిగి తనపనిలో నిమగ్నమైనారాయన

నిరంజన శాస్త్రి గారు అవూళ్ళో పురోహితుడు ఛంద శాసనుడు ఇంట్లో అయన మాటకి ఎవరూ ఎదురాడరు అంత బయం అయనంటి వున్నంతలో లోటు లేకుండా సంసారం వెళ్ళదీస్తున్నారు చాలా ముక్కు సూటి మనిషని అయన్ని గౌరవిస్తారు అవూళ్ళో వాళ్ళు చివరికూతురు పెళ్ళి చేస్తున్నాడాయన పెళ్ళి వారికి ఇవ్వ వలసిన కట్నంకి గాను చౌదరిగారిని అప్పు అడిగేడు చౌదరిగారు ఇస్తానని గట్టిగా చెప్పాడు కానీ ఏదో పనిమీద పట్నం వెళ్ళాడాయన ఇంకా తిరిగిరాలేదాయన పెళ్ళివారు మాత్రం వచ్చి విడిదిలో దిగారు

* * * * *

రాత్రి ఎనిమిది గంటలవేళ–

పెళ్ళివారు భోజనాలకి తరలి వచ్చేరు తెల్లవారు ఝాము ముహూర్తం కావటంతో ముందుగా వాళ్ళు రావటంతో– మూడు పూటలభోజనాలు తప్పలేదాయనికి ఇల్లంతా హడావిడిగా వుంది వడ్డనలు చేస్తున్నారు

భ్రమరాంబగారు భర్త దగ్గరగావచ్చింది పమిట చెంగుకి చేతులు తుడుచుకుంటూ– వాళ్ళ వాళ్ళందరూ వచ్చేరు వియ్యంకుడు –వియ్యపురాలు మాత్రం రాలేదు మీరు వెళ్ళి పిలిచిరండి చెప్పిందామె వాళ్ళు రాక పోవడానికి కారణం బోధపడిందాయనకి మురళిని పిలిచి చౌదరి గారింటికి మరో సారి వెళ్ళిరమ్మంటూ పురమాయించి – తను విడిదికి బయలు దేరాడు వియ్యపురాలిని, వియ్యంకుడ్ని పిలిచి రావటానికి

నిరంజనంగారు వెళ్ళేటప్పటికి వియ్యంకుడు– వియ్యపురాలు – అయన్ని చూసి ముభావంగా తలతిప్పుకున్నారు వాళ్ళ ముభావానికి కారణం అయనకి తెలియంది కాదు

భోజనాలకి రండి బావగారు కాలాతీత మవుతోంది మరీ పొద్దు పోతే అరగదాయె తెల్లవార్లు మెలుకువతో వుండాల్సిన వాళ్ళు రండి అంటూ గుంబనగా ఆహ్వానించేడు

భోజనాల దేంవుంది అన్నయ్యగారు! మాకు పెద్దగా అకళ్ళు కూడా లేవు ముందుగా మనం అనుకున్న ప్రకారం కానిస్తే బాగుంటుంది అంది వియ్యపురాలు వర్ధనమ్మ సూటిగా

దాని దేంవుంది చెల్లమ్మా అలాగే ఇప్పుడు కాకపోతే మరో గంటలోనైనా ఇస్తాను మాట మాటేకదా ఇస్తానన్నాయన వూరు వెళ్ళాడు అబ్బాయిని కబురంపించేను రాగానే ఇస్తాను నేను, మాటకి కట్టుబడే మనిషిని మీకు తెలియనిదేం వుంది నాగురించి నేను చెప్పుకోవటం స్వకుచ మర్ధన యవుతుంది అన్నాడు ఎంతో ధీమాగా

అయనకి లోపల భయంగానే వుంది చౌదరిగారు రాకపోవటం ఒక కారణమైతే – మరో కారణం వర్ధనమ్మ కూతురి పెళ్ళికి తను చేసిన గలాటా

తొమ్మిది గంటలు దాటుతోంది ఒక ముద్ద ఎంగిలిపడి లేచారంటే కొంచెం సేపు విశ్రాంతి తీసుకోవచ్చు రండి బయలుదేరండి తొందర చేశాడాయన

ఇక లేవక తప్పలేదు వాళ్ళకి పైగా వియ్యంకుడు కూతుర్ని ఆ ఇంటి కోడలిని చేశారు రేపు బవిష్యత్తులో పిల్లని దెప్పుతారేమోనని బయలుదేరారు

భోజనాలకి వాళ్ళకి ప్రత్యేకంగా వడ్డన చేయించి – మురళి రాకకోసం ఎదురు చూస్తూ అసహనంగా గదిలో పచార్లు చేస్తున్నాడాయన

మురళి వచ్చేడు

అయన రాలేదు కానీ టెలిగ్రాం వచ్చిందట మరో వారంరోజుల్లో తిరిగి వస్తానని ఏదో అర్జంటు పనిబడిందని, కంగారు పడవద్దని ఇంటికి టెలిగ్రాం ఇచ్చేడట చావుకబురు చల్లగా చెప్పాడు మురళి

నిరంజన శాస్త్రిగారు వణికి పోయారు శరీరం ఒక్కసారిగా చల్లబడ్డట్లనిపించింది మెదడు మొద్దు బారి పోయింది ఇప్పుడేవి చెయ్యాలో అర్ధంగాలేదాయనకి

తను చౌదరిగారి మీద ఎంతో ఆశపెట్టుకున్నాడు తన ఆశనిరాశైంది మరో మార్గమేదీ తట్టలేదు ఈ పరిస్థితిలో తనేం చేయాలి? తర్వాత ఇస్తానంటే పెళ్ళివారు ఒప్పుకుంటారా? పొరపాటున కూడా ఒప్పుకోరు తన పరువు బజారు పాలె తనని ఎన్నివిధాల అనాలో – అవమానపర్చాలో –అన్ని విధాల తనని చిత్రహింసలు చేస్తారు గతంలో తన మీద వున్న కక్షనంతా ఇప్పుడు తీర్చుకుంటారు

నిరంజనంగార్కి బయమేసింది అసలు వాళ్ళకి ఈ విషయం ఎలా తెలియబర్చాలో ఎలా ఒప్పించాలో అర్ధంగాలేదాయనకి

అరగంట క్రితం తనెంతో దీమాగా చెప్పి వచ్చేడు గంటలో సర్దుతానని విశ్వనాదం నోరు మెదపక పోవచ్చుగాని– వర్ధనమ్మ మాత్రం వూర్కోదు నానాయాగీ చేస్తుంది పెళ్ళి పీటల మీద నుంచీ కొడుకుని తీసుకుని వెళ్ళి పోతుంది కూడా అంతటి మటికురాలామె మరి తనిప్పుడు ఏంవిచెయ్యాలి? ఎలా? ఎలా? అసహనంగా నుదురు రుద్దుకున్నాడాయన

తండ్రి పడుతున్న మధన చూసి – అన్నయ్యని పిల్చుకు వస్తానని వెళ్ళాడు మురళి

మురళి వెళ్ళిన దిక్కుకేసి చూస్తూ విషాదంగా నవ్వుకున్నాడాయన తనలో తానే గొణుక్కున్నట్లుగా అనుకున్నాడు వాడివల్ల ఏంవవుతుంది వాడివల్ల ఏంవీకాదు వాడు కూడా తన మీద కక్షగట్టాడు ఆరోజున వాడి పెళ్ళిలో తను చేసిన గొడవ వాడి మధ్య – తనమధ్య అంతులేని దూరం పెంచింది అందుకే వాడు నామ తహః వచ్చేడు వంటరిగా – భార్యని తీసుకురాకుండా? అసలు వీడు తీసుకువచ్చేదేంవిటి? ఆ అమ్మాయే రానని వుంటుంది తన మీద ఆమెకి పీకలదాక కోపం – ద్వేషం అందుకే రాలేదు"

భ్రమరాంబగారు గదిలోకి వచ్చింది వాళ్ళ బోజనాలు అయినాయి విడిదికి వెళ్ళారు మిమ్మల్ని

ఒక పరిరమ్మని చెప్పారు అంది చేతిలోని తమలపాకుల ట్రేని బల్లమీద వుంచి

రమ్మంటారు – ఇప్పుడు వాళ్ళది అవకాశం

అవకాశాల సంగతి ఎలా వున్నా – వెళ్ళిరావటం మన విదాయకం అందామె ఒప్పుగా ఆమెకి అసలు విషయం తెలియదు

విదాయకమే! అసలైన అర్థమే చేతికి అందలేదు వాళ్ళు కబురు చేసింది అందుకే అసహనంగా అన్నారాయన

మరిప్పుడెలా అందామె భయంగా


అదే అర్థంగాక చస్తున్నాను తల కొట్టుకున్నారాయన

అందుకే ముందు చెప్పాను మీకు ఈ కుండమార్పిడి వద్దండి అని విన్నారా? వేరే ఏదన్నా బయట సంబంధం చూడమని చెప్పాను. బైట వాళ్ళైతే ఎలాగోలా కాళ్ళున్నా పట్టుకునే వాళ్ళం ఇప్పుడు వీళ్ళు వింటారా మనమాట పెద్దాడి పెళ్ళికి మనం చేసిన అల్లరి, వీళ్ళు చెయ్యరు ఇప్పుడు? ఆరోజున అవకాశం వుంది గదాఅని ఏడిపిస్తారి ఇప్పుడు పీటల మీద పెళ్ళి ఆగిపోతే ఎంత అభాసుపాలు అవుతాము అసలు ఈ జన్మలో ఇక దానికి పెళ్ళి అవుతుందా? భ్రమరాంబగారి కళ్ళనుండి జలజలా నీళ్ళు రాలాయి ఆమె కంఠంలో పెళ్ళి ఆగిపోతుందేమోనన్న బెంగధ్వనించింది

అనండో! అనండి! అందరికీ లోకువ నేనేకద నాదే తప్పు అంతేగా మీ అందరి అభిప్రాయం ఆ రోజున అలా చేస్తేగాని పెద్ద పిల్లని ఓ ఇంటిదాన్ని చెయ్యలేక పోయాము అర్థం చేసుకోవటం పోయి-నిందించటం ఎక్కువైంది అంతా నా ఖర్మ బాధగా నొసలు ముడివేస్తూ అన్నారాయన

కొద్దిసేపు ఇద్దరి మధ్య మౌనం తాండవించింది

నిందలు అనిగాదు! మనలో మనం తర్కించుకోటం గాదు! ముందు వెళ్ళి వాళ్ళకి నచ్చచెప్పండి ఎలాగోలా ఒడ్డున పడే మార్గం చూడండి అంత్య



నిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలన్నారు అవసరమైతే కాళ్ళ మీద పడి బ్రతిమలాడుకుందాం రండి అంటూ బర్తకి ధైర్యం చెప్పింది

ఉభయులు విడిదికి వెళ్ళారు అందరూ జంపఖానా మీద పడి నిద్రపోతున్నారు దారి చేసుకుని వియ్యపురాలి వద్దకు వెళ్ళాడునిరంజనం గారు

ఆయన్ని చూడగానే లేచి కూర్చుంది వర్ధనమ్మ గారు బర్తను లేపింది మాకు తెల్సు' అన్నయ్య గారు మాటమీద నిలబడే మనిషి అని నవ్వుతూ అన్నదామె

కొద్దిక్షణాలు తటపటాయించేడు నిజమేనమ్మా' ఇంతవరకూ మాట మీద నిలబడే లాక్కువచ్చాను ఈసారీ కాస్త ఆటంకాలు ఏర్పడ్డాయి అందుకే క్షమార్పణలు చెప్పుకుందామని – బ్రతిమలాడుకుందామని వచ్చాను అన్నాడు

చాలు చాలు ఇంతకీ అసలు విషయం చెప్పండి కరుకుగా అడిగింది వర్ధనమ్మ

విషయం ఏంవిటంటే ఇస్తానన్నాయన వూరినుంచీ రాలేదు కొంచెం అర్థం చేసుకుని నన్ను గట్టెక్కించండి అందాకా నోటు రాసిస్తాను వుంచండి జాలిగా అడిగారాయన

నోటు ఎందుకండి – తగుల బెట్టనా కరినంగా అన్నాడు విశ్వనాదం గారు

నిరంజనం గారికి చెళ్ళున కొరడాతో చరిచినట్లైంది తన మాట తనకే అప్ప చెప్పారు ఆరోజున కట్నం డబ్బులో నాల్గు వేల రూపాయలు తగ్గినందుకు నోటు రాసిస్తానన్నందుకు – తను ఇదేమాట అన్నాడు

వీల్లేదు' కట్నండబ్బు చేతిలో పడందే ఈ పెళ్ళి జరగదు ఖరాఖండిగా చెప్పింది వర్ధనమ్మ

అలా కాదు వదినగారు' కొంచెం పెద్ద మనసుతో ఆలోచించండి ఇప్పుడు మీరు కాదని వెడితే పిల్ల బ్రతుకు ఎమవుతుంది మా తప్పుని క్షమించండి ఆ రోజున అలాగ ప్రవర్తించటం మా తప్పు మీ కాళ్ళు పట్టుకుంటాము మా పిల్ల బ్రతుకు అన్యాయం చేయవద్దు మేము మీ బాకీ తీర్చేంత వరకూ మా పిల్లని మీ పని పిల్లగానే చూడండి అంతేగాని – పెళ్ళి ఆపి– దాని గొంతు కోసి – నూరేళ్ళ జీవితాన్ని బలిచేయకండి' ఏడుస్తూ వర్ధనమ్మ చేతులు పట్టుకుంది భ్రమరాంబగారు

వర్ధనమ్మ భ్రమరాంబగారి చేతుల్ని విదిలించింది

అందరూ లేచి వింత తిలకిస్తున్నారు

విశ్వనాదంగారి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని బ్రతిమలాడేరు నిరంజనంగారు బావగారు అర్థిస్తున్నాను పెద్ద మనసుతో ఆలోచించండి మీరు చేసే ఈ మేలుకి జీవితాంతం కృతజ్ఞుడిగా పడి వుంటాను బోరుమని ఏడ్చేడు ఆయన

మీవూరికి మావూరెంత దూరమో– మావూరికి మీవూరు అంతేదూరం నిరంజనంగారు ఆరోజున కేవలం నాల్గువేల రూపాయలకి ఎంత అల్లరి చేశావో – అప్రతిష్ఠపాలు చేశావో– గుర్తు తెచ్చుకో! ఆ రోజున మేము అనుభవించిన బాధ –



మాతా! మహిషాసురమర్ధని

(చిత్రం వెల్లటూరి పూర్ణానంద శర్మ)

'దేవీ వందనం'

మహిషుని వధియించి
మదంబుని అణిచావు
మహిషాసుర మర్ధనివై
మదిలోన నిలిచావు

శంభు నిశుంభుల నణచి
శాంతంబు సృష్టించావు
శాంభవివై సృష్టికే
సౌందర్యలహరి వైనావు

దుష్ట శిక్షణా కరి శిష్ట రక్షణా కరి
శ్రీకరి శుభకరి శంకరి ప్రియకరి
అభయంకరీ వందనం
అష్ట ఐశ్వర్య ప్రదాయినీ అభివందనం

దేవీ! నవరాత్రి వైభవ మోహినీ
విజయదశమి విశ్వ జగన్మాత
విజయ మహేశ్వరీ వందనం
శ్రీ శక్తి స్వరూపిణీ అభివందనం!

- లక్కరాజు ప్రఫుల్లచంద్ర

మార్పు

మా గుండెల్లో రగిలిన రంపపు కోత ఈ రోజు నువ్వు అనుభవించవల్సిందే మేము పడిన క్షోభ నీవూ పడవలసిందే ఆవేశంగా అన్నాడు విశ్వనాథంగారు

నిజమే – ఆ రోజు తప్పుచేశాను మిమ్మల్ని క్షోభ పెట్టాను ఎందుకో తెల్సా మరో పిల్ల కన్నెచెర విడిపించటానికి అంతేగాని స్వార్థంతో కాదు కొడుకునమ్ముకుని – అల్లుడ్ని కొనుక్కున్నాను నన్ను – నా పరిస్థితిని అర్థం చేసుకోండి మగపెళ్ళి వారమనే అహంకారంతో చేయలేదాపని నా బాధ్యత నన్ను అలా ప్రేరేపించింది అయినా నాది తప్పేనని వొప్పుకుంటున్నాను మీరేశిక్ష విధించినా భరిస్తాను నేను నా పిల్లకి మాత్రం అన్యాయం చేయకండి ఏడ్చాడు నిరంజనంగారు

అప్పటిదాక మౌనంగా వున్న పెళ్ళికొడుకు శ్రీదరం అన్నాడు మావయ్యగారు' బాధపడకండి' ఈ పెళ్ళి జరుగుతుంది నేను చేసుకుంటాను నాకు కట్నం డబ్బుతో నిమిత్తంలేదు నాకు కావలసినదల్లా మీ అమ్మాయి ఈ దేశంలో 'చాలామంది ప్రస్తుత పరిస్థితి ఇలానే వుంది కట్నాల మండలాన్ని అందుకోలేక తగిన ఆర్థిక స్థోమత లేక కొడుకు నమ్మి అల్లుడ్ని కొంటున్నారు ఎందుకు' ముఖ్యంగా మా యువతరంలో మార్పు రాకపోవటం కారణం అందుకే ఈ క్షణంలో నేనొక నిర్ణయానికి వచ్చాను నానుంచే మార్పును ప్రారంభిస్తాను మా యువతలో మార్పుకి నేనే మొదటి వాడినవుతాను శ్రీకారం చుడతాను పదండి నిశ్చింతగా వెళ్ళి కావలసిన ఏర్పాట్లు చూడండి అన్నాడు కృతనిశ్చయంతో అనునయంగా నిరంజనంగారితో


నీళ్ళు నిండిన కళ్ళతో ఆప్యాయంగా చూశాడు శ్రీదరం వంక నిరంజనంగారు

అమ్మా' నాన్నా'' పెద్దలుగా వచ్చి ఆశీర్వదించి మీ గౌరవం నిలబెట్టుకోండి మీరు కాదన్నా బ్రతిమిలాడినా విదిలించినా నా నిర్ణయం మారదు

అయితే మా శవాలే చూస్తావు రోషంగా అంది వర్ధనమ్మ

చిన్నగా మందహాసం చేశాడు శ్రీదరం మంచిది' నేను ముందే చెప్పాను నా నిర్ణయంలో మార్పు వుండదని వయసు వుడిగినవాళ్ళు మీరు రేపో మాపో రాలిపోక తప్పదు మేమా వయసుకు చిన్నవాళ్ళం మరికొంతకాలం బతికేవాళ్ళం మాకు ముందు ముందు ఎంతో జీవితం వుంది రేపో మాపో రాలిపోయే మీ కోసం మా బ్రతుకుల్ని నాశనం చేసుకోలేం కల్సి నూరేళ్ల జీవితం సాగించాల్సిన మేము మీ ధన దాహంకి అధికార ఉన్మత్తతకి తల వంచం ఈ వృద్ధాప్యంలో మా నీడన సేద తీర్చుకోవాలంటే చివరి క్షణాల్లో ప్రశాంతంగా హాయిగా కాలం వెళ్ళబుచ్చుకోవాలంటే మీరు రాజీపడవలసింది రేపు మేమయినా అంతే మా పిల్లల నిర్ణయాలకి తల ఒగ్గుతాం కొత్త నీటికి పాతనీరు తల వంచవలసిందె తప్పదు ఇదే ఇక నుంచీ లోకం తీరు మీ ఇష్టం అనైన పెళ్ళి పందిరికోసి నడిచేడు శ్రీధరం ఎంతో హాయిగా సంతోషంగా

వెళుతున్న కొడుకు వంక పాలిపోయిన ముఖంతో చూస్తున్న వర్ధనమ్మని కుదిపి తప్పదు యువతరంలో మార్పు వచ్చింది వాళ్ల ననుసరించవలసిన వాళ్ళం మనం' పద బయలుదేరదీశాడామెని విశ్వనాదంగారు □



పూర్తి వివరాలకై మీకు దగ్గరలోని న్యూ ఇండియా కార్యాలయానికి విచ్చేయండి
లేదా ఏజెంటును కలవండి.

నష్టాలలో మీకు నమ్మకమైన ఆధారం — భీమా !

న్యూ ఇండియా ఎష్యూరెన్స్

(జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ)

క్రొత్త శీర్షిక ప్రారంభం

మన సంస్కారాలు విశేషాలు

–ఖండవల్లి సూర్యనారాయణ శాస్త్రి



మన సంస్కారాలు – విశేషాలు రచయిత శ్రీ ఖండవల్లి సూర్యనారాయణ శాస్త్రి గారు వేదపండితులు సాహితీ వేత్త వీరు కాళిదాసు జగన్నాథ పండితరాయలు పోతనలపై విమర్శనాత్మక రచనలనేకం తెలుగు సంస్కృత భాషలలో చేసారు అనేక సాహిత్య సంస్థలలో సభ్యులుగా ఉన్న వారు సంస్కృత భాష హైందవ సంస్కృతి ధర్మాల వ్యాప్తికి అంకితమైనారు శ్రీ శాస్త్రి గారు తూ గో జిల్లాలోని ముంగండలో 1914 ఆనంద ఉగాది నాడు ఒక సంప్రదాయ కుటుంబంలో జన్మించారు వీరి తండ్రి శ్రీ రామమూర్తి గారు కర్మిష్ఠ కులపతి వారివద్ద సంస్కృతం అభ్యసించడానికి మైసూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి శిష్యులు వస్తూ ఉండేవారు

శ్రీ శాస్త్రిగారు తెలుగులో కాళిదాస వ్యాసపీఠము భక్త పోతన– మహా భాగవత రచన సంస్కృతంలో కాళిదాస కావ్య సౌరభం పండితరాజ జగన్నాథ మహాకవి గ్రంథాలు రచించారు అమరవాణి ప్రసంగాల ద్వారా ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితులు ఎన్నో సాహితీ సంస్థలు వీరిని సత్కరించారు ముంగండలోని శ్రీ జగన్నాథ పండిత రాజ పీఠం అధ్యక్షులుగా ఉన్నారు


"సంస్కారాలు అనగా జాతకర్మ ఉపనయనం వివాహం వంటివి ఇవి మానవులకు సంస్కారమును అనగా సద్భావన సత్ప్రవర్తన సచ్ఛీలాదులను కలిగించే శాస్త్రీయ ప్రక్రియలు ఇట్టి సంస్కార క్రియలను ఆచరించడం చేతనే బాలబాలికల దేహేంద్రియ మనో బుద్ధులలో దాగి ఉన్నఉత్తమ శక్తులు క్రమంగా పైకి వికసిస్తాయి ఇట్లు ఆ క్రియలు వారిని అచిరకాలంలో భావి భారత పౌరులుగాను ఉదార భావనా భాసితులుగాను తీర్చి దిద్దుతాయి సంస్కార శబ్దవ్యుత్పత్త్యర్థం కూడా ఈ విషయాన్నే విశదం చేస్తుంది

సంస్క్రియంతే ఏ భిరితి సంస్కారాః


సంస్కారాలు అనే శాస్త్రీయ క్రియలు బాలబాలికలలో అంతవరకూ ఉన్న దోషాలను దుష్టశక్తులను దూరం చేసి అంతకు ముందు వారిలో లేని క్రొత్త గుణాలను శక్తులను ప్రవేశపెట్టి తద్వారా వారి నవి సంస్కరిస్తాయి అనగా బాగు పరుస్తాయి కనుక సంస్కారాలు అనే పేరు ఆ శాస్త్రీయ క్రియలకు చక్కగా సమన్వయించి సార్థక మయింది

ఇంక ఈ సంస్కారాలనేవి అంతకు ముందు ఉపయోగంలో లేని రత్నధాన్యాది వస్తువులను కూడా బాగుపరచి వాటిని మానవుల నిత్య జీవితంలో ఎలా ఉపయోగం లోనికి తెస్తున్నాయో ఇక తెలుసుకుందాం

లోకంలో ధాన్యం అనేవి ధాన్యపుకళలో ఉన్నంతవరకు అవి మనకు ఆహారంగా ఉపయోగించడానికి గాను వాటికి కొన్ని సంస్కారాలు అనగా బాగు సేతలు అంటే వరి ధాన్యం కోసికొట్టి ఎగరబెట్టి మిల్లులో బియ్యం చేసే వంటడం వంటి సంస్కారాలు తప్పక చెయ్యాలి అప్పుడే ఆ ధాన్యం బియ్యంగామారి ఆహారంగా మనకు ఉపయోగిస్తాయి ఇట్లే రత్నాలు బంగారం వంటి వస్తువులు కూడా స్త్రీ పురుషులకు నగలుగా ఉపయోగించాలంటే వాటికి మొదట గనులలో అంటిన మట్టి మలినాదులను కొన్ని ఏసిడ్సు తో కడిగి పోగొట్టి, తరిపిడి పెట్టడం వంటి కొన్ని శాస్త్రీయ క్రియలు అనగా బాగు సేతలు చేసిన పిమ్మటే అవి క్రమంగా స్త్రీల ఆభరణాలుగా తయారై అవి మహారాజుల మకుటాలను కూడా అలంకరించే అవకాశం ఏర్పడుతుంది అలా ఆభరణాలుగా తయారైన పిమ్మట గాని ఆ రత్నాలు, మణులు లోకానికి ఉపయోగించవు కదా! ఇదే విధంగా మానవులు పుట్టిన వేళయొక్క గ్రహస్థితినీ వారి పూర్వజన్మ కర్మల పుణ్య పాపాల ప్రభావాలను బట్టి వారు పుట్టినప్పుడే సాధారణంగా కొన్ని రకాల బాలారిష్టాది దోషాలు వారికి సంక్రమిస్తాయి ఆ దోషాలు అలాగే ఉన్నంత కాలం వారి సహజ శక్తులను అవి వికసించనియ్యవు ఆ కారణంగా అట్టి వారు నిరుత్సాహంతో ఏపనీ చెయ్యలేకుండా ఉంటారు అట్టి వారి జీవితాలను లోకోప కారంగా తయారు చెయడానికి వారికి జాత కర్మ వంటి శాస్త్రీయ సంస్కారాలు తప్పని సరిగా చేయవలసి ఉంది ఈ సంస్కారాలు యదావిధిగా అనగా శాస్త్రోక్తంగా ఆచరించడం చేత అంతకు ముందు బాలుర మనో బుద్ధీంద్రియాలను అంతఃకరణమును అంటి పెట్టు కున్న అరిష్టాలు కామక్రోధ లోభ మోహాదులు అనే దోషాలు తొలగి పోయి వాటిస్థానే క్రొత్తగా వారిలో విశుద్ధత పవిత్రత జాగరూకత మనోనైర్మల్యం వంటి అనేక శక్తులు ఏర్పడతాయి ఈ విధంగా మానవులలోను వస్తువులలోను మొదట ఉన్న దోషాలను మలినాలను పోగొట్టి క్రొత్త శక్తులను పుట్టించడం ద్వారా వారిని లోకోప కారకంగా తీర్చి దిద్దగల జాత కర్మాది శాస్త్రీయ క్రియా విశేషాలే సంస్కారములు అని చెప్ప బడుచున్నాయి



సంస్కారాలు అనగా అలవాట్లు అనే ఇంకో అర్థం కూడా ఉంది వీటినే పూర్వజన్మ సంస్కారాలు అనీ, పూర్వం జన్మ వాసనలు అనీ కూడా అంటారు, పూర్వ జన్మలలో మనం నేర్చుకున్న ఈ అలవాట్లు మంచి వైతే మంచి ఫలితాలను, చెడ్డవైతే చెడుఫలితాలను మనచే అవి అనుభవింప జేస్తూంటాయి ఉదాహరణకు – ఒకొక్క బాలుడు తన చిన్నతనంలోనే గొప్పగా గానకచేరీలు చేయడమో, లేక ఏ గణిత శాస్త్రంలోనో అద్భుత పాండిత్యాన్ని ప్రదర్శించడమో జరిగినప్పుడు అట్టి ఆదర్శబాలుణ్ణి చూసి, అది వాడి పూర్వజన్మ సంస్కారం అని మెచ్చు కుంటాం ఇక ఇంకో బాలుడు తన చిన్నతనంలో ఏ హింసా ప్రవృత్తినో ఏలోభ ప్రవృత్తినో తరచుగా కనబడుస్తున్నప్పుడు అట్టి బాలుణ్ణి చూసిమనం పూర్వ జన్మవాసనలు ఊరికే పోతాయా ? అనుకొంటాం ఇట్లే – ఒక పండిత సభలో ఉన్న బాలపండితుణ్ణి చూసి మనం ఈయన గొప్ప సంస్కారి అంటాం అంటే అతడు తన పూర్వజన్మలో సంపాదించిన వేదశాస్త్ర విజ్ఞానాది సంస్కారాలు తరవాత జన్మలో కూడా సంక్రమించి అవి బాల్యంలోనే అతణ్ణి పండితునిగా చేశాయన్న మాట కనుక మానవ జీవితాలకు సుఖశాంతి గౌరవ కీర్తులను కలుగ జేసేవి పూర్వ జన్మలో సంపాదించిన మంచి అలవాట్లు అనీ, అపకీర్తి, అశాంతి దుఃఖాది కష్టనష్టాలను కలిగించేవి పూర్వజన్మ కృత



దురభ్యాసాలనీ మనం తెలుసుకోవాలి ఈ చెడు అలవాట్ల దుష్ప్రభావం సోకిన మానవులు, కామ, క్రోధ, లోభ మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గానికి అధీనులై దుష్ప్రవర్తనతో క్రమంగా దేశ ద్రోహులుగా తయారౌతారు ఆ కారణంగా అట్టి వారు ప్రతి నిత్యమూ దుర్భర కష్ట నష్టాదులకు గురి ఔతూంటారు

ఇట్లు మానవ జాతికే పరమ శత్రువులైన కామ క్రోధాది దోషాలను తొలగించి మానవులలో విశుద్ధతను పవిత్రతను ఏర్పరచడం ద్వారా వారిలో 'దైవీసంపద' (చూ భగవద్గీతలో దైవాసుర సంపద్విభాగయోగం)ను ప్రవేశపెట్టి వారిని ఆదర్శపౌరులుగా తయారు చేయగలిగినవి ఉపనయనాది శాస్త్రీయ సంస్కారా లు మాత్రమే అని తేలింది వీర మిత్రోదయం అనే ధర్మ శాస్త్ర గ్రంథం కూడా ఈ సంస్కార శబ్దానికి నిర్వచనం చేస్తూ పిది విషయాలనే ఇలా విశదం చేసింది

ఆత్మ శరీరాంతర నిష్ఠః విహిత క్రియాజన్యః
అతిశయ విశేషః సంస్కారః

అనగా మానవులలో ఉన్న సర్వ విధ దోషాలను మొదట పోగొట్టి వారిలో క్రొత్తగా మనో విశుద్ధత బావ పవిత్రత వంటి వినూత్న శక్తులను ఏ శాస్త్రీయ ప్రక్రియలు ప్రవేశ పెట్ట గలుగు తాయో అట్టి శాస్త్రీయ విశేష ప్రక్రియతో సంస్కారాలు అనిపించు కుంటాయి

(ఇంకా ఉంది)

సీరియల్

డి.ఎస్.పి.విజయ్



ఆమారి సావిత్రి

(గత సంచిక తరువాయి)

ఎమ్. డి రూంలో నుంచి చిరునవ్వుతో బయట కొచ్చిన సౌందర్యని అనేక జతల కళ్ళు కుతూహలంగా అనుమానంగా చూశాయి శ్రీధర్‌ని తలుచుకుని ఈర్ష్య పడ్డాయి

ఏమన్నాడు? అనబోయి ఆమెకు కాస్త వెనకగా తన ఛాంబర్‌లో నుంచి బయట కొచ్చిన ఎమ్ డి ని చూసి టక్కున నోళ్ళు మూసుకున్న వాళ్ళందర్నీ గమనించి నవ్వాపుకుంటూ టకటకా టైప్ చెయ్యటం ప్రారంభించింది సౌందర్య అలా మొదలైన సౌందర్యా శ్రీధర్‌ల పరిచయం ఒక టైపిస్ట్‌కీ ఒక ఎమ్ డి కి ఉండాల్సిన పరిధిల్లో ఆగిపోలేదు దాని గురించి పట్టించుకోనంత ముందుకు సాగింది

ఎవరేమనుకున్నా పట్టించుకోకుండా ఎవరి ఏడుపుకు వాళ్ళ నొదిలేసి, ప్రతి సాయంత్రం ఎమ్ డి కారులో నే దర్జాగా ఇంటి కెళ్ళిపోయేది సౌందర్య

'వాడు దాన్ని నట్టేట్లో ముంచి చేతులు దులుపు కుంటాడు అప్పుడు దీని బతుకు కుక్క కన్నా హీనమవుతుంది అంటూ ఎప్పుడెప్పు డలా జరుగుతుందా అని కసిగా ఎదురు చూస్తున్నారు ఆఫీస్‌లో ఆమె సహోద్యోగులు

క్రమంగా సౌందర్యా శ్రీధర్‌ల మధ్య పరిచయం స్నేహంగా మారి స్నేహం బాగా పటిష్ఠమయి అనురాగంగా రూపు దాల్చింది

అతని అలవాట్లు అభిరుచులు ప్రవర్తన ఆమెకు చాలా నచ్చాయి

ఏ కోణంలో నుంచి చూసినా సౌందర్య మహా అద్భుతంగా కనిపిస్తోంది శ్రీధర్‌కి

మనం ఈ రోజు అల్లూరు పోలేరమ్మ గుడి కెడదాం!' అన్నాడు శ్రీదర్

నా కలాంటి క్షుద్ర దేవత లంటే భయం అన్నది సౌందర్య

మనం గుడి చూడటానికి కాదుగా వెళ్ళేది

మరి? దేన్ని చూడ్డాని కెడుతున్నాం?

నిన్ను'

నన్ను మీరిక్కడ చూడ్డం లేదా?

ఎవరైనా ఏమయినా అనుకుంటారేమోనని బయపడుతూ జంకుగా చూస్తున్నా 'నిక్కడ అక్కడయితే ఊరికి కాస్త దూరంగా అట్టే జన సంచారం లేని చోటు గనక ఫ్రీగా చూడొచ్చని

ఏం అక్కర్లేదు లెండి

ఆ మాట నేను గదా అనాల్సింది?

మీరు అనరు గనక నేనంటున్నాను

ఇది అన్యాయం నిన్ను చూసే అధికారం నాకుంది బలవంతాన నువ్వు నా హక్కుని కాలరాస్తానంటే నేను చూస్తూ ఊరుకోను కావాలంటే నువ్వు నన్ను చూడ్డం మానెయ్యి

అదెలా? మీరు నన్ను చూస్తుంటే నేనేం చెయ్యను?'

అక్కడ తుమ్మ చెట్లున్నాయి

ఉంటే?

వాటిల్లో పొద్దు గ్రుంకటం అనే దృశ్యాన్ని చూడు,

తను అతని మొహానికీ ఆ దృశ్యానికీ కలిపి చేసిన కంపారిజన్ గుర్తు రాగానే నవ్వొచ్చిం దామెకు

వస్తావు గదూ?

మీ మాటకు యస్ అనటమే గానీ 'నో' అనటం చేతగావటం లేదు

థాంక్యూ! ఎప్పటికీ ఇదే మాట మీద నిలబడాలి మరి

అలాగే

సాయంత్రం కారు మీ సందు చివర మామూలుగానే ఆపి ఉంచుతాను వచ్చేస్తావుగా?

అలాగే! కానీ ఏడింటికల్లా తిరిగి నేను ఇంటి దగ్గరుండాలి'

ఈ ఒప్పందం రద్దు చేసుకుందాం సౌందర్యా నాకిదేం బావుండలేదు కాలానికి కరువొచ్చినట్లు మరీ ఒక్క గంట మాత్రమే కేటాయిస్తాననటం ఘోరం నువ్వొచ్చేదే ఆరు గంటలకి ఏడింటికల్లా ఇంట్లో ఉండాలంటావు

గంట ఏం సరిపోతుందని? ఒకరినొకరం తనివితీరా చూసుకోటానికే చాలదు

ఎంతసేపు చూసుకుంటే తనివి తీరుతుంది?

కనీసం నాలుగు గంటల సేపయితే ఓ మాదిరిగా అడ్జస్ట్ చేసుకోవచ్చు

తల్లిదండ్రుల చాటు పిల్లను నేను ఆరు నుంచి పదిదాకా మీతో ఊరేగితే మావాళ్ళు నన్ను ఇంట్లో నుంచి గెంటేస్తారు

మరీ మంచిది అప్పుడెంచక్కా నా చాటుకొచ్చెయ్యచ్చు ఇరవై నాలుగ్గంటలూ ఒకరినొకరం అంటిపెట్టుకు నుండొచ్చు

వాళ్ళ చేత గెంటించుకుని మీ చాటుకు రావటం కన్నా ముందుగానే వాళ్ళ చెవిన ఓ మాట వేసి అప్పుడు మీరు నన్ను తెచ్చేసుకుంటే

అలాగే ఒక్క నెల రోజులు గడువివ్వు నేనే వచ్చి మీ వాళ్ళనొప్పించి ఝామ్మని పెళ్ళి చేసుకుంటాను

నిజంగా?! సౌందర్య మొహం మిలమిలా మెరిసింది

నిజం ఈ ఎమ్ డి శ్రీధర్ నిఘంటువులో మాట తప్పటం అనే పదానికే చోటు లేదు అన్నాడు శ్రీధర్ సిన్సియర్‌గా

థాంక్యూ బాస్! తల ఒంచి చిలిపిగా అన్నది సౌందర్య

ఇది ఆఫీసయి పోయింది గానీ లేకపోతేనా

లేకపోతే?

ఆ తలనలాగే గుండెల కానించుకొని ముద్దులు దొంతర్లుగా పేర్చేవాడిని

ఆమె ముఖం ఎర్రబడింది

జరిగిన కథ – 10 : విజయ్ రహస్యంగా రంగారావు గడీలోకి వెళ్ళి భూగృహం లోంచి నానీని విడిపిస్తాడు ఒక బిలం గుండా బైట పడి మురికి కాలువలో అతికష్టం మీద ఈది చెంచుల గూడెం చేరతాడు విజయ్ నానీలు మరణించారని రంగారావు అనుకుంటాడు నానీతో విజయ్‌కి గాఢమైన అనుబంధం ఏర్పడుతుంది ఇంద్రాపూర్ పరిసరాల్లో దొంగల బెడదను ప్రజా సమావేశంతో పరిష్కరిస్తాడు విజయ్ విజయ్‌కి సమాచారం అందించే సరితను దండగులు ఎత్తుకుపోతారు నానీ విజయ్ సంబంధం పట్ల అనుమానాలు వ్యాపిస్తుంటాయి

వాళ్ళ అనురాగం ఇంకా మనసులు దాటి పెదవుల మీదకు రాలేదు

*　*　*　*　*　*

పొద్దుగూకి తాను పోలేరమ్మ గుడికి రానని భయమని సౌందర్య గొడవ పెట్టటంతో ప్రోగ్రాం మార్చి భువనేశ్వరీదేవి ఆలయానికి తీసుకెళ్ళాడు శ్రీదర్

విరబూసిన పూలతోట చుట్టూరా వున్న ఆలయమది గుడి ముందు చలవరాళ్ళు పరిచిన విశాలమైన ఆవరణలో కూర్చుని బజన చేస్తున్నారు ఆడవాళ్ళు వాళ్ళని దాటుకుని ఆలయంలోకెళ్ళి కానుకలిచ్చి ప్రసాదం తీసుకుని ఆ ఆడవాళ్ళు కనపడకుండా గుడి వెనక వైపెళ్ళి తోటలో కూర్చున్నారు సౌందర్య శ్రీదర్ లేత పసుపు రంగులో తెలుపు రంగులో సుకుమారంగా ఉన్న చంద్రకాంత పూలను ఒడిలో పోసుకుని వాటితో జడ అల్లుతున్న సౌందర్యను రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు శ్రీదర్

కొద్దిగా తొలిగిన పైట నుండి అలవోకగా కనుపిస్తున్న ఆమె ఒంపుల్ని చూస్తూ నిగ్రహించుకోలేక అవస్థ పడుతున్నాడతను

మగాడికి కఠినమైన శిక్ష ఏమిటో తెలుసా? అన్నాడతను

ఏమిటి? అన్నదామె

అందమైన ప్రియురాలు ఎదురుగా తన అందాన్నంతా కుప్పబోసుకున్నట్లు కూచుని ఉంటే కనీసం చేత్తోనైనా తాకటానికి వీల్లేని పరిస్థితిలో ఉంటమే మగాడికి పెద్ద శిక్ష ఇప్పుడు చూడు నిన్ను తాకాలనుంది దగ్గరకు తీసుకోవాలనుంది కోరుకున్న చోట ముద్దాడాలని ఉంది కానీ చుట్టూరా జనం మనల్ని కనిపెడుతూ వుండే అనేక జతల కళ్ళు

పోలేరమ్మ గుడికి వెడదామంటే విన్నావా?

అర్ధరాత్రి అంకమ్మ శివాలన్నట్లు ఈ టైంలో ఎవరన్నా అక్కడికెడతారా? వెళ్ళరు గనకే మనమెడతాం

తలుచుకోటానికూడా భయంగా ఉంది నాకు

ఇంత పర్సనాలిటీ గల హీరోను పక్కనుండగా నువ్వలా భయం భయమనటం నాకు షేమ్‌గా ఉంది

ముద్దు పెట్టుకోటాక్కూడా ఆహ్లాదకరమయిన వాతావరణం కావాలి ఆ మాట అనేశాక సిగ్గుపడిందామె

నిజంగా!? అయితే అలాంటి వాతావరణం నేనే కల్పించుకుంటాను అప్పుడు నీకభ్యంతర ముండదుగా?

తను అల్లిన దండ రెండు కొసలూ దగ్గరకు చేర్చి మెలిక వేస్తూ మాట్లాడలేదామె

ఎవరికా మాల? అన్నాడు శ్రీదర్ నవ్వుతూ

మీ మెళ్ళో వెయ్యనా? అల్లరిగా అడిగింది సౌందర్య.

నాకు ఆ మాలయితే వద్దు

మరింకేం మాల కావాలేం?

పూలకన్నా మెత్తగా ఉన్న నీ రెండు చేతుల్నీ దగ్గరకు చేర్చగా ఏర్పడ్డ మాలవెయ్యి నా మెళ్ళో

వెడదామండీ ఏడు దాటుతోంది

మాట మార్చటంలో మాత్రం నీ తరువాతే ఎవరయినా".

సౌందర్యా

ఊఁ!

నేనొకటి అడగనా?

అడగండి

మళ్ళీ కాదనకూడదు

నా దగ్గరున్నదయితే ఇస్తాను అంతేగానీ జానపద చిత్రాల్లోలాగా గందర్వ లోకానికెళ్ళి గందర్వ మాల తీసుకురా దేవ పారిజాతం పట్రా అని అడిగితే నేనెక్కడ తెచ్చేది?

పారిజాతం తెచ్చే డ్యూటీ మగాళ్ళది కదా

ఒద్దులెండి మీరు ఆ డ్యూటీ చెయ్యొద్దు నన్ను చెయ్యమని వేధించొద్దు".

అగ్రీడ్ మరి అడిగేస్తున్నాను

ఊఁ!

ఒక ముద్దివ్వు

ఇంకానయం

నీ దగ్గర చాలా ఉన్నాయి గదా లేనివి నేనేం అడిగాను?

ఉంటే మాత్రం? సమయం సందర్భం అక్కర్లేదా?

సమయుం సందర్భం సరిగ్గా ఉంటే ఇస్తావా?

చెప్పు

ఊఁ! ఇహ లేవండీ వెడదాం అంటూ లేచి నిలబడిందామె

ఉన్నట్లుండి ఒక్కసారిగా కరెంటు పోయింది

ఆమె నడుం చుట్టూ చెయ్యేసి చటుక్కున దగ్గరగా లాక్కుని ఒంగి ఆమె పెదవుల్ని తన పెదవుల్తో అదిమాడు శ్రీదర్ ఆ కదలిక కామె తలలో ఉన్న జాజులు అతని మీద జలజల రాలాయి

లైట్లు వెలిగాయి

చూశావా? సమయం సందర్భం ఎలా కలిసొచ్చిందో? కొంటెగా అన్నాడతను

`గొప్పేలెండి అంటూ అతని షర్టు వేపు చూసింది సౌందర్య

అతని భుజం మీదొకటి జేబు దగ్గరొకటి నిలిచి ఉన్నాయి జాజిపూలు గడిచిన అనుభూతి చిహ్నాలుగా వాటిని తీసి జేబులో వేసుకున్నాడతను

ఆమెకింకా మత్తుగానే ఉంది

సౌందర్యా నా రూంకోసారి రావూ? ప్లీజ్!

రూమేమిటి? మీది బంగళా కదా?

అక్కడ వాచ్‌మన్ వాళ్ళంతా ఉంటారు గదా! మనల్ని ఎవరూ పట్టించుకోని నిశ్చలమైన ప్రదేశంలో అద్భుతమయిన రూం ఒకటి తీసి ఉంచాను సౌందర్యా ఇలా కక్కుర్తిగా ఎన్నాళ్ళు?

ఒక నెల రోజుల తరువాత ఎలాగా శాశ్వతంగా నాదానివి కాబోతున్నావు

పెళ్ళి కాకముందే నీతో ఆ అనుభవాన్ని పొందాననే థ్రిల్ నాకు దక్కనియ్యవా సౌందర్యా?

ఇలా గంటా అరగంటా కాకుండా హాయిగా స్వేచ్ఛగా కొన్ని గంటలపాటు ఏకాంతంగా గడిపితే ఎంత బావుంటుంది?!



కొత్త శీర్షిక

నాకు నచ్చిన సన్నివేశం

ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఆదూరి సావిత్రి రాసిన 'డి ఎస్ పి విజయ్' సీరియల్‌ని ఆసక్తితో చదువుతున్న పాఠకులందరూ ఈ శీర్షికలో పాల్గొనవచ్చును ఈ సీరియల్ నవలలో తమకి బాగా నచ్చిన సన్నివేశాన్ని గురించి వివరిస్తూ 250 అక్షరాలకి మించకుండా రాసి ఫొటోతో సహా పంపవచ్చును వాటిలో ప్రచురణ యోగ్యంగా ఉన్న వాటిని వారం వారం ఈ సీరియల్ పేజీలలో వేస్తాము ప్రచురణకి అర్హంగా లేని వాటిని తిప్పి పంపగోరేవారు తమ రచనలతో పాటు తగినన్ని తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామా కల కవరు జతపరచి పంపాలి వ్రాత ప్రతి మీద రాసిన వారి పేరు, పూర్తి చిరునామా ఉండాలి

ఈ సీరియల్ ముగిసేలోగా ప్రచురింపబడిన రచనలలో ఉత్తమమైనవిగా తాము ఎంపిక చేసిన మూడింటిని ఫొటోలతో సహా ఈ సీరియల్ పుస్తక రూపంలో ముద్రించేటప్పుడు అందులో వేయటం జరుగుతుందని, ఆ ముగ్గురు పాఠకులకీ ఆ నవల ప్రతిని తమ అభినందనలతో అందజేయగలమని రచయిత్రి తెలియచేస్తున్నారు

ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన పాఠకులు తమ రచనలని 'నాకు నచ్చిన సన్నివేశం' శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520003 అనే చిరునామాకి పంపవచ్చును –సం

డి. ఎస్. పి. విజయ్

మన పెళ్లయిం తర్వాత ఈ విషయం తలుచుకుంటే చాలు సిగ్గు అనే పదం మన దరిదాపుల క్కూడా రాకుండా పోతుంది

ప్లీజ్ సౌందర్యా! నేను మాత్రం పరాయి వాళ్ల నడుగుతున్నానా? నా భార్యని ఒక్క నెల రోజుల ముందే అడ్వాన్స్ అడుగుతున్నాను అంతగా నేను నీ శ్రీదర్‌ని కాదూ?

కోపమొచ్చిందా?

కోపం కాదు

పెళ్లయిపోయిం తరవాత అందరు భార్యా భర్తల్లాగే మనం కూడా క్యాజువల్‌గా కలవటమేనా? కొత్తదనం ఏం వద్దా? నువ్వే చెప్పు సౌందర్యా మన భావాలు కూడా మరీ ఇంత బూజు పట్టినట్లుంటే ఎలా? లాలనగా బ్రతిమాలుతున్నాడు శ్రీదర్ ఆమెనలాగే నిలబెట్టి

అతని మనసు నొప్పిస్తే బావుండదేమో అతను తన కాబోయే భర్త ఇందులో తప్పేముంది? ఇది తను తీర్చకపోతే నువ్వే ఆ థ్రిల్ నుంచి నన్ను దూరం చేశావు అంటూ పెళ్లయ్యాక గుర్తొచ్చినప్పుడల్లా సాధిస్తూ ఉంటాడేమో ఆ అసంతృప్తినే మనసులో పెట్టుకుంటాడేమో తను మరీ మొండికేస్తే బాగోదు అతనికి కోపం కూడా రావచ్చు అది దేనికైనా దారి తియ్యొచ్చు

తెలివి తక్కువగా ఆలోచించి అతన్ని పోగొట్టుకోటం మూర్ఖత్వం

అతనంతట అతనే పెళ్లి పట్ల ఉత్సాహం చూపిస్తున్నాడు వాళ్ల అక్క ఎల్జీరియాలో ఉందిట నెల రోజుల తరవాత వస్తుందట అతనికున్నది ఆమె ఒక్కతేట తల్లిదండ్రులు లేరుట ముందే వచ్చేసి మీ వాళ్ల దగ్గర డబ్బా కొట్టటమెందుకు? అక్క రాగానే ఇద్దరం వచ్చి అన్నీ మాట్లాడుకుని వెంటనే మ్యారేజ్ చేసుకుంటే సరిపోతుంది అన్నాడు శ్రీదర్

నీ పెళ్లి నీ ఇష్టం నాకేం అభ్యంతరం లేదు అంటూ వాళ్లక్క రాసిన ఉత్తరం కూడా చూపించాడు

ఇంకా తను అనుమానిస్తే అతను దాన్ని అవమానంగా భావించొచ్చు

సౌందర్యా

అతని పిలుపుతో ఉలిక్కిపడిందామె

రేపు ఉదయం మామూలుగానే ఆఫీస్‌కని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరి అప్సరా హొటల్ ముందు నిలబడు నేనొచ్చి పికప్ చేసుకుంటాను సాయంత్రం వరకూ సరదాగా గడపుదాం తిరిగి ఆఫీసు వదిలే వేళకు నిన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను అన్నాడు శ్రీదర్

రేపేనా! భయంగా అన్నదామె

రేపే వెడదాం సౌందర్యా నేనింక ఆగలేను నా మీద ఇంకా నమ్మకం కుదరటం లేదా నీకు? ఏం చేసి నమ్మించను నిన్ను? పోనీ మా అక్క రాక ముందే మనం పెళ్లి చేసుకుందామని నువ్వంటే నీ యిష్టం అలాగే చేసుకుందాం నేను తనకేదో సర్ది చెపుతాను

ఒద్దులెండి ఆవిడ వచ్చాకే చేసుకోవచ్చు

మరి రేపొస్తున్నావుగా?

వస్తాన్లెండి

థాంక్యూ! మాట తప్పవు గదూ? రేపు నువ్వు రాకుండా టోకరా ఇచ్చావంటే నిజంగా చచ్చిపోతాను నేను ఆ నిరాశ భరించలేక

తప్పకుండా వస్తాను అన్నది సౌందర్య

* * * * * *

ఆ రాత్రంతా ఆమె నిద్రపోలేదు అతని పెదవుల స్పర్శ తాలూకు మత్తు తపీ అలాగే ఉన్నాయింకా ఇంకా అతను తనని బ్రతిమాలుతున్నట్లే ఉంది

సౌందర్యా రావూ!? పెళ్లికి ముందే ఆ థ్రిల్ నేను పొందేలా చెయ్యవూ!? ప్లీజ్

ఆమె పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి రేపటి గురించిన టెన్షన్‌తో ఆమెకా రాత్రంతా జాగారమే అయింది తెల్లారి తీరికగా తయారయి తొమ్మిదింటికి ఇంట్లోంచి బయటపడింది సౌందర్య

తలంటు పోసుకున్న జుట్టు గాలికి తేలికగాఎగిరి మొహంమీద పడుతోందామెకు కొద్దిగా ఎర్రబారిన పెద్ద పెద్ద కళ్లు తెల్లని మొహానికి అదో రకమయిన కొత్తదనంతో కూడిన ఆకర్షణను కలిగిస్తున్నాయి ముక్కుకున్న మిరియం ముక్కుపుడక ఆమె కదిలినప్పుడల్లా నాచురల్‌గా ప్రకాశిస్తోంది

మస్టర్డ్‌కలర్ జార్జెట్ చీర మాచింగ్ బ్లౌజు ఆమె ఒంటికి అందంగా నప్పాయి

గొప్పగా అలంకరించుకోకపోయినా గొప్పగానే వెలిగి పోతోందామె

ఆమె మనసులో వున్న ఉద్వేగం మొహంలో ఎగ్గు సిగ్గుగా ప్రతిఫలిస్తోంది

ఆమెను అంత దూరం నుంచే చూసిన శ్రీదర్ పెదవుల మీద తృప్తితో కూడిన చిరునవ్వు కదలాడింది

డోర్ తెరచి ఆమె నాహ్వానించాడు కారు అతనే డ్రైవ్ చేస్తున్నాడు

చెపితే అతిశయోక్తి అనుకుంటావని భయమేస్తోంది గానీ సౌందర్యా ఎంత చక్కగా ఉన్నావో తెలుసా?! నెమ్మదిగా అన్నాడు శ్రీదర్

మీరు మీరు కూడా బావున్నారు ఈ రోజు ప్రత్యేకంగా ఉన్నారు అన్నది సౌందర్య

ఈ రోజు ప్రత్యేకమయిన రోజు గదా మనకి! ఈ రోజు డేట్ డైరీలో నోట్

చేసుకో సౌందర్యా ప్రతి సంవత్సరం ఈ రోజున సెలబ్రేట్ చేసుకుందాం మన మ్యారేజ్ యానివర్సరీ జరుపుకోవాల్సింది ఈ రోజే

అజంతా ఎంటర్‌ప్రయిజెస్ ముందు ఆగింది కారు

ఇదేమిటి? ఈ షాపు దగ్గరెందుకూ ఆగటం? సందేహంగా అన్నది సౌందర్య.

లోపల నువ్వే చూస్తావుగా నేనెందుకూ చెప్పటం? చూడగానే నన్ను పొగడ్తలతో ముంచెత్తి పారేస్తావు దిగు అంటూ షాపులోకి దారి తీశాడు శ్రీధర్

షాపతను నవ్వుతూ విష్ చేశాడు అతనికి శ్రీధర్‌తో బాగా చనువున్నట్టుంది

పుస్తకాల ర్యాక్ దగ్గరకెళ్ళి ఏదో స్విచ్ నొక్కగానే గోడకు ఒక ద్వారం ఏర్పడింది పై పొర పక్కకి జరిగింది తన దగ్గరున్న తాళం చెవితో తలుపు తెరిచాడు శ్రీధర్ ఆశ్చర్యంగా అతన్ననుసరించింది సౌందర్య

ఇవన్నీ ఇతనెలా ఏర్పాటు చేశాడు!? ఇక్కడికొచ్చిన ఈ కాస్త వ్యవధిలోనే వీళ్ళతో ఇంత క్లోజ్‌నెస్ ఈ రహస్యమైన గది ఇవన్నీ ఎలా ఏర్పడ్డాయి?

మొదట భయంగా అనిపించినా శ్రీధర్‌ని చూసి ధైర్యం తెచ్చుకుందామె

ఇతను తనక్కాబోయే భర్త తన బాధ్యత అతనిది ఆ గొడవలన్నీ అతనే చూసుకుంటాడు అనుకుందామె శ్రీధర్ చెప్పినట్టు నిజంగానే ఆ గది చాలా ప్రత్యేకంగా ఉంది

మబ్బురంగు గోడలు అదే కలర్ వాల్‌టు వాల్ కార్పెట్ మబ్బురంగు శాటిన్ దుప్పట్లు పరిచిన ఫోమ్ బెడ్స్ ఆ అలంకరణ నీలి మబ్బుల మధ్య అడుగుపెట్టిన అనుభూతిని కలిగిస్తోంది

ఎ సి ఆన్ చేశాడు శ్రీధర్ తేలికగా వస్తున్న లవండర్ వాసన ఆహ్లాదాన్ని కలిగిస్తోంది

స్నానం చేస్తావా? అన్నాడు శ్రీధర్ షర్ట్ చేతులు కొద్దిగాపైకి మడుస్తూ

చేసే వచ్చాను అన్నది సౌందర్య

భయమేస్తోందా?

ఊఁ!

ఎందుకూ?

ఏమో

మొదట అలాగే ఉంటుంది తరవాత క్రమక్రమంగా అదే తగ్గిపోతుంది

ఏయ్! మాట్లాడు

ఏం మాట్లాడను?

ఏదో ఒకటి హఠాత్తుగా అలా మూగబోయావెందుకూ?

ఇంకా కలగంటున్నట్టే ఉందా? ఆమెను సున్నితంగా చేతుల మీద లేపి బెడ్‌మీద పడుకోబెడుతూ నవ్వాడు శ్రీధర్

ఊఁ! ఉహూఁ! అంటూ నవ్వింది సౌందర్య

అయిదు నిముషాలు గడవక ముందే ఇద్దరికీ పేచీ వచ్చింది

నాకు సిగ్గు భయం అన్నదామె

సిగ్గు సరే దాని సంగతి నేను చూస్తాను గానీ భయం దేనికి? అన్నాడతను

బయటున్నతను కూడా అదే స్విచ్ నొక్కి లోపలికొస్తే!

అదా! మరీ ఇంత అమాయకురాలివేమిటి నువ్వు? స్విచ్ నొక్కితే గోడ పక్కకు జరుగుతుంది గానీ తలుపు రాదు చూడు లోపల బోల్టు వేశానుగా? పక్కకు తప్పుకుని లోపల వేసిన బోల్ట్‌ను చూపించాడు శ్రీధర్ నిజమే తను గమనించలేదు తలుపుకెక్కడా చిన్న సందు కూడా లేదు అనవసరంగా బయపడుతోంది తను ఇందాకట్నుంచి

లేచి అతని ఒడిలో మొహం దాచుకుని అతని నడుం చుట్టూ చేతులేసిందామె

అతని చేతులామె ప్రతిఘటనను లెక్కచెయ్యకుండా జార్జెట్ చీర కుచ్చెళ్ళను పట్టుకుని వెనక్కి లాగాయి ఎర్రగా కందిన మొహాన్ని చేతుల్లోకి తీసుకుని ఆమె కళ్ళను పెదవులతో కాసేపు మూసి ఉంచాడు శ్రీధర్



న్యాయమ్మును కోరుచున్న నారీమణులెవరు వీరు?

కడుపులోన ఆకలి కార్చిచ్చై దహిస్తోంది
నడవలేక చరణయుగం తడబడుతూ గమిస్తోంది
కనుపాపల తెరలపైన కొన ఊపిరి సొలసి ఉంది
తన జీవిత యానంలో పెనుచీకటి పొలసి ఉంది
చిరిగిన బట్టలతో, కడు చివికిన దేహంతో
ఇరుదెస పోలీసులతో నరుదెంచెడి వనిత ఎవరు?
అన్నం పెడతా రమ్మని, పిలిచి నొక్క తార్పుకత్తె
ఆమె లోన చేరగానే, అరుదెంచిరి పోలీసులు
పరిస్థితుల కారణాన, పతితయనే నేరమ్మును
భరిస్తున్న మందభాగ్య, కోరుతోంది న్యాయమ్మును.

★ ★ ★ ★ ★

ఒంటిమీద మంచి సెంటు ఊరికి ఊరికి పడుతోంది
కంటిలోన ఉత్సాహం కదం త్రొక్కి నటిస్తోంది
కోరిక గమి కోయిలయై కుహు కుహుమని కూస్తోంది
మారుతి డీలక్సు నెక్కి మగువ మలసి వస్తోంది
అన్నుగొలుపు బట్టలతో, కడు నున్నని దేహంతో
అడ్వకేటు యుగ్మంతో నరుదెంచెడి అతివ ఎవరు?
ఇప్పుడున్న భర్తతోడ, సంసారం ఏమాత్రం
ఇష్టపడక డైవోర్సును కోరుతున్న నారి ఈమె
నిదుర, భర్త గురక పెట్ట తనకు నిదుర రాదటంచు
నిద్రపోతు పతి వద్దని న్యాయమ్మును కోరుతోంది.

/- కనమలూరు వెంకటశివయ్య

డి. ఎస్. పి. విజయ్

అబ్బ' అన్నదామె బరువుగా

ఆమెను గుండెల మీదికి లాక్కుని వెనక్కి తిరిగి పడుకున్నాడతను

దాహంగా ఉంది అన్నది సౌందర్య మత్తుగా

ఆమె నలాగే ఉంచుకుని మంచం పక్కన టీపాయ్ మీద గాజు గ్లాసులో మూతపెట్టి వుంచిన నీళ్లనామె కందించాడు శ్రీదర్

అతని నాల్సుక ఆమె ఒంటిని రుచి చూస్తున్నట్లుగా తాకుతుంటే ఉక్కిరిబిక్కిరవుతోంది సౌందర్య

ఏమాత్రం తొందరపాటును ప్రదర్శించకుండా అతనిస్తున్న తడి ముద్దులు ఒక్కో స్పందనకూ స్పందనకూ మధ్య గ్యాప్ ఇస్తూ ఆ అనుభూతి అలా నిలిచిపోవటానికి దోహదం చేస్తున్నాయి

తల దిమ్ముగా మత్తుగా ఉంది. కూరుకు పోతున్న రెప్పల్ని బలవంతాన ఎత్తుతూ అన్నదామె

అలాగే ఉంటుంది మొదటిసారి గదా లాలనగా అన్నాడతను

?

?

అతను లేచి బట్టలు సరి చేసుకుని సిగరెట్ ప్యాకెట్ అందుకుని ఆమెవేపు చూశాడు

గాఢ నిద్రలో మునిగి ఉందామె మళ్ళీవెళ్లి అతనామె పక్కన పడుకున్నాడు

ఎంతసేపటికో కళ్ళు విప్పి టైమెంత? అన్నది సౌందర్య

నాలుగు

ఓహ్! ఇంతసేపు నిద్ర పోయానా! లేపగూడదూ? లేవబోతూ సిగ్గుతో ఆగిపోయిందామె

అతను నవ్వి చీర అందించాడు

నువ్వు లేస్తావేమో అన్నం తిందామని చూస్తే ఎంతకీ లేవకపోతివి అన్నం పళ్ళెం మీద గాజు ప్లేట్లు తొలగించి టీపాయ్ మంచం దగ్గరగా జరుపుతూ అన్నాడతను

మీరూ ఇప్పటిదాకా తినకుండా కూర్చున్నారా! నొచ్చుకున్నట్లుగా అన్నదామె

పళ్ళెదులే

ఇద్దరూ భోజనం ముగించాక మరోసారి అతని కోరిక చెల్లించి బయటపడేసరికి అయిదు దాటింది

ఆ రాత్రంతా కూడా మత్తుగా గాఢ నిద్రలో మునిగి పోయిందామె

తెల్లారి మామూలుగా ఆఫీసుకెళ్ళింది సౌందర్య

శ్రీదర్ కూడా మామూలుగానే ఉన్నాడు ఇద్దరూ ఒకరినొకరు అర్థవంతంగా చూసుకుని కళ్లతోనే నవ్వుకున్నారు

అతను తన స్వంతమయినట్లు అతని బాగోగులు, మంచిచెడ్డలు తనవే అయినట్లు అతని మీద పూర్వం కన్నా తనకు స్వతంత్రం పెరిగినట్లు ఇద్దరి మధ్యా ఎనలేని సాన్నిహిత్యం ఏర్పడ్డట్లు ఫీలవుతోంది సౌందర్య

అతనేమనుకుంటున్నాడో!

అదే అడిగితే సరిగ్గా నేనూ ఇలాంటి అనుభూతినే పొందుతున్నాను సుమా! ఎందుకనీ? అన్నాడు అమాయకంగా

అదంతే! అన్నదామె అరిందాలా

అతనికా విధంగా లొంగిపోయిందనే బాధ కలగటంలేదు సౌందర్యకు

పెళ్ళి కాకముందే తనకా అనుభవం కావాలని దాన్ని తను పదిలంగా దాచుకుంటాననీ అతనన్నాడు ఆ ఉద్రేకం అతనికి కలగటం సహజమే

నయం! తను మూర్ఖురాల్లా ప్రవర్తించి అతన్ని నొప్పించలేదు తనకు కలుగుతున్న లాంటి అనుభూతే అతనికీ కలుగుతోందిట!

పూర్వపు చిలిపితనం స్థానే ఒక రకమైన గాంభీర్యం చోటు చేసుకుందామెలో.

తను ఎమ్ డి భార్యననే హుందాతనమది (ఇంకావుంది)

చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి వైద్య సలహాలు

ఎ వళ్ళీశ్వరిరెడ్డి, తిరుపతి

ప్ర మా అమ్మగారు మోకాలు నొప్పి వాపుతో బాదపడుచున్నారు దీనికి తగిన మందేమో తెలుపండి

జ చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి బృహద్వాత చింతామణి 4 గ్రా మౌక్తికభస్మ 1 గ్రా త్రిఫలాచూర్ణం కలిపి 41 పొట్లాలు చేయండి తేనెతో వాడ వలయును ఉదయం ఒకటి సాయంత్రం ఒకటి మహాయోగ రాజగుగ్గులు 20 గ్రా ఉదయం ఒకటి సాయంత్రం ఒకటి నమిలి మింగి మంచినీరు త్రాగ వలయును వాతారితైలం పైకి రాసి వేడినీటితో కాపడం పెట్టవలయును 40 రోజులు సేవించి తరువాత చింతలూరికి లెటర్ రాయగలరు

ఎ రంగారావు, ఒంగోలు

ప్ర నా వయస్సు 38 సం లు షుమారు రెండు సంవత్సరముల నుండి విపరీతమైన జిల వస్తున్నది గిరుట వలన శరీరం ఎఱ్ఱగా మారడం గీతలు పడడం వాయడం కొద్ది సేపటికి శరీరం మామూలుగా రావడం జరుగుచున్నది ఇంగ్లీషు మందుల వలన తాత్కాలికముగా తగ్గుట గాక మరలా వస్తున్నది పూర్తిగా తగ్గిపోవుటకు సలహా ఇవ్వ ప్రార్థన పత్యం తెల్ప ప్రార్థన

పి భారతి, హైదరాబాదు

ప్ర మా వారికి గాస్ ట్రబుల్ ఉంది కడుపు ఉబ్బరంగా ఉండటం ఆకలేస్తే కడుపులో త్రిప్పటం అప్పుడప్పుడు కాళ్ళూ చేతులు లాగినట్లుండటం మీ సలహా ఇవ్వండి

జ చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి స్వర్ణ క్రవ్యాదిరసం 10 గ్రా పైత్యాంతకం 5 గ్రా కలిపి 40 మాత్రలు ఉదయం ఒక మాత్ర సాయంకాలం ఒకమాత్ర భోజనం తరువాత రెండు పూటలా వాడవలయును మంచినీటితో గానీ మజ్జిగతో గాని వాడవలెను పూర్ణచంద్రోదయం మాత్ర బోజనమునకు ముందుగా రెండు పూటలా నమిలి మ్రింగి పాలుగానీ మంచినీరుతో గానీ సేవించ వలయును

శ్రీమతి ఎన్ చంద్రకళ, జైపూర్

ప్ర : నావయస్సు 25 సం లు నాలుగయిదు సంవత్సరాల క్రితం వరకు పుష్టిగా ఉండేదాన్ని ఈ మద్య బాగా సన్నగా అయిపోయాను ఆరోగ్యం బాగానే ఉంటోంది తిరిగి లావయే మార్గం చెప్పండి

జ చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి పూర్ణచంద్రోదయం 4 గ్రా కాంతాభ్రక సిందూరం 10 గ్రా త్రిఫలాచూర్ణం 41 పొట్లాలు వెన్నతో గాని పంచదారతో గాని ఉదయం ఒకటి సాయంత్రం ఒకటి వేసుకొన వలయును పాలు కూడ త్రాగ వలయును వేపుడు కూరలు వేడిచేయు కూరలు తగ్గించ వలెను పెరుగు మజ్జిగ పెసరగడ గారెలు మినపసున్ని తినుచుండ వలెను నలభై రోజులు వాడిన తరువాత చింతలూరు ఆయుర్వేద ఫార్మసి తెలియ పరచ వలెను చ్యవన ప్రాశ్య కాల్షియం వాడవచ్చును □



మహిళా పాఠకుల శీర్షిక!

ఈకాలం పెళ్ళిళ్లు

కులాంతర వివాహాలు

పూర్వపు రోజుల్లో మనుష్యులు చేసే వృత్తిని బట్టి వారిని కొన్ని కులాలుగా విభజించటం జరిగింది అల్లా ఏర్పడిన కులాలు తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ, తమ బిడ్డలకూ తమ వృత్తిలోనే తర్ఫీదునిచ్చి, వారి బ్రతుకు తెరువు కోసం తాము చేసే పనిలో ప్రవేశ పెట్టేవారు ఏకులానికి చెందిన వారు ఆయా వృత్తి ధర్మాలను పాటిస్తూ సాటి కులం వారితోనే తమ బిడ్డలకు వివాహాలు జరిపించేవారు అలా ఆరోజుల్లో కుల వ్యవస్థ బలపడింది

కాలం ముందుకు కదులుతూ ఎన్నెన్నో మార్పులను ప్రవేశ పెట్టింది సమాజంలో, మనుష్యుల్లో మారిన కాలంతో పాటు మనుష్యుల మనస్సులు కూడా వికసించాయి ఈనాడు చాలామంది తమకులపు వృత్తులను వదిలేసి చదువుల్లో ప్రవేశిస్తున్నారు ప్రతీ కులం వారు ఈనాడు పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు ఎదుటివారి కట్టు బొట్టు, వేషధారణ, భాష నడతను బట్టి వారి కులమేమిటో గ్రహించలేని స్థితిలోకి మారింది నేటి ఆధునిక సమాజం

చదువుకునే రోజుల్లో, ఉద్యోగం చేసే సమయంలో యువతీ యువకులు ఒకరినొకరు తటస్థపడటం, ఒకే చోట వారు కలసి గడపటం జరుగుతుంది ఆ సమయంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ముందుకు సాగి స్నేహం ఏర్పడుతుంది స్నేహంగా ఉన్న ప్రతి యువతీ యువకులు ప్రేమికులు కాలేరు ఎదుటి వారి గుణగణాలతో, ఆత్మ సౌందర్యానికో, రూపానికో, సంస్కారానికో, స్వభావానికో నడతకో ఆకర్షింప బడి వారికి మనస్సర్పించటం జరుగుతుంది ఆ సమయంలో యువతీ యువకులకు ఎదుటి వారి కులంతో పరిచయ ముండదు వారి వ్యక్తిత్వాన్ని గౌరవించి, వారితో సాహచర్యాన్ని కోరుకుంటారు కులం తెలిసిన తర్వాత కూడా యువతీ యువకుల ప్రేమలో మనస్సులో, నిర్ణయంలో మార్పురాదు వారు పెళ్ళి చేసుకోటానికే సిద్ధపడతారు అయితే, పెద్దల వైపు నుంచి మాత్రం ఈ వివాహానికి వ్యతిరేకత అడ్డంకి ఎదురౌతుంది


ఈ కులాంతర వివాహాలన్నవి పెద్దల ఇష్టానికి వ్యతిరేకంగానే జరుగుతాయి తమకులం వారితో కాక ఇతర కులాల వారితో సంబంధాలు కలుపు కోటానికి పెద్దలు ఇష్టపడరు కులాంతర వివాహాలన్నవి సాధారణంగా ప్రేమ వివాహాలేనని చెప్పవచ్చు ఇద్దరు యువతీ యువకులు కులాల తేడాలను త్రోసిపుచ్చి ప్రేమ వివాహం చేసుకున్నట్లయితే, వారికి ఆతర్వాత ఎన్నో సమస్యలు ఎదురవుతాయి ఆ దంపతులకు తమ వైపు పెద్దలనుంచి కానీ, బంధువుల నుంచి కానీ ఎటువంటి ఆదరణ లభించకపోగా వారిని వెలివేసినట్లు దూరం చేసేస్తారు ఎన్నో ఆదర్శాలను వల్లించే ఈ సమాజం కులాంతర వివాహం చేసుకున్న వారిని మానసిక అశాంతికి గురి చేస్తుంది ఒంటరి తనానికి గురయిన ఆదంపతులు గుండె ధైర్యాన్ని వీడకుండా, ఒకే మాట మీద ముందుకు సాగితే ఈ సంఘం ఇక వారిని పట్టించుకోవటం మానేస్తుంది ఒకరిపట్ల మరొకరికి ఏర్పడిన నమ్మకాన్ని మాత్రం వారిద్దరూ ఎన్నడూ జార విడుచుకోకుండా కాపాడుకోవాలి కులం మంట కలిపారన్న ఆగ్రహంతో తల్లితండ్రులు తమ బిడ్డలను తాత్కాలికంగా దూరం చేసుకుంటారే కానీ శాశ్వతంగా మాత్రం కాదు

పెద్దలవల్ల సంఘం వల్ల ఏర్పడిన సమస్యలను ఆలుమగలిద్దరూ కలసి పరిష్కరించుకోగలరు కానీ కులాంతర వివాహం వల్ల వారిద్దరి మధ్యా అభిప్రాయ భేదాలు, మనస్పర్థలు, సమస్యలు ఏర్పడవచ్చు ఆ ఆలుమగల్లో ఒకరు శాకాహారి అయినట్లయితే ఆహార విషయంలోనే వారిద్దరి మధ్యా సమస్య ఏర్పడవచ్చు వారిద్దరి పద్ధతుల్లో, ఆచారాల్లో, పనుల్లో ఉన్న వ్యత్యాసాలు వారి సహజీవనంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి ఆ తేడాలను గుర్తించి ఇద్దరూ సర్దుకు పోతే ఏ చిక్కూ ఉండదు లేకుంటే, వారిమధ్య ఏర్పడే కలతలు చిలికి చిలికి గాలివానగా మారి వారి దాంపత్యం విచ్చిన్నమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది కులాంతర వివాహం చేసుకున్న యువతీ యువకులు తమ పద్ధతులను కొన్ని విడనాడ వలసి ఉంటుంది అల్లాగే, అవతలివారి పద్ధతులను కొన్నింటిని ఆచరించవలసి ఉంటుంది సర్దుకు పోయే మనస్తత్వం ఇద్దరిలోనూ ఉండాలి

కులాంతర వివాహం చేసుకున్న దంపతులు ఆర్జన పరులు కాకపోతే వారికి భయంకర మయిన ఆర్థిక సమస్య ఏర్పడుతుంది తమను తాము పోషించుకునే స్థితిలో ఉన్నప్పుడే యువతీ యువకులు స్వతంత్రంగా వివాహం చెసుకోవచ్చు లేకపోతే వారిని ఆసమయంలో ఎవరూ ఆదుకోక పోగా ఎగతాళులతో, తీవ్రమయిన మాటలతో వారిని చిత్రహింసకు గురిచేస్తారు కొన్నాళ్ళకు పెద్దవాళ్ళను దూరం చేసుకుని ఈ కులాంతర వివాహం చేసుకుని తాము తప్పు చేశామన్న పశ్చాత్తాపంతో తాము కోరి వివాహమాడిన వ్యక్తిని తమ మాటలతో మానసికంగా గాయపరుస్తారు పెద్దలను ఎదిరించి, కులాంతర వివాహం చేసుకున్న ఆలు మగల మధ్య మనస్పర్థలు ఏర్పడి వారు విడిపోయే స్థితికి వచ్చినట్లయితే, వారిని రాజీ చేయటానికి ఇరువైపు పెద్దలూ ముందుకురారు కులాంతర వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్న అమ్మాయికీ అబ్బాయికీ ఒకరి పట్ల మరొకరికి గాఢానురాగం సదవగాహన సమాజం లో కలనుంచి ఎదురయ్యే ఆటు పోట్లను తట్టుకునే ఆత్మ విశ్వాసం పెద్దలను దూరం చేసుకున్న తను కోరుకుని పెండ్లాడిన వ్యక్తితో శాశ్వతంగా కలిసి ఉండగలమన్న మనోనిబ్బరం, ఆ వివాహం చేసుకున్నందు వల్ల తమకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకునే ఓర్మి చాకచక్యం ఆనూతన దంపతుల మధ్య ఉండాలి అప్పుడే ఆ ఆదర్శ దాంపత్యం కలకాలం నిలుస్తుంది అల్లా జరిగిననాడు కులాల తేడాలను సడలించాలన్న పట్టుదల యువతలో పెంపొందుతుంది

ఈ కులాల తేడాలన్నవి మనుష్యులు కల్పించుకున్నవి ఈ కులాలన్నవి మనుష్యుల మధ్య ఎక్కువ, తక్కువ అన్న బేధ భావాలను కలిగిస్తాయి భావి తరానికీ, దేశ ప్రగతికీ ఈ కులాల తారతమ్యాలు గొడ్డలి పెట్టవుతున్నాయి మానవులంతా ఒకటే నన్న ధ్యేయంతో ఐకమత్యంతో స్నేహ భావంతో కులాల తేడాలను తుడిచేస్తూ ప్రగతి పథం వైపు పయనించాలి పెద్దలు తమ బిడ్డల కులాంతర వివాహం నిర్ణయాన్ని హర్షించి తాము కూడా ప్రోత్సహిస్తూ ముందడుగు వేయాలి పెద్దలలో, సాంప్రదాయాల్లో మార్పు వచ్చినప్పుడు కానీ ఈ కులాల అంతరాలు సమసిపోవు

–కె నిర్మల, హైదరాబాద్



భర్తలను హింసించే భార్యలు

పవిత్ర బారతావనిలో సతీ అనసూయ సతీ సక్కుబాయి వంటి పతివ్రతా శిరోమణులు విలసిల్లిన గడ్డపై బర్తలను హింసించే బార్యలా? వింతకాదూ ? అని మీ రనుకోవచ్చు దేశమేదైనా కాలమేదైనా అప్పుడూ ఇప్పుడూ కూడ బార్యలను హింసించే బర్తలున్నట్టే బర్తలను హింసించే బార్యలూ వున్నారు మనమధ్య కాకపోతే సంఖ్యాబేదం ఎక్కువగా వుంటుందనుకోండి ఇంకో రహస్యం ఏమంటే కన్నీళ్ళు బగవంతుడు స్త్రీల కిచ్చిన చిరుకానుక స్త్రీని పురుషుడు బాదిస్తే మేమున్నాం నీ నేస్తాల మంటూ సెలయేళ్ళలా ఉబికొస్తాయి కన్నీళ్ళు అదిచూసిన ఎదుటివారి గుండె చెరువై ఆ మగమహారాజెంత దుర్మార్గుడో అని సవాలక్ష శాపాలు పెడతారు ఒకవేళ పురుషుడే ఆ పరిస్థితుల్లో వున్నాడనుకోండి' బార్య ఎంతగా వేదిస్తున్నా బయటకు చెప్పుకోలేడు ఎన్నడైనా ఆ బాదను బరించలేక అతను కన్నీరు పెడితే అతన్నో అసమర్ధుడిగా జమకడుతుందీ సమాజం స్త్రీకి వరప్రసాదమైన కన్నీళ్ళు పురుషులకో శాపంగా పరిణమించాయి


అసలు హింస అంటే ఏమిటి? తిడితేనే హింసా? అంతకుమించిన హింస మాటలతో మనిషి మనసును గాయపరచడం తెలివైన స్త్రీ ఆ అయుదాన్నే వుపయోగిస్తుంది అనుమానం అసూయ స్త్రీకి తోబుట్టువులు బయట ప్రపంచంలో తిరిగే పురుషుడికి ఎన్నోరకాల స్త్రీలతో తరచూ మెలగాల్సిన అవసరం ఏర్పడుతుంది అనుమానం నిండిన స్త్రీ అడుగడుగునా అతని చర్యలపై నిఘా వేసి పరాయి స్త్రీతో మాట్లాడితే చాలు లేనిపోని అబాండాలువేసి సాదిస్తుంది నిజంగా అతనెంత మంచివాడైనా పురుషులంతా ఒకటేనంటూ రాద్ధాంతం చేస్తుంది ఇటు బార్యను నమ్మించలేక అటు ఎదుటివారితో చెప్పుకోలేక నలిగి పోతుంటాడా పతిదేవుడు

నేటి సమాజంలో పుస్తకాలూ సినిమాలూ కూడ విజ్ఞానాన్ని పెంచాల్సింది పోయి పెడత్రోవను పట్టిస్తాయనడంలో సందేహంలేదు ఏ పుస్తకంచూసినా ఏ సినిమాచూసినా బర్త బార్యను అపురూపంగా చూసుకోవడం కూర్చోబెట్టి సపర్యలు చేయడం ప్రేమే జీవితమంటూ ప్రేమ డైలాగులు వల్లించడం వంటి అసహజమైన వాస్తవదూరమైన వాటిని ఎక్కువగా పొందుపరుస్తున్నారు ఇవన్నీ నిజ జీవితానికి సరి పోల్చుకుంటూ తమ బర్తలు తమనలా చూసుకొనడంలేదని అంటే వారికి తమపై ప్రేమ లేనట్లేననీ సూటిపోటి మాటలతో వేదిస్తుంటారు అంతేకాని జీవితాన్ని జీవితంగా చూడగలిగేటంతటి



సహృదయం చాల తక్కువమందిలో చూడగలుగుతున్నాం

స్త్రీ తన తల్లిదండ్రుల్ని అన్నదమ్ముల్ని విడచివచ్చినట్లే పురుషుడు కూడ తన వాళ్ళందరికంటే వున్నతస్థానాన్ని తనకిచ్చి ఆదరిస్తున్నాడని ఆలోచించరు తన పుట్టింటివాళ్ళను ప్రేమాబిమానాలతో ముంచేస్తూ బర్త తరపు బందువులను దూరంగా వుంచుతారు



చాలమంది స్త్రీలు పాపం' బార్యను ఒప్పించలేక తనవారిని మెప్పించలేక అతని పరిస్థితి అడకత్తెరలోని పోకచెక్క చందమౌతుంది

ఇక నగలూ చీరలూ అంటూ తాహతుకు మించిన ఆశలకుపోయి బుద్ధిగా వున్న మగాణ్ణి వేదించడం మొదలుపెడుతుంది ఆ బాధ బరించలేక ఆ కన్నీటికి కరిగి గడ్డికరచి పట్టుబడితే ఎంత అవమానం? స్త్రీ యింట్లో కూర్చుని ఆ సంపదను ఐశ్వర్యాన్ని చూసుకొని మురిసి పోవచ్చు కాని సమాజంలో యిరవై నాలుగ్గంటలూ తిరిగే మగవాడు ఈ అవమానానికి తలెత్తుకు తిరగలేక ఎంతగా కుమిలి మానసికక్షోబ ననుబవిస్తాడో ఆలోచించండి? అలా కాకుండా మీరు మీ పరువు మీ ప్రతిష్ఠ నాకు ముఖ్యం నాకోసం పిల్లలకోసం అడ్డదారులు తొక్కొద్దు నిజాయితీగా నడవండని ఎందరు చెప్పగలరు? అనుబవించేది ఒకరు' అల్లరిపాలయ్యేది వేరొకరు' బార్యెప్పుడూ బర్తకు తోడూనీడై సహకరించగలగాలికాని అతని మెడకో గుదిబండ కారాదు చల్లనిమాట చక్కని ప్రేమతో ఆత్మీయతతో బందించాలని చూడాలికానీ బెదిరించి సాదించాలనుకోవడం అవివేకం డబ్బే ప్రదానమనుకుంటూ బర్తను పీడించి తప్పుద్రోవపట్టించే స్త్రీలే ఈ సమాజానికి నిజమైన చీడపురుగులు

పాశ్చాత్య నాకరితా వ్యామోహం పుణ్యమా అంటూ ఆడంబరాలెక్కువై ఆర్ధికసోమత తక్కువై స్త్రీ పురుషు లిరువురూ కుటుంబ బారాన్ని పంచుకోవలసి వస్తుంది స్త్రీ ఎన్ని నేర్చినా, ఎంత చదివినా సుఖ సంసారం కోసం సుఖ జీవనంకోసం కాదూ? అటువంటప్పుడు ఎవరిది పైచేయి? అన్న పంతాలకు పోకుండా దాపరికాలు లేకుండా బార్యాబర్తలిరువురూ ఒకరికొకరై నిలిస్తే ఇల్లే స్వర్గసీమ అవుతుంది

దేశమేదయినా కాలమేదయినా స్త్రీకి కొన్ని కట్టుబాట్లు హద్దులూ వున్నాయి ఆ కట్టుబాట్లను దాటకుండా ఆ హద్దులను మీరకుండా నడచుకున్న స్త్రీ జీవితమేదన్యం అంతేకాని తానేదో అదికురాలినన్న అహంతో పదిమందిలో బర్తను చిన్నబరచి అవహేళనచేస్తే నష్టపోయేది స్త్రీయేకాదూ? మనసా వాచా కర్మణా బర్తను ప్రేమిస్తూ అతని మనసెరిగి మసలుకోవడం ఉత్తమగృహిణి లక్షణం కార్యేషు దాసీ కరణేషు మంత్రీ అన్న సూక్తి నాచరిస్తూ బర్తకు సహకరించే స్త్రీ జీవితమే దన్యం

శ్రీమతి స్వర్ణా సుధాకర్,
చిన్నచింతకుంట,
(మహబూబ్‌నగర్) □

కూపన్
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
ఈ కాలం పెళ్లిళ్లు

పంపిన వారి పేరు

పూర్తి చిరునామా

పిన్ కోడ్

ప్రశ్నావళి

-కె.రామలక్ష్మి



ఆర్ కాశీబుగ్గ

★ చదువుకున్న కోడలు అత్తను సుఖపెట్టగలదా?

● చదువుకోని కోడలు కంటే - ఎక్కువ సుఖపెట్ట కలదని నా నమ్మకం చదువు కాస్త ఇంగితాన్నిస్తుంది కనుక - తనకు తల్లితండ్రులు వున్నట్టే తన భర్తకీ వుంటారని - ఆలోచించి ప్రవర్తిస్తుంది కాదంటారా?

★ రాముని అడుగు జాడలో సీత నడిచింది ఇప్పుడు భర్తల అడుగుజాడల్లో భార్యలు నడుస్తున్నారా?

● నడిస్తే భర్తలకేనష్టం!

ఆర్ ఎస్ ఖుర్దారోడ్

★ అన్ని అందచందాలు వున్న ఆంధ్రపత్రికకి ఒక్కటే లోటు కలం స్నేహం ఒక్కటే ప్రచురించడంలేదు మీరేమంటారు?

● ఎందుకా కొరివితో తల గోక్కోవడం అని వూరుకొని ఉంటారు!

ఆర్. ఎన్ ఆర్ గుంతకల్

★ దెయ్యాలు, భూతాలు సెక్సు హింస భీభత్స భయానక రసాలని కలబోసి పాఠకులకు ఉత్రూత లూపే ఓ మంచి నవల రాయకూడదూ? మీకు చేత కాదు వ్రాయడం ఛాలెంజి

● ఇలాంటి చచ్చు ఛాలెంజిలకి కత్తి దూయడానికి నేనేం ఆటవిక మనస్తత్వం కలదాన్నా?! నాకలాంటి 'ఉత్రూత' లూగించే 'మంచి నవల' రాయడం చేత కాదు సరికదా - చదవడం కూడా భయం

ఎస్ వి ఆర్ జువారినగర్, గోవా

★ ఇప్పుడు వస్తున్న కొత్త కోడళ్ళని అత్తలు ఎన్నో విధాల బాధలు పెడుతున్నారు చివరికి వారి ప్రాణాలు పోడానికి కారణం అవుతున్నారు మరి ఈ అత్తలూ ఒకప్పటి కోడళ్ళే కదా? మరిచి పోయారా?

● మరిచి పోయి మనసు మడతల్లో పడిపోయిన తాను పడ్డ బాధలు వేదన- కొత్త కోడల్ని చూడగానే తలెత్తుతాయి కాబోలు- అయినా- ఇద్దరూ తొలి దగ్గర నుంచి ఓ అర్థవంతమైన వర్కింగ్ రిలేషన్ షిప్ ఏర్పాటు చేసుకుంటే- స్నేహం మిగులు తుందని నా నమ్మకం కొత్త కోడలు తన హక్కులు లాక్కుందుకు వచ్చిందనుకోక తన బరువు పంచుకుందు కొచ్చిన సహజీవి అనుకుంటే పోదా

జి వి ఆర్ సికింద్రాబాదు

★ సాంఘికాభ్యుదయం కోసం పాటు' పడుతున్నాం అనే సంఘ సేవకులని చూస్తే నాకు మంట కామెంట్

● మీలాంటి వాళ్ళు ఎక్కువే! అందుకే అది కుంటినడకలు నడుస్తోంధి అందరి మంచి గురించి ఆలోచించడం చేతకానివాళ్ళు అనే మాట యిది అంతే

ఎం ఎస్ ఎన్ అన్నవరం

★ మీరు ఇప్పటి కొచ్చి నవలలేనా ఏవన్నా కథలు రాశారా?

● దారుణం? చే ధా గారూ! యీయన్ని చూశారా ఎలా అడుగు తున్నారో?! మీ రెంతసేపూ మాట పుట్టుక గురించి ఛాందసుల మూర్ఖత్వం గురించేనా రాయడం? మంచి కథల గురించి నేటి పాఠకులకు చెప్పరేం!!

★ ఒక రచయితగా మారడానికి మనిషికి ఏం కావాలి?

● తన వూహలని కాగితంపై ఎక్కించగల బాషా పరిజ్ఞానం ఆ వూహల్లో కాగితానికి ఎక్క తగినవేవి అని నిర్ణయించుకో కల్గిన ఇంగితజ్ఞానం వుంటే చాలు

★ డబ్బున్నవాడే ఇంకా అభివృద్ధిలోకి వస్తున్నాడు లేనివాడు ఇంకా అధఃపాతాళానికి దిగజారి పోతున్నాడు ఇదేం న్యాయం?

● ఇది లోక నీతి డబ్బు డబ్బుని పెంచుతుంది కాని పేదరికం కూడా పేదరికాన్నే పెంచుతుంది అదే బాధ

★ నేడు అనేక మంది యువతీ యువకులు ప్రేమ వ్యవహారాల్లో పడి భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారు ఇది బాధాకరమైన విషయం కదా?

● ప్రేమ వ్యవహారం అయితే బాధ పడవలసిందే!

★ తమ రచనల్లో ఆదర్శాలని వల్లె వేసే రచయితలు నిజ జీవితంలో కూడా ఆదర్శవంతంగా వుండాలా?

● ఉండాలని నేను నమ్ముతాను కాని నే రాసింది నమ్ము, నన్ను నమ్మకు అనే వాదన నేడు ఎక్కువైంది ఇది ఆరోగ్యకరమైన లక్షణం అని నేను అనుకోను

డి జె ఆర్ హైదరాబాదు

★ గురుదక్షిణ ఎప్పుడు సినిమాగా వస్తుంది?

● అది మీరు శ్రీ మోహన్‌బాబుగారిని కదా- అడగాలి!!

ఎస్ సి హెచ్ కె కోటబొమ్మాళి

★ సమాజంలో మంచి చేద్దామనుకుంటే అన్నీ అడ్డంకులే ఎప్పుడు తొలగుతాయో మీ వూహ వివరించ కలరా?

● అడ్డంకులు తొలగించుకుంటూ మంచి చేయడమే గాని అవి తొలగిపోయాక చేద్దామని ఏ కార్యశూరులూ అనుకోరు


★ పత్రికలో వేసే మీ ఫొటో కి మీ నిజ ప్రతికి తేడా వుంటుందా?

● , స్వామీ- బొమ్మకీ ఫొటో కి తేడా తెలియదా! అమాయకులా మీరు?! అది చిత్రకారుడి కుంచె, వేసిన బొమ్మ నా ఫొటో అలా వుండదు!!

టి డి సిహెచ్ కె బాపట్ల

★ దేవాలయానికి వెళ్ళినంత మాత్రాన పుణ్యం వస్తుందను కోవడం పొరపాటు కదూ! ఖచ్చితంగా వెళ్ళాలని శాశించాలనడం నాకు నచ్చ లేదు

● శుభం అందుకే హుందాగా వుండవలసిన హిందువుల సమైక్యత ఇసుక తక్కెడగా తయారైందని నా నమ్మకం మంచికేనా చెడుకేనా అందరూ ఒకచోట ఒక సారేనా కలుసుకోవడం జరగాలన్న దానికి గాని కొబ్బరికాయ కొట్టి పుణ్యం మూట కట్టుకు పోడానికి కాదు క్రైస్తవులను చూడండి ఆదివారం కోలాహలంగా అంతా కలుసుకుని- వూహలు కలబోసు కుంటారు ముస్లిములను చూడండి మనం ఎందుకు నేర్చుకో కూడదు? □




సరదాలకే దసరా ఆటపట్టు
ఆప్కో పట్టు చీరల్లోనే అది
కన్పట్టు
పండుగ వేడుకలన్నీ –
నేతపనివారల అపూర్వ విజయ
పరంపరల ఆప్కో చీరలలో
ప్రతిఫలింప జేయండి!
ఆప్కో
చేనేతలు
సంబరాల
దసరా కానుక
20

అద్దం

మంత్రవాది మహేశ్వర్

కళ్యాణి అద్దం ముందు నిలబడివుంది పదేపదే తన రూపాన్ని చూసుకుంటోంది

కళ్ళక్రింద నల్లటి చారలు –

తలపైన తెల్లబడుతున్న వెంట్రుకలు –

బిగువు తగ్గిన శరీరం –

నలభై ఏళ్ళ వయసును గుర్తుకుతెస్తున్నాయి

గతంలోకి మనసు పరుగుతీసింది

అప్పుడు తన వయసు ఇరవైలోపే

కాలేజీలో కళ్యాణిని మెచ్చుకునేవాళ్ళు ఎంతమందో! ఏ డ్రస్సు వేసుకుంటే ఆ డ్రస్సు తనకి బాగా నప్పిందని, డ్రస్‌కే అందం వచ్చిందని చాలా మోడ్రన్‌గా వుందని ఎన్నిపొగడ్తలు –

బ్యూటీ కంటెస్ట్‌లో కూడా ఒకసారి బహుమతి వచ్చింది ఇంట్లోవాళ్ళు వద్దంటే ప్రక్కింటి నిర్మలా అంటీయే పట్టుబట్టి పాల్గొనేలా చేసింది

సినిమాల్లో ప్రయత్నించమని ఎందరనలేదు ?

తనే అంత చొరవ చూపించలేదెందుకో

వయసు మనిషిలోను, మనిషి ఆలోచనల్లోనూ ఎన్ని మార్పులు తెస్తుంది

యవ్వనం దాటుతున్నప్పుడు బాధ్యతలు ముసరినప్పుడు నీ వయసు యిది అని గుర్తు చేయడానికా –

చేతిలో – కూతురు దీప ఈమధ్యే కుట్టించుకున్న మోడ్రన్ డ్రస్ దానిని తనకు దగ్గరగా పెట్టుకుని ఆ నిలువుటద్దంలో పదేపదే చూసుకుంటోంది

ఆ డ్రస్‌ని దగ్గరపెట్టుకున్నప్పుడు పెదాలపై చిర్నవ్వు

'ఎలావుందిప్పుడు?' అని అద్దాన్నే కళ్ళతో ప్రశ్నించింది

'ఎలావున్నావో నిన్ను నీ కే చూపిస్తున్నానుకదా ఇంకా వేరే ఏం చెప్పను? ఎలా చెప్పను?' అని తెల్లముఖంవేసి నిలబడినట్లుంది అద్దం

ఆ అద్దం సరిగ్గా యిరవై సంవత్సరాల క్రితం పెళ్ళిలో వచ్చిన ప్రెజెంటేషను

అప్పట్నుంచీ అది అలాగే ఒఫిగ్గా నిలబడేవుంది దానికి ప్రత్యేకంగా చేస్తున్న సంరక్షణా ఏం లేదు, రోజూ శుభ్రంగా తుడవటం తప్ప

ఆ అద్దానికి వయసు పెరిగింది తప్ప ఏ మార్పులేదు తన కర్తవ్యం తను నిర్వహిస్తోంది

రేపు ఆయనకి ప్రమోషన్‌మీద ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు జాగ్రత్తగా దానిని పట్టుకెళ్ళాలి

తనకి ఆ అద్దంతో ఎంతటి అనుబంధమో అంతే కాదు చిన్నప్పట్నుంచీ తనకి అద్దమంటే ఎందుకో చాలా యిష్టం

దీప డ్రస్సు చేతుల్లో అలాగేవుండగానే – మమ్మీ అంటూ లోపలికొచ్చింది హుషారుగా దీప మమ్మీని చూసి ఒకటే నవ్వు

ఏమిటి మమ్మీ కొంపదీసి వేసుకుంటావా– అని దీప తకీమని అడిగేసరికి కళ్యాణికి ఎక్కడలేని కోపం వచ్చింది

ముఖం బాగా ఎర్రబడిందికూడా

ఏం ఎందుకు వేసుకోకూడదు? ఏమైందని నాకు? ఇవి పనికిరావా? వయసు మీరిపోయిందా? అని అనలేదు కానీ అనాలనుకుంది

ఏమిటి మమ్మీ అలా డల్‌గా అయిపోయావు? అంది దీప

అహా ఏం లేదు – ఈ రంగు నాకు నప్పుతుందో లేదో చూస్తున్నాను అంది తడబాటుతో

అంతేకదా వేసేసుకుంటావనుకున్నాను

అవును మమ్మీ మా కాలేజీ స్టూడెంట్స్ అంతా పిక్‌నిక్‌కి అరకు వెడుతున్నారు మరి నేనుకూడా వెడతాను ప్లీజ్!

అలాగే నాన్నగారికి కూడా చెప్పాలికదా

నీ పర్మిషనుంటే చాలు మమ్మీ! డాడీని ఒప్పించటం ఎంతసేపు!

పరుగులాంటి నడకతో హుషారుగా హమ్మింగ్ చేసుకుంటూ వెళ్ళిపోయింది దీప

ఇరవై ఏళ్ళ దీపను చూసి ఆమెకు తనే తల్లి అన్న గర్వంతోబాటు ఆమెకంటే తనకు ఇరవై ఏళ్ళు ఎక్కువే – అన్న బాధ కూడా గుండెలో ఓ మూల లేకపోలేదు

ఎవరో పిలిస్తే పార్టీకి వెళ్ళారు కళ్యాణి, ఆమె భర్త మోహనరావు

కళ్యాణి ధోరణి వింతగా అనిపించింది చూడగానే మోహనరావుకి

హెయిర్‌స్టైల్ వేసుకున్న డ్రస్ పెదవులకు లిప్‌స్టిక్ అందంగానే కనిపించింది మోహనరావుకి

జోక్ చేద్దామనుకున్నాడు బయలుదేరేటప్పుడే మూడ్ పాడుచేసినట్లవుతుందని ఊరుకున్నాడు

ఏం కామెంట్ చేయలేదు

మోహనరావు మౌనం కళ్యాణికి బాధ కలిగించింది

తనూ మాట్లాడలేదు

ఇద్దరూ ఆటోలో 'సీ – వ్యూ' హొటల్‌ముందు దిగారు

లోపలికి నడిచారిద్దరూ –

భాగ్యశ్రీగారు ఎంతో హాపీగా రిసీవ్‌చేసుకున్నారు ఆడవాళ్ళంతా ఒకచోట వున్నారు కూల్‌డ్రింక్స్ సిప్‌చేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు

కళ్యాణి చుట్టూ చాలామంది ఆడవాళ్ళు చేరారు

ఒకరు మెడలో హారాన్ని –

మరొకరు వేసుకున్న డ్రస్‌ని రకరకాలుగా పొగుడుతున్నారు

మరికొందరు కళ్యాణి అందానికి అసూయపడుతున్నట్లనిపించింది

కళ్యాణికి ఆనందంగానేవుంది

ఐబ్రోస్‌ని పైకి చేస్తూ –

పదేపదే నవ్వుతూ ఆ ధోరణి ఆ పద్ధతి అంతా వింతగా, క్రొత్తగా అనిపించింది దూరం నుంచే గమనిస్తున్న మోహనరావుకి

కళ్యాణిలో ఏదో తాపత్రయం – అందరిలోనూ తనే చిన్న అన్నట్లుగానేమో

పార్టీ అయ్యాక యింటికొచ్చేశారు

అద్దం ముందుకొచ్చి చూసుకుంది ఓసారి వెళ్ళేటప్పుడున్నంత ఉత్సాహం యిప్పుడులేదు నుదుటిమీద పట్టిన చమటబిందువులు గాలికి కాస్త రేగిన ముంగురులు

ఆ – కళ్యాణికి ఈ కళ్యాణికి వున్న తేడా ఆ అద్దానికి బాగా తెలుసు అంతకంటే బాగా మోహనరావుకి తెలుసు

పడుకునే టైం వరకూ ఏ కామెంటూ చేయలేదు మోహనరావు

కళ్యాణికూడా ఏం మాట్లాడలేదు

ఇద్దరిమధ్యా కాసేపు మౌనం రాజ్యమేలింది

ఆ తరువాత మోహనరావు – కళ్యాణీ ఏమిటి ఈవేళ ఎప్పుడూలేనిది క్రొత్తగా తయారయ్యావు?

ఏం బాగులేదా?

బాగులేదనికాదు ఉన్నట్టుండి మార్పు చూస్తేనూ!

మార్పు యిష్టంలేదా

ఎందుకంత కోపంగావున్నావు అసలు

నేను అంతలా డ్రస్ చేసుకున్నాను ఒక్కముక్కైనా అన్నారా? బావులేదు అన్నా సంతోషంగానే వుండేది నాకు



పిచ్చి కళ్యాణి నువ్వు నా కళ్ళకు ఎలాగైనా బానేవుంటావు అయితే అలంకరణలు అన్నవి బయటప్రపంచానికి నలభైలో ఇరవైలా కనిపించాలనుకోవడం సహజం కావచ్చు కానీ ఆ తాపత్రయం ఎందుకు చెప్పు ఆర్టిఫిషియాలిటీ నేను పెద్దగా లైక్‌చేయను అని నీకు తెలుసు ఒకరు దానిని యిష్టపడితే నేను అడ్డుకూడా చెప్పను అటువంటప్పుడు నా అభిప్రాయం చెప్పడం నిన్ను బాధపెట్టడమే అవుతుంది

నేను వయసు మీరిన దానిలా కనిపిస్తున్నానా? నాకు మోడ్రన్ డ్రస్సు అసహ్యంగా అనిపించిందా జాలిగా అడిగింది

కళ్యాణీ – నీ వయసు నలభై ఇరవై అన్నా ఎవరూ ఒప్పుకోరు ఇరవైలా కనిపించాలన్న తాపత్రయం కనిపిస్తుంది తప్ప వయసు దాగదు అయితే ఏ వయసుకు తగ్గ అందం ఆ వయసుకుంటుంది నువ్వు నాకు ఈ- నలభైలోనే అందంగా అనిపిస్తున్నావు – అని సూటిగా కళ్ళల్లోకి చూస్తూండిపోయాడు

ఎలా మారితే అలా చూపించే ఆ అద్దంలోని ప్రతిబింబం కన్నా అతని కళ్ళల్లో ఎప్పుడూ ఒకేలా కనిపించే ఈ ప్రతిబింబం ఎంతో అందంగా అనిపించింది కళ్యాణికి

– అలా చూస్తూనే ఆమెను దగ్గరికి చేర్చుకున్నాడు ప్రేమగా

కళ్యాణి కోపం అతని కౌగిలిలో పూర్తిగా చల్లారిపోయింది □


నమ్మకానికి ప్రతీకయైన ప్రసిద్ధ సామర్థ్యం.



క్రికెట్ తార దిలీప్ వెంగ్‌సర్కార్. ఇంతవరకూ ఎప్పుడూ మిమ్ములను నిరాశ పర్చలేదు.

ఈ సీజన్‌లో వీరి నుంచి అద్భుతమైన ఆటను ఆశించవచ్చు. విజ్డన్‌వారి విశ్వపు ఐదుగురు 'క్రికెట్ ఆఫ్ ది ఇయర్'లో వీరికి స్థానాన్ని అందింపజేసింది వీరి ఆటలోని విశ్వసనీయ సహజశైలి. డెలాయిట్స్ కంప్యూటర్ కూడా వీరికి విశ్వపు నంబర్ 1 బ్యాట్స్‌మ్యాన్ అనే గౌరవాన్నిచ్చింది. అయితే ఈ ప్రకటన మరో నిత్య వినూత్న తార గురించి. క్రాంప్టన్ గ్రీవ్స్ కలర్ టెలివిజన్. ఆధునికమైన, అత్యంత అధునాతనమైన సాంకేతిక విజ్ఞానంతో నిర్మించబడ్డ టీ.వీ.ఇంతో ప్రత్యేకమైన ఈ టీ.వీ.ని సొంతం చేసుకుని తీరాలనిపించే అనేకానేక విశిష్టతలతో.

అన్నిటినీ మించి మరో విశేషం ! క్రాంప్టన్ గ్రీవ్స్ టీ.వీ. 12 నెలల పరిపూర్ణమైన భీమాతో వస్తుంది– అది మీ టీ.వీ.లో అన్నింటికన్నా ఖరీదైన భాగం పిక్చర్ ట్యూబ్‌కి కూడా వర్తిస్తుంది. ఇంకా, అమ్మకాల తర్వాత కొందరే అలా ఇవ్వగల సేవా సౌకర్యం. గుర్తుంచుకోండి. ఇది క్రాంప్టన్ గ్రీవ్స్ టీ.వీ. ఇక క్రాంప్టన్ గ్రీవ్స్ ఏళ్ళ తరబడి గడించుకున్నతమ ఖ్యాతిని నిలుపుకునేందుకు ఎంతటికైనా వెనుకాడదని మరువకండి.



Crompton Greaves

క్రాంప్టన్ గ్రీవ్స్ టీవీ
ఎందుకంటే కొన్ని వస్తువులు ఆనందాన్నిస్తూనే వుంటాయి ఏళ్ళకేళ్ళు.

కన్స్యూమర్ ఎలెక్ట్రానిక్స్ & హౌస్‌హోల్డ్ అప్లయన్సెస్
బ్రాంచ్ : శ్రీనిధి కాంప్లెక్స్, 86, సరోజినీ దేవి రోడ్, సికింద్రాబాద్-500 003.

నాటి దసరా వేడుకలకు నేటి ఏకైక సాక్షి

నభూతో నభవిష్యత్‌గా మన పాలకుల ఔన్నత్యాన్ని చాటి చెప్పాలంటే మన మదిలో మెదిలే మొదటి మనీషి 'అంధ్రబో జుదే' అంటే అతిశయోక్తి కాదు శ్రీ కృష్ణదేవరాయల పరిపాలనా పద్ధతులు, కళాభిరుచులు నాటికీ నేటికీ పండిత పామరుల ప్రశంసల నందుకుని ఆచంద్రతారార్కం నిలిచి వుంటాయన్నది నిస్సందేహం

'డామింగో పేస్' అనే చరిత్ర కారుడు, నాటి దసరా ఉత్సవాలలో పాల్గొని, విజయ నగరంలోని అనాటి వైభవాలను వర్ణించిన విధానం చూస్తే, మన కనుల ముందు నేటికినీ అవి సాక్షాత్కరిస్తున్నట్లుంటుంది

'వస్త్రాలతో అలంకరింపబడిన విజయమందిరంలో ధన కనక వస్తు సముచ్ఛయములు రాసులుగా పోయబడి సుందర లతా పుష్పములతో అలంకరింపబడిన వేదికపై 'మూల విగ్రహం' స్వర్ణసింహాసనంపై నిలుపబడినది మూల విగ్రహం ముందు బంగారు కలశంలో గులాబీ తదితర పుష్పముల మధ్య గుండ్రటి వస్తువునుంచి, వజ్ర వైఢూర్యాలతో దానిని కూడా అలంకరించేరు.

మహారాజా వేకువనే పురోహితులు, పండితుల ఆశీర్వచన ప్రవచనాలతో, కాల్బల , గజబల, అశ్వబల సమేతులైన సైనికులు విజయ ధ్వానములు సల్పుతుండగా సాటి రాజులు సామంతులు పురప్రముఖులు ప్రజలు మున్నగు లక్షల కొలది అహూతులు నిశ్శబ్దంగా, భక్తి పూర్వకంగా వినమ్రులై వీక్షిస్తుండగా పూజాకార్యక్రమములు ప్రారంభించెను తొమ్మిది రోజులు అతి సందడిగా సాగిన ఈ పూజోత్సవము వర్ణింప నలవి కానిది


నేటికినీ కర్నాటక రాష్ట్రంలో దసరా పూజలు పైరీతిగనే జరుపబడడం గమనార్హం ప్రత్యేకింప బడిన గదిని క్రొత్త వస్త్రములతో మూడు వేపులా అలంకరించి అందమయిన నగిషీలు చెక్కిన బంగారు వర్ణపు కలశంలో కొబ్బరి కాయను నిలిపి లక్ష్మి సరస్వతుల ప్రతిమలతో 'ధనలక్ష్మి సరస్వతి పూజలు' జరపడం నేటికినీ సాంప్రదాయమై నిలిచినది

ఉత్సవముల పిదప, శ్రీకృష్ణ దేవరాయలు తన ఇద్దరు ప్రియసతులతో తులాభారం తూగి, తమ ఎత్తు ధనాన్ని ప్రజలకు దానమిచ్చేవాడు నేటికినీ 'హంపీ లోగల 'రాజతులాభారం నాటి రాయల దానగుణాన్ని చాటి చెపుతోంది

దసరా దసరాకు మహారాజా అయురారోగ్యాలతో ప్రకాశించి, మరింత బరువుతూగాలని ప్రజలు ఆశీర్వదించడంతో వారి స్వార్థమున్నా, మహారాజుకు వారి అశీస్సులే శ్రీరామరక్షగా నిలిచి వుండేవి.

నేడూ తులాభారం తూగే నాయకులున్నా, అది వారి స్వ(పార్టీ) ప్రయోజనాలకే వినియోగింప బడడం మన దురదృష్టం కానీ అనపాయితీని నిల్పుతున్నందుకు 'హేట్సాఫ్టుదెమ్'

వ్యాసం, ఫోటోలు
–నిడమర్తి ఆదిలక్ష్మీ ప్రసాద్




రాజతులాభారం (హంపీ విజయనగరం)



శక్తి 'చింతామణి' కవిటి (శ్రీకాకుళం జిల్లా)

చింతలను ఛేదించు చింతామణీ తల్లి
ప్రభవలో నైనా మా ప్రభువుల తీర్పే
సరిచేసి చల్లంగ చూడవో తల్లి!
సమస్యల సుడిగుండంలో ని మా భరతమాతకు
ప్రశాంత జీవనం ప్రసాదింపుమో పునీతా!



ప్రేమసాగరమథనం

డాక్టర్ కొత్త రవీంద్రబాబు



సీరియల్

(గతసంచిక తరువాయి)

దీప్‌ను మధ్యలో వుంచుకుని డివైన్ గ్రూప్ సభ్యులు చుట్టూవుండి, సాంబశివ ముందు నడువగా సరివితోట లోపల గాలించటానికి బయల్దేరారు! వాళ్ళందరి చేతుల్లోనూ పిస్టల్స్ వుండటం గమనించాడు దీప్

ఇవి పిస్టల్స్‌గావు! పాయిజన్ డార్ట్స్! శరీరంలోకి గుచ్చుకోగానే పాయిజన్ రక్తంలోకి పాకి హృదయచలనం ఆగి మనిషి క్షణాలలో చనిపోతాడు డార్ట్‌ని లాగివేసినాక మనిషి ఎందుకు చనిపోయింది తెలుసుకోవటం ఎవరకూ సాధ్యంగాదు!

పిస్టల్ వుపయోగిస్తే శరీరంలో గాయం అవుతుంది! పోస్ట్‌మార్టమ్ చేసినప్పుడు శరీరంలో పిస్టల్ గుండు దొరుకుతుంది

పాయిజన్ డార్ట్ గన్స్ ఆర్ సో సేఫ్! సాంబశివ అన్నాడు యదాలాపంగా ఆ మాటలు సగం దీప్‌ను భయపెట్టటానికి సగం తన శక్తి తడాఖా తెలియజేయటానికి వుద్దేశించి అన్నాడు

వందలకొద్దీ ఎకరాలలో విస్తరించుకువున్న సరివి తోటలో నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రతి అడుగూ తూచితూచి వేయసాగారు వాళ్ళు

దూరంగా సరివి కొమ్మలపై గూళ్ళు కట్టుకొన్న పక్షులు గలగల అరుస్తూ చెట్లపైనుండి ఎగరడం చూచాడు దీప్!

"ఎవరో వస్తున్నారు! మనం నిలబడివుంటే వాళ్ళకు కనబడుతాం! అంటూ నేలమీద బోర్లబొక్కలా పడుకుండిపోయాడు దీప్

అతని మాటలు వింటూనే క్షణాలలో డివైన్ గ్రూప్ సభ్యులందరూ నేలమీద పడుకుని వుండిపోయారు

దీప్ చెప్పినట్లే రెండు నిముషాల తర్వాత కొన్ని ఆకారాలు దూరంగా కనపడ్డాయి అందులో ఒకటి మహాకాయం అని గుర్తించిన దీప్

ఆ లావాటి అతను రాఘవరావు పంపిన రౌడీ! అన్నాడు సాంబశివతో

రానీయ్! ఎంత మహాకాయమైనా ఒక పాయిజన్ డార్ట్‌తో ఫినిష్! అన్నాడు సాంబశివ

దూరాన కనపడ్డ ఆకారాలు నడకవేగం తగ్గించి నెమ్మదిగా అడుగులో అడుగువేస్తూ ముందుకు రావటం గమనించిన దీప్

జరిగిన కథ –18 దీప్‌ను వెతుకుతూ వచ్చిన నాగరాజు, కోటి, టైగర్‌లు చనిపోతారు. రాణిని డివైన్ గ్రూపు వాళ్ళు బలవంతంగా అనుభవించి బంధిస్తారు విజయ రాఘవన్ కూడ కంచికి చేరతాడు రాణి కోసం వెతకమని రాఘవరావు కింగ్‌కాంగ్‌కు పురమాయిస్తాడు రాణి డివైన్ గ్రూప్‌ను తప్పించుకుని విలూ, దీప్‌లను చేరుతుంది. దీప్ ఎవరో తెలిసిన విలూ, రాణితో పాటు దీప్‌కు చెప్పకుండా వెళ్ళిపోయి కింగ్‌కాంగ్ ముఠాకు చిక్కుతుంది దీప్‌ను డివైన్ గ్రూపు సభ్యులు బంధించి హింసిస్తుంటారు

ఈ చుట్టు పక్కల చెట్లమీద పక్షులు ఎగురుతుండడం చూచి వాళ్ళూ మనలానే ఎలర్టయివుంటారు జాగ్రత్త! ఎవరూ పెద్దగా మాట్లాడకండి! అవసరమైతే ఒకరికొకరు సైగచేయిండి! అన్నాడు దీప్

అతని మాటలు వింటూనే వాళ్ళు తమలో తాముగుసగుసలాడటం ఆపివేసారు! గంట క్రితం దీప్‌ను బాధించి చిత్రహింసల పాల్జేసిన వాళ్ళు యిప్పుడు అతని మాటలు శిరసావహించసాగారు దీప్ మాటలు విశ్వసనీయంగా గోచరించటమే అందుకు కారణం!

జాగ్రత్త! అదుగో అక్కడే పక్షులు గోలగా అరిచింది గాలివాలున కింగ్‌కాంగ్ మాటలు వందగజాల దూరం ప్రయాణించి వచ్చి వినపడ్డాయి దీప్‌కు డివైన్ గ్రూప్ సభ్యులకు!

ఎలర్టుగా వుండమని సైగచేసాడు దీప్

చెట్ల చాటుచేసుకుని ముందుకు నడవండి ఎందుకైనా మంచిది! కింగ్‌కాంగ్ నెమ్మదిగా అనగానే విజయరాఘవన్ అతని అనుచరులు చప్పున సరివిబోదెల వెనుకజేరారు

ముందున్న ప్రదేశం జాగ్రత్తగా పరిశీలించి చూచి గబాలున మరో చెట్టుబోదె వెనుకకు పరిగెత్తసాగారు వాళ్ళు

ప్రత్యర్థులు తగు జాగ్రత్తలో వున్నారని అర్థం అయింది దీప్‌కు ఆపాదమస్తకం నల్లటి బురఖా తగిలించుకున్న ఆకారాలు నాలుగు, సరివిబోదె వెనుక యిముడలేక పక్కన కొంత దేహభాగం కనపడుతున్న కింగ్‌కాంగ్ స్థూలదేహం గుర్తించాడు దీప్

డివైన్ గ్రూప్ సభ్యులు ఎనిమిది మంది, తనతో తొమ్మిది – ప్రత్యర్థులకంటె సంఖ్యాబలంలో రెట్టింపు ఆధిక్యంలో వున్నామని అనుకున్నాడు మనసులో దీప్!

సంఖ్యాబలంవల్ల అన్నివేళలా విజయం సిద్ధించదు విలూ చెప్పినదాని ప్రకారం కింగ్‌కాంగ్ అతులిత బల సంపన్నుడేగాక అమేయ మేధాసంపత్తి గలవాడు గంజాయిదమ్ముపట్టే ఈ డివైన్‌గ్రూప్ సభ్యులు వాళ్ళను ఎంతవరకు ఎదుర్కొనగలరో చూడాలి అనుకున్నాడు దీప్ మనసులో

చూస్తుండగానే కింగ్‌కాంగ్ బురఖా మనుష్యులు యిరవై గజాలదూరంలోకి వచ్చారు

వినాయక్ ముక్కులో దోమ దూరి 'హాచ్' మని తుమ్మాడు.

మరుక్షణం విజయరాఘవన్ చేతిలోని స్టెన్‌గన్ నుండి వెలువడ్డ తూటాలు వినాయక్ ముందున్న సరివిబోదెను అనేకచోట్ల తూట్లుపెట్టాయి

ఆ క్షణాన అర్థం అయింది సాంబశివకు దీప్ సలహావిని నేలమీద పడుకుని వుండిపోయినందువలన తమ ప్రాణాలు దక్కాయని!

ఏం చేద్దాం? అన్నట్లు చూసాడతను దీప్ వంక

మెదలకుండా వుండి వాళ్ళు దగ్గరకొచ్చాక ఎదుర్కొనమని సైగచేశాడు దీప్

డివైన్‌గ్రూప్ సభ్యులందరూ వూపిరి బిగబట్టి వుండిపోయారు.

కాని అవతల యిరవైగజాల దూరంలో మనుష్యులున్నారని తెలిసాక

విజయరాఘవన్‌గాని అతని సహచరులుగాని ముందుకురాలేదు

ప్రచండరుుండయూమాతుతో ధృతికి ముందు నిశ్శబ్దంలా అయిదు నిముషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి చీమచిటుక్కుమన్నా వినపడేంత నిశ్శబ్దంగా ఆ అయిదునిముషాలలోను యిటు సాంబశివ దీప్ అటు కింగ్‌కాంగ్, విజయరాఘవన్ తమతమ అనుచరులకు సైగలద్వారా వ్యూహ వివరాలు తెలియపరుచుకున్నారు!

డివైన్ గ్రూప్ సభ్యులు యిసుకనేలమీదనే అర్ధంగా పాకుకుంటూ వున్నచోటునుండి వలయాకారంగా విస్తరించుకోసాగారు! వాళ్ళు అలాచేయడం ంచిదని రెండు నిముషాలలోనే తెలిసిపోయింది

విజయరాఘవన్ విసిరిన గ్రెనేడ్ వచ్చి అదివరలో డివైన్ గ్రూప్ సభ్యులున్న ప్రదేశంలో పడి పేలి రెండు గజాల ఎత్తున మంట లేచి, యిసుక దుమ్ము చెల్లా చెదురుగా చుట్టూతా విరజిమ్మబడింది గ్రెనేడ్ ప్రకంపనతో డివైన్ గ్రూప్ సభ్యులు మరింత ఎలర్టుగా మారి నేలమీద దేకుతూ ఒకరి కొకరు ఎడం అవుతూ క్రమంగా విజయరాఘవన్ అనుచరులను చుట్టుకొని రాసాగారు అయిదు నిముషాలలో

సాంబశివ, షణ్ముఖం, వినాయక్ నెమ్మదిగా విజయరాఘవన్ గ్రూపు వున్న సరివిచెట్ల వెనుకకు జేరగలిగారు!

చీమ చిటుక్కుమన్నా వులిక్కిపడే కింగ్‌కాంగ్‌కు అనుమానం వచ్చి వెనుదిరిగాడు


వెనుకనుండి చుట్టుముట్టి వస్తున్న శత్రువులను చూడగానే చప్పున నేలమీద పడిపోతూ వాళ్ళమీదకు గ్రెనేడ్ విసిరాడు.

గ్రెనేడ్ వినాయక్, షణ్ముఖం లను నామరూపాలు లేకుండా పేల్చిపార వేసింది సరివిచెట్టువెనుక గుంటలో వున్న సాంబశివ గ్రెనేడ్ దెబ్బ తప్పుకుని మరింత పక్కకు వెళ్ళి గురిచూసి విజయరాఘవన్ అనుచరులమీద పాయిజన్ డార్ట్‌లు వేయసాగాడు.

అనుచరులలో యిద్దరు కిక్కురుమనకుండా కుప్పగూలాకగాని విజయరాఘవన్ వెనుదిరుగలేదు

పాయిజన్ డార్ట్‌గన్ తనమీదకు గురిపెడుతున్న సాంబశివను చూడగానే అతని ఎడమచేయి గ్రెనేడ్‌కోసం వెళ్ళింది

గ్రెనేడ్ లయిపోయాయని తెలుసుకున్న మరుక్షణం స్టెన్‌గన్ సాంబశివకు గురిచేసి ట్రిగర్ నొక్కాడు విజయరాఘవన్ – అదేసమయంలో సాంబశివ వదలిన పాయిజన్ డార్ట్ ఛాతిలో గుచ్చుకుని కుప్పకూలిపోయాడతను విజయరాఘవన్



ప్రేమసాగరమధనం

స్టెన్‌గన్ నుండి వచ్చిన తూటాలు సాంబశివ వంటిని చీరి క్షణంలో అతనూ నిర్జీవమైన మాంసం ముద్దలా మారిపోయాడు

డివైన్ మిషన్ సభ్యులు వేసిన డార్ట్స్ రెండు వచ్చి విజయరాఘవన్ నలుగురు అనుచరుల్లో బతికివున్న వొక్కడి వొంట్లోను ధిగబడి అతను కుప్పగూలిపోయాడు

తన వెంట వచ్చిన నలుగురూ చనిపోయారని తెలియగానే కింగ్‌కాంగ్ విజృంభించాడు రెండు చేతులతోను గ్రెనేడ్లు తీసుకుని పాయిజన్ డార్ట్స్ విసురుతున్నవాళ్ళమీదకు విసిరాడు డివైన్ మిషన్ సభ్యులందరూ మరణించారని నిర్ధారణకు వచ్చాకగూడా పదినిముషాలు అలాగే కదలకుండా సరివిబోదె చాటున నిలబడి నాలుగు వైపులా కలియజూస్తూ రెండుచేతులలోను గ్రెనేడ్లుంచుకుని ఎలర్టుగా వుండిపోయాడు కింగ్‌కాంగ్

దూరంగా ఏదో శబ్దం అయింది! చప్పున చేతిలోని గ్రెనేడ్లు విసిరాడు పెద్ద శబ్దంతో గ్రెనేడ్లు ప్రేలి మంటలువచ్చాయి రెండు నిముషాలాగి మరోపక్క ఏదో శబ్దం అయింది గ్రెనేడ్లు విసిరాడు నిముషానికి రెండు నిముషాలకు ఎటో ఒకవైపున శబ్దం వస్తూనేవుంది

కింగ్‌కాంగ్ అటూయిటూ పరిగెడుతూ గ్రెనేడ్లు విసురుతూనే వున్నాడు

గులకరాయి సరిగా కింగ్‌కాంగ్ నెత్తిన పడింది గ్రెనేడ్లన్నీ అయిపోయాయి! చప్పున తలపైకెత్తి చూచాడు కింగ్‌కాంగ్

ఏపుగాపెరిగిన సరివిచెట్టు కొమ్మమీద కూర్చుని వున్నాడు దీప్

దీప్‌ను చూడగానే కింగ్‌కాంగ్ ముఖం సంతోషంతో వికసించింది చప్పున పరుగెత్తి విజయరాఘవన్‌స్టెన్‌గన్ అందుకోవాలనుకున్నాడతను

కదిలావా పాయిజన్ డార్ట్ నీ శరీరంలో గుచ్చుకుంటుంది అన్నాడు దీప్ కఠినంగా

స్థాణువులా నిలబడిపోయాడు కింగ్‌కాంగ్

విలూ ఎక్కడుంది? చెప్పు గర్జించాడు దీప్

నాకు తెలియదు అంటూ దీప్ వున్న చెట్టు బోదె దగ్గరకు రాసాగాడు కింగ్‌కాంగ్

ఆగక్కడ! అడుగు ముందుకువేసావో జాగ్రత్త!

కింగ్‌కాంగ్ నిలబడిపోయి దీప్ వంక నిశ్చలంగా చూడసాగాడు అతని కనులలో భయ విహ్వలత ఎంతమాత్రంలేదు

చెప్పు! విలూ ఎక్కడ?

సముద్ర తీరాన పాడుపడిన దేవాలయంలో వుంది విలూ కింగ్‌కాంగ్ మ వింటూ క్షణం ఏమరుపాటుగా వున్నాడు దీప్

ముందుకు దూకి సరివిచెట్టు బోదెను బలంగా ఊపాడు కింగ్‌కాంగ్!

దీప్ చేతిలోని పాయిజన్ డార్ట్ గన్ కింద పడిపోయింది చప్పున కిందకు వంగాడు కింగ్‌కాంగ్ గన్ అందుకోవడానికి! చెట్టు కొమ్మపై నుండి సరిగా కింగ్‌కాంగ్ వీపుమీద దూకాడు దీప్

బాలన్స్ తప్పి బోర్లపడిపోయాడు కింగ్‌కాంగ్ కింగ్‌కాంగ్ పైకి లేచేలోపల పాయిజన్ డార్ట్‌గన్ తీసుకుని ఎదురుగా నిలబడి వున్నాడు దీప్

విలూ ఎక్కడ? నిజం చెప్పు లేకపోతే కింగాకాంగ్ గుప్పిటలో మన్ను దీప్ ముఖం మీద చల్లాడు కంట్లో మన్ను పడటంవలన దీప్ కనులు మూసుకుపోయాయి ఆ క్షణాన్నే దీప్ మీద కురికాడు కింగ్‌కాంగ్ బలమైన అతనిచేతులు దీప్ మెడచుట్టూ బిగుసుకోసాగాయి

పాయిజన్ డార్ట్‌గన్ ట్రిగర్ నొక్కాడు దీప్ క్షణంలో నేల గూలాడు కింగ్‌కాంగ్ కనులు తుడుచుకుని గన్ జేబులో వుంచుకుని ముందుకు నడిచాడు దీప్ కుడికంట్లో మట్టి రేణువులుపోయి కన్ను నీరుగారసాగింది కొంతదూరం నడిచాక నీటి చెలమ కనపడితే తేటనీటితో ముఖం కుడుక్కున్నాడు దోసిలి నిండా నీరు తీసుకుని కళ్ళు నీళ్ళలో ముంచివుంచాడు అలా నాలుగయిదుసార్లు చేసాక కన్ను రవరవలాడటం తగ్గింది

రచయిత జవాబులు



నాగండ్ల వెంకటేశ్వరరావు అమ్మాపాలెం

ప్ర మనిషికి జబ్బు చేస్తే సిరంజి అవసరం దేశానికి జబ్బు చేస్తే తుపాకీ అవసరం అంటారు విప్లవకారులు ఇది ఎంత వరకు సమంజసం

జ హింసాత్మక పద్ధతుల వలన సాధించినది దీర్ఘకాలం నిలవదు ప్రజల మనసులకు నచ్చే విధంగా చెప్పి సమాజంలో మార్పు తీసుకు రావాలని ప్రకోవటం ఉత్తమ పద్ధతి గాంధీగారి అహింసా ...తం హింసా విప్లవ వాదం కంటే ఎక్కువ ...చుర్యం పొందినదన్న విషయం మర్చిపోవద్దు

ఎ ఎస్ రాజశేఖర్ అనంతపురం

ప్ర కాపీ రచయితలపై మీ అభిప్రాయం?

జ కాపీ చేయటం అనాదిగా అన్ని దేశాలలోనూ వున్నదే అయితే గురివిందలా తమ నలుపు నెరుగక యితరులు కాపీ చేస్తున్నారని వాపోతుంటారు కొందరు రచయితలు!

ఇమ్మానేని వెంకటేశ్వరరావు ఆకుల అల్లూరు

ప్ర సమాజంలో డాక్టర్లు ఎంత మంది తమ వృత్తికి న్యాయం చేకూరుస్తున్నారు?

జ పవిత్రమైన వైద్య వృత్తికి అంకితమై పరిపూర్ణ న్యాయం చేకూర్చే డాక్టర్లెందరో వున్నారు వృత్తిని వ్యాపారంగా మార్చాలనుకునే కొద్ది మందిని చూచి మొత్తం డాక్టర్లందరినీ చిన్నచూపు చూడకండి

కె సుభద్రాదేవి లింగాల

ప్ర వయసుతో రచయితల స్థాయి పెరగటం లేదెందుకు?

జ మనో నేత్రానికి వయోరుగ్మతలుండవు

ఉత్తమ ప్రశ్న

జాగృతి కిరణ్, నాగపూర్

ప్ర మీరు రాసే నవలలు రచనలు మరొకరిచే రాయించి మీరు ప్రచురింపజేస్తున్నారని ఒక తెనాలి మిత్రుడు అన్నాడు బహుమతులుకూడా రికమెండేషన్ వలన అన్నాడు నేను నమ్మలేదు

జ సంతోషం

కె సీత లేచర్ల

ప్ర కొంతమంది సినిమాలు చూస్తారు పుస్తకాలు చదువుతారు కాని వాటిలో మంచిని అర్థంచేసుకోరు మరి సినిమాలు చూసి పుస్తకాలు చదవడం ఎందుకు?

జ లోకోభిన్నరుచిః

జి రవీంద్రకుమార్, చార్వాకానిపల్లి చిత్తూరు

ప్రః సమాజంలో జరిగే అనేక విషయాలపై అలాగే జరిగినట్లు రచనలుచేసినప్పుడు ఎవరైనా మిమ్ములను బెదిరించారా?

జ లేదు

ఎన్ వెంకటేష్ జువారినగర్ గోవా

ప్ర ఉద్యోగ అవకాశాలు దరఖాస్తులు కోరబడుతున్నవి – ఏ పత్రికలో చదివినా, రేడియోలో విన్నా ఈ ప్రసారాలే ఎక్కువ ఉపయోగంలేని ప్రసారాలు ఎందుకు చెయ్యాలి?

జః రూల్సుకోసం

కె రాజారావు, ఖర్గపూర్

ప్ర ప్రేమసాగర మథనం చాలా బాగుంది

జ థాంక్యూ

గరిగ నర్సయ్య రామకృష్ణాపూర్ (ఆదిలాబాద్)

ప్ర మీకంటే బాగా రాసే రచయితలున్నారా?

జ ఇదివరలో సమాధానం చెప్పాను

బి రాంబాబు ఆకివీడు

ప్ర మనిషికి మహిమలుంటే?

జ ప్రపంచం తల్లకిందులవుతుంది

కె సీతాయమ్మ లింగాల

ప్ర మీ రచనల వుద్దేశం ఏమిటి?

జ ఇదివరలో సమాదానం చెప్పాను □

కింగ్‌కాంగ్ అన్న మాటలు గుర్తొచ్చాయి విలూ సముద్రతీరాన వున్న పాడుపడ్డ దేవాలయంలో వుందని చెప్పాడతను

ప్రాణభయంలో వున్న వ్యక్తి సాధారణంగా నిజం చెప్పాడు అలాగే ఎదుటి వ్యక్తి చావబోతున్నాడని అనుకున్నప్పుడు నిజం చెప్తారు కింగ్‌కాంగ్ విషయంలో రెండూ జరిగాయి దీప్‌ను చంపగలనన్న ఆత్మవిశ్వాసంతో పాటు తను మరణిస్తానేమో నన్న భయమూ అతని మనస్సును అల్లకల్లోలపరచి వుంటాయి ఆ సమయంలో కింగ్‌కాంగ్ చెప్పిన మాటలు నమ్మదగినవి అని అనిపించింది దీప్‌కు

అదీగాక రాణి వాళ్ళు మహాబలిపురం దాటి వెళ్ళలేదని సాంబశివ చెప్పాడు విలూ రాణి కూడా మహాబలిపురంలోనే వున్నారుగనుక వాళ్ళకోసం వూరంతా వెదకాలి వెదకటం ముందు సముద్రపు తీరాన వున్న పాడుపడ్డ దేవాలయంతో మొదలెడతాను అనుకున్నాడు దీప్ చల్లటి గాలి వస్తున్న దిశగా సముద్రం వుండాలనుకుని ఆ వైపుగా నడువసాగాడు నడచినడచి కాళ్ళు నొప్పిపుట్ట సాగాయి కొన్ని రోజులుగా సరిఅయిన ఆహారంలేక శరీరం నీరసంగా వున్నది డివైన్ గ్రూప్ పెట్టిన హింసలతో శరీరంలోని కండరాలు నుజ్జయి నొప్పెడుతున్నాయి ఆకలిదప్పులు మనిషిని కుంగదీస్తున్నాయి

కాని విలాసినిని కాపాడాలనే కాంక్ష ఆకలి దప్పులను నీరసాన్ని, బాధలను పోగొట్టి దీప్‌ను ముందుకు నడిపిస్తూ కార్యోన్ముఖుడిని చేస్తున్నది నేలమీద న్యూస్‌పేపర్ ముక్క పడివుంటే తీసి చూసాడు దీప్ పేపర్‌లో దీప్ ఎంటర్‌ప్రైజెస్ ఎడ్వర్‌టైజ్‌మెంట్లోన తన ఫోటో వున్నది ఒకవైపు తేలికగా నన్ను గుర్తుపట్ట డానికి యీ అడ్వర్‌టైజ్‌మెంట్ వుపయోగపడింది నా ఫోటో వల్ల నా కెంత అపకారం జరుగుతున్నదన్న సంగతి మా ఆఫీసు మేనేజర్‌కు తెలియదు పాపం అనుకున్నాడు దీప్

దీప్ పరధ్యానంగా పేపర్ ముక్క రెండో వైపు తిప్పాడు విజయరాఘవన్ అనే సంఘ ద్రోహి తమిళనాడులోని మారుమూల ప్రాంతాల్లో బీభత్సం సృష్టిస్తూ అమాయకులను అనేకులను హత్యచేస్తున్నాడనీ అందరూ పోగా యింకా అతనికి అయిదుగురు అనుచరులు మిగిలారనీ అతన్ని అనుచరులనూ ప్రాణాలతోగాని శవాలనుగాని అప్పగిస్తే యాభైవేల రూపాయలు బహుమతి లభిస్తుందని రాసివుంది విజయరాఘవన్ తీవ్రవాదం ముసుగువేసుకున్న సంఘవిద్రోహి అని కూడా రాసివుంది

వెనుదిరిగి చప్పున నడుస్తూ కింగ్‌కాంగ్ శవం పడివున్న చోటికి వచ్చాడు దీప్

బురఖా తగిలించుకున్న నలుగురు శవాల దగ్గర ... బురఖా తొలగించి పరిశీలనగా చూడసాగాడు దీప్ నలుగురిలో ... విజయరాఘవన్! విజయరాఘవన్ అనుచరులలో యింకా యిద్దరు బ్రతికేవున్నారు బహుశా విలూ, రాణీలను కాపలాకాస్తూ పాడుబడ్డ దేవాలయంవద్ద వుండివుంటారు వాళ్ళు

కింగ్‌కాంగ్ జేబులు వెతికితే వందరూపాయల నోట్లకట్ట దొరికింది తీసి జేబులో వుంచుకున్నాడు దీప్ విజయరాఘవన్ వేసుకున్న నల్లటి బురఖాతీసి ధరించాడు

నేనెవర్నో తెలియకపోవడమేగాదు నేను తమ ముఠాలో వాడిని అని విజయరాఘవన్ అనుచరులు భ్రమపడే అవకాశం వున్నది అని అనుకుంటూ ముందుకు నడిచాడు దీప్ మనసులో ఆత్మస్థైర్యం అడుగులలో నూతనజవం పెంపొందుతుండగా ముందుకు నడిచాడు తను

నూతనోత్సాహం యిచ్చిన వూపుతో అతను ఎంత దూరం నడిచాడో తెలియలేదు సరివితోట దాటి సముద్రతీరానికొచ్చాడు సముద్రపు టలల ఘోష వింటుంటే అతనికి విలూ చెవిలో గుసగుసలాడినట్లు వినిపించింది తడి యిసుకలో ముందుకు నడుస్తూ ఆయాడతను ఎదురుగా శిదిల దేవాలయం కనపడింది బురఖా తగిలించుకున్న యిద్దరు వ్యక్తులు దేవాలయం ముందు కనపడ్డారు నడకనుబట్టి వాళ్ళు తనను గుర్తుపడుతారేమోనన్న భయంతో తలపక్కకు పెట్టి కుంటుతూ ముందుకు నడిచాడు దీప్ దెబ్బతిని అలా కుంటుతున్నాడని వాళ్ళనుకోవాలని దీప్ ఉద్దేశం (ఇంకావుంది)

వారఫలం

2-10-1987 శుక్రవారం మొదలు 8-10-1987 గురువారం వరకు

★ **మేషం** వారమంతా లాబదాయకం ఎందుకో గ్రహానుకూలత ఉన్నందుకు వ్యాపార మార్పులకు అవకాశం, ప్రాత స్థలంలో మార్పు రావచ్చు ధైర్యంగా వ్యవహార రంగాన దిగవచ్చు విక్రయ లాబమున్నది స్త్రీలకు ఆదాయం కార్యానుకూలం యత్న కార్య విజయం ఉద్యోగ రీత్యా ఆనందం

★ **వృషభం** ఏకాగ్రతతో చక్కని ఆలోచనతో క్రమశిక్షణతో వ్యాపార వ్యవహారాలందు సంచరించుట మేలు లాబం అనుకూలదాయకం వేచి చూడండి వారాంతంలో అనుకూలత చేకూరుతుంది వ్యవహారం వ్యాపారం కావచ్చు, వృత్తి రీత్యా కావచ్చు స్త్రీలకు మిత్రానుకూలం రాజకీయానందం ద్రవ్యలబ్ధి

★ **మిధునం** ఒక్క రూపాయి లబిస్తే పది ఖర్చు చేయవలసిన అగత్యమున్నది ఒకరికి సహాయం చేయాలనుకొంటే పది మంది వెంట పడుతారు అదిక ప్రయాస ఆదరించే వారు, అనుకూలించే వారు ఉన్నారనుకోవటమేగాని ప్రయోజనం లేదు స్త్రీలకు కళా రంగావకాశాలు ఆనందం ధనాదాయం

★ **కర్కాటకం** నలుగరో ముగ్గురో బందువులు రానున్నారు శుబ వ్యవహార చర్చలకు ఆస్కార వారం' ఉద్యోగంలో యిటీవల ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోవడం గమనించగలరు రాజకీయ వాదులకు అనుకూలం స్త్రీలకు వృత్తి వికాసం అంతో యింతో ద్రవ్యాదాయం

★ **సింహం** గత వారానికన్నా మేలే వస్తు సేకరణకు అనుకూలమే గృహానందమున్నది వృత్తి యందనుకూలమున్నది స్థితిగతులందు మెరుగు చేకూరుతుంది చాలా శుభమైన రోజులు భూములు వాహనాలు కొనగలుగుతారు స్త్రీలకు రాజకీయంగా మేలు ఆరోగ్యాభివృద్ధి గ్రహించాలి

★ **కన్య** వార ప్రారంబం, చివరి దినాలు అనుకూలిస్తాయి కార్యక్రమానికి ఉపక్రమించండి వ్యాపారమయితే బాగా సాగించండి వ్యవహారం ఏదయినా ఉంటే మధ్యవర్తి ద్వారా పరిష్కరించుకోండి వృత్తి రిత్యా మేలే, గ్రహించండి స్త్రీలకు ఉద్యోగరీత్యా యిబ్బంది రాకుండా చూచుకోండి కాలం అనుకూలంగాకుంటే ఏదైనా యిబ్బందే

★ **తుల** గ్రహబలం బాగున్నది క్రమంగా ద్వితీయ రాశి స్థితుడైన శని' అనుకూలింపగలడు ఆదాయమున్నది వస్తు వాహనానుకూలం గల సమయం వారాంతంలో ఆశించినంతకన్న అదిక మేలు చేకూరుతుంది స్త్రీలకు ఉద్యోగ సంబందంగా మేలు, దనాదాయం ఆరోగ్య లాబం

★ **వృశ్చికం** తొందరపడి ఏ కార్యానికీ దిగకండి పరుగెత్తి యత్నించే ఏ కార్యం కూడా లాబించదు వృత్తి రీత్యా పెద్దగా అనుకూలం గాదు ప్రయాణం లాబదాయకం గాదు అలాగని ముఖ్య ప్రయాణం మాని బాదపడరాదు స్త్రీలకు బందు మిత్ర సంబంద గొడవలకు తావివ్వరాదు అనుకూల సమయంగాదు

★ **ధనుస్సు** ఉద్యోగ రీత్యా ఎంత శ్రద్ధ వహిస్తే అంత మేలు అదికారులతో మాట పడటం న్యాయం కాదుగా' రాజకీయాలందు జోక్యం చేసుకోవటం న్యాయం కాదు వ్యాపారాన ఎలాంటి ఒడిదుడుకులు రావని గ్రహించండి స్త్రీలకు కుటుంబానందం, బిడ్డల సంబందంగా శుబ కార్య చర్చలు ఒక వేళ సానుకూలం

★ **మకరం** కుటుంబానందానికి అవకాశం గల వారం బంధువులు యిల్లు చేరి శుబ ప్రస్తావనలు ప్రారంబిస్తారు మీ యత్నాలు సానుకూలమే కృషి చేస్తే లాబదాయకమే వ్యాపార విషయంలో ఎలాంటి అనానుకూలత సంభవించదు కృషితో నాస్తి దుర్భిక్షమ్ గదా! స్త్రీలకు అనవసరంగా గొడవలతో కాలయాపన తగదు అలాంటి అవకాశం ఉండవచ్చు రాజకీయవాదులయితే లాబించే వారమే

★ **కుంబం** వార ప్రారంబాన్నే ఏదో మేలు జరుగనున్నది అలాగే వారాంతాన ధనాదాయమున్నది వ్యాపార సంబంధంగా ఏదో మేలు చేరుకూరనున్నది శుక్ర శని' వారాలు మరీ లాభదాయకాలు వ్యాపారం సర్వానుకూలం స్త్రీలకు రాజకీయ సంబంధంగా మేలు, స్థితి రీత్యా మేలు బంధు సమాగమం గ్రహించాలి

★ **మీనం** ముఖ్య గ్రహాలు మేష గురుడు, కన్యా కేతువు వృశ్చిక శని మీనరాహువు మీకు అనుకూలురు ధనాదాయానికి అనుకూలురు సర్వ విషయాలందు లాభదాయకం చిత్ర విచిత్ర లాబదాయక వ్యవహారాలు ఉంటాయి స్త్రీలకు: లాభం కార్యానుకూలం, ఉద్యోగానుకూలం

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

పాఠకుల శీర్షిక

చిన్నారి బాలల దీనగాథలు

నృత్యబాధిత

నేను స్నానం చేస్తుంటే వినిపించాయా మాటలు

ఏం చేస్తారో ఎలా చేస్తారో- దీనికి మాత్రం నాట్యం రావాలి. దీన్ని స్కూల్లో చేర్పించే నాటికి ఒక్క అయిటం అయినా వచ్చి వుండాలి... ఆ గొంతు నాకు క్రొత్త! స్నానం ముగించి ఇవతలకు వచ్చాను. సెంట్ జోసెఫ్ స్కూలులోని టీచరు, వాళ్ల మూడేళ్ళు కూడా నిండని పాప నిల్చుని ఉన్నారు!

డ్యాన్స్ మాస్టారు ఊఁ కొడుతున్నారు- మా ఇంట్లో మా చెల్లెలికి నేర్పుతున్నారు కూచిపూడి చుట్టు ప్రక్కల పిల్లలు కూడా దాదాపు పదిమంది దాకా చేరారు- ఇప్పుడు స్కూల్ టీచర్ వాళ్ల పాపను తీసుకొచ్చింది!

"మరీ చిన్నపిల్ల అనుకున్నాను మనసులో.



"వన్ - టు - త్రీ..." మాస్టారు మొదలుపెట్టారు ఫార్మాలిటీస్ అన్నీ అయ్యాక ఆ పిల్లకి చేతులు నడుము మీద పెట్టుకోవటం కూడా చేత కాలేదు ఇక మాస్టారు చెప్పే స్టెప్పులు ఏమి వేస్తుంది- ఆ రోజు నుండి బిగిన్ అయిన ఆ పాప ఏడుపు ఇప్పటికి నాలుగు నెలలు ఏడుపుతోనే మా ఇంటికి వస్తుంది ఏడుపుతోనే వెళ్తుంది వాళ్లమ్మ దగ్గరుండి ఆ పిల్లని మరీ చావబాదుతుంది కాలు కొంచెం బ్యాలెన్స్‌గా త్రిప్పినా

'ఊఁ మొద్దూ తెలీదూ అంటూ తొడ పాయసం పెడుతుంది గట్టిగా- నేను షాప్‌కు వెళ్లేలోపు పాప ఏడుపు తప్పక వినిపిస్తుంది ఆ పాపకు ఇష్టముందో లేదో చెప్పే వయసు కాదు అసలు గ్రహింపు శక్తి వుందో లేదో కూడా ఆ తల్లి గమనించటం లేదు మాష్టారు గారు ఎవరైతేనేమిటి- తనకు డబ్బులొస్తున్నాయ్ కాసేపు ఆ కాలు, ఈ కాలు ఆడించటం- నాలుగు సార్లు కేకలు పెట్టటం ఇంతేగా అని అనుకుంటున్నట్టున్నారు- చెబుదామా అని అంటే మనకంత స్వతంత్రం సాన్నిహిత్యం లేవు నేర్చుకుంటుంది లెండి మిమ్మల్ని వేయమనటం లేదుగా అని అంటే ఏం చెయ్యను అందుకే మౌనంగా ఆ పాప బాధను చూస్తున్నాను ఒకసారి వాళ్ల నాన్నగారు కనిపిస్తే చూచాయగా చెప్పాను ఆయన పెదవి విరిచి ఊరుకున్నారే గానీ ఏమీ మాట్లాడలేదు రెట్టించడం బాగుండదని ఇవతల కొచ్చేసాను

కట్టెలు కొట్టే చిన్నారి బాలలున్నారు వారిని చూస్తే జాలి అభిమానం సానుభూతి కలుగుతాయి ఇలా హైక్లాస్ బాలల దీన గాథలు ఎవర్ని కదిలిస్తాయ్ కానీ ఆ పాపది దీనగాథ కాదంటారా? ఆ పాప ఎంత నలిభిలి అవుతుందో ఎవరికి తెల్సు? ప్రతి రోజూ మా ఇంట్లో అడుగు పెడుతున్నపుడు నరకంలోకి వస్తున్న ఫీలింగ్‌ని ఆ పిల్ల కళ్లల్లో ఎంతమంది చదవగలరు? ఎవ్వరికీ చెప్పలేని అశక్తతతో ఆ పాప ఎంత కుమిలి పోతుందో? మానసికంగా ఆ పసిపాప ఎంత నరకయాతన అనుభవిస్తుందో ఎవరికి తెలుసు? అందుకే తల్లిదండ్రులూ! పిల్లల ఇష్టాయిష్టాల్ని గమనించండి వారికి బలవంతంగా బంగారం తినిపించాలని చూడకండి.పసిపిల్లల మనస్తత్వం చాలా సున్నితమని మీకు తెలియదూ?

- కోలపల్లి ఈశ్వరరావు, నెల్లూరు

* * *

విషాద తుషారం

"పిల్లలను మంచిగా తయారు చేయాలంటే వారిని ఆనందంగా ఉంచాలి అన్నాడు ఆస్కార్ వైల్డ్ నిజమే కానీ మనదేశంలో బాలల విషయానికొస్తే వారిది ప్రపంచంలో ఏగాయకుడూ ఆలపించలేనంత విషాదగీతం

మనది పేదదేశం పేదదేశంలో ప్రజల ఆర్థిక ప్రమాణాలు చాలా స్వల్పంగా ఉంటాయి మనదేశంలో అత్యధికపు జనాబా పేదవారయినపుడు వారి పిల్లలు కూడా పేదలవటంలో ఆశ్చర్యమేవుంది

ఈ విధంగా కుటుంబవ్యవస్థపరంగా బాలలకు అందాల్సిన పోషణ రక్షణ నిశ్చింత, విద్య ఆరోగ్యకరమైన ఆనందప్రదమయిన వాతావరణం అందడం లేదు ప్రపంచంలో జనాబా ప్రాతిపదికగా రెండవ స్థానం ఆక్రమించిన దేశం కావటం మూలంగా ప్రభుత్వ పరంగా రేపటి పౌరులకు లభించ వలసిన శ్రద్ధ, సదుపాయాలు లభించాల్సి నంతగా లభించటం లేదు.

మేం ట్రాన్స్‌ఫర్ కాక మునుపు చింతలపూడిలో ఉండేవాళ్ళం అక్కడ ఓ చిన్నమ్మాయి పేరు చంద్ర ఆ పాప తండ్రి తాగుబోతు ఇంటికి అతని ద్వారా ఆదాయం లేక పోగా వ్యయం మాత్రం ఉండేది ఆ పాప ఆమె తల్లి ఇళ్లల్లో పాచి పనులు చేసేవారు ఆ పాప మాత్రం ఉదయం పనిచేసుకు బడికి వెళ్ళి మరలా సాయంత్రం వదిలాక వచ్చి పనులు చేసేది పాపకు బాగా చదువు కోవాలని ఆశ కానీ ఆర్థిక ఇబ్బంది ఈ వ్యవస్థ ఎన్ని చిన్నారి మేధాకుసుమాలు వికసించకుండా చేస్తుందో! అలాని వాళ్ళకు ఊరికే డబ్బులివ్వబోతే మాత్రం స్వీకరించేవారు కాదు తమ పనికి ప్రతిఫలం మాత్రమే కోరేవారు అంతటి ఆత్మాభిమానం వాళ్ళకి

ఈరోజు మనకు ఎన్నో చోట్ల చిన్నారి బాలల దీనార్తరావాలు వినవస్తాయి రైల్లో ప్రయాణించే వారికి తినుబండారాలు అమ్మేందుకు తమ జీవితాల్నే రిస్క్‌లోపెట్టి కదిలే



బళ్ళలోకి ఎక్కుతూ, దిగుతూ ఉంటారు.

పటిష్టంగా నడపబడుతున్న బిచ్చగాళ్ల తయారీ రాకెట్‌లో వికలాంగులయితే తప్ప జన్మం సానుభూతి చూపరన్న ఉద్దేశంతో అనేక మంది పిల్లలు తమ విలువైన కంటిచూపునీ లేదా తదితర అవయవాల్నీ కోల్పోతున్నారు

ఎంగిలి ఆకుల కోసం చెత్తకుప్పల దగ్గర దీనవదనాల్తో తారట్లాడే బాలలే మనదేశ చిహ్నం ఈ మచ్చు మాసి పోయే దురదృష్ట కరమూ దుస్సహమూ ఐన కర్తవ్యం కాని గతం సమసి పోయి ఆనందప్రదమయిన ఉల్లాస భరితమయిన వాతావరణం లోంచి విన్పించే బాలల పసిడి పలుకులు వినే భవిష్యత్తు కోసం ఎదురుచూద్దాం ప్రయత్నిద్దాం

-పి వి అనీల్‌కుమార్, పెనుగొండ

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

....

పిన్ కోడ్:

వ్యక్తిగతం

ప్రైవేట్ హోటల్లో ప్రభుత్వ అతిధి!



భారత స్వాతంత్ర్యం నలభై వార్షికోత్సవాలు సోవియట్ రష్యా విప్లవ ...విజయం 70వ వార్షి ...వాల సందర్భంగా ...దేశం సోవియట్‌కు ...వియట్ భారతదేశానికి మైత్రీ బృందాలను పంపించాయి భారత దేశానికి వచ్చిన సోవియట్ బృందానికి నాయకురాలు శ్రీమతి వి ఎస్ షెవ్‌చెంకో ఆంధ్రప్రదేశ్‌కు కూడ వచ్చారు ఆమె సోవియట్ రష్యా అత్యున్నత పాలక మండలి అయిన సుప్రీం సోవియట్‌కు ఉపాధ్యక్షు రాలు ప్రభుత్వ ఆహ్వానంపై మన దేశం సందర్శించ వచ్చిన శ్రీమతి షెవ్‌చెంకో విజయవాడలో పురపాలక సంఘం ప్రతిష్ఠించిన లెనిన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు మాస్కోలో శ్రీ రాజీవ్ ఆవిష్కరించిన శ్రీమతి ఇందిరాగాంధీ విగ్రహం తాను ఆవిష్కరించిన లెనిన్ విగ్రహం భారత్, సోవియట్ల మధ్య గల మహోన్నత మైత్రిని చాటుతున్నాయని ఆమె అన్నారు ప్రభుత్వ అతిథిగా పర్యటిస్తున్న ఆమె విజయవాడలో ప్రభుత్వ అతిథి గృహంలో ఉండగా ఒక విలాసవంతమైన హోటల్లో బస చేసిన కారణం ఏమై ఉంటుందని కొందరు అనుకున్నారు

ప్రచారానికి కీర్తి కిరీటం



అమెరికన్ ఆర్థిక వ్యవస్థ 1990 లలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొనున్నదని జోస్యం చెప్పి అమెరికా అంతటా విశేష ప్రచారాన్ని పొందుతున్నారు శ్రీ రవి బాత్రా అనే భారతీయ ఆర్థిక శాస్త్ర నిపుణుడు టెక్సాస్‌లోని డల్లాస్‌లో గల సదరన్ మెథడిస్ట్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న శ్రీ బాత్రా కొన్ని సంవత్సరాల క్రితం ది గ్రేట్ డిప్రెషన్ ఆఫ్ 1990 అనే పుస్తకం రాసినప్పుడు అప్పుడు అమెరికాలో చాలా సంవత్సరాల సంక్షోభం తర్వాత మెరుగుపడుతున్న ఆర్థిక స్థితి ఫలితంగా ఆయన జోస్యాన్ని ఎవరూ పట్టించుకోలేదు కనుక ఆయనే ఆ పుస్తకాన్ని ప్రచురించుకుని ఒక సంవత్సరం పాటు దాన్ని ప్రచారం చేస్తూ దేశ వ్యాప్తంగా తిరిగారు ఇప్పుడు దానిని ఒక ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థ ప్రచురించింది శ్రీ బాత్రా 1943 లో భారతదేశంలో జన్మించారు దేశ విభజనలో ఆయన జన్మ స్థలం పాకిస్తాన్‌లో కలిసి పోగా ఆయన భారతదేశంలోనే విద్యాభ్యాసం చేసి ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు 1966 లో అమెరికా వెళ్ళి పి హెచ్ డి చేసిన శ్రీ బాత్రా అక్కడే స్థిరపడ్డారు

పరుగులో ప్రపంచ రికార్డు!




వంద మీటర్ల పరుగు పందెంలో ఇప్పటికి నమోదయి ఉన్న రికార్డులను బద్దలు గొట్టి చరిత్ర సృష్టించాడు బెన్ జాన్సన్ జమైకాకు చెందిన ఈ 25 సంవత్సరాల పరుగు వీరుడు 1984 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్ పోటీల్లో మూడో స్థానంలో కార్ల్ లూయిస్ అనే అమెరికన్ పరుగు వీరుడి తర్వాత ఉన్నాడు మొన్నటి ఆగస్ట్ 30న రోమ్‌లో ఆ కార్ల్ లూయిస్‌నే ఓడించి రికార్డు స్థాపించాడు గతంలో ఈ దూరాన్ని 9 93 సెకన్లలో పరుగెత్తిన అమెరికన్ కాల్విన్ స్మిత్‌కన్నా తక్కువ కాలంలో 9 83 సెకన్లలోనే జాన్సన్ పరుగెత్తాడు

సంచలనం సృష్టించిన స్వామివారు



కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు నాలుగు రోజుల పాటు మాయమై సంచలనాన్ని సృష్టించారు ఆచార్య పీఠాన్ని వదిలి, ప్రశాంతంగా తపస్సు చేసుకోవడం తమ లక్ష్యమని ఆ తర్వాత ప్రకటించిన స్వామి వారు ఆగస్టు 23 అర్ధరాత్రి ఆశ్రమాన్ని దండ కమండలాలను వదిలి తెలియని చోటికి వెళ్ళిపోయారు నాలుగు రోజుల పాటు దక్షిణాది అంతటినీ గాలించిన భక్తులు ఆయన తలకావేరిలో ఉన్నారని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు పరమాచార్య విజ్ఞప్తి మేరకు తిరిగి కంచికి చేరిన స్వామి ఆశ్రమ నిర్వహణను వదిలేస్తామని భవిష్యత్ కార్యక్రమం గురించి విజయ దశమి రోజున తిరుపతిలో ప్రకటిస్తామని అన్నారు

విదేశాంగ కార్యదర్శికి వసతి సమస్య!



విదేశాంగ శాఖ కార్యదర్శిగా శ్రీ ఎ పి వెంకటేశ్వరన్ రాజీనామా చేసిన తర్వాత ఆ పదవి చేపట్టిన శ్రీ కె పి ఎస్ మీనన్ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు దాటుతున్నా ఇంతవరకూ ఆ పదవికి ఉచితమైన వసతి సమకూర్చుకోలేక పోయారు ఇంకా ఆయన విదేశాంగ మంత్రిత్వశాఖ హాస్టల్‌లోని ఒక్క పడకగది అపార్ట్ మెంట్‌లోనే ఉంటున్నారు శ్రీ మీనన్‌కు స్వయంగా ప్రధాని చాణక్య పురిలోని ఒక బంగళాను కేటాయించారట ఇకనుంచి ఆ బంగళా విదేశాంగ శాఖ కార్యదర్శుల శాశ్వత వసతి గృహంగా ఉండాలని ఆదేశించారట కాని శ్రీ వెంకటేశ్వరన్ ఆ భవంతిని ఖాళీ చేయలేదు శ్రీ మీనన్‌కు మరొక బంగళా ఇవ్వజూపగా అది ఆయనకు నచ్చలేదుట!

రెండేళ్ళలో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన క్రీడాకారిణి!



రెండు సంవత్సరాలలో రెండు ప్రపంచ రికార్డులని సృష్టించి అసమాన ప్రతిభని ప్రదర్శించిన మహిళ స్టెఫ్కా కోస్టడినోవా బల్గేరియాకి చెందిన ఈ క్రీడాకారిణి స్త్రీల హైజంప్‌లో గత సంవత్సరం తాను సృష్టించిన ప్రపంచ రికార్డుని అధిగమించి ఈ ఏడాది 2 09 మీటర్లు ఎత్తు దూకి చూపరులని దిగ్భ్రాంతి పరచింది నేను ప్రపంచ రికార్డు సృష్టించ గలిగానని నమ్మలేకుండా ఉన్నాను సోవియట్ క్రీడా కారిణి తమారా ఈసారి చక్కని ప్రతిభని ప్రదర్శించింది అన్నది తన ప్రత్యర్థిని ప్రశంసిస్తూ □



దూరదర్శనం

లత

అమృత

కవితా యహీ అమృతా నిజమే ఆమాట – జనాబు జిగర్ మురాదాబాదీ – ఈ కవి ప్రకృతి ప్రేమికుడు – ప్రేమికుడు అందరు ఉర్దూకవుల లాగానే తన గజల్స్‌లో నిరాశా వాదాన్నీ – కనిపించని – లేదా త్రుణీకరించిన పర్దా చాటు ప్రేయసిని గురించి చాలా చక్కని మాటల్లో దుఃఖించటం వాళ్ళ సంప్రదాయ మని ఒక సారి వ్రాసినట్లున్నాను– ఇతర బాషల కవులు ఈ అమృతాన్ని దేశానికి ఇవ్వలేదా? క్రిష్ణ శాస్త్రి ఊర్వశి విశ్వనాద కిన్నెర నండూరి ఎంకి నాయని కావ్యనాయకి రాయప్రోలు అమలిన శృంగార నాయిక వీళ్ళందరూ హైద్రబాద్‌కి పనికిరారా? పెద్ద భాదగా ఉంది

కబీరు

ఈ కబీరు రామభక్తుడు కాదు ఏవో కొన్ని పాటలు వ్రాశాడు దేశంలో దీనులూ పతితులూ అవి పాడినట్లు చూపించారు మధ్య మధ్య ఏసుక్రీస్తు వేషంలో రెండు మూడు తడవలు కనిపిస్తాడు బయటికి రావాలి కాని ఆ బయట ఎక్కడ? అని ప్రశ్న ఏసుక్రీస్తు పునరుజ్జీవిస్తాడని క్రైస్తవుల నమ్మకం లాటిది ఈ కబీరు నిర్మాతల కున్నట్లుంది భక్తుడూ కవీ అయిన కబీరు జీవితం చాలా' అడ్డగోలుగా తీశారు మొదట్లో అన్ని బాషల్లో పేరు వ్రాస్తే సంతోషించాం కాని ఈ మధ్యలో రథచక్ర కన్నా ఘోరంగా ఉన్నది కబీరే అయిపోయింది ఈ నాటిక

రామాయణ్

మొదట చాలా సేపు కరెంటు పోయింది అగస్త్యుని మహిమల దగ్గర కరెంటు వచ్చింది కంబరామాయణాన్ని కాదనటం కాదుగాని – తమిళ భాష ఇటీవలది మూడువందల ఏళ్ళ కిందట వరకూ తమిళానికి తెలుగు లిపి వాడే వారని చరిత్ర చెపుతున్నది– కాని అగస్త్యుడు తమిళ బాషకు వ్యాకరణం వ్రాశాడని తెలుగువాడైన అరవ రామాయణం వ్రాసిన కంబన్న వ్రాసి ఉండడు అది ప్రక్షిప్తం అరవం ఆస్ట్ర లాయిడ్ భాషల్లోకి వస్తుందనుకుంటాను– సరిగా గుర్తులేదు రామానంద సాగర్ జీ కంబ రామాయణం నుంచి ఈ దృశ్యం తీసుకున్నారు ఏమయినా బాగుంది తమిళులు ఈ నాటికీ రావణుని కొలుస్తారు కారణం ఆర్య ద్వేషం – అలాటిది ఆర్యుడైన శ్రీరాముని చేత తమిళ బాషనీ దాని వ్యాకరణ కర్త అయిన అగస్త్యుడినీ రామాయణ సమకాలికం చేయటం హేతువాద రీత్యా కరెక్ట్ కాదు రామాయణం చరిత్ర కాదు మైథాలజీ అనుకునే వాళ్ళు ఆనందిస్తారు రామస్వామి నాయకరు ఈ ఆర్యద్వేషం చేత శ్రీరాముని పటాల్ని అవమానించటం నాలుగేళ్ళు మద్రాసులో వానలు లేక పోవటం ఎంతయాదృచ్ఛికమైనా? నిజం రామద్వేషం కాదా? అనిపిస్తుంది నా బోటి రామభక్తులకు – మద్రాసులో అగస్త్యుడి గుళ్ళు ఉన్నాయి తమిళ – కేరళ బార్డరులో తాటక ఆలయం ఉంది శ్రీ లంక తమిళులు నేటికీ రావణుని పూజిస్తారు అవి ఆయన గొప్ప తనానికి కాదు ద్రావిడుడని మాత్రమే– తాంక్‌గాడ్ ఆంధ్రులు ఆర్య సంతతి ఏదయినా ఎన్ని మతాలని అందులో ఇరికించినా నీగ్రో లాయిడ్ ఆస్ట్రలాయిడ్ బాషకి అగస్త్యుని చేత వ్యాకరణం వ్రాయించినా రావణుడు ఆర్య సంతతికి చెందిన పౌలస్త్యుడని మర్చి పోయినా రామాయణం రామాయణమే వాల్మీకి కవి కోకిల కుహుకుహునాదాలే రామాయణానికి మూలం అయినా ఎవరి గొప్ప దనాలు వారు రాముడిచేత చెప్పించడం మానవస్వబావం రాక్షసులు ద్రావిడులనీ వారిని సంహరించిన రాముడు ఆర్యుడనీ ఇది రాజకీయ ఇతిహాస మనీ చాలా మంది పండితులు వ్రాశారు అయినా ఫరవాలేదు బాగుంది కేరళీయులు బలిచక్రవర్తిని ఆరాదిస్తారు వందే రామం రాజీవలోచనం నమామి

"సత్యజిత్ రే సమర్పణ-2"లో ఒక దృశ్యం



తెనాలి రామకృష్ణ

రామకృష్ణుడు దొంగల చేత పాదులకు నీళ్ళు తోడించడం కథ – బాగుంది ఇందులోనే మేక తోకకు మేక పద్యం కూడా చెప్పించారు మొత్తం మీద అశోక్‌కుమార్ బాగా నటిస్తున్నాడు

కాలాజల్ – ఉగని

మూడో తరం టీనేజ్‌డ్ మేనత్త మేనమామ పిల్లల్లో ఆకర్షణ పెరుగుతున్నది బహుశా ఇది మహమ్మదీయుల్లో నిషేదం కాబోలు మేనమామ కుటుంబంతో వలస బయలుదేరాడు బారత స్వాతంత్ర్య సమరం అప్పుడప్పుడే ప్రారంభమవు తున్నది అదీ కథ

తప్పు – ఒప్పు

నాటిక బల్లి పడితే భయపడిన ఒకమ్మాయికి బల్లి పడితే ఫరవాలేదని చెప్పే నాటకం చాలా ఆర్టిఫిషియల్‌గా ఉంది ఈ కాలంలో బల్లి పడితే కెవ్వుమనే అమ్మాయిలున్నారు గాని చన్నీళ్ళ స్నానం చేసి చాదస్తంగా ప్రవర్తించే వాళ్ళున్నారా? అని

మాల్గుడీడేస్

ఆర్ కె నారాయణ్ కథలు మళ్ళీ ప్రారంభమయినయి – ఆర్ కె నారాయణ్‌జీ గురించి ప్రేక్షకులకు పరిచయం ఉన్నది లోగడ ఇంజన్ ట్రబుల్ – కథ పేరు – శేషాద్రి సరదాగా తిరణాల కెళ్ళి లాటరీ కడితే రోడ్డు రోలరు వస్తుంది దాన్ని తీసేయకపోతే జంఖానాకి అద్దె కట్టాలి కట్టాడు ఆలయంలో ఏనుగుని తీసుకొచ్చి రోలరుని కదిలిస్తే అది ఒకరి ఇంటి గోడ పగలగొట్టుతుంది అదో దండగ ఏనుగదో దండగ ఆ మానవుడు ఇలా రోడ్డు రోలరుతో అష్టకష్టాలు పడుతూ ఉండగా మాల్గుడీలో భూకంపం వచ్చి రోడ్డు రోలరు దేవాలయం లోపలికి దొర్లుతుంది అదిదేవుడి కిచ్చానని రోడ్డు రోలరు బాధ తప్పించుకున్నాడు శేషాద్రి ఆ కథ తరువాత ఎవరితో చెప్పినా నమ్మరు మంచి హాస్యం ఉంది □

హైదరాబాదు నోట్‌బుక్

అపూర్వంగా గణపతి నిమజ్జనం

సెప్టెంబర్ 6వ తేదీన వినాయక సాగర్‌లో జరిగిన గణపతి నిమజ్జనోత్సవం అపూర్వమనే చెప్పాలి హైదరాబాద్ నోట్‌బుక్ ఇంతకు ముందే ఊహించినట్టు దాదాపు 5000 విగ్రహాలు ఈ ఉత్సవంలో పాల్గొన్నాయి పది లక్షల మందికి పైగా భక్తబృందం దీనిలో పాల్గొన్నది ప్రధానమైన ఊరేగింపు 6వ తేదీ ఉదయం 9-00 గంటలకు చాంద్రాయణగుట్ట నుంచి ప్రారంభమై సాయంకాలం 6-00 గంటలకు వినాయక్ సాగర్ చేరింది ఈ ఊరేగింపులో వివిధ ప్రాంతాల ఊరేగింపులు ఉపనదుల లాగ చేరాయి చార్‌మినార్ నుంచి అటు సెక్రెటేరియట్ వరకు ఇటు లిబర్టీ వరకు జనం కిటకిటలాడి పోయింది ఈ ఉత్సవం సందర్భంగా ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు శ్రీ దాల్మియా చార్‌మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి ప్రసంగిస్తూ హిందువులు ముస్లిములు మతసామరస్యం కోసం ఇతర ఉత్సవాలలో పాల్గొనాలని సూచించారు నిమజ్జనానికి ముందురోజు జరిగిన మొహర్రం నాడు నిమజ్జనం నాడు గాని ఎటువంటి మతకలహాలు జరగలేదు పోలీసు బందోబస్తు చాల కట్టుదిట్టంగా వుంది రాష్ట్ర పోలీసు సిబ్బందేకాక కర్ణాటక తమిళనాడుల నుంచి కూడ వచ్చిన పోలీసు దళాలు తమ కర్తవ్యం చక్కగా నిర్వహించాయి పోలీసు కమిషనర్ శ్రీ టి ఎస్ రావు పోలీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ ఎ ఎస్ రామమోహనరావు హోం శాఖమంత్రి శ్రీ కె కేశవరావు పోలీస్ కంట్రోల్ రూములను ఇతర ప్రాంతాలను ఎప్పటి కప్పుడు తనిఖీ చేసారు

దార్వాడలో కుమారి జొన్నలగడ్డ అనూరాధ విజయం

కేంద్రప్రభుత్వం సాంస్కృతిక శాఖ నిర్వహించే స్వతంత్ర ప్రతిపత్తి గల సంస యువసంగీత నృత్య మహోత్సవ్ ఈ సంస్థ ఏడు మండలాలలో సంగీత నృత్య స్పర్ధలు జరిపే యువకళా కారులను ప్రోత్సహించి సన్మానిస్తుంది. ఈ మండలాలలో దక్షిణ మధ్య మండలానికి కేంద్రం నాగపూర్. ఈ మండలంలో ఆంధ్ర. కర్నాటక. మధ్యప్రదేశ్. మహారాష్ట్రలు ఉన్నాయి. కర్నాటకులకు హైదరాబాద్‌లో. ఆంధ్రులకు ధార్వాడలో పోటీలు జరిగాయి. మహారాష్ట్రులకు భోపాలులో. మధ్యప్రదేశ్ వారికి అమరావతిలో పోటీలు జరుగుతాయి వీటిలో ప్రథమ స్థానంలో వచ్చిన వారికి అక్టోబర్‌లో నాగపూర్‌లో చివరి పోటీ జరుగుతుంది దీనిలో ప్రథములుగా వచ్చిన వారికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సంగీత నృత్యోత్సవాలలో స్థానం వుంటుంది కర్నాటకులకు ఆగస్టు ఒకటవ తేదీ నుంచి 3 వరకు రవీంద్ర భారతిలో జరిగిన పోటీని రాష్ట్ర సాంస్కృతిక శాఖామంత్రి శ్రీ పుష్పరాజ్ ప్రారంభించారు దార్వాడలో తెలుగు వారికి ఆగస్టు 16 నుంచి 18 వరకు పోటీలు జరిగాయి వాటిలో కూచిపూడి నర్తకి నాట్య విశారద కుమారి జొన్నలగడ్డ అనూరాధ సంగీత విద్వాంసుడు శ్రీ ఎ వెంకటరావు జి జానకి (సంగీతం) కె కూర్మనాద్ (సంగీతం) ఎల్లా బాల సోమశేఖర్ (సంగీతం) జి అరుణ (నృత్యం) ఎం జయశ్రీ (నృత్యం) పతి దివాకర్ (నృత్యం) వై బాలమురళీకృష్ణ (సంగీతం) సుధాపరమహంస (సంగీతం) కుమారిలత శ్రీమతి హరిప్రియ (సంగీతం) పాల్గొన్నారు

కుమారి జొన్నల గడ్డ అనూరాధ కృష్ణా నీ బేగనే బారో అనే పురందరదాసు కీర్తనను బాలగోపాల తరంగాన్ని అభినయించి ప్రేక్షకులను ముగ్ధులను చేసింది దార్వాడలో జరిగిన పోటీలో నృత్యంలో కుమారి జొన్నలగడ్డ అనూరాధకు సంగీతంలో కుమారి లలిత శ్రీమతి హరిప్రియలకు ప్రథమ బహుమతులు వచ్చాయి వీరు అక్టోబర్‌లో నాగపూర్‌లో జరిగే చివరిపోటీలో పాల్గొంటారు మరచాను ఈ పోటీలలో 18 నుంచి 30 సంవత్సరాల వయసున్న వారే పాల్గొనాలి



ఆగస్టు 16-18 తేదీలలో ధార్వాడలో జరిగిన యువ సంగీత నృత్య మహోత్సవ్‌లో నృత్యంలో ప్రథమస్థానం పొందిన కుమారి జొన్నలగడ్డ అనూరాధ.

ఉత్తర హరివంశ వ్యాఖ్యా మందరం ఆవిష్కరణ


నవీన గుణ సనాథుడైన నాచన సోముని ఉత్తర హరివంశం తెలుగు కావ్యాలలో అగ్రగణ్యమైంది ఇతడు కవిత్రయంతో తులతూగ దగినవాడు సోముడుకూడ తిక్కన వలెనే హరిహరా ద్వైతాన్ని అభిమానించాడు సకల బాషా భూషణుడని సాహిత్య రస సంవిధాన చక్రవర్తి అని నవీన గుణసనాథుడని సంపూర్ణకీర్తి అని పెక్కు


ఆగస్టు 16 18 తేదీలలో దార్వాడలో జరిగిన యువ సంగీత నృత్య మహోత్సవ్‌లో కర్నాటక సంగీతంలో ప్రథములుగా వచ్చిన కుమారి లలిత, శ్రీమతి హరిప్రియ.



నాచన సోముని ఉత్తర హరి వంశానికి వ్యాఖ్యానం మందరాన్ని ఆవిష్కరించిన సందర్భంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర బాషా నిలయంలో తీసిన చిత్రం శ్రీ ఎం ఎల్ నరసింహారావు, భాషా నిలయ కార్యదర్శి డా., జి. వి. సుబ్రహ్మణ్యం, న్యాయమూర్తి పమిడిఘంటం కోదండరామయ్య, ఆచార్య బి. రామరాజు గ్రంథకర్త శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి.







బిరుదులతో విరాజితుడయ్యాడు సోముడు అతని ఉత్తర హరివంశం ప్రౌఢ మహాకావ్యం అది వ్యాఖ్యాన సాపేక్షం ఈ కావ్యానికి విద్యా వాచస్పతి సహస్రావధాని వ్యాకరణ విద్యా ప్రవీణ శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన మందర వ్యాఖ్యానం ఆగస్టు చివరివారంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర బాషా నిలయంలో ఆవిష్కరింపబడింది వ్యాఖ్యను ఆవిష్కరించిన హైకోర్టు న్యాయమూర్తి శ్రీ పమిడిగంటం కోదండరామయ్య, సభాధ్యక్షులు డాక్టర్ బిరుదు రాజు రామరాజు హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య డాక్టర్ జి వి సుబ్రహ్మణ్యం వ్యాఖ్యాతను పలురీతుల ప్రశంసించారు శ్రీ శాస్త్రి అనితర సాదారణ

హైదరాబాద్ నోట్‌బుక్

ప్రతిబతో వ్యాఖ్యానం చేశారని తొలి రెండు ఆశ్వాసాల వ్యాఖ్య వేయి పుటలయిందని ఇది రసబావ సాహిత్యాలంకార వ్యాకరణ విశేషాల క్రోడీకరణ సర్వస్వంగా సోముని ప్రతిబను ఉగ్గడిస్తుందని అన్నారు ప్రారంబంలో బాషానిలయం కార్యదర్శి శ్రీ ఎం ఎల్ నరసింహరావు మాట్లాడుతూ, మొత్తం ఆరు ఆశ్వాసాల కావ్యంలో ప్రస్తుతం రెండు ఆశ్వాసాలకే వ్యాఖ్యానం వెలువడిందని తక్కిన బాగం ప్రచురించడానికి తెలుగు సాహిత్యాబిమానులు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు చివరన శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి ఉచిత రీతిని సమాదాన మిచ్చారు శ్రీ అక్కిరాజు వెంకట జనార్దనరావు కృతజ్ఞతతో సమావే సమాప్తమైంది

ఉపశ్రుతి :–

ఎందుకుసార్ ఇంతగా అవినీతి పెరిగిం – అనడిగారు ఒక న్యాయ పక్షపాతి అయ్యా నేరమనేది అంటురోగం చట్టాన్ని వుల్లంఘిస్తే చట్టంపై ఏహ్యాబావం పుడుతుంది దానితో ప్ర చట్టాన్ని తనే ఏలుతానంటాడు అదేనేరా అని న్యాయమూర్తి లూయి డి అన్నాడండీ– అని న్యాయశాస్త్ర వేత్త మిత్రుడు సమాదానం చెప్పాడు

—తిరుమల రామ



ప్రొఫెసర్ రామమూర్తికి శ్రీ రాజాలక్ష్మి అవార్డు

ఏటా సాహిత్య సాంస్కృతిక విజ్ఞానశాస్త్ర తదితర రంగాలలో నిష్ణాతులైన వారికి అందజేసే శ్రీ రాజాలక్ష్మి పౌండేషన్ అవార్డు ఈ సంవత్సరం ప్రపంచ ప్రఖ్యాత న్యూరో సర్జన్ ప్రొపెసర్ బి

అవీ ఇవీ అన్నీ

రామమూర్తికి లబించింది మదరాసులో నవంబరు 19న జరిగే అవార్డు ప్రధానోత్సవంలో ఆయనకి రు 20 000 నగదు ఒక ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు ఈ అవార్డు గ్రహీతగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉన్న తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ న్యూజెర్సీ వారి సహకారంతో న్యూయార్క్‌లో ఉన్న డా కె వి రావు డా కె జ్యోతిరావు దంపతులు ప్రొ రామమూర్తిని అమెరికా ఆహ్వానించి ఆతిద్యం అందజేస్తారు

"కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి ఫౌండేషన్"

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి ఫౌండేషన్ మద్రాసులో యేర్పడి కవిరాజు రచనలన్నింటినీ పునర్ముద్రించ డానికి నిర్ణయించింది

కవిరాజు ఆశయాలను ఆదర్శాలను అం ప్రారంభించిన భావ విప్లవ పందాను ముం కొనిపోవాలనే ఆశయంతో స్థానిక పొట్టి శ్రీరాము స్మారక సంస్థ బీవనంలో స్వాతంత్ర్య దినోత్సవ నాడు వివిద రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశం జరిగింది ప్రముఖ సంఘసేవిక శ్రీమతి కొత్త లక్ష్మి రఘురామయ్య ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు కుల మత తత్వాలు పెచ్చు పెరిగి ఎల్లెడలా హింసాకాండ ప్రజ్వలిస్తున్న నేటి తరుణంలో కవిరాజు బావాలను ప్రచారం చేయవలసిన ఆవశ్యకత గురించి వక్తలు నొక్కి చెప్పారు

శ్రీమతి కొత్త లక్ష్మి రఘురామయ్య చైర్మన్‌గా కవిరాజు కుమార్తె శ్రీమతి అట్లూరి చౌదరాణి మేనేజింగ్ ట్రస్టీగా, శ్రీయుతులు అట్లూరి పుండరీ కాక్షయ్య, ఎ అనిల్ కుమార్ వి సుబ్బయ్య శాశ్వత సభ్యులుగా యేర్పడిన ఈ ఫౌండేషన్‌లో దేశ వ్యాపితంగా వివిధ రంగాలలో సుప్రసిద్ధులైన అనేక మంది ప్రముఖులు సభ్యులుగా వున్నారు

Printed and Published for Nageswara Rao Estates Private Ltd , by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003 Acting Editor M. Madhava Rao, Chief Editor S Radhakrishna.
Phones Business : 61247, 61248, 75569 Editorial 75667